సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం

వెల: ₹ 7.00

సంపుటి: 17

సంచిక: 305

ఆదివారం 26-1-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

# గెలిచిన దారులు మిగిలిన ఆకాంక్షలు

● నేడు గణతంత్ర దినోత్సవం

**రాజ్యాంగం... దేశ పాలనావ్యవస్థకు పరమగ్రంథం. ప్రతి పౌరునికి శిరోధార్యం. బలహీనులకు వజ్రాయుధం. బలవంతులను అదుపు చేసే అంకుశం. పురుషస్వామ్య పెత్తందారీ నుంచి స్త్రీలు అడుగు ముందుకు వేయడానికి రాజ్యాంగం పరిచిన దారులు వారిని నేడు ఆత్మగౌరవంతో నిలబెట్టి స్వయం సమృద్ధి వైపు నడిపిస్తున్నాయి. సాధించింది ఎంతో. సాధించాల్సింది మరెంతో. ఆకాంక్షలను అలాగే నిలబెట్టుకుంటూ ముందుకు సాగాలని అంటున్నారు సీనియర్ రచయిత్రి.**



భారత రాజ్యాంగాన్ని స్త్రీల దృష్టితో చూడటానికి ఈరోజొక వజ్రోత్సవ సందర్భం. వాలుకి కొట్టుకుపోయే యాంత్రికత నుంచి బైటికి వచ్చి, దాటి వచ్చిన కాలాలను, నడుస్తున్న సమయాలను నిమ్మళంగా చూస్తున్నప్పుడు కొంత సంతోషం, మరి కొంత బాధ. ఈ రోజుల్లో భర్త చనిపోతే భార్య చితిలోకి దూకనవసరం లేదు, అతి బాల్య వివాహాలు చేసుకోనవసరం లేదు, వితంతువులు రహస్య గర్భవిచ్ఛిత్తిలో ప్రాణాలు పోగొట్టుకోనవసరం లేదు. గడపచాటున నిలబడి మాట్లాడటం, ముట్టుగదుల్లో మగ్గడం, అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాల నుంచి స్త్రీలు చాలావరకూ బైటపడ్డారు. రాజ్యాంగంలో స్త్రీలకి సమానహక్కులు పొందుపరచడానికి ముందుతరాల వారు చేసిన సంఘసంస్కరణ చాలావరకూ మూలకారణం. దీనికి సమానమైన చేర్పుని రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్ ఆలోచనలు ఇచ్చాయి.



స్త్రీలని వాహికలుగా చేసుకుని కులం, మతం వ్యాప్తి చెందుతాయని, ఈ సమాజాన్ని కొందరి చెప్పుచేతుల్లోనే ఉంచుతాయన్నది అంబేద్కర్ అవగాహన. అందుకే దళిత, కార్మికవర్గాల కోసం ఆలోచించినంతగా స్త్రీ సమానత్వం కోసం కూడా పాటుబడ్డారు. రాజ్యాంగానికి మూలాధారమైన 'అందరికీ సమానమైన విలువ' అనే అంబేద్కర్ ప్రతిపాదన పైకి కనిపించే సాధారణ విషయం కాదు. ఆ కాలానికే కాదు, ఇప్పటికీ మనుషులు సమానంగా లేరు. స్త్రీలు చాలా విషయాల్లో రెండవ తరగతి పౌరులుగానే ఉన్నారు. ఆ స్థితిని పోగొట్టి, స్త్రీల జీవితాల్లో విప్లవాత్మక మార్పుల కోసం అంబేద్కర్ ప్రవేశపెట్టిన 'హిందూ కోడ్ బిల్' ఒక సంచలనం. అంతవరకూ స్త్రీలకి సామాజిక, రాజకీయ, కుటుంబహక్కుల వంటివి లేవు. సమానత్వ ప్రాతిపదిక మీద రాజ్యాంగం ద్వారా వారు ఆ హక్కులను మిగతా వారితో పాటు సహజంగానే పొందారు. ఉదాహరణకి రాజ్యాంగ ఏర్పాటుకి మునుపు సార్వత్రిక ఓటుహక్కు లేదు. తొంభైశాతం పైగా స్త్రీలకి ఓటువేయడం అంటే ఏమిటో తెలీదు. కానీ రాజ్యాంగం ద్వారా స్త్రీలంతా ఓటు వేయడమే కాదు, రాజకీయ పార్టీలలో చేరి, ఎన్నికలలో పాల్గొని, శాసనసభలకి చేరారు.

'బిఏ చదివినా బియ్యంలో రాళ్లేరక తప్పుతుందా' అన్నవారికి- ఉద్యోగాలు చేసి, ఉళ్ళేలి చూపించారు స్త్రీలు. బ్రిటిష్ పాలనకి భిన్నంగా భారత రాజ్యాంగం స్త్రీల ఉనికిని నిరూపించింది. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వాడుకుని చేసిన అనేక పోరాటాల ఫలితంగా స్త్రీలకి అనుకూలమైన కొన్ని చట్టాలు రూపొందాయి. వివాహానికి సరైన వయసు ప్రాతిపదిక అయింది. అబార్షన్ హక్కులు ఉన్నాయి. విడాకులు పూర్వమంత కఠినం కావు. స్త్రీలపై సాగే గృహహింస, లైంగిక వేధింపులు, అత్యాచారాలకి కఠినశిక్షలు ఉన్నాయి. ఆస్తి, వారసత్వ హక్కుల విషయంలో కూడా ప్రగతి కనబడుతోంది. ముఖ్యంగా స్త్రీల సామాజిక, రాజకీయ భాగస్వామ్యం మెరుగుబడింది.

అయితే, స్త్రీల హక్కులన్నిటికీ కాపాడగల రక్షణ వ్యవస్థలు నిష్పక్షపాతంగా లేవు. అవి మగ స్వభావాన్ని, మగ పెత్తనాన్ని తెలియక, తెలిసి ప్రదర్శిస్తాయి. దానివల్ల మొగ్గు పురుషుడి వైపు ఉండి స్త్రీ సమానత్వాన్ని సూచించే రాజ్యాంగస్ఫూర్తిని భగ్నం చేస్తాయి. అందుకే 'అందరికీ ఒకే విలువ' సూత్రం ఆచరణలో విఫలం అయింది. స్త్రీలు అన్ని ఉద్యోగాలకి అర్హులు. కానీ సైనికులుగా, భారీ వాహన చోదకులుగా, పెద్దపెద్ద హోదాలు కల ఉద్యోగులుగా, మంత్రులుగా, వ్యాపారవేత్తలుగా వారి ఉనికి ఎంత? ఇటీవలి అంచనాలు కార్మిక వర్గంలో, 'బాస్' స్థానాలలో స్త్రీల నిష్పత్తి పతనమవుతున్నదని హెచ్చరిస్తున్నాయి. ఇక కొన్ని ప్రత్యేక రంగాల్లో స్త్రీలు అడుగు పెట్టాల్సే ఉంది.

సంసిద్ధత లేకపోవడం సమాజానికే కాదు, సమాజం తయారు చేసే స్త్రీలది కూడా కావొచ్చు. అందరినీ ఒక చోటికి చేర్చాలంటే వెనుకబడి ఉన్న వారిని ముందుకు చేర్చడానికి రిజర్వేషన్లు కావాలి. విద్యా ఉద్యోగ రంగాలలో స్త్రీలకి 33 శాతం రిజర్వేషన్లని అంగీకరించిన రాజ్యాంగం- చట్టసభలకి ఆ హక్కుని వర్తింపజేయలేక పోయింది. 33 శాతం రిజర్వుడ్ స్థానాల్లోనూ, జనరల్ స్థానాల్లో మరి కొందరు స్త్రీలు కలిసి చట్టసభలకి చేరి విధాన నిర్ణయాలు చేయడమన్న ఆలోచనకే రాజకీయపార్టీలు వ్యతిరేకం కనుకనే ఇంతవరకూ మహిళా రిజర్వేషన్ల బిల్లు ముందుకు పోవడం లేదు. స్త్రీల శరీరాల మీద పురుషులకి ఉండే హక్కులకి, స్త్రీల గౌరవానికి భంగకరంగా ఉన్న అడల్టరీ చట్టం ఎత్తి వేయడానికి రాజ్యాంగం ఏర్పడ్డాక కూడా దాదాపు ఏడు దశాబ్దాలు పట్టింది. తల్లికి బిడ్డల మీద ఉండాల్సిన సహజ బాధ్యతలు, హక్కుల విషయంలో కూడా చాలా వివక్ష ఇప్పటికీ ఉంది. పురుషుని ఇంటిపేరుతో స్త్రీ, ఆమె పిల్లలు గుర్తింపు పొందడం- పితృస్వామ్యం బలంగా ఉండడాన్నే సూచిస్తుంది.

రాజ్యాంగంలో కూడా స్త్రీలహక్కులకి సంబంధించి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఆచరణలో చాలా లోటుపాట్లు కూడా ఉన్నాయి. అయినాసరే స్త్రీలు తాము పోరాడి సాధించుకున్న చైతన్యాన్ని నిలుపుకోవడానికి తమ హక్కులకి రక్షణ ఉండాలని గట్టిగా అడగడానికి రాజ్యాంగమే ఆసరాగా ఉంది. దానికి తోడు మహిళాపోరాటాల సాధించుకున్న, సాధించుకోబోయే మార్పులు- 'అందరికీ ఒకే విలువ' సూత్రానికి స్త్రీలని మరింత దగ్గర చేస్తాయని నమ్మిక. ఈ నమ్మకాన్ని సడలనివ్వకుండా మనం ముందుకు సాగాలి.

**- కె.ఎన్.మల్లీశ్వరి, రచయిత**

"సన్నగా ఉండాలని కడుపు మాడ్చుకుంటే అనారోగ్యమే. చక్కగా తినాలి... చక్కగా ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ఆరోగ్యమే మహాభాగ్యం" అని ఉష మూల్పూరి అన్నారు. నిర్మాతగా తన తనయుడు నాగశౌర్యతో 'ఛలో', నర్తనశాల, కృష్ణా వ్రింద విహారి' తదితర చిత్రాలను నిర్మించారు. తొలి చిత్రం 'ఛలో' తోనే నిర్మాతగా సక్సెస్‌ని టేస్ట్ చేసిన ఉష ఇప్పుడు తన రెస్టారెంట్ 'ఉష మూల్పూరి'స్ కిచెన్' ద్వారా రుచికరమైన వంటకాలు అందిస్తున్నారు. ఇక గణతంత్ర దినోత్సవం సందర్భంగా 'సాక్షి' కోసం ప్రత్యేకంగా కొన్ని వంటకాలు తయారు చేశారు. ఆ వంటకాలు తెలుసుకుందాం.

# సర్వ ఆహార సమ్మేళనం



ఉష మూల్పూరి

"దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్... ఆ మనుషుల ఆరోగ్యం మా బాధ్యత... అందుకే రిపబ్లిక్ డే సందర్భంగా చేసిన వంటకాల్లోనూ పోషక విలువలు ఉండేలా చూసుకున్నాను'' అంటూ దేశభక్తిని చాటుతూ, జెండా రంగులకు తగ్గట్టుగా తాను కూడా రెడీ అయి, కిచెన్‌లోకి ఎంటరయ్యారు ఉష. ముందుగా నాన్ వెజ్ స్టార్టర్ చేశారు.. 'పండుమిర్చి కోడి వేపుడు, క్రీమ్ చికెన్, కరివేపాకు కోడి వేపుడు' చేసి, ఆ కాంబోని అందంగా ప్రెజెంట్ చేశారు.



''పండు మిర్చిలో విటమిన్ ఎ, బి, సి వంటివి పుష్కలంగా ఉంటాయి. అలాగే క్యాన్సర్‌తో పోరాడే ఔషధ గుణాలు ఉంటాయి. కరివేపాకులో విటమిన్ ఎ, బి, సి, ఇ వంటివి ఉంటాయి. కంటికి, జుట్టుకి మంచిది. ఎముకల ఆరోగ్యానికి కూడా కరివేపాకు బెస్ట్. అందుకే ఆహారం ఆరంభమే ఆరోగ్యంగా ఆరంభించాలని ఈ స్టార్టర్స్ చేశాను'' అని వివరించారు ఉష. రైస్ ఐటమ్స్‌లో పుదీనా మాంసం పులావ్, చికెన్ ఫ్రైడ్ రైస్, పండుమిర్చి కోడి పులావ్ చేశారు. ''పుదీనాకి మంచి వాసన ఉంటుంది. దాంతో పాటు రుచి కూడా బాగుంటుంది. అలాగే ఆహారం జీర్ణం కావడానికి పుదీనా మంచిది. ఐరన్ పుష్కలంగా ఉన్న పుదీనాని మీరు రోజూ తీసుకోవచ్చు. మనలో చాలామందికి రోజూ టీ తాగే అలవాటు ఉంటుంది. ఆ టీలో కొన్ని పుదీనా ఆకులు వేసుకుని, తాగి చూడండి. మీకే తేడా తెలుస్తుంది. ఇక నాన్‌వెజ్ తినేవారికి చికెన్‌లో ఎన్ని పోషక పదార్థాలు ఉన్నాయో తెలిసిందే'' అని పేర్కొన్నారామె. మాంసాహారం మాత్రమే కాదు... శాకాహారం కూడా చేశారు ఉష. వెజ్‌లో కరివేపాకు వెజ్ పులావ్, పండుమిర్చి పనీర్ పలావ్, కర్డ్ రైస్ చేశారు. ''కరివేపాకు, పండుమిర్చి ఎంత మంచిదో ముందే చెప్పాను. పనీర్ మంచి ప్రొటీన్ ఫుడ్. నాన్‌వెజ్ తినేవారికి మాంసం రూపంలో ప్రొటీన్లు అందుతాయి. వెజిటేరియన్స్‌కి పనీర్ బెస్ట్. పనీర్‌లో తక్కువ కార్బో హైడ్రేట్స్... ఎక్కువ ప్రొటీన్ ఉంటుంది. ఇక మన ఇండియన్స్‌లో చాలా మందికి ఫైనల్‌గా పెరుగన్నం తింటేనే సంతృప్తిగా ఉంటుంది.



పెరుగులో కావాల్సినంత కాల్షియం ఉంటుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పొట్ట చల్లగా ఉండటానికి పెరుగన్నం కూడా చేశాను'' అని తెలిపారు ఉష మూల్పూరి.

**ఎనిమిది పదుల వయసులవాళ్లకూ...**

''మనం ఆహారం తీసుకున్నాక పొట్ట బరువుగా ఉండకూడదు. తేలికగా అనిపించాలి. ఫుడ్ బిజినెస్ ఆరంభించాలనుకున్నప్పుడు నా మెయిన్ టార్గెట్ ఇదే. మా రెస్టారెంట్‌కి ఎనభై ఏళ్ల వయసు, ఆ పైన ఉన్నవాళ్లు కూడా వస్తారు. 'పొట్ట చాలా తేలికగా ఉందమ్మా' అని వారు చెప్పినప్పుడు హ్యాపీగా ఉంటుంది'' అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు.

**సెలబ్రిటీలకూ...**

''మా కిచెన్ వంటకాలను ఎన్టీఆర్, రామ్ చరణ్, ఉపాసన, కృష్ణారెడ్డి, హరీష్ శంకర్, బాబీ, బుచ్చిబాబు, కోటి, మెగా కృష్ణారెడ్డి, నందినీ రెడ్డిగార్లు వంటివారు ఇష్టపడతారు. మా దగ్గర బ్రోకోలీ కాషూనట్ చిల్లీ గార్లిక్ ఫేమస్. ఇవి ఎక్కువగా తెప్పించుకుంటారు'' అని చెప్పారు ఉష.

**అవగాహన పెంచుకోవాలి**

''నేను రెస్టారెంట్ పెట్టాలనుకున్నప్పుడు నాకు పెద్దగా ఏమీ తెలియదు. జీతాలిచ్చి మనుషులను పెట్టుకుని, వాళ్లతో చేయించేయొచ్చు. కానీ అందులో పరిపూర్ణత ఉండదు. వంటకు కావల్సినవి కొనడం నుంచి వాటిని సరిగ్గా శుభ్రం చేసి వండటం వరకూ అన్నింటినీ దగ్గరుండి చేయించేదాన్ని. 'సర్వ మత సమ్మేళనం' అంటారు... 'సర్వ ఆహారం సమ్మేళనం' అంటాను. రెస్టారెంట్ అంటే రకరకాల వాళ్లు వస్తారు. వాళ్లకి తగ్గట్టుగా ఉండాలి కదా. నా కుటుంబ సభ్యులకు వండుతున్నట్లుగా భావించి వంట చేయిస్తాను. వీలున్నప్పుడల్లా అన్ని టేబుల్స్ దగ్గరికి వెళ్లి, అందర్నీ పలకరిస్తుంటాను. 'మాకు ఇంటికి వచ్చినట్లుగా ఉంది' అని అంటుంటారు. అందరికీ 'సాక్షి' ద్వారా థ్యాంక్స్ చెబుతున్నాను'' అంటూ ముగించారు ఉష.

**- డి.జి. భవాని**

## హెల్త్

● టీన్- అనీమియా

# ఆ టైమ్ లోనూ ఐరన్ యువతిలా...



భారతదేశంలోని మహిళల్లో రక్తహీనత (అనీమియా) చాలా ఎక్కువ. కొన్నేళ్ల కిందట దాదాపు 85 శాతం మంది మహిళలు అనిమిక్‌గా ఉండేవారు. క్రమంగా మహిళల్లోనూ చైతన్యం పెరుగుతుండటంతో ఇటీవల అది 57 శాతానికి చేరింది. ఇంతగా చైతన్యం పెరిగాక కూడా దేశంలోని సగానికి పైగా మహిళలు అనీమియాతో బాధపడుతున్నారు. ఇక ఇటీవలే పీరియడ్స్ మొదలైన టీనేజీ అమ్మాయిల్లో రక్తహీనతతో బాధపడుతుండేవారు ఇంకా ఎక్కువ. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2019-21 ప్రకారం 15 నుంచి 19 ఏళ్ల వయసుండే కౌమార బాలికల్లో అనీమియాతో బాధపడేవారు 59.1 శాతం! రుతుస్రావంలో రక్తం కోల్పోతుండటం, అది భర్తీ అవుతుండగానే నెలసరితో రక్తం కోల్పోతుండటంతో యువతుల్లో రక్తహీనత కనిపిస్తోంది.

కొత్తగా పీరియడ్స్ మొదలైన టీనేజ్ అమ్మాయిలు అనీమియాకు లోనుకాకుండా ఉండాలంటే ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకుంటూ ఉండాలి. అవేమితో చూద్దాం.

**ఆహారంలో ఎక్కువగా తీసుకోవాల్సినవి...**

● శాకాహారులు తమ ఆహారంలో తాజాగా ఉండే ఆకుకూరలు, ఎండు ఖర్జూరం, నువ్వులు, బెల్లం (బెల్లం, నువ్వులు ఉండే నువ్వుల జీడీలు, బెల్లం, వేయించిన వేరుశనగలు ఉండే పల్లీపట్టీలు తీసుకోవడం మేలు), గసగసాలు, అటుకులు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ● ఒకవేళ మాంసాహారులైతే ఆహారంలో వేటమాంసం, చేపలు, చికెన్‌తో పాటు... మటన్, చికెన్ లివర్‌ను ప్రత్యేకంగా తీసుకోవడం మంచిది.

● మాంసాహారం, శాకాహారం ఈ రెండింటిలోనూ ఐరన్ ఉంటుంది. అయితే మాంసాహారంలో హీమ్ ఐరన్ ఉంటుంది. హీమ్ ఐరన్ అంటే... తిన్న వెంటనే అది ఒంటికి పట్టే రూపంలో ఉంటుంది. అదే శాకాహార పదార్థాల్లో ఉండే నాన్‌హీమ్ ఐరన్ ఒంటికి పట్టేలా చేయడానికి విటమిన్-సి కావాలి. కాబట్టి శాకాహారులు తమ ఆహారాల్లో ఐరన్ ఉండేవి తినేటప్పుడు వాటితో పాటు విటమిన్-సి ఉండే తాజా పండ్లైన జామ, నిమ్మ, నారింజ వంటివి ఎక్కువగా తీసుకోవాలి లేదా వంటకాల్లో విటమిన్-సీ ఎక్కువగా ఉండే ఉసిరి వంటివి తీసుకుంటూ ఉండాలి.

● మాంసాహారులైనా, శాకాహారులైనా కోడిగుడ్డు, పాలు తప్పనిసరిగా రోజూ తీసుకోవాలి. కోడిగుడ్డులో పచ్చసొన తీసుకోకూడదనే అభిప్రాయాన్ని వదిలించుకోవాలి. ఎందుకంటే పచ్చసొనతో వచ్చే హానికరమైన కొలెస్ట్రాల్ కంటే, అది తీసుకోకపోతే కోల్పోయే పోషకాలే ఎక్కువ.

● రుతుస్రావం అవుతున్న సమయంలో ద్రవాహారం సమృద్ధిగా లభించేలా ఎక్కువ నీళ్లు తాగుతూ, కొబ్బరినీళ్లు తీసుకోవడం కూడా మంచిదే.

**అస్సలు తీసుకోకూడనివి...**
● బేకరీ ఐటమ్స్, కెఫిన్ మోతాదు ఎక్కువగా ఉండే కూల్‌డ్రింక్స్ అస్సలు తీసుకోకూడదు.

**మరికొన్ని సూచనలు**

● రుతుస్రావం సమయంలో అమ్మాయిలు రక్తాన్ని ఎక్కువగా కోల్పోతుంటారు కాబట్టి ఎక్కువ మోతాదులో ఆహారం ఇవ్వాలంటూ పొరుగువారు, ఫ్రెండ్స్ చెబుతుంటారు. అది వాస్తవం కాదు. ఈ టీనేజ్‌లోనే అమ్మాయిలు తాము తీసుకునే క్యాలరీల వల్ల బరువు పెరుగుతుంటారు. అందుకే ఆహారం ఎక్కువగా తీసుకోవడం కంటే... ఆహారాన్ని ఎప్పటిలాగే తీసుకుంటూ ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలూ తీసుకోవాలి.

● కొత్తగా రుతుస్రావం మొదలైన అమ్మాయిలకు కొబ్బరి, బెల్లం పెట్టాలంటారు. సంప్రదాయకంగా పెద్దలు చెప్పే ఆ ఆహారం పెట్టినా పరవాలేదు. అయితే కొబ్బరిలో, నువ్వుల్లో కొవ్వు పదార్థాలు ఎక్కువ. కాబట్టి వాటిని కాస్త పరిమితంగా తీసుకుంటూ ఉండాలి. ● నెయ్యికి బదులు వెన్న వాడటం మేలు. ఎందుకంటే వెన్నకాచి నెయ్యి చేశాక అందులో కొన్ని పోషకాలు తగ్గుతాయి. అయితే వెన్న తీసుకుంటే అందులోని కొవ్వులు... ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్స్‌ను బాగా ఒంటబట్టేలా చేస్తాయి. ● అన్నిటి కంటే ముఖ్యంగా పీరియడ్స్ సమయంలోనూ తేలికపాటి వ్యాయామం చేయడం అవసరమని తెలుసుకోవాలి. క్రమం తప్పకుండా రోజుకు 45 నిమిషాల చొప్పున కనీసం వారానికి ఐదు రోజుల పాటైనా వ్యాయామం చేస్తే హార్మోన్లు క్రమబద్ధంగా విడుదల కావడం జరుగుతోంది. అయితే కొంతమంది విషయంలో మాత్రం పీరియడ్స్ సమయంలో వ్యాయామం కుదరకపోవచ్చు. వాళ్ల మినహా మిగతా యువతులంతా వ్యాయామం తప్పనిసరిగా చేయాలి.

**చాలా పరిమితంగా తీసుకోవాల్సినవి...**
● ఉప్పు ఎక్కువగా ఉండే పచ్చళ్లు, అప్పడాలు వంటి వాటినీ, కొవ్వులు ఉండే ఆహారాలను చాలా పరిమితంగా తీసుకోవాలి. ● కెఫిన్ ఎక్కువగా ఉండే కాఫీ చాలా తక్కువగా తీసుకోవాలి.



డా. పూజితాదేవి సూరనేని
సీనియర్ హైరిస్క్ ఆబ్‌స్టెట్రీషియన్ & రోబోటిక్ సర్జన్



● నీ రీప్లేస్‌మెంట్ - రోబో

# సునిశితంగా శస్త్ర చికిత్స

**మోకాలి ఎముకల తాలూకు మృదులాస్థి (కార్టిలేజ్) అరిగాక... మోకాలి కదలికల్లో ఒకదానితో మరొకటి ఒరుసుకుంటే తీవ్రమైన నొప్పి రావడం... ఈ అరుగుదల తీవ్రత నాలుగో దశకు చేరాక మోకాలి మార్పిడి (నీ రీప్లేస్‌మెంట్ సర్జరీ) అవసరం ఏర్పడటం అందరికీ తెలిసిందే. ఇప్పటివరకు సంప్రదాయ పద్ధతుల్లో చేసే నీ రీప్లేస్‌మెంట్ చికిత్సల స్థానంలో ఇప్పుడు రోబో సహాయంతో శస్త్రచికిత్స (రోబోటిక్ సర్జరీ) వంటి అధునాతన పద్ధతులు అమల్లోకొచ్చాయి. ఈ నేపథ్యంలో రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జరీతో ఉండే సౌలభ్యాలూ, అనుకూలత గురించి తెలుసుకుందాం.**

మోకాలి ఎముకల అరుగుదల అనేక విధాలుగా జరుగుతుంది. ఈ అరుగుదలను ఆర్థరైటిస్‌గా పేర్కొంటారు. ఇందులో దశలు ఉంటాయి. ఒకదశ దాటాక (నాలుగో దశ) ఇక మోకాలి మార్పిడి శస్త్రచికిత్స వల్లనే నొప్పి తగ్గుతుంది. గతంలోనూ... ఆ మాటకొస్తే ఇప్పుడు కూడా సాధారణ సంప్రదాయ పద్ధతుల్లో శస్త్రచికిత్సలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇటీవల అనేక శస్త్రచికిత్స పద్ధతుల్లో వచ్చినట్టే మోకాలి మార్పిడి చికిత్సల్లో సైతం రోబోటిక్ సర్జరీ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. అందునా ఇప్పుడు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో పని చేస్తూ... అత్యంత సునిశితంగా (ప్రెసిషన్‌తో) శస్త్రచికిత్స చేయగల సామర్థ్యం ఉన్న అత్యాధునిక రోబోల సహాయాన్ని వైద్యులు తీసుకుంటున్నారు. సంప్రదాయ శస్త్రచికిత్సతో పోలిస్తే ఈ అధునాతన పద్ధతిలో జరిగే శస్త్రచికిత్సతో ప్రయోజనాలేమిటో చూద్దాం.

● **కృత్రిమ పరికరాలు చాలాకాలం పాటు మన్నడం:** లోపల అమర్చాల్సిన పరికరాలను చాలా సునిశితత్వంతో అత్యంత ఖచ్చితమైన స్థానాల్లో అమర్చడం వల్ల అవి త్వరగా రాసుకుపోవడం, ఒరుసుకుపోవడం జరగవు. దాంతో చాలాకాలం పాటు మన్నికతో ఉంటాయి.

● **తక్కువ నొప్పి:** రోబోటిక్ శస్త్రచికిత్సలో నొప్పి చాలా తక్కువగా ఉంటుంది.

● **చాలా తక్కువ దుష్ప్రభావాలు:** చాలా ఖచ్చితత్వంతో శస్త్రచికిత్స జరిగిపోవడం వల్ల ఇన్ఫెక్షన్ వంటి దుష్ప్రభావాలు రావడం చాలా తక్కువ.

● **టైలర్ సర్జికల్ అప్రోచ్:** అందరి దేహ భాగాలూ, వాటితో పనిచేసే తీరుతెన్నులు ఒకేలా ఉండవు. దాంతో బాధితుల మోకాలి చుట్టూ ఉండే టెండన్లు, లిగమెంట్లు సరిగ్గా అమరిపోయేలా వారి అవసరాలకు తగ్గట్లుగా కృత్రిమ ఉపకరణాల రూపకల్పన, లోపల వాటి అమరిక అత్యంత ఖచ్చితత్వంతో జరగడంతో గతంలోని వారి వ్యక్తిగత అవయవం లాగానే మోకాలి భాగాలు అమరిపోతాయి. ఇంకా చెప్పాలంటే సంప్రదాయ చికిత్సల్లో శస్త్రచికిత్స చేసి లోపలి భాగాలను చూసేవరకు కండరాల పరిస్థితి అంతగా తెలియదు. అనుభవజ్ఞులైన శస్త్రచికిత్స నిపుణులు తమ అంచనా ప్రకారం శస్త్రచికిత్స నిర్వహిస్తారు. అయితే రోబోటిక్ సర్జరీలో కండరాల తీరుతెన్నులు శస్త్రచికిత్స ముందే స్పష్టంగా తెలుస్తాయి. ఫలితంగా ఖచ్చితమైన శస్త్రచికిత్సకు అవకాశం దొరుకుతుంది. దాంతో శస్త్రచికిత్స తర్వాత మోకాలు ముందుకూ వెనక్కు కదలడం (ఎక్స్‌టెన్షన్, ఫ్లెక్షన్) వంటి కదలికలు చాలా బాగుంటాయి. అందునా మోకాలి దగ్గర వంగడం అనేది సంప్రదాయ చికిత్స కంటే మరింత ఎక్కువగా ఉంటుంది. బాగుంటుంది. మోకాలు ఒంచేటప్పుడు సైతం నొప్పి చాలా తక్కువ.

**మరింత ఎక్కువ సునిశితత్వం**

ఇలాంటి అత్యాధునిక రోబోల సహాయంతో చేసే శస్త్రచికిత్సల్లో సర్జన్ల ముందర బాధితుల తాలూకు మోకాలి 3-డి ఇమేజ్ స్పష్టంగా కనిపిస్తుంటుంది. సంప్రదాయ చికిత్సల్లో ఇది అంత పూర్తిగా, స్పష్టంగా కనిపించకపోవచ్చు. ఫలితంగా కృత్రిమ మోకాలి ఎముకల భాగాల్ని అమర్చేటప్పుడు మునుపు ఉన్నట్లే సరిగ్గా అమరిపోయేలా అమర్చడానికి వీలవుతుంది.

**వేగంగా కోలుకోవడం**




రోబోటిక్ శస్త్రచికిత్స అత్యంత సునిశితత్వంతో జరగడంతో గాయం చాలా త్వరగా తగ్గుతుంది. ఇక దుష్ప్రభావాలు (సైడ్ ఎఫెక్ట్స్) కూడా చాలా తక్కువగా ఉండటం ఫలితంగా చాలా వేగంగా కోలుకుని, చాలా త్వరగా ఇంటికెళతారు.



డా. నీలం రమణారెడ్డి, రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్ సర్జన్

**ఎవరికి ఈ శస్త్రచికిత్సలు**

**గతంలో శస్త్ర చికిత్స చేయించుకుని విఫలమైనవాళ్లు (వీళ్లలో మోకాలి దగ్గర కదలికలు చాలా పరిమితంగా ఉండటం, కాలు కదిలిస్తున్నప్పుడు నొప్పి ఉండటం వంటి లక్షణాలుంటాయి), అరుగుదల చాలా ఎక్కువగా (సివియర్ ఆస్టియో ఆర్థరైటిస్) ఉన్నవారికి, రుమటాయిడ్ ఆర్థరైటిస్‌తో బాధపడుతుండేవారికి, అలాగే ఇక నొప్పి నివారణ మందులూ, ఇతర చికిత్సలు పని చేయని వారికి ఈ రోబోటిక్ శస్త్రచికిత్స ఎంతగానో ఉపయోగపడుతుంది.**


'పేదలందరూ పక్కా ఇళ్లలో ఉండాలన్నదే నా అభిమతం'

# సాక్షి

సత్యమేవ జయతే

WWW.SAKSHI.COM

పేజీలు: 18+32 పేజీల ఆదివారం అనుబంధం    వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 305

ఆదివారం 26-1-2025

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


## దేశంలో వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం

ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



"ప్రస్తుత పరిస్థితుల్లో ఏవైనా నిర్ణయాలపై మండల స్థాయి నుంచి ప్రధాని స్థాయి వరకు రాజకీయవేత్తలను ఒప్పించడమనేది కష్టంగా మారింది.

## ఆరోగ్య అక్షరాస్యత అత్యవసరం


డబ్ల్యూహెచ్ఓ చీఫ్ సైంటిస్ట్ డా.సౌమ్య స్వామినాథన్



"అనారోగ్యానికి కారణాలు తెలియకపోవడం వల్ల వచ్చే వ్యాధులు ఎక్కువవుతున్నాయి. హెల్త్ ఎడ్యుకేషన్ ఆవశ్యకతను అందరూ గుర్తించాలి.

## 'రైట్ టు రీకాల్' రావాలి

జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్



"వార్డు మెంబర్, ఎమ్మెల్యే, ఎంపీ.. ఎవరైనా సరే హామీలు అమలు చేయకున్నా, సరిగా పనిచేయకున్నా తొలగించే హక్కు తీసుకురావాలి.

వివరాలు 2లో ▶



# 4 పథకాలు నేడే షురూ

### రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పథకాలు ప్రారంభం

### తెలంగాణ వ్యాప్తంగా ప్రతి మండలంలో ఒక గ్రామంలో కార్యక్రమం

- చంద్రవంచలో ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పలుచోట్ల మంత్రులు
- ఆ గ్రామాల్లో 100% లబ్ధిదారులకు వెంటనే మంజూరు
- దరఖాస్తుల క్రోడీకరణ పూర్తయిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అర్హులందరికీ వర్తింపు
- మార్చి 31లోగా నాలుగు పథకాలు పూర్తిగా అమలు
- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలో నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన ఉప ముఖ్యమంత్రి భట్టి



పథకాల అమలుపై సమీక్షిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి

**సాక్షి, హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ పథకాలను లాంఛనంగా ప్రారంభిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి మండలంలో ఒక్కో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని.. తొలిరోజున ఆ గ్రామంలో పూర్తి శాచురేషన్ పద్ధతిలో పథకాలను వర్తింపజేయనున్నట్టు వెల్లడించారు. లక్షల్లో వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలించి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పథకాలను ఇవ్వాలని ఆలోచనతో ఉన్నామని.. దీనిపై ఎలాంటి పరిమితి లేదని చెప్పారు. ఈ మొత్తం ప్రక్రియను మార్చి 31 కల్లా పూర్తి చేయనున్నట్టు తెలిపారు. పథకాల అమలుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం పలువురు మంత్రులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమావేశమై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం సచివాలయంలో సహచర మంత్రులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి సమావేశం వివరాలను వెల్లడించారు.

**అర్హత ఉన్న అందరికీ పథకాలు..**

"లక్షల మంది తమ పేర్లు లేవంటూ గ్రామసభల్లో దరఖాస్తులు పెట్టుకోవడంతో పరిశీలన కోసం మార్చి వరకు సమయం పడుతుంది. ఈ ప్రక్రియలో ఏ ఒక్కరూ మిగిలిపోరు. రైతు భరోసా కింద వ్యవసాయోగ్యమైన ప్రతి ఎకరానికి సాయం చేస్తాం. ఉపాధి హామీ పథకం కింద ఏడాదిలో కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలను గుర్తించి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేస్తాం. షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు నిర్వహిస్తున్నాం. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన లక్షలాది దరఖాస్తులను క్రోడీకరించి అర్హత ఉన్న వారందరికీ ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనవరి 26న భారత

మిగతా 2వ పేజీలో ▶

# డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్





డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి

- వైద్య రంగానికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపు
- దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారానికి ఎంపిక
- నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్
- మందకృష్ణ మాదిగ, మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ
- తెలంగాణ నుంచి ఇద్దరు, ఏపీ నుంచి ఐదుగురికి పద్మ పురస్కారాలు
- 2025కుగాను మొత్తం 139 మందికి పద్మ అవార్డులు ప్రకటించిన కేంద్రం




బాలకృష్ణ | మందకృష్ణ | మాడుగుల
అప్పారావు | వాదిరాజు | లీలాకృష్ణ

వివరాలు 12లో ▶

తెలంగాణకు రెండు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు 13లో

ప్రపంచంలోనే ఎత్తయిన చినాబ్ రైలు వంతెన మీదుగా వెళ్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ▼



## కశ్మీర్‌కు వందేభారత్

ట్రయల్ రన్ విజయవంతం 6లో

జస్టిస్ రేణుక యారా | జస్టిస్ నర్సింగ్‌రావు | జస్టిస్ తిరుమలాదేవి | జస్టిస్ మధుసూదన్‌రావు



## రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తిస్తాం

హైకోర్టు కొత్త జడ్జీలుగా జస్టిస్ రేణుక, జస్టిస్ నర్సింగ్‌రావు, జస్టిస్ తిరుమలాదేవి, జస్టిస్ మధుసూదనరావు ప్రమాణ స్వీకారం 12లో

## నీట్ యూజీలో కీలక మార్పు



- ఇక 180 ప్రశ్నలతోనే నీట్ యూజీ–2025
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి 16లో

## తిలక్ తడాఖా



ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 2 వికెట్ల తేడాతో నెగ్గింది. హైదరాబాద్ ప్లేయర్ తిలక్ వర్మ (55 బంతుల్లో 72 నాటౌట్: 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారత జట్టును గెలిపించాడు. 14లో

# ‘రైట్ టు రీకాల్’ రావాలి

**హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్**

**పార్టీ ఫిరాయిస్తే పదేళ్లదాకా మంత్రి కాకుండా నిషేధం తేవాలి**

**నేటి రాజకీయ నాయకత్వానికి రోజు వారీ ‘మైక్రో మేనేజ్‌మెంట్’ అవసరం**

**ప్రస్తుత పరిస్థితుల్లో వాట్సాప్‌లో ఎన్నికలు జరుగుతున్నట్టుగా ఉందని వ్యాఖ్య**



చర్చలో మాట్లాడుతున్న సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్. చిత్రంలో సునీతారెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ఎన్నికల సంస్కరణల్లో భాగంగా.. వార్డు మెంబర్ నుంచి ఎమ్మెల్యే, ఎంపీ దాకా ఎవరైనా సరే, అధికారంలో ఉన్నవారు ఇచ్చిన హామీలు అమలు చేయకపోయినా, ప్రజలు కోరుకున్నట్టు పనిచేయకపోయినా వారిని తొలగించే హక్కు (రైట్ టు రీకాల్) తీసుకురావాల్సి ఉందని సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్ చెప్పారు. అదేవిధంగా ఎవరైనా పార్టీ ఫిరాయిస్తే పదేళ్లదాకా మంత్రి కాకుండా నిషేధం, ‘ప్రభుత్వ నిధి’ (స్టేట్ ఫండ్)తో ఎన్నికల నిర్వహణ వంటివి రావాలన్నారు. ఇటువంటి వాటిపై రాజకీయవేత్తలు ఎందుకు చర్చించడం లేదని ప్రశ్నించారు. శనివారం ‘హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్’లో రాజ్‌దీప్ కొత్త పుస్తకం ‘2024: ఎలక్షన్ దట్ సర్‌ప్రైజ్డ్ ఇండియా’పై చర్చాగోష్టి నిర్వహించారు. దీనికి సమన్వయకర్తగా వ్యవహరించిన హెచ్‌ఎల్‌ఎఫ్ కోర్ గ్రూపు సభ్యురాలు సునీతారెడ్డి ఈ పుస్తకంపై చర్చను ప్రారంభించారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయాలు, రాజ్‌దీప్ పుస్తకంలోని అంశాలు, ఇతర విషయాలను ప్రస్తావిస్తూ ప్రశ్నలు వేశారు.

### సంస్థాగతంగా బలంగా ఉండటం అవసరం

మోదీ గత పదేళ్లలో ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తి చేయలేదని రాజ్‌దీప్ చెప్పారు. రాజకీయ వేత్తగా రాహుల్‌గాంధీ మంచివాడే అయినా అది సరిపోదన్నారు. నేటి రాజకీయ నాయకత్వానికి రోజువారీ ‘మైక్రో మేనేజ్‌మెంట్’ ముఖ్యమని.. అందుకు వ్యూహాలు, సంస్థాగతంగా పార్టీ బలంగా ఉండటం అవసరమని స్పష్టం చేశారు. అధికారమనేది విషం అనే మాటను అధికారం కోరుకుంటున్న పార్టీ నేత రాహుల్‌గాంధీ పేర్కొనడం సరికాదని వ్యాఖ్యానించారు.

### సీట్ల సంఖ్యపై ముందే చెప్పా..

‘2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు మిమ్మల్ని ఆశ్చర్యపరిచాయా?’ అని సునీతారెడ్డి ప్రశ్నించగా రాజ్‌దీప్ మిశ్రమంగా స్పందించారు. ‘‘గత ఏడాది రామమందిర ప్రారంభం, మోదీ ఇమేజీని ఒక్కసారిగా పెంచేయడం, అబ్‌కీ బార్ చార్ సౌ(400) పార్ అంటూ బీజేపీ పెద్ద ఎత్తున ప్రచారం చేయడం వంటివి కొంత అయోమయానికి గురిచేశాయి. అయితే 2024 మే 12న (ఫలితాలు రావడానికి ముందు) బీజేపీ 270 సీట్ల వద్ద ఆగిపోవచ్చని నా వీడియో బ్లాగ్‌లో పేర్కొన్నాను. అది రికార్డెడ్‌గా ఉంది’’ అని రాజ్‌దీప్ చెప్పారు. ఎన్నికల కవరేజీ నిమిత్తం దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న క్రమంలో.. ఓటర్లు, ముఖ్యంగా మహిళలు విభిన్నంగా స్పందించారని ఆయన తెలిపారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, అవినీతి తదితర అంశాలను గురించి ప్రస్తావించారని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. అగ్రరాజ్యం అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ పార్టీ, బ్రిటన్‌లో రిషి సునాక్ వంటి వాళ్లు ఓటమిని చవి చూసినా.. ఇక్కడ మోదీ మాత్రం పూర్తి మెజారిటీ రాకపోయినా గెలవగలిగారని పేర్కొన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చూస్తే సామాజిక మాధ్యమాల్లో, మరీ ముఖ్యంగా వాట్సాప్‌లో ఎన్నికలు జరుగుతున్నాయని వ్యాఖ్యానించారు.

### భారీ మార్పులు రావాలి

చర్చాగోష్టిలో సభికులు అడిగిన ప్రశ్నలకు రాజ్‌దీప్ స్పందిస్తూ... ‘ఒక దేశం.. ఒక ఎన్నిక’ వంటి సంస్కరణలను ‘వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్ (సామూహిక హనన ఆయుధాలు)’గా తాను భావిస్తానని రాజ్‌దీప్ చెప్పారు. పార్లమెంట్, న్యాయస్థానాలు, మీడియా వంటి వ్యవస్థలతోపాటు ప్రజాస్వామ్య సంస్థల్లో సంస్థాగతంగా భారీ మార్పులు రావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బ్యూరోక్రసీ కూడా ఓ అడ్డుగోడగా మారుతున్నందున, ఇది కూడా మారాల్సిన అవసరం ఉందని చెప్పారు. తెలంగాణలో ఓ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసిన అభ్యర్థి రూ.75 కోట్లు ఖర్చుచేశారని.. ఇంత భారీగా ఎన్నికల ఖర్చు వంటి విష వలయం నుంచి కూడా దేశం బయటపడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.


# దేశంలో వ్యవస్థీకృత సంస్కరణలు అవసరం

**హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ చర్చాగోష్టిలో ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు**

**దావోస్ ఒప్పందాలు పెట్టుబడులుగా మారేలా చూడాలి**

**రాజకీయాల్లో నైతిక సంస్కరణలు తీసుకురావాలి**

**మండల స్థాయి నుంచి ప్రధాని దాకా రాజకీయవేత్తలను ఒప్పించడం కష్టమని వ్యాఖ్య**



**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత పరిస్థితుల్లో దేశంలో కార్మిక, పెట్టుబడులు, భూములు, పన్నులు, పాలన వంటి అంశాల్లో వ్యవస్థీకృత సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అభిప్రాయపడ్డారు. దావోస్‌లో సీఎంలు, కేంద్ర మంత్రులు పలు ఒప్పందాలు చేసుకున్నారని.. ఆ పెట్టుబడిదారులు ఇక్కడికి వచ్చాక పెట్టుబడులు పెట్టేందుకు వారు సుముఖంగా ఉండేలా చర్యలు తీసుకోవాల్సి ఉందని చెప్పారు. శనివారం హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ‘జస్ట్ ఏ మెర్సినరీ? నోట్స్ ఫ్రం మై లైఫ్ అండ్ కెరీర్’ పుస్తకంపై చర్చాగోష్టి నిర్వహించారు. రచయిత సుచిత్ర షెనాయ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ చర్చాగోష్టిలో దువ్వూరి సుబ్బారావు మాట్లాడారు.

### రాజకీయాల్లో నైతిక సంస్కరణలు తేవాలి

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారంలోకి రావడంతోపాటు ఎన్నికలకు ఇంకా నాలుగున్నరేళ్ల సమయం ఉండటం, కూటమి బలంగా ఉండటం వల్ల రాజకీయపరంగా నైతిక సంస్కరణలు (పొలిటికల్లీ ఎథికల్ రిఫామ్స్) తెచ్చేందుకు ఇదే సరైన సమయమని దువ్వూరి పేర్కొన్నారు. ప్రస్తుతం ఏ ప్రధానికీ లేనంతగా మోదీకి రాజకీయ పలుకుబడి ఉన్నందున రాజకీయపరంగా కొన్ని కష్టతరమైన నిర్ణయాలను, వ్యవస్థీకృత సంస్కరణలను అమల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని చెప్పారు.

### నాటి సంస్కరణలు ఎంతో కీలకం

‘‘1991లో దేశంలో తెచ్చిన ఆర్థిక సంస్కరణలు ఎంతో కీలకమైవి. దేశం ఆర్థికంగా అత్యంత విపత్కర పరిస్థితుల్లో ఉన్నపుడు తెచ్చిన ఆ సంస్కరణలు దేశ గతిని మలుపు తిప్పాయి. నాడు ఆ సంస్కరణలు ఎంతో అవసరం. వాటిని అంతర్జాతీయ ద్రవ్యనిధి ఆదేశాలకు అనుగుణంగా తెచ్చారనేది వాస్తవం కాదు. నేటి తరానికి, ముఖ్యంగా యువతకు 1990కు ముందు దేశంలో ఉన్న పరిస్థితుల గురించి అంతగా అవగాహన ఉండకపోవచ్చు. ల్యాండ్ ఫోన్ కనెక్షన్, ఎల్‌పీజీ గ్యాస్ లేవు. టేప్‌రికార్డర్, కాలిక్యులేటర్ వంటివి కూడా ఇతర దేశాల నుంచి తెప్పించుకోవడమో, స్మగ్లింగ్ చేయడమో జరిగేది..’’ అని దువ్వూరి సుబ్బారావు చెప్పారు. ఎన్టీ రామారావు సీఎంగా ఉన్నప్పుడు ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల్లో జిల్లాకో ‘సారాయి బాట్లింగ్ యూనిట్’ స్థాపించాలనే ఆదేశాలను అమలుచేసేందుకు ఓఎస్డీగా వ్యవహరించిన తీరును గుర్తు చేసుకున్నారు. ఆర్బీఐ గవర్నర్‌గా ఒక శాతం వడ్డీరేటు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ప్రకటించినప్పుడు ఎదురైన పరిస్థితులను వివరించారు. మండల స్థాయి నుంచి ప్రధాని స్థాయి వరకు రాజకీయవేత్తలను ఏవైనా నిర్ణయాలపై ఒప్పించడమనేది కష్టతరమైనదేనని ఒక ప్రశ్నకు బదులిచ్చారు.

# ఆరోగ్య అక్షరాస్యత అత్యవసరం

**అవగాహనాలోపం వల్లే దేశంలో వివిధ అనారోగ్య సమస్యలు**

**ప్రజల్లో అవగాహన పెంచడం సామాజికవేత్తలు, శాస్త్రవేత్తల బాధ్యత**



‘సాక్షి’తో డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ సైంటిస్ట్ డా.సౌమ్యా స్వామినాథన్

**సాక్షి, హైదరాబాద్:** ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్య అక్షరాస్యత అవసరమని ప్రముఖ వైద్యురాలు, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) చీఫ్ సైంటిస్ట్ డా.సౌమ్య స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో రెండోరోజైన శనివారం నిర్వహించిన పలు చర్చాగోష్టుల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ‘సాక్షి’తో ప్రత్యేకంగా సంభాషించారు. ముఖ్యాంశాలు ఆమె మాటల్లోనే..

**రోగాలపై సరైన సమాచారమేదీ?**

వ్యాక్సిన్ వల్ల అనారోగ్యాలు ఆఖరికి మరణాలు సైతం అపోహల దగ్గర నుంచీ ప్రస్తుతం వైద్య ప్రపంచం తీవ్రంగా ఆందోళన చెందుతున్న యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎమ్ఆర్) దాకా చాలా సమస్యలకు కారణం అవగాహన లోపమే కదా. అంతేకాదు అనారోగ్యానికి కారణాలు తెలియకపోవడం వల్ల వచ్చే వ్యాధులు ఎక్కువవుతున్నాయి. నీటి ద్వారా వ్యాపించే రోగాలేమిటి? గాలి ద్వారా వ్యాపించేవి ఏమిటి? వైరస్ ద్వారా వచ్చేవి ఏమిటి? సరైన తిండి తినకపోతే ఎలాంటి వ్యాధులు వస్తాయి? ఏది సరైన తిండి? ఇలాంటి చాలా ప్రశ్నలకు సమాధానాలు ఎక్కడా లభించవు. అందువల్ల జనం వాట్సాప్ మొదలు సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో హెల్త్ ఎడ్యుకేషన్ ఆవశ్యకతను గుర్తించి అందరూ ముందుకు రావాలి. అనారోగ్యాలపై ప్రజల్లో అవగాహన పెంచడం సామాజికవేత్తలు, శాస్త్రవేత్తల బాధ్యత.

**ఇంటర్నెట్‌లోని సమాచారాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకోవాలి**

ఇంటర్నెట్ ఓ అద్భుతమైన సమాచార సేకరణ మార్గం. ఆరోగ్య అక్షరాస్యతకు ఉపకరించే అత్యున్నత మార్గం. అయితే టెక్నాలజీ వల్ల మంచితోపాటు చెడు కూడా జరుగుతోంది. తీవ్రమైన అనారోగ్య విషయాలపైనా తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతోంది. కాబట్టి ప్రజలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న వాటిలో ఏది నమ్మాలో, ఏది నమ్మకూడదో ఒకటికి రెండుసార్లు ఆలోచించుకొని నిర్ణయించుకోవాలి.

**మన మహిళలకు మల్టీటాస్కింగ్ కొట్టిన పిండే..**

ఇంటి పని, వంట పని, బయటి పని... ఇలా పలు పాత్రలు పోషించే మల్టీ టాస్కింగ్ భారతీయ మహిళలకు స్వతహాగానే వచ్చింది. అదే సమర్థతతో ఇప్పుడు అనేక వృత్తుల్లో అతివలు రాణిస్తున్నారు. అయితే ప్రపంచంలో చాలా చోట్ల ఉన్నట్టుగానే మన దగ్గర కూడా ఇప్పటికీ లింగ వివక్ష ఉంది. దీన్ని మనం అధిగమించాల్సి ఉంది.

**మితాహారం.. వ్యాయామం నా ఆరోగ్య రహస్యం**

నేను క్రమబద్ధమైన జీవనశైలిని పాటిస్తా. ప్రతిరోజూ కనీసం 45 నిమిషాలపాటు వ్యాయామం చేస్తా. రోజూ రాత్రి 7 గంటలకే నిద్రపోతా. అన్ని రకాల ఆహారపదార్థాలను మితంగా తింటా. మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు నవ్వు ఓ మార్గం. మన చుట్టూతా ఎల్లప్పుడూ మంచి స్నేహితులతోపాటు ఆహ్లాదకరమైన ఇంటి వాతావరణం ఉండటం మనసును ఆరోగ్యంగా ఉంచుతుంది.

### ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ప్రభుత్వ విధానాలు స్పష్టంగా ఉండాలి

ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో ప్రభుత్వాల విధివిధానాలు స్పష్టంగా ఉండాలని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ సైంటిస్ట్ డా.సౌమ్య స్వామినాథన్ పేర్కొన్నారు. ఒక విధానాన్ని రూపొందించేటప్పుడు బహుళ రంగాల నిపుణులను భాగస్వాములను చేయాలని సూచించారు. అప్పుడే పటిష్టమైన విధానాలు రూపొందుతాయన్నారు. వాటిని ఆచరణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో వాతావరణ పరిరక్షణ సదస్సులో పాల్గొన్న సౌమ్య స్వామినాథన్, పంకజ్ సెఖ్సారియా, సుల్తాన్ ఇస్మాయిల్‌లు పాలసీ పర్‌స్పెక్టివ్స్ అండ్ ద ప్లానెట్ అనే అంశంపై చర్చించారు. ఆహారం, ఆరోగ్యం, మహిళలు, పిల్లల అంశాన్ని సౌమ్యా స్వామినాథన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. వాతావరణ మార్పుల ప్రభావం ప్రజారోగ్యంపై తీవ్రంగా ఉంటోందని.. శిశువుల్లో జన్యు లోపాలకు ఇది ఒక కారణం అవుతోందన్నారు. కృత్రిమ ఎరువుల వాడకంతో పండించే పంటల్లో పోషకాలు తగ్గిపోవడం, పంట ఉత్పత్తులను రుచిగా మార్చుకొనే క్రమంలో కృత్రిమ రసాయనాల వాడకం పెరగడం కూడా ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తోందని చెప్పారు. రసాయన ఎరువులు మట్టిని, పంటలను నిస్సారం చేస్తుంటే, ఎరువుల తయారీ పర్యావరణానికి హాని చేస్తోందని సౌమ్యా స్వామినాథన్ చెప్పారు. అయితే భారతదేశపు మట్టి పరిపూర్ణమైనదని.. ఆ మట్టిని కాపాడుకుంటే మన దేశం ప్రపంచ దేశాలకు అవసరమైన ఆహారాన్ని పండించగలిగే దేశంగా ఎదుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యువత ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు.

# నిజాలు తెలుసుకుని వార్తలు రాయాలి

**సినీ పరిశ్రమలో బ్లాక్ మనీ లేదు: నిర్మాత దిల్ రాజు**



**సాక్షి, హైదరాబాద్:** ఐటీ దాడులు సాధారణమేనని, కానీ కొందరు తెలిసీ తెలియక ఇష్టమొచ్చినట్టు వార్తలు రాశారని ప్రముఖ నిర్మాత దిల్ రాజు పేర్కొన్నారు. తమపై ఐటీ దాడులు, మీడియాలో వచ్చిన పలు ఆరోపణలు, వదంతులపై ఆయన స్పందించారు. ‘‘గతంలో 2008లో మాపై ఐటీ రైడ్స్ జరిగాయి. మళ్లీ ఇప్పుడు జరిగాయి. ఏ వ్యాపారంలో ఉన్నా.. అప్పుడప్పుడు రైడ్స్ జరుగుతూనే ఉంటాయి. కానీ కొన్ని మీడియాలలో తెలిసీ తెలియక ఇష్టమొచ్చినట్టుగా వార్తలు రాశారు. ఖరీదైన డాక్యుమెంట్లు దొరికాయని, కోట్ల కొద్దీ నగదు లభ్యమైందని ప్రచారాలు చేశారు. అవన్నీ అవాస్తవాలు. మా అందరి దగ్గర కలిపి రూ.20 లక్షల నగదు మాత్రమే దొరికింది. వాటికి కూడా అన్ని లెక్కలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ ఇలా అన్నింటికి సంబంధించిన పత్రాలు అడిగారు. చూపించాం. సినీ పరిశ్రమలో బ్లాక్ మనీ లేదు. దాదాపు 80 శాతం మంది టికెట్లను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. ఇక బ్లాక్‌మనీ ఎక్కడి నుండి వస్తుంది? మేం సెలబ్రిటీలం కాబట్టి ఎక్కువ క్యూరియాసిటీ ఉంటుంది. కానీ నిజాలు తెలుసుకుని రాయండి..’’ అని కోరారు.

# పూర్తికాని సాగు యోగ్యం కాని భూముల ‘ఫ్రీజింగ్’

**దీంతో మొదట పైలట్ ప్రాజెక్టుగా ప్రతి మండలంలో ఒక గ్రామం ఎంపిక**

- ప్రభుత్వం నిర్ణయం.. సాగుయోగ్య భూములు కోటిన్నర ఎకరాలుగా లెక్క

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో నేటి నుంచి ప్రారంభం కానున్న రైతుభరోసా పథకంలో కీలకమైన వ్యవసాయ యోగ్యంకాని భూముల లెక్కలు తేలలేదు. సాగుయోగ్యం కాని భూములను ఫ్రీజింగ్ చేసి తుది జాబితాను ప్రభుత్వానికి పంపే ప్రక్రియ మండల స్థాయిలో కొనసాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో రైతుబంధు పథకం కింద 1.63 కోట్ల ఎకరాలకు పెట్టుబడి సాయం అందించారు. రైతు పాసుపుస్తకంలో ఉన్న భూమి మొత్తానికి రైతుబంధు ఇచ్చారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, గోదాములు, కాలేజీలు, కోళ్ల ఫారాలు, రోడ్లు, నాలా కన్వర్షన్ అయిన భూములకు కూడా రైతుబంధు వేశారు. తాజాగా ఈ వివరాలను మండల వ్యవసాయ అధికారులు, తహసీల్దార్‌లకు పంపి ఈ నెల 16 నుంచి సర్వే చేయించారు. 21 నుంచి గ్రామ సభల ద్వారా రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. దీని ప్రకారం రైతుభరోసా పోర్టల్‌లో వ్యవసాయయోగ్యంకాని భూముల ఫ్రీజింగ్ పూర్తి చేసి తుది జాబితా సిద్ధం చేయాల్సి ఉంది. ఈ క్రమంలో నేడు మండలానికో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని రైతు భరోసాను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**కోటిన్నర ఎకరాల సాగుయోగ్య భూములు**

రాష్ట్రంలో వ్యవసాయ యోగ్యత ఉన్న భూములు సుమారు కోటీ 48 లక్షల ఎకరాలు అని సాగు లెక్కలను బట్టి తెలుస్తోంది. ఇందులో 1.36 కోట్ల ఎకరాలు పంటలు పండించే భూములుకాగా 12 లక్షల ఎకరాలు ఉద్యానవన పంటల భూములు. సాగు యోగ్యమైనప్పటికీ సాగు చేయకుండా వదిలేసిన భూములు మరో 2 లక్షల ఎకరాలు ఉంటాయని అనుకున్నా మొత్తంగా కోటిన్నర ఎకరాల వరకు సాగు యోగ్యత గల భూములుగా లెక్క తేలే అవకాశం ఉంది. ఇందులోనూ పార్ట్ బీ కింద 18 లక్షల ఎకరాల భూమి ఉన్నట్లు తేలింది.

# పంచాయతీ గేట్‌కు తాళం వేసి.. అధికారులను నిర్బంధించి

**పైలట్ ప్రాజెక్టు గ్రామాన్ని మార్చడంతో గ్రామస్తుల ఆగ్రహం**



ఖానాపురం గ్రామ పంచాయతీ కార్యాలయ గేట్‌కు తాళం వేయడంతో లోపల ఉండిపోయిన అధికారులు

**ముదిగొండ:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ఆదివారం నుంచి నాలుగు పథకాలను అమలుచేయనుండగా.. మండలానికి ఒక గ్రామంలో కొందరు చొప్పున లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తామని ప్రకటించారు. ఈమేరకు ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో ఖానాపురాన్ని ఎంపిక చేసినట్లు ప్రకటించగా తహసీల్దార్ సునీత ఎలిజబెత్, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఎంపీఓ వాల్మీకి కిశోర్ ఆధ్వర్యంలో శనివారం నుంచి సర్వే మొదలు పెట్టారు. 2 గంటల పాటు సర్వే చేశాక రాత్రి 9 గంటల సమయంలో మండలంలో పైలట్ గ్రామంగా ఖానాపురం బదులు సువర్ణాపురాన్ని ఎంపిక చేసినట్లు సమాచారం అందింది. దీంతో గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉన్న అధికారులు బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. ఆగ్రహించిన గ్రామస్తులు తమ గ్రామాన్ని ఎలా రద్దు చేస్తారంటూ కార్యాలయ గేట్లకు తాళం వేశారు. అధికారులు అప్రమత్తమై పోలీసులతో పాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. కాసేపటికి ఖానాపురం గ్రామాన్ని కొనసాగించాలని సమాచారం చెప్పడంతో తహసీల్దార్ సునీత ఆ విషయాన్ని గ్రామస్తులకు వివరించారు. దీంతో రాత్రి 10 గంటలకు గ్రామస్తులు నిరసన విరమించగా అధికారులు సర్వే ప్రారంభించారు.

# శాంతియుత ఎన్నికలు తెలంగాణ సంప్రదాయం

**గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ**

- భవిష్యత్తులోనూ ఈ పద్ధతిని కొనసాగించాలి
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం




2024 ఎన్నికల వివరాల పుస్తకాన్ని విడుదల చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో శాంతియుతంగా ఎన్నికలు జరిగే సుదీర్ఘ సంప్రదాయం ఉందని, భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ ఈ అద్భుతమైన పద్ధతిని కొనసాగించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆకాంక్షించారు. శనివారం రవీంద్ర భారతిలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2024 ఎన్నికల వివరాలకు సంబంధించిన పుస్తకాన్ని గవర్నర్ విడుదల చేశారు. అలాగే ఆ ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. 18 ఏళ్లు పూర్తి చేసుకున్న పలువురికి గవర్నర్ నూతన ఓటర్ ఐడీ కార్డులను అందజేశారు. ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సభను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలను బలోపేతం చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కృషి చేస్తోందన్నారు. ఆన్‌లైన్‌లో ఓటరు నమోదు, దివ్యాంగుల కోసం పోలింగ్ స్టేషన్ల వద్ద ర్యాంప్‌లు, ఈవీఎంలపై బ్రెయిలీ ఫాంట్‌లు, బ్రెయిలీ బ్యాలెట్ పేపర్లు వంటి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను ఎన్నికల యంత్రాంగం విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు.

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అభినందనలు**

రాష్ట్రంలో కొత్తగా 5.45 లక్షల మందికి ఈపీఐసీ కార్డులు జారీ చేసిందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కి గవర్నర్ అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో చురుగ్గా పాల్గొనడం ద్వారా మన ప్రజాస్వామ్య సంప్రదాయాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఈవో సుదర్శన్‌రెడ్డి, రిటైర్డ్ సీఈవో రాణీ కుముదిని, అడిషనల్ సీఈవో లోకేశ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, పలు జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.




# 4 పథకాలు నేడే షురూ

▶ మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన పరమ పవిత్రమైన రోజు కావడంతో ఈ ఉదాత్తమైన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం..’’ అని భట్టి తెలిపారు. ఈ ఆనందాన్ని రాష్ట్ర ప్రజలందరితో పంచుకోవాలని ఈ ప్రకటన చేస్తున్నామన్నారు. తనతో సహా సీఎం, మంత్రులు స్వయంగా గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. భూమి లేని కూలీలందరూ ఉపాధి హామీ పనులకు వెళ్తారని ఓ ప్రశ్నకు బదులుగా భట్టి పేర్కొన్నారు.

**70శాతానికిపైగా జనాభాకు సన్నబియ్యం: ఉత్తమ్**

ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30 గంటల మధ్య నాలుగు పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామంలో అర్హులందరికీ పథకాలను అందిస్తామన్నారు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని తెలిపారు. గతంలో దరఖాస్తులిచ్చినా, సామాజిక ఆర్థిక సర్వే, గ్రామసభ, ప్రజాపాలనలో ఇచ్చినా అర్హత ప్రకారం పరిశీలించి రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. స్వతంత్ర భారత దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఈ స్థాయిలో ఆహార భద్రత కల్పించడానికి చొరవ తీసుకోలేదన్నారు. గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద కుటుంబాలన్నింటికీ ఆహార భద్రత కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులిచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున నాణ్యమైన సన్న బియ్యాన్ని ఇస్తామని.. రాష్ట్ర జనాభాలో 70–72శాతం మందికి ప్రతి నెలా ఉచితంగా ఇవ్వబోతున్నామని తెలిపారు.

**రబీకి ముందే రైతు భరోసా..: తుమ్మల**

తమ సర్కారు ఒకే ఏడాదిలో రైతుల ఖాతాల్లో రూ.40 వేల కోట్లను నేరుగా జమ చేసిందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చెప్పారు. రబీ సీజన్‌కు ముందే వ్యవసాయం చేసే ప్రతి ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతు భరోసా ఇచ్చి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చబోతున్నామని తెలిపారు.

**అనర్హులకు ఇళ్లు ఇస్తే రద్దు: పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**

ఎక్కడైనా అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లను ఇస్తే వాటిని రద్దు చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. అనర్హులు లబ్ధిపొంది ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా.. ఎక్కడా అవినీతి, పైరవీలకు స్థానం లేకుండా పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని 606 మండలాల్లోని ప్రతి గ్రామంలో ఇళ్లను ఇవ్వబోతున్నామని, ఇది నిరంతర ప్రక్రియగా జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారందరికీ జనవరి 26న ఒకేసారి పథకాలను ఇవ్వాలని అనుకున్నామని.. కానీ గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించాల్సి ఉండటంతో తొలుత ప్రతి మండలంలోని ఒక గ్రామంలో ఇవ్వాలని నిర్ణయించామని వివరించారు. గ్రామసభల్లో కొంత మంది, కొన్ని రాజకీయ పార్టీలు దురుద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని కుట్రలు పన్నాయని ఆరోపించారు. పథకాలను పూర్తిస్థాయిలో ఎప్పుడు, ఎక్కడ అమలు చేస్తారన్న షెడ్యూల్‌ను ఫిబ్రవరి మొదటి వారంలో ప్రకటిస్తామని తెలిపారు.

### చంద్రవంచలో ప్రారంభించనున్న సీఎం రేవంత్

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్‌కార్డుల పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో ప్రారంభించనున్నారు. సీఎం ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయం వద్ద త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో అమర వీరుల స్మారక స్తూపం వద్ద నివాళులు అర్పిస్తారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం ఎయిర్ వార్ ఫేర్ సందర్శిస్తారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చేరుకుని, అక్కడ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. మధ్యాహ్నం చంద్రవంచ గ్రామానికి చేరుకుని నాలుగు పథకాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చే తేనీటి విందులో పాల్గొంటారు.

# 4 పథకాల అమలుతో గ్రామాల్లో పండుగ వాతావరణం

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్**



**సాక్షి, హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న నాలుగు సంక్షేమ పథకాల అమలుతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలోని పల్లెపల్లెనా కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మహేశ్‌గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా బీఆర్‌ఎస్ నేతలు మాట్లాడుతున్నారని, తమది చేతల ప్రభుత్వమని చెప్పేందుకు దావోస్ వేదికగా తెచ్చిన పెట్టుబడులే నిదర్శనమని మహేశ్ పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు నిధులివ్వబోమని, రేషన్ కార్డులిచ్చినా బియ్యం ఇవ్వబోమంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ దిగజారి మాట్లాడుతున్నారని, ఆయన ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు.

# కాంగ్రెస్ 'ఈనో' ప్రచారం

సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై అధికార కాంగ్రెస్ పార్టీ వినూత్న ప్రచారానికి దిగింది. దావోస్ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన పెట్టుబడులపై విమర్శలు చేసిన బీఆర్ఎస్‌కు కడుపు మంట అంటూ 'ఈనో' ప్రచారాన్ని చేపట్టింది. బీఆర్ఎస్ కడుపు మంట తగ్గాలంటూ 'డైజెస్ట్ ది గ్రోత్' పేరుతో ఈనో ప్యాకెట్లు పంపుతున్నామని శుక్రవారం ప్రకటించిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు.. ఈ మేరకు ఈనో ప్యాకెట్లను బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు కొరియర్ ద్వారా పంపించారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌లు కూడా ఈనో ప్యాకెట్లను బీఆర్ఎస్ నేతలకు పంపుతున్నట్లు ప్రకటించారు. ఈనో క్యాంపెయిన్ ప్రకటించిన మర్నాడే.. హైదరాబాద్‌లో పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి.



కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## వారికి కడుపు మంట.. కళ్ల మంట: జగ్గారెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాజకీయంగా ఉనికి కోల్పోతామన్న భయంతో ప్రతిపక్ష పార్టీలు వ్యవహరిస్తున్నాయని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి వారికి కడుపు మంట, కళ్ల మంటగా ఉందని, అందుకే కొత్త రేషన్ కార్డులిచ్చే కార్యక్రమాన్ని అడ్డుకోవాలని చూస్తున్నాయని ఆరోపించారు. శనివారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. ఏడేళ్లలో బీఆర్ఎస్ ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు రాజకీయ అనుభవం తక్కువని, కేంద్రమంత్రి హోదాలో ఎలా మాట్లాడాలో నేర్చుకుంటే మంచిదని హితవు పలికారు. ఇళ్లకు డబ్బులివ్వబోమని, రేషన్ బియ్యం ఇవ్వబోమని ప్రజలను బ్లాక్‌మెయిల్ చేస్తున్న సంజయ్ తెలంగాణ ప్రజలు పన్నులు కడితేనే కేంద్రానికి నిధులు వస్తున్నాయన్న అంశం మర్చిపోవద్దని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## కాంగ్రెస్ నేతలకు జండూబామ్, జిందా తిలిస్మాత్ పంపుతున్నాం

**ఈనో ప్యాకెట్ల ప్రచారానికి బీఆర్ఎస్ దీటుగా జవాబు**

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకొస్తే బీఆర్ఎస్ తట్టుకోలేదంటూ ఈనో ప్యాకెట్ల ప్రచారం చేసిన కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ నేతలు దీటుగా జవాబిచ్చారు. పథకాల పేరుతో కాంగ్రెస్ పెట్టిన గ్రామసభలు ప్రజా ఆగ్రహ సభలుగా మారాయని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కార్పొరేషన్ మాజీ చైర్మన్ బాలమల్లు, రామమూర్తి, భాస్కర్ తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏడాదైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ధ్వజమెత్తారు. గ్రామ సభల్లో ప్రజలు కాంగ్రెస్ నేతల వీపులు విమానం మోత మోగించారని, నొప్పులను తగ్గించుకునేందుకు కాంగ్రెస్ నేతలకు జండూబామ్, జిందాతిలిస్మాత్ పంపిస్తున్నామని చెప్పారు. ప్రజాపాలన పేరుతో అప్లికేషన్లు రోడ్లపై పడేశారని, 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, పోలీసు పహారాలో గ్రామసభలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకు గ్రామ సభల్లో పాల్గొనడం లేదని ప్రశ్నించారు.



వెండి సంపాదించుటకంటె జ్ఞానము సంపాదించుట మేలు.
అపరంజి సంపాదించుట కంటె జ్ఞానలాభము నొందుట మేలు.

– క్రైస్తవ ధర్మం



## గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** బ.ద్వాదశి రా.7.26 వరకు తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** జ్యేష్ఠ ఉ.7.10 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** ప.3.35 నుండి 5.05 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.11 వరకు, **అమృత ఘడియలు:** రా.1.35 నుండి 3.16 వరకు.

**సూర్యోదయం** : 6.38
**సూర్యాస్తమయం** : 5.48
**రాహుకాలం** : సా.4.30 నుంచి 6.00 వరకు
**యమగండం** : ప.12.00 నుంచి 1.30 వరకు

## మార్క్ జుకర్‌బర్గ్ (ఫేస్‌బుక్)
## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

వాషింగ్టన్‌లో ప్రెసిడెంట్ ఇనాగరేషన్‌కు వెళ్లి, తిరిగి క్యాలిఫోర్నియాలో మేము ఉంటున్న పాలో ఆల్టోకి వచ్చేసరికి వైట్ హౌస్ నుండి ఫోన్ కాల్!

"మిస్టర్ జుకర్‌బర్గ్! నేను అలెక్స్ ఎన్ వాంగ్, యునైటెడ్ స్టేట్స్ డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్‌ని మాట్లాడుతున్నాను. ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ లైన్‌లోకి రావటం కోసం దయచేసి కొద్ది క్షణాలు మీరు వేచి ఉండగలరా?" – అని !!

"ఎస్... ప్లీజ్" అన్నాను.

'ఎవరు?!' అన్నట్లు ప్రిసిల్లా నావైపు చూసింది.

టేబుల్ మీద ఉన్న 'లాస్ ఏంజిల్స్ టైమ్స్' లో ట్రంప్ ఫొటోను కనుసైగగా ఆమెకు చూపించాను.

పిల్లల్ని తీసుకుని ప్రిసిల్లా పక్క గదిలోకి వెళ్లిపోయింది. మాక్సిమా, ఆగస్ట్, ఆరేలియా ఎప్పుడూ తల్లిని చుట్టుకునే ఉంటారు. తొమ్మిదేళ్లొకరికి, ఏడేళ్లొకరికి, రెండేళ్లొకరికి!

కాలేజ్‌లో ప్రిసిల్లా అంటే... ప్రిసిల్లా–నేను. ఇప్పుడు ప్రిసిల్లా అంటే 'ఆల్ గర్ల్ టీమ్' లా పిల్లలు–తను! కలిసి తిరుగుతుంటారు. కలిసి ఆడుతుంటారు. బుద్ధి పుడితే ఎప్పుడైనా 'పోన్లే పాపం డాడ్...' అన్నట్లు నన్ను తమ జట్టులోకి చేర్చుకుంటారు.



"మిస్టర్ జుకర్‌బర్గ్! లైన్‌లోనే ఉన్నారా...?" అన్నారు అలెక్స్ ఎన్ వాంగ్, నిర్ధారణ కోసం.

"ఎస్... మిస్టర్ వాంగ్! నేను లైన్‌లోనే ఉన్నాను..." అన్నాను.

హఠాత్తుగా "హాయ్ జాక్..." అంటూ లైన్‌లోకి వచ్చేశారు ట్రంప్!

"సర్‌ప్రైజింగ్, మిస్టర్ ప్రెసిడెంట్!" అన్నాను.

"నీ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలనని చెప్పటానికే నీకు ఫోన్ చేశాన్ జాక్..." అన్నారు ట్రంప్!!

"ఏ విషయం గురించి మిస్టర్ ప్రెసిడెంట్!!" అని అడిగాను.

"వెల్... జాక్! నా ఇనాగరేషన్‌లో నువ్వు నీ పక్కనున్న స్త్రీమూర్తిని – ఆమె కంఠానికి దిగువనున్న భాగం వైపు – ఆపేక్షగా చూశావని అంతా నిన్ను ట్రోల్ చేయటం గురించే అంటున్నా! మగవాళ్లు నిప్పులా ఉన్నా నిందలు తప్పవు. లుక్! స్త్రీ విషయంలో నోరు జారిన మగాడినైనా ఈ లోకం క్షమిస్తుంది కానీ, చూపు జారిన మగాడికి ఏ లోకంలోనూ క్షమాపణ లభించదు..." అన్నారు ట్రంప్.

"థ్యాంక్యూ మిస్టర్ ప్రెసిడెంట్" అన్నాను.

ఆయన అంటున్న ఆ స్త్రీ మూర్తి లారెన్ సాంచెజ్! జెఫ్ బెజోస్ ప్రియురాలు. ఇనాగరేషన్‌లో నాకు ఒక పక్క నా భార్య, ఇంకో పక్క ఆమె ఉన్నారు. ఆమెకు అటువైపున నిలబడి ఉన్న జెఫ్ బెజోస్ ఏదో చెబుతుంటే, నేను తలతిప్పి చూసినప్పుడు, నా చూపు ఆమె 'లో–నెక్' లోపలికి స్లిప్ అయినట్లుంది. అంత బ్యాడ్ మోమెంట్ లేదు నా లైఫ్‌లో!

ఇలాంటి సంక్షోభ సమయంలో లోకంలోని ఒక మగవాడు నాకు సపోర్ట్‌గా రావటం బాగుంది. అయితే ఆ మగవాడు డోనాల్డ్ ట్రంప్ కాకపోయుంటే నాకు మరింత సపోర్టివ్‌గా అనిపించేది.

"వింటున్నావా జాక్? నువ్వు ఆమెను చూడాలని చూడలేదని నాకు తెలుసు. చూడటం వేరు. చూపు పడటం వేరు. కానీ జాక్, నీపైన వచ్చిన లక్ష కామెంట్‌లలో ఒకటైతే నాకు భలే నచ్చింది. మొదటిసారి నువ్వొక హ్యూమన్‌లా స్పందించావట! హాహ్హాహా..." అంటూ పెద్దగా నవ్వారు ట్రంప్.

నేనూ నవ్వాపుకోలేకపోయాను.

'హాయ్ జాక్' అంటూ లైన్‌లోకి వచ్చినంత హఠాత్తుగా 'బాయ్ జాక్' అంటూ లైన్‌లోంచి వెళ్లిపోయారు ట్రంప్.

ఫోన్ పెట్టేశాక, "ఏమిటట?" అని ప్రిసిల్లా. పక్కన పిల్లల్లేరు! నిద్రబుచ్చి వచ్చినట్లుంది.


"అదే, ఆ బ్యాడ్ మోమెంట్ గురించి ట్రంప్ నన్ను సపోర్ట్ చేస్తున్నారు... " అని చెప్పాను.

ప్రిసిల్లా నవ్వింది.

"అది బ్యాడ్ మోమెంట్ కాదు బాస్, బ్యాడ్ ఫొటోగ్రాఫ్... ' అంది, నన్ను అతుక్కుపోతూ.

ప్రిసిల్లా అంటే... ఇప్పుడు మళ్లీ ప్రిసిల్లా–నేను... కాలేజ్ డేస్ తర్వాత ఇన్నేళ్లకు!

# లాంగ్ లివ్ ద రిపబ్లిక్



## జనతంత్రం

వర్ధెల్లి మురళి

డెబ్బయ్ ఐదు సంవత్సరాలు. కాలగమనంలో ఇదొక కీలకమైన మైలురాయి. ఆనాడు భారత ప్రజలు ప్రకటించుకున్న ప్రజాస్వామ్య రిపబ్లిక్ నేడు ఈ మజిలీకి చేరుకున్నది. ఈ ప్రయాణమంతా సాఫీగానే జరిగిందని చెప్పలేము. ఒడిదుడుకులు ఎదురయ్యాయి. ఎటుచూస్తే అటు చీకటి ముసిరిన చేటు కాలాన్ని కూడా దాటవలసి వచ్చింది. దారి పొడుగునా ఎగుడు దిగుళ్లూ, ఎత్తుపల్లాలూ ఇబ్బందులు పెట్టాయి. అయినా మన రిపబ్లిక్ రథం వెనుదిరగలేదు. వెన్ను చూపలేదు. రాజ్యాంగ దీపం దారి చూపగా ముందుకే నడిచింది.

సుదీర్ఘ ప్రయాణం ఫలితంగా మన రిపబ్లిక్ ఎంతో పరిణతి సాధించి ఉండాలి. అందువల్ల ఇకముందు సాగే ప్రయాణం నల్లేరుపై బండిలా సాగుతుందని ఆశించాలి. ప్రతిష్ఠాత్మకమైన శతాబ్ది మైలురాయిని తాకేందుకు ఉరకలెత్తే ఉత్సాహంతో సాగిపోతామనే ధీమా మనకు ఏర్పడి ఉండాలి. కానీ, అటు వంటి మనో నిబ్బరం నిజంగా మనకున్నదా? మన రిపబ్లిక్‌కు ఆయువు పట్టయిన రాజ్యాంగం ఇకముందు కూడా నిక్షేపంగా ఉండగలదనే భరోసా మనకు ఉన్నట్టేనా? రాజ్యాంగబద్ధంగా ఏర్పడిన వ్యవస్థలన్నీ ఆశించిన విధంగానే పనిచేస్తున్నాయని గుండెల మీద చేయి వేసుకొని చెప్పుకోగలమా?

మన స్వాతంత్ర్యం ఎందరో వీరుల త్యాగఫలం. ఆ స్వాతంత్ర్యానికి సాధికార కేతనమే మన గణతంత్రం. స్వాతంత్ర్య పోరాటంలో భారత జాతీయ కాంగ్రెస్ ఒక ప్రధాన స్రవంతి మాత్రమే! ఇంకా అటువంటి స్రవంతులు చాలా ఉన్నాయి. ఆ పార్టీ పుట్టకముందు కూడా ఉన్నాయి. మహాత్మాగాంధీ ఆ పోరాటాన్ని ఫైనల్స్‌కు చేర్చిన టీమ్ క్యాప్టెన్ మాత్రమే. రెండొందల యేళ్లలో అటువంటి క్యాప్టెన్లు చాలామంది కనిపిస్తారు. ఈస్టిండియా కంపెనీ రోజుల్లోనే బ్రిటీషర్ల దాష్టీకంపై తిరగబడిన వీర పాండ్య కట్టబ్రహ్మన, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వంటి పాలెగాళ్ల వీరగాథలు మనం విన్నవే.

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందుగా, ఆ తర్వాత కూడా బ్రిటీష్ పాలనపై ఎందరో గిరిజన యోధులు తిరగబడ్డారు. బిర్సాముండా, తిల్కా మాఝీ, సిద్ధూ–కన్హూ ముర్ములు, అల్లూరి దళంలోని సభ్యులు వగైరా అటవీ హక్కుల రక్షణ కోసం, స్వేచ్ఛ కోసం ప్రాణాలు ధారపోశారు. తొలి స్వాతంత్ర్య పోరుకు నాయకత్వం వహించిన చివరి మొఘల్ చక్రవర్తి బహదూర్ షా జాఫర్ వేలాదిమంది ముస్లిం స్వరాజ్య యోధుల దిక్సూచి. బ్రిటీషర్ల ఆగ్రహానికి గురై బర్మాలో ప్రవాస జీవితం గడిపిన జాఫర్ కనీసం తాను చనిపోయిన తర్వాతైనా తన మాతృదేశంలో ఖననం చేయాలని పాలకులను అభ్యర్థించారు.

స్వాతంత్ర్య పోరాటంలో అంతర్భాగంగా, సమాంతరంగా దేశవ్యాప్తంగా ఎన్నో రైతాంగ పోరాటాలు జరిగాయి. అందులో కొన్ని సాయుధ పోరు రూపాన్ని తీసుకున్నాయి. జమీందారీ, జాగీర్దారీ దోపిడీ పీడనకు వ్యతిరేకంగా రైతులు తిరగబడ్డారు. ఈ విధంగా భిన్నవర్గాల, విభిన్న తెగల ఆకాంక్షలు, ఆశలూ ఈ పోరాటంలో ఇమిడి ఉన్నాయి. వేరువేరు భాషలు, విభిన్నమైన సంస్కృతులు, ఆచార వ్యవహారాలతో కూడిన సువిశాల భారత దేశ ప్రజల మధ్య భిన్నత్వంలో ఏకత్వాన్ని స్వాతంత్ర్యోద్యమం సాధించగలిగింది. ఆ ఉద్యమాన్ని నడిపిన జాతీయ నాయకత్వానికి ఈ భిన్నత్వంపై అవగాహనా, గౌరవం ఉన్నాయి.

స్వతంత్ర దేశంగా అవతరించడానికి కొన్ని గంటల ముందు పండిట్ నెహ్రూ దేశ ప్రజలనుద్దేశించి చేసిన 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' ప్రసంగం చరిత్రాత్మకమైనది. ఆ రోజునే ఆయన దేశ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం అందవలసి ఉన్నదనీ, సమాన అవకాశాలు కల్పించవలసి ఉన్నదనీ స్పష్టం చేశారు. మత తత్వాన్ని, సంకుచిత మనస్తత్వాన్ని ఎటువంటి పరిస్థితుల్లోనూ సహించరాదని ఆనాడే ఆయన నొక్కిచెప్పారు. ఆ తర్వాత మూడేళ్లపాటు జరిగిన రాజ్యాంగ సభ చర్చల్లోనూ ఇదే విచారధార ప్రధాన భూమికను పోషించింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం పునాదులుగా డాక్టర్ అంబేడ్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది.

ప్రపంచంలోని లిఖిత రాజ్యాంగాలన్నింటిలో విపులమైనది, పటిష్ఠమైనది భారత రాజ్యాంగమే. భవిష్యత్తులో దేశం నియంతృత్వంలోకి జారిపోకుండా చెక్స్ అండ్ బ్యాలెన్సెస్‌లతో కూడిన రాజ్యాంగ వ్యవస్థలకు రూపకల్పన చేశారు. భారత్‌తోపాటు అదే కాలంలో స్వాతంత్ర్యం సంపాదించుకున్న అనేక దేశాలు అనంతరం స్వల్పకాలంలోనే సైనిక పాలనల్లోకి, నిరంకుశ కూపాల్లోకి దిగజారిపోయాయి. వాటన్నింటి కంటే పెద్ద దేశమైన భారత్ మాత్రం కాలపరీక్షలను తట్టుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టుకోగలిగింది. ఇందుకు మనం మన అద్భుతమైన రాజ్యాంగానికీ, దాని రూపకర్తలకూ ధన్యవాదాలు సమర్పించుకోవలసిందే!

మన పాలకుడు ఎంత గొప్ప మహానుభావుడైనప్పటికీ సర్వాధికారాలను అతనికే అప్పగిస్తే చివరికి మిగిలేది విధ్వంసమేనని జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరికను రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేడ్కర్ ప్రస్తావించారు. ఇందిరాగాంధీపై మొదలైన వ్యక్తి పూజ 'ఇందిరే ఇండియా' అనే స్థాయికి చేరి పోయిన తర్వాత ఏం జరిగిందనేది మనకు తెలిసిందే! మన ప్రజాస్వామ్యానికి ఎమర్జెన్సీ అనేది ఒక మచ్చగా ఎప్పటికీ మిగిలే ఉంటుంది. ఇందిర తర్వాత ఆ స్థాయిలో ప్రస్తుత నరేంద్ర మోదీ వ్యక్తి పూజ కనిపిస్తున్నది. ఒక సందర్భంలో ఆయనే స్వయంగా 'అయామ్ ది కాన్‌స్టిట్యూషన్' (నేనే రాజ్యాంగం) అని ప్రకటించుకోవడం ఈ వీరపూజ ఫలితమే! ఫ్రెంచి నియంత పద్నాలుగో లూయీ చేసిన 'అయామ్ ది స్టేట్' ప్రకటనకు ఇది తీసిపోయేదేమీ కాదు.

ఈ దేశంలో ప్రజాస్వామ్యం చిరకాలం వర్ధిల్లడం కోసం రాజ్యాంగ నిర్మాతలు ఏర్పాటు చేసిన కొన్ని వ్యవస్థలు బీటలు వారుతున్న సూచనలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. అధినాయకుని వీరపూజల ముందు వ్యవస్థలు నీరుగారుతున్న వైనాన్ని మనం చూడవచ్చు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్నీ, ఫెడరల్ తరహా పాలననూ రాజ్యాంగం ఆకాంక్షించింది. ఫెడరల్ అనే మాటను వాడకపోయినా 'యూనియన్ ఆఫ్ ది స్టేట్స్' అనే మాటను వాడారు. ఈ మాటలో రాష్ట్రాలకే ప్రాదేశిక స్వరూపం ఉన్నది తప్ప కేంద్రానికి కాదు.

కేంద్ర ప్రభుత్వం కూడా బలంగానే ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించిన మాట నిజమే. దేశ విభజన అనంతర పరిస్థితుల నేపథ్యంలో బలహీన కేంద్రం వల్ల కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని వారు అభిప్రాయపడ్డారు. అందువల్ల కేంద్రానికి కొన్ని అత్యవసర అధికారాలను కట్టబెట్టారు. సాధారణ పరిస్థితుల్లో కూడా ఈ అధికారాలను చలాయించడానికి కాంగ్రెస్, బీజేపీ కేంద్ర ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. కేంద్రం పెత్తనం ఇప్పుడు మరీ పరాకాష్ఠకు చేరుకున్నది. అసమంజసమైన ద్రవ్య విధానాలతో రాష్ట్రాలను బలహీనపరిచే ఎత్తుగడలు ఎక్కువయ్యాయి.

మొత్తం జీఎస్టీ వసూళ్లలో అన్ని రాష్ట్రాలకూ కలిపి మూడో వంతు లభిస్తుంటే, కేంద్రం మాత్రం రెండొంతులు తీసుకుంటున్నది. మోయాల్సిన భారాలు మాత్రం రాష్ట్రాల మీదే ఎక్కువ. రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిన అవసరం లేని సుంకాలు, సర్ ఛార్జీల వసూళ్లు ఏటేటా పెరుగుతున్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని సర్వోన్నత న్యాయస్థానం వివిధ సందర్భాల్లో ప్రకటించింది. కానీ పార్లమెంట్ చర్చలు పలు సందర్భాల్లో ఒక ప్రహసనంగా మారుతున్న వైనం ఇప్పుడు కనిపిస్తున్నది. అసలు చర్చలే లేకుండా కీలక బిల్లుల్ని ఆమోదింపజేసుకున్న ఉదాహరణలున్నాయి.

స్వతంత్ర వ్యవస్థగా ఉండాలని రాజ్యాంగం ఆకాంక్షించిన ఎన్నికల సంఘం గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఈ వ్యవస్థ ప్రతిష్ఠ నానాటికీ దిగజారుతున్నది. మొన్నటి సాధారణ ఎన్నికల్లో అది పాతాళానికి పడిపోయింది. పోలయిన ఓట్ల కంటే లెక్కించిన ఓట్లు ఎందుకు ఎక్కువ ఉన్నాయో తెలియదు. తొలుత ప్రకటించిన పోలయిన ఓట్ల శాతాన్ని నాలుగైదు రోజుల తర్వాత సవరించి అసాధారణంగా పెరిగినట్టు చెప్పడం ఎందువల్లనో తెలియదు. వాటిపై ప్రశ్నించిన స్వతంత్ర సంస్థలకూ, రాజకీయ పక్షాలకూ ఇప్పటి దాకా ఎన్నికల సంఘం సంతృప్తికరమైన సమాధానం ఇవ్వలేకపోయింది. ఎన్నికల సంఘం స్వతంత్రతను కోల్పోవడమంటే ప్రజాస్వామ్యం శిథిలమవుతున్నట్లే లెక్క.

రిజర్వు బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించవలసిన సంస్థ. కరెన్సీకి సంబంధించిన నిర్ణయాలన్నీ తీసుకోవలసిన బాధ్యత దానిదే. కానీ, పెద్ద నోట్ల రద్దు వంటి అసాధారణ నిర్ణయాన్ని కొన్ని గంటల ముందు మాత్రమే ఆర్‌బీఐకి తెలియజేసి, బహిరంగ ప్రకటన చేశారు. ఆర్‌బీఐ పాలక మండలిని కనుసన్నల్లో పెట్టుకొని, దాన్ని అనుబంధ సంస్థగా మార్చేసుకున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇక సీబీఐ, ఆర్‌టీఐ, సీవీసీ వంటి 'స్వతంత్ర' సంస్థలు పంజరంలో చిలకలుగా మారిపోయాయనే విమర్శ సర్వత్రా వినబడుతూనే ఉన్నది.

తమకు గిట్టని రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడానికి గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వాలు గవర్నర్ వ్యవస్థను వాడుకున్నాయి. అయితే కొందరు గవర్నర్ల విపరీత ప్రవర్తన గతంతో పోల్చితే ఎక్కువైంది. విపక్ష ముఖ్యమంత్రులున్న రాష్ట్రాలకు 'ట్రోజన్ హార్స్'ను పంపించినట్టే ఇప్పుడు గవర్నర్‌లను పంపిస్తున్నారు. ఇప్పుడు ముందుకు తెచ్చిన 'ఒన్ నేషన్ ఒన్ ఎలక్షన్' (ఓఎన్‌ఓఈ) విధానానికి పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మరింత బలహీనపరిచే స్వభావమున్నది. ప్రాంతీయ రాజకీయ పార్టీలనూ, రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్నీ ధ్వంసం చేయడానికే దీన్ని తీసుకొస్తున్నారని విపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఈ బిల్లు చట్టరూపం దాల్చాలంటే చేయవలసిన రాజ్యాంగ సవరణల ఫలితంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మరింత బలహీనపడుతుందని నిపుణులు చెబుతున్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భిన్నత్వంలో ఏకత్వ భావన అనేవి మన రాజ్యాంగానికి పునాది వంటివి. పార్లమెంట్‌లో ఎంత మెజారిటీ ఉన్నప్పటికీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం మాత్రం లేదని కేశవానంద భారతి (1973) కేసులో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం వేస్తున్న అడుగులన్నీ అధ్యక్ష తరహా పాలనకు దారితీస్తున్నాయనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. ఈ లక్ష్యసాధనకు ప్రస్తుత రాజ్యాంగం ఉపయోగపడదు.

ఇక నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమాన్ని ఆధారం చేసుకొని తమకు పట్టున్న ఉత్తరాదిలో సీట్లు పెరిగేలా, బలహీనంగా ఉన్న దక్షిణాదిలో సీట్లు తగ్గేవిధంగా బీజేపీ ప్రయత్నిస్తున్నదనే అనుమానాలు కూడా విపక్షాలకు ఉన్నాయి. ఇదే నిజమైతే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. ఇదంతా రాజకీయ భాగం మాత్రమే! అంబేడ్కర్ చెప్పినట్టు రాజ్యాంగం అభిలషించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలు కేవలం రాజకీయపరమైనవే కాదు. సామాజిక ఆర్థికపరమైనవి కూడా! ఈ రంగాల్లో ఇంకా ఆశించిన లక్ష్యం సుదూరంగానే ఉన్నది. ఇప్పుడు రాజకీయ అంశాల్లోనే మన రిపబ్లిక్ సవాళ్లను ఎదుర్కోవలసి వస్తున్నది. ఈ సవాళ్లను అధిగమించి ఆర్థిక, సామాజిక రంగాల్లో కూడా నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించాలంటే మన రాజ్యాంగం, మన రిపబ్లిక్ చిరకాలం వర్ధిల్లాలి.

vardhelli1959@gmail.com

కేంద్ర ప్రభుత్వం కూడా బలంగానే ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించిన మాట నిజమే. దేశ విభజన అనంతర పరిస్థితుల నేపథ్యంలో బలహీన కేంద్రం వల్ల కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని వారు అభిప్రాయపడ్డారు. అందువల్ల కేంద్రానికి కొన్ని అత్యవసర అధికారాలను కట్టబెట్టారు. సాధారణ పరిస్థితుల్లో కూడా ఈ అధికారాలను చలాయించడానికి కాంగ్రెస్, బీజేపీ కేంద్ర ప్రభుత్వాలు అలవాటు పడ్డాయి. కేంద్రం పెత్తనం ఇప్పుడు మరీ పరాకాష్ఠకు చేరుకున్నది. అసమంజసమైన ద్రవ్య విధానాలతో రాష్ట్రాలను బలహీనపరిచే ఎత్తుగడలు ఎక్కువయ్యాయి.

మొత్తం జీఎస్టీ వసూళ్లలో అన్ని రాష్ట్రాలకూ కలిపి మూడో వంతు లభిస్తుంటే, కేంద్రం మాత్రం రెండొంతులు తీసుకుంటున్నది. మోయాల్సిన భారాలు మాత్రం రాష్ట్రాల మీదే ఎక్కువ. రాష్ట్రాలకు వాటా ఇవ్వాల్సిన అవసరం లేని సుంకాలు, సర్ ఛార్జీల వసూళ్లు ఏటేటా పెరుగుతున్నాయి. పార్లమెంటరీ ప్రజా స్వామ్యం మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగమని సర్వోన్నత న్యాయస్థానం వివిధ సందర్భాల్లో ప్రకటించింది. కానీ పార్లమెంట్ చర్చలు పలు సందర్భాల్లో ఒక ప్రహసనంగా మారుతున్న వైనం ఇప్పుడు కనిపిస్తున్నది.

ప్రపంచంలోని లిఖిత రాజ్యాంగాలన్నింటిలో విపులమైనది, పటిష్ఠమైనది భారత రాజ్యాంగమే. భవిష్యత్తులో దేశం నియంతృత్వంలోకి జారిపోకుండా చెక్స్ అండ్ బ్యాలెన్సెస్‌లతో కూడిన రాజ్యాంగ వ్యవస్థలకు రూపకల్పన చేశారు. భారత్‌తోపాటు అదే కాలంలో స్వాతంత్ర్యం సంపాదించుకున్న అనేక దేశాలు అనంతరం స్వల్పకాలంలోనే సైనిక పాలనల్లోకి, నిరంకుశ కూపాల్లోకి దిగజారిపోయాయి. వాటన్నింటి కంటే పెద్ద దేశమైన భారత్ మాత్రం కాలపరీక్షలను తట్టుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను నిలబెట్టుకోగలిగింది. ఇందుకు మనం మన అద్భుతమైన రాజ్యాంగానికీ, దాని రూప కర్తలకూ ధన్యవాదాలు సమర్పించుకోవలసిందే!

మన పాలకుడు ఎంత గొప్ప మహానుభావుడైనప్పటికీ సర్వాధికారాలను అతనికే అప్పగిస్తే చివరికి మిగిలేది విధ్వంసమేనని జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరికను రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేడ్కర్ ప్రస్తావించారు. ఇందిరాగాంధీపై మొదలైన వ్యక్తి పూజ 'ఇందిరే ఇండియా' అనే స్థాయికి చేరి పోయిన తర్వాత ఏం జరిగిందనేది మనకు తెలిసిందే!

# రాజ్యాంగ అమలులో చిత్తశుద్ధి ఉందా?



సందర్భం

డా॥ మహ్మద్ హసన్

దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి చర్చలు తుది రూపంలోకి వస్తున్న తరుణంలోనే రాజ్యాంగాన్ని రూపొందించడానికి 'రాజ్యాంగ సభ'ను ఏర్పాటు చేశారు. బి.ఆర్. అంబేడ్కర్ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా, బాబూ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షులుగా వ్యవహరించారు. వివిధ రాజ్యాంగ రచనా కమిటీలకు నిష్ణాతులు సేవలందించారు. వీరి కృషి ఫలితంగా రూపొందిన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26 నాడు రాజ్యాంగ సభ ఆమోదించింది. నాటి రాజ్యాంగంలో 395 ప్రకరణలు, 8 షెడ్యూళ్ళు, 22 భాగాలు ఉన్నాయి (ప్రస్తుతం 12 షెడ్యూళ్ళు, 25 భాగాలు, 486 పైగా అధికరణలు). చివరకు 1950 జనవరి 26 నాడు రాజ్యాంగం అమలులోకి వచ్చింది. అంటే 2025 జనవరి 26 నాటికి రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లన్నమాట!

ఈ ఏడున్నర దశాబ్దాల కాలంలో దేశం పరిపాలనా పరంగా, జనాభా పరంగా, సంస్థాగతంగా, సాంకేతికంగా చాలా ప్రగతిని సాధించిందని చెప్పగలం. కానీ ఆ అభివృద్ధి అన్ని రంగాల్లో ఆశించిన స్థాయిలో జరగకపోవడం, రాజ్యాంగంలో పేర్కొన్నట్లు అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా పంపిణీ కాకపోవడం బాధాకరం. రాజ్యాంగ ప్రవేశికలో లేని 'సామ్యవాద', 'లౌకిక' పదాలను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం చేర్చింది. మొత్తం మీద ఇప్పటికి 106 రాజ్యాంగ సవరణలు జరగడం గమనార్హం.

ఏ దేశ రాజ్యాంగం అయినా మారుతున్న అవసరాలకు అనుగుణంగా తన స్వరూపాన్ని మార్చుకుంటుంది. ఆనాడు రాజ్యాంగ సభలో అంబేడ్కరే స్వయంగా 'ఒకవేళ రాజ్యాంగం విఫలం అయితే ఆ తప్పు రాజ్యాంగానిది కాదు, దానిని అమలు చేసే పాలకులదే' అన్నారు.

1985లో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టా'న్ని చేశారు. కానీ దీన్ని చాలా రాజకీయ పార్టీలు ఎంతగా నీరుగార్చాయో తెలిసిందే కదా! 6–14 సంవత్సరాల మధ్య ఉన్న బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాలని 'విద్యా హక్కు చట్టం' తెచ్చారు. కానీ అమలును మరచారు. నేటికీ బడి బయట కోట్లాదిమంది పిల్లలు బాలకార్మికులుగా బతుకుతున్నారు.



రాజ్యాంగ సభ సమావేశం

దేశంలో అంతర్గతంగా పెరుగుతున్న కులం, మతం భావాలు విద్వేషాన్ని నింపుతున్నాయి. ఈ మధ్యనే ఫ్యూచర్ రీసెర్చ్ సెంటర్ నివేదికలో మత విద్వేషం బుసలు కొడుతున్న దేశాల్లో మనదేశం మొదటి స్థానంలో ఉందని వెల్లడించింది.

రాజ్యాంగంలో పొందుపరచిన ఆదేశ సూత్రాలు సరిగ్గా అమలుకు నోచుకోవడం లేదు. ప్రాథమిక హక్కులదీ దాదాపు అదే స్థితి. రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛను ప్రభుత్వాలు ఎలా నీరుగారుస్తున్నాయో జైళ్లలో మగ్గుతున్న అనేక మంది హక్కుల కార్యకర్తలూ, ప్రజా ఉద్యమకారులూ, మేధావులను చూస్తే అర్థమవుతుంది. అలాగే అమానవీయమైన అంటరానితనాన్ని రాజ్యాంగం నిషేధించినా ఇప్పటికీ గ్రామాల్లో వివక్ష కొనసాగుతూనే ఉంది.

'రాజ్యాంగం' మీద కనీస అవగాహన లేనివారు చట్టసభలలో అడుగుపెట్టడం శోచనీయం. ఇక వారు ఎటువంటి చట్టాలు చేస్తారో చెప్పవలసిన పనేముంది! ఒక అందమైన భవంతిని నిర్మించుకొని దానిని సక్రమంగా వాడుకోకపోతే అది త్వరలోనే శిథిల స్థితికి చేరుతుంది. ఈ సూత్రం ఏ దేశ రాజ్యాంగానికైనా వర్తిస్తుంది.

'భారత ప్రజలమైన మేము దేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర్య రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్ర దీక్షతో తీర్మానించి, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్నీ, ఆలోచన, భావ ప్రకటన స్వేచ్ఛ, మతవిశ్వాస ఆరాధనా స్వేచ్ఛలనూ, అవకాశాల్లో సమానత్వాన్ని సాధించేందుకు, వ్యక్తి గౌరవాన్ని, జాతి ఐక్యతను, సమగ్రతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించేందుకు శాసనం (రాజ్యాంగం రూపంలో) చేసి, ఆమోదించి మాకు మేము సమర్పించుకుంటున్నాం' అని రాజ్యాంగ ప్రవేశికలోనే ఉంది. అంటే ఆనాడు మన లక్ష్యాలు, ఆశయాలకు అనుగుణంగానే అది రూపొందించబడింది. కానీ దాని అమలులోనే పాలకులకు చిత్తశుద్ధి కొరవడింది. ఇది గర్హనీయం.

వ్యాసకర్త పొలిటికల్ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

# రాజ్యాంగ గుర్తింపు ఏది?



బంజారా ప్రజలు మాట్లాడే భాష 'గౌర్–బోలి'. భారత దేశంలోని వందలాది లిపిలేని భాషల్లో ఇదొకటి. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఈ ప్రజలు ఎస్టీ, ఎస్సీ, బీసీ కేటగిరీల్లో ఉన్నప్పటికీ వీరు మాట్లాడే భాష మాత్రం ఇదే. అందువల్ల ఇక్కడ ఒక ఆదివాసీ భాషగా మాత్రమే దీన్ని చూడకుండా ప్రజాబాహుళ్యం విస్తృతంగా మాట్లాడే భాషగా దీన్ని పరిగణించాల్సిన అవసరం ఉంది. ఇది లిపిలేని భాష కావడం వల్ల దీని ప్రాచీనత (యాంటిక్విటీ) ఎంతటిదో కూడా అర్థం చేసుకోవాలి. శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో ఇటువంటి వందలాది భాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, అమెరికన్ సామ్రాజ్యవాద సంస్కృతి తాకిడికి ఈ భాషలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. భాష అంటే ఒక సంస్కృతికి ప్రతిబింబం. భాష మృతప్రాయంగా మారిందంటే... దాన్ని మాట్లాడే ప్రజల సంస్కృతీ కనుమరుగవుతున్నట్లు అర్థం. ఇవ్వాళ బంజారా భాష కూడా ఆ దిశలోనే పయనిస్తోంది.

భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికి 22 భాషలను అధికారికంగా గుర్తించారు. రాజ్యాంగ గుర్తింపునకు అధిక సంఖ్య జనాభా మాట్లాడటమే ప్రాతిపదిక అయితే... బంజారా భాషను కూడా గుర్తించాలి. 20 రాష్ట్రాలలో నివసిస్తున్న బంజారాలు దాదాపుగా 12 కోట్ల వరకూ ఉన్నారనేది పరిశోధకులు వేస్తున్న అంచనా. అంటే దేశంలో హిందీ తరువాత అత్యధికంగా మాట్లాడే భాషల్లో గౌర్–బోలి కూడా ఒకటన్నమాట. లిపి లేకపోవడం, ఆ యా రాష్ట్రాల్లో ప్రాచుర్యంలో ఉన్న భాషల ఆధిపత్యం వల్ల క్రమంగా ఈ భాష మృతభాషగా మారుతోంది. ఈ స్థితి నుంచి రక్షించాలంటే... రాజ్యాంగ గుర్తింపునిచ్చి, భాషాభివృద్ధికి, పరిశోధనకు పెద్ద ఎత్తున నిధులు సమకూర్చాలి.

ఉమ్మడి రాష్ట్రంలో 'రాజీవ్ విద్యామిషన్ (ఆర్‌వీఎం) ద్వారా బంజార భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలలను నెలకొల్పి, ఆ భాష వచ్చిన వారినే టీచర్లుగా నియమించింది ప్రభుత్వం. ఇలా భాషను బతికించడానికి కొంత ప్రయత్నం చేసినా, కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు ఆ పాఠశాలలు పని చేయడం లేదు. మళ్లీ అటువంటి పాఠశాలలను తెరవాలి.

– జటావత్ హనుము, ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ స్కాలర్



# కనీస వసతుల కల్పన మీ విధి



- మున్సిపల్ అధికారులకు హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: పౌరులకు డ్రైనేజీ, ఇతర సౌకర్యాలు కల్పించడం మున్సిపల్ అధికారుల విధి అని హైకోర్టు స్పష్టం చేసింది. ఇతర కాలనీవాసులు అభ్యంతరం చెబుతున్నారంటూ డ్రైనేజీ నిర్మాణాన్ని మధ్యలోనే ఆపడాన్ని తప్పుబట్టింది. మల్కాజ్‌గిరి అనంత సరస్వతి నగర్‌లోని తమ ఇళ్లలోకి.. వర్షాకాలంలో వరద నీరు చేరుతుండటంతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని, అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పరిష్కరించడం లేదంటూ అదే కాలనీకి చెందిన ఓ.రమేశ్ 2022లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టగా.. ఆర్.కె.పురం, సఫిల్‌గూడ నుంచి వరద నీరు పోయేందుకు ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ సరిపోదని, దాన్ని మరింత పెంచాలని జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ పేర్కొన్నారు. ఆ మేరకు అధికారులు చర్యలు చేపట్టారని, ఐదు నెలల్లో పనులు పూర్తవుతాయని తెలిపారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి గడువులోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండేళ్లు గడిచినా పనులు పూర్తి కాకపోవడంతో రమేశ్ ధిక్కరణ పిటిషన్ వేయగా, జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు.

## వడ్డీ వ్యాపారులకు కలెక్టర్ జరిమానా

ఇల్లంతకుంట (మానకొండూర్): అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న ఇద్దరు వ్యక్తులకు జిల్లా కలెక్టర్ జరిమానాలు విధించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలానికి చెందిన రాజమల్లయ్య, బొమ్మెరవేణి రాజు అధిక వడ్డీలకు అప్పు ఇస్తున్నారనే సమాచారంతో కేసులు నమోదు చేశారు. దీనిపై ఆగ్రహించిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా.. రాజమల్లయ్యకు రూ.30 వేలు, రాజుకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

## మత్స్యకారుల వలలు తగులబెట్టిన ఫారెస్ట్ అధికారులు

- 50 ఏళ్లుగా.. 10వేల కుటుంబాలకు జీవనోపాధి



కాలిపోతున్న వలలు

నాగార్జునసాగర్: అనుమతి లేకుండా కృష్ణానది తీరంలో నివాసం ఉండొద్దని అటవీశాఖ అధికారులు మత్స్యకారులను హెచ్చరించి, వారు వేసుకున్న గుడిసెలను తొలగించి వలలను తగులబెట్టారు. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వరకు కృష్ణానది తీరం వెంట పుట్టీలనే గృహాలుగా మార్చుకొని గత 50 ఏళ్లుగా రెండు తరాల వారు 10 వేల మత్స్యకారుల కుటుంబాలు చేపలు పట్టుకొని జీవనోపాధి పొందుతున్నాయి. అయితే ఎలాంటి హెచ్చరికలు చేయకుండా అటవీ అధికారులు తమ గుడిసెలు తొలగించి వలలు తగలబెట్టారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము సుమారుగా రూ.8 లక్షల మేర నష్టపోయినట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు.

# కశ్మీర్‌కు వందేభారత్ రికార్డు పరుగు

**ట్రయల్ రన్ విజయవంతం** | **ఈ ఎక్స్‌ప్రెస్‌కు అనేక ప్రత్యేకతలు** | **త్వరలోనే ప్రధాని మోదీ పచ్చ జెండా**

**శ్రీనగర్:** కశ్మీర్‌ను రైలు మార్గం ద్వారా భారతీయ రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానించే బృహత్ కార్యక్రమం విజయవంతమైంది. శనివారం ప్రఖ్యాత వైష్ణో దేవి ఆలయం నెలకొన్న జమ్మూలోని కాత్రా నుంచి కశ్మీర్‌లోని బుద్గాం వరకు వందే భారత్ రైలు ట్రయల్ రన్ విజయవంతంగా పూర్తయింది. నౌగావ్ ప్రాంతంలోని శ్రీనగర్ స్టేషన్‌కు ఉదయం 11.30 గంటల సమయంలో ఆరెంజ్- గ్రే- కలర్ రైలు చేరుకుంది. ఆ రైలులో వచ్చిన వారికి జనం పూల దండలతో స్వాగతం పలికారు. ఈ ప్రాంతంలో మంచు, అతిశీతల వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా అత్యాధునిక వసతులతో రూపొందించిన ప్రత్యేక రైలు శుక్రవారం జమ్మూకు చేరుకుంది. ట్రయల్ రన్‌లో భాగంగా ప్రపంచంలోనే అత్యంత పొడవైన అంజి ఖాద్ వంతెనతోపాటు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చినాబ్ వంతెన మీదుగా ఈ రైలు పరుగులు తీసిందని అధికారులు తెలిపారు. కొద్ది సమయం తర్వాత రైలు బుద్గాం స్టేషన్ నుంచి ముందుకు వెళ్లి ట్రయల్ రన్‌ను పూర్తి చేసింది. ఉత్తర రైల్వే చీఫ్ ఏరియా మేనేజర్(శ్రీనగర్) సకీబ్ యూసఫ్ మాట్లాడుతూ.. ఈ ట్రయల్ రన్ చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. ఇంజనీరింగ్ అధికారుల పదేళ్ల శ్రమకు తగిన ప్రతిఫలమన్నారు. రైల్వే సేఫ్టీ కమినర్ కూడా ధ్రువీకరించినందున కాత్రా–బారాముల్లా సెక్షన్‌లో నడిచే ఈ రైలును త్వరలోనే ప్రధాని మోదీ జెండా ఊపి ప్రారంభించే అవకాశముంది. సుమారు 272 కిలోమీటర్ల పొడవైన ఉధంపూర్–శ్రీనగర్– బారాముల్లా రైల్ లింక్(యూఎస్‌బీఆర్ఎల్) ప్రాజెక్టును రైల్వే శాఖ డిసెంబర్‌లో పూర్తి చేసింది.

**వాతావరణానికి తగ్గ ఏర్పాట్లు**

కాత్రా–శ్రీనగర్ రైలు మార్గం కోసం జమ్మూకశ్మీర్‌లోని పర్వత ప్రాంతంలోని శీతాకాల పరిస్థితులను తట్టుకునేలా ప్రత్యేకంగా తయారు చేసిన వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైలును గతేడాది జూన్ 8వ తేదీన అధికారులు ఆవిష్కరించారు. ఇందులో ఇతర వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఉండే వసతులతోపాటు అనేక ప్రత్యేకతలున్నాయి. శీతాకాలంలో రైలులోని పైపులు, బయో టాయిలెంట్ ట్యాంకుల్లో నీరు గడ్డకట్టకుండా అత్యాధునిక హీటింగ్ వ్యవస్థను అమర్చారు. వాక్యూమ్ సిస్టమ్‌కు వెచ్చని గాలి అందేలా చేశారు. దీనివల్ల ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయినా ఎయిర్ బ్రేక్ వ్యవస్థ యథా ప్రకారం పనిచేస్తుంది. తీవ్రంగా మంచు కురుస్తున్న సమయంలో సైతం డ్రైవర్ ముందున్న వస్తువులను స్పష్టంగా చూడగలిగేలా విండ్ షీల్డ్‌పై పేరుకుపోయిన మంచును స్వయంచాలితంగా తొలగించే ఏర్పాటుంది. అదనంగా మిగతా వందే భారత్ రైళ్లలో ఉండే ఇతర అన్ని వసతులు..ఎయిర్ కండిషన్డ్ కోచ్‌లు, ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, మొబైల్ చార్జింగ్ సాకెట్లు వంటివి ఉన్నాయి. దేశంలోనే మొట్టమొదటి కేబుల్ రైలు వంతెన అంజి ఖాద్ బ్రిడ్జి, చినాబ్ నదిపై కౌరి వద్ద నిర్మించిన ఆర్చ్ బ్రిడ్జిల మీదుగా గత నెలలో ఈ రైలును ఆరుసార్లు ప్రయోగాత్మకంగా నడిపారు. యూఎస్‌బీఆర్ఎల్ ప్రాజెక్టులోని భాగమైన అంజి ఖాద్ వంతెన ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలిచింది. నది గర్భం నుంచి 331 మీటర్ల ఎత్తులో ఒకే ఒక పైలాన్‌పై నిర్మితమైన వారధి ఇది. పునాది నుంచి దీని ఎత్తు 191 మీటర్లు. దీనిని పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులకు ఏళ్లు పట్టింది. మొత్తం 473.25 మీటర్ల పొడవైన అంజి ఖాద్ వంతెన ప్రపంచంలోనే రెండో అత్యంత ఎత్తైన రైల్వే వంతెనగా రికార్డు నెలకొల్పింది. అంతేకాదు, చినాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనను నిర్మించారు. నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేశారు. ఇది పారిస్‌లోని ఈఫిల్ టవర్ కంటే కూడా 35 మీటర్ల పొడవెక్కువ.



శనివారం ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ రైలు వంతెన మీదుగా వెళ్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు

# ఇండొనేసియాతో ఇక బలీయ బంధం

**ద్వైపాక్షిక సంబంధాలను ఉన్నత శిఖరాలకు చేర్చాలని నిర్ణయం**
- భారత ప్రధాని మోదీ, ఇండొనేసియా అధినేత సుబియాంటో భేటీ
- కీలక రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని తీర్మానం
- రెండు దేశాల మధ్య ఐదు ఒప్పందాలు

**న్యూఢిల్లీ:** రక్షణ ఉత్పత్తులు, సరఫరా వ్యవస్థ సహా కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని భారత్, ఇండొనేసియా నిర్ణయానికొచ్చాయి. వ్యాపార వాణిజ్య రంగంతోపాటు సముద్ర తీర రక్షణలో సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని తీర్మానించుకున్నాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇండొనేసియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో శనివారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఇండొనేసియా దేశం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భారత్‌కు అత్యంత ముఖ్యమైన భాగస్వామి అని ప్రధాని మోదీ చెప్పారు. ఇరువురు నేతల మధ్య చర్చల నేపథ్యంలో భారత్–ఇండొనేసియా మధ్య ఐదు కీలక ఒప్పందాలు కుదిరాయి. ఆరోగ్యం, మారిటైమ్ సెక్యూరిటీ, డిజిటల్ స్పేస్, సాంస్కృతిక తదితర రంగాల్లో కలిసి పనిచేయడానికి వీలుగా రెండు దేశాలు ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సుబియాంటోతో భేటీ అనంతరం ప్రధాని మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. అసియాన్ (అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఈస్టు ఆసియన్ నేషన్స్)తో పాటు ఇండో–పసిఫిక్ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు భారత్, ఇండొనేసియా కట్టుబడి ఉన్నాయని ఉద్ఘాటించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఈ ప్రాంతంలో నౌకలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించడానికి అవకాశం ఉండాలన్నారు. ఎవరైనా సరే నియమ నిబంధనలు పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. డ్రాగన్ దేశం చైనా విస్తరణ కాంక్షపై ప్రధాని మోదీ పరోక్షంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిన్‌టెక్, కృత్రిమ మేధ(ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డిజిటల్ ప్రజా వసతులు, ఇంధనం, ఖనిజ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీ, మారిటైమ్ సెక్యూరిటీ, సైబర్ సెక్యూరిటీ, కౌంటర్–టెర్రరిజం వంటి రంగాల్లో కలిసికట్టుగా పనిచేయాలని తాము నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఇరు దేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాలను ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నదే తమ లక్ష్యమని స్పష్టంచేశారు.

**సుబియాంటో రాక గర్వకారణం**

భారత గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు సుబియాంటో గురువారం రాత్రి ఇండియాకు చేరుకున్నారు. ఆయన రాక భారత్‌కు గర్వకారణమని మోదీ అభివర్ణించారు. సుబియాంటోకు స్వాగతం పలకడాన్ని గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. మోదీతో సమావేశం అనంతరం సుబియాంటో స్పందిస్తూ.. భారత్‌తో భాగస్వామ్యం తమకు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రితో నిర్మాణాత్మక చర్చ జరిగిందని సంతోషం వ్యక్తంచేశారు. భారత్‌తో ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని తమ అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలిపారు. ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణకు భారత్‌లో కలిసి పని చేస్తామన్నారు. తమ దేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని భారత పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. మలేషియాలో మౌలిక సదుపాయాల రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని సూచించారు.



ప్రధాని మోదీతో ఇండొనేసియా అధ్యక్షుడు సుబియాంటో

**ద్వైపాక్షిక వాణిజ్యం వేగవంతం**

గత కొన్నేళ్లుగా భారత్–ఇండొనేసియా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం వేగం పుంజుకుంటోందని నరేంద్ర మోదీ గుర్తుచేశారు. గత ఏడాది 30 మిలియన్ డాలర్లు దాటిందన్నారు. దీన్ని మరింత పెంచాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో ప్రైవేట్ రంగం పాత్ర మరింత పెరగాలని సూచించారు. భారత్–ఇండొనేసియా ప్రజల మధ్య ప్రాచీన కాలం నుంచి సంస్కృతి, చారిత్రక సంబంధాలు ఉన్నాయని వివరించారు. ఇండొనేసియాలో ప్రాంబనన్ హిందూ ఆలయ పరిరక్షణకు భారత్ సహకరిస్తోందన్నారు. 'బ్రిక్స్'కూటమిలో ఇండొనేషియా ఒక సభ్యదేశంగా చేరడాన్ని మోదీ స్వాగతించారు. ఆదివారం కర్తవ్యపథ్‌లో జరిగే గణతంత్ర పరేడ్‌లో ఇండొనేసియా సైనిక బృందం, బ్యాండ్ టీమ్ పాల్గొననుంది. ఇండొనేసియా బృందం ఈ వేడుకల్లో పాలుపంచుకుంటూ ఉండడం ఇదే మొదటిసారి.

# జమిలి ఎన్నికలతో సుస్థిర పాలన

**గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానంతో దేశంలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. సుపరిపాలనకు బాటలు వేయొచ్చని అన్నారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం తప్పించడానికి, వనరుల మళ్లింపును అడ్డుకోవడానికి అడ్డుకోవడానికి జమిలి ఎన్నికలు దోహదపడతాయని తెలిపారు. 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి శనివారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. జమిలి ఎన్నికలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని, పరిపాలనలో వేగం పెరుగుతుందని వివరించారు. దేశంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న వలసవాద మనస్తత్వాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. బ్రిటిష్ కాలంనాటి క్రిమినల్ చట్టాల స్థానంలో నూతన ఆధునిక చట్టాలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. మహిళలు, చిన్నారులపై నేరాల నియంత్రణపై అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రజలకు వేగంగా న్యాయం చేకూర్చడానికి భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియంను ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిందని వివరించారు. రాష్ట్రపతి ఇంకా ఏం మాట్లాడారంటే...

**ప్రగతి పథంలో ఆర్థిక వ్యవస్థ**

"దేశానికి స్వాతంత్య్రం వచ్చిన సమయంలో ఎటు చూసినా పేదరికం, ఆకలి తాండవించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. మనపై మనం విశ్వాసం పెంచుకున్నాం. అభివృద్ధికి తగిన పరిస్థితులు సృష్టించుకున్నాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత ఆర్థిక వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ మార్పు వెనుక మన రాజ్యాంగం వేసిన పునాదులు ఉన్నాయి. ఇటీవలి కాలంలో మన ఆర్థిక వ్యవస్థ వేగంగా అభివృద్ధి చెందుతోంది. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.



**ఇస్రో ప్రయోగాలు హర్షణీయం**

అంతరిక్ష ప్రయోగాల్లో ఇస్రో ఎన్నో విజయాలు సాధిస్తుండడం ఆనందంగా ఉంది. స్పేస్ డాకింగ్ ప్రయోగంలో విజయవంతమైన దేశాల జాబితాలో మన దేశంలో కూడా చేరడం సంతోషకరం. ఈ సామర్థ్యం కలిగిన నాలుగో దేశంగా భారత్ రికార్డు కెక్కింది. ఇది మనందరికీ నిజంగా గర్వకారణం.

**త్యాగధనులకు తగిన గుర్తింపు**

స్వాతంత్య్ర పోరాటంలో ఎంతోమంది త్యాగాలు చేశారు. ప్రాణాలు సైతం పోగొట్టుకున్నారు. గతంలో వారికి గుర్తింపు రాలేదు. ప్రభుత్వం ప్రస్తుతం అలాంటి త్యాగధనులకు తగిన గుర్తింపు ఇస్తోంది. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనేవి ఆధునిక భావనలు కాదు. అవి మన నాగరిక వారసత్వంలో అంతర్భాగాలే" అని రాష్ట్రపతి ముర్ము స్పష్టంచేశారు.

## రాణా తరలింపునకు మార్గం సుగమం

**రివ్యూ పిటిషన్‌ను కొట్టేసిన అమెరికా సుప్రీంకోర్టు**

**వాషింగ్టన్:** ముంబై ఉగ్రదాడి ఘటనలో ఉగ్రవాదులకు సాయపడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటూ ప్రస్తుతం అమెరికాలో జైలు శిక్ష అనుభవిస్తున్న తహవ్వుర్ రాణాను భారత్‌కు తరలించేందుకు మార్గం సుగమమైంది. భారత్‌కు అప్పగించాలన్న అమెరికా ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అతడు పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తాజాగా కొట్టేసింది. దీంతో భారత్‌కు తరలింపునకు ఉన్న ఆఖరి అడ్డంకి తొలగిపోయింది. ట్రంప్ అధ్యక్షుడిగా ప్రమాణంచేసిన మరుసటి రోజే అంటే ఈనెల 21వ తేదీన ఇలా భారత అనుకూల తీర్పు రావడం విశేషం. రాణాను భారత్‌కు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ అతడు వేసిన పిటిషన్లను శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్ సహా పలు ఫెడరల్ కోర్టులు గతంలోనే కొట్టేశాయి. చిట్టచివరి ప్రయత్నంగా గత ఏడాది నవంబర్‌లో రాణా అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించడం తెల్సిందే.

## వైట్ హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా కుష్ దేశాయ్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్ష భవనం వైట్ హౌస్ డిప్యూటీ ప్రెస్ సెక్రటరీగా భారత సంతతికి చెందిన కుష్ దేశాయ్‌ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియమించారు. ఈ మేరకు శుక్రవారం వైట్‌హౌస్ ఒక ప్రకటన చేసింది. కుష్ గతంలో, అయోవా రిపబ్లికన్ పార్టీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గాను ,2024 రిపబ్లికన్ నేషనల్ కన్వెన్షన్‌కు డిప్యూటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గాను బాధ్యతలు నిర్వర్తించారు. పెన్సిల్వేనియా వంటి కీలక రాష్ట్రాలకు ఎన్నికల సమయంలో రిపబ్లికన్ పార్టీ తరఫున కమ్యూనికేషన్స్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఈయన సారథ్యం వహించిన ఏడు రాష్ట్రాల్లో ట్రంప్ ఘన విజయం సాధించడం గమనార్హం. వైట్ హౌస్ కమ్యూనికేషన్స్ వ్యవహారాలను డిప్యూటీ వైట్ హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్, కేబినెట్ సెక్రటరీ టేలర్ బుడోవిక్ చూస్తున్నారు.వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీగా కరోలిన్ లీవిట్ ఇప్పటికే నియమితులయ్యారు.

## శరద్ పవార్‌కు అనారోగ్యం

**పుణే:** సీనియర్ నేత, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ) వ్యవస్థాపకుడు శరద్ పవార్(84) అనారోగ్యం బారినపడ్డారు. తీవ్రమైన దగ్గు కారణంగా మాట్లాడటం కష్టంగా మారిన నేపథ్యంలో వచ్చే 4 రోజుల్లో ఆయనకున్న కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి. ఆరోగ్యం బాగోలేకున్నా ఆయన గురువారం పుణేలోని వసంత్‌దాదా షుగర్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రసంగించారు. ఆ సమయంలో తరచూ దగ్గుతూనే 18 నిమిషాల ప్రసంగాన్ని ముగించారు. 'శరద్ పవార్ జీ ఎడతెగని దగ్గుతో ఇబ్బంది పడుతున్నారు. అందుకే, వచ్చే నాలుగు రోజుల్లో ఆయన పాల్గొనే కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి'అని శనివారం ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధ్యక్షుడు ప్రశాంత్ జగ్తాప్ చెప్పారు.

# అద్దెదార్ల ఓట్లపై పార్టీల వల

- ఢిల్లీలో 32 శాతం మంది అద్దె ఇళ్లల్లోనే నివాసం
- హామీల వర్షం కురిపిస్తున్న పార్టీలు
- ఉచితంగా నీరు, విద్యుత్ సరఫరా చేస్తామంటున్న 'ఆప్'

దేశ రాజధాని ఢిల్లీలో ప్రతి మూడు కుటుంబాల్లో ఒక కుటుంబం అద్దె ఇంట్లోనే నివసిస్తోంది. మొత్తం ఓటర్లలో అద్దెదార్ల వాటా తక్కువేమీ కాదు. అభ్యర్థుల గెలుపోటములను నిర్దేశించగల స్థాయిలో ఉన్న ఈ ఓటర్లపై ప్రధాన రాజకీయ పార్టీలు వల విసురుతున్నాయి. వారి ఓట్లపై గురిపెడుతూ హామీల వర్షం కురిపిస్తున్నాయి. అద్దెదార్ల ఓట్లు గంపగుత్తగా పడితే ఎన్నికల్లో గెలుపునకు ఢోకా ఉండదని భావిస్తున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇప్పటికే పలు హామీలు ఇచ్చారు. అద్దె ఇళ్లల్లో ఉంటున్నవారికి ఉచితంగా నీరు, విద్యుత్ సరఫరా చేస్తామని ప్రకటించారు. తమ పార్టీని మళ్లీ గెలిపిస్తే వారి సమస్యలు పరిష్కరిస్తామని వెల్లడించారు.

- ఢిల్లీ నివాసితుల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై ప్రభుత్వం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. నగరంలో 66.6 శాతం మంది సొంత ఇళ్లల్లో నివసిస్తుండగా, 32.4 శాతం మంది కిరాయి ఇళ్లల్లోనే బతుకులీడుస్తున్నారు.
- అద్దె ఇళ్లల్లో ఉంటున్నవారిలో 51.9 శాతం మంది న్యూఢిల్లీ జిల్లాలోనే ఉండగా, 41.9 శాతం మంది సౌత్‌ఈస్ట్ జిల్లాలో ఉన్నారు.
- న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ పరిధిలో 62.7 శాతం మంది, ఢిల్లీ కంటోన్మెంట్ ఏరియాలో 46.9 శాతం మంది అద్దెదార్లు ఉన్నారు.
- ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఢిల్లీకి ప్రజలు వలస వస్తున్నారు. ప్రధానంగా పూర్వాంచల్‌గా పిలిచే ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్ వాసులు దేశ రాజధాని గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. చిన్నచిన్న ఉద్యోగాలు, కూలీ పనులు చేసుకొనే పూర్వాంచల్ ప్రజల్లో ఎక్కువ మంది అద్దె ఇళ్లల్లోనే నివసిస్తున్నారు.
- ఆమ్ ఆద్మీ పార్టీతోపాటు బీజేపీ, కాంగ్రెస్ సైతం అద్దెదార్ల ఓటర్లపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి.
- తాము అధికారంలోకి వస్తే పూర్వాంచల్ ప్రజల అభ్యున్నతి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది.
- ఆమ్ ఆద్మీ సర్కారు పాలనలో అద్దెదార్లు నిర్లక్ష్యానికి గురయ్యారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే వారి సంక్షేమం కోసం ప్రత్యేక పథకాలు తీసుకొస్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

## ఇద్దరికి కీర్తి చక్ర

**14 మందికి శౌర్య చక్ర**

**న్యూఢిల్లీ:** శాంతిసమయాల్లో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన వారికిచ్చే రెండో అత్యున్నత గ్యాలెంట్రీ అవార్డ్ 'కీర్తిచక్ర' ఈసారి నాయక్ దిల్వర్ ఖాన్, మేజర్ మన్‌జీత్‌లకు దక్కింది. గత ఏడాది కశ్మీర్‌లోయలో ఉగ్రవ్యతిరేక ఆపరేషన్‌లో నాయక్ దిల్వార్ వీరమరణం పొందారు. గత ఏడాది ఏప్రిల్‌లో సోపోర్‌లో విదేశీ కిరాయి ఉగ్రవాదులను అడ్డుకోవడంలో మేజర్ మన్‌జీత్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని త్రివిధదళాలకు అధినాయకత్వ హోదాలో రాష్ట్రపతి ముర్ము శనివారం సాయుధబలగాల్లో 14 మందికి శౌర్య చక్ర సహా మొత్తంగా 93 మందికి గ్యాలెంట్రీ అవార్డ్‌లను ప్రకటించారు. వీటిలో ఒక బార్ టు సేనా మెడల్, 66 సేనా మెడల్స్, ఎనిమిది వాయుసేన మెడల్స్, రెండు నావో సేనా మెడల్స్ ఉన్నాయి. వీళ్లతోపాటు పోలీస్, ఫైర్, సివిల్ డిఫెన్స్ విభాగాల్లో మొత్తం 942 మందికి పోలీస్, సర్వీస్ మెడల్స్ ప్రకటించారు. వీటిల్లో రాష్ట్రపతి మెడల్స్ కూడా ఉన్నాయి. ఇవిగాక, మణిపూర్‌లో ఘర్షణలు, హింసాత్మక ఘటనలు, దేశంలో పలు ఆన్‌లైన్ ట్రేడింగ్ కుంభకోణాలు, 2024 నీట్ పరీక్ష అక్రమాలు, అస్సాంలో పోంజీ కుంభకోణం వంటి దేశవ్యాప్తంగా పలు కీలక కేసుల దర్యాప్తులో విశేష కృషిచేసినందుకు 31 మంది సీబీఐ అధికారులకూ అవార్డ్‌లు ప్రకటించారు.

# అటు నలుగురు.. ఇటు 200

**కొనసాగుతున్న బందీల విడుదల ప్రక్రియ • గాజాలో వెల్లివిరిసిన ఆనందం**

**టెల్ అవీవ్:** ఇజ్రాయెల్–హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంలో ఇరువైపులా బందీల విడుదల ప్రక్రియ రెండోదఫా సజావుగా సాగింది. పెద్ద సంఖ్యలో తమ వాళ్లు ఇజ్రాయెల్ జైళ్ల నుంచి విడుదల కావడంతో వెస్ట్‌బ్యాంక్‌లోని రమల్లా నగరంలో పాలస్తీనియన్లు సంబరాలు చేసుకున్నారు. నలుగురు ఇజ్రాయెలీ మహిళా సైనికులు కరీనా అరీవ్(20), డేనియెలా గిల్‌బోవా(20), నామా లెవీ(20), లిరి అల్బాగ్(19)లను హమాస్ సాయుధులు విడిచిపెట్టారు. ఇందుకు ప్రతిగా ఇజ్రాయెల్ సైతం తమ కారాగారాల్లోని 200 మంది పాలస్తీనియన్లను వదలిపెట్టింది. వెస్ట్‌బ్యాంక్‌లోని ఒఫెర్ జైలు నుంచి బయటకొచ్చిన ఖైదీలను జెరూసలేం, రమల్లా సిటీలకు తరలించారు. విడుదలైన 200 మంది బస్సుల్లో బయల్దేరారు. ఈ 200 మందిలో 121 మంది జీవితఖైదు పడిన వాళ్లు ఉన్నారు. వీళ్లంతా గతంలో ఇజ్రాయెలీలపై దాడులకు పాల్పడ్డ నేరాలకు ఇజ్రాయెల్ జైళ్లలో శిక్ష అనుభవిస్తున్నారు. విడుదలైన వారిలో కరుడుగట్టిన ఉగ్రవాదులు మొహమ్మద్ ఒదేహ్(52), వేయిల్ ఖాసిమ(54) సైతం ఉన్నారు. విడుదలైన 200 మందిలో 70 మందిని బహిష్కరించి ఈజిప్ట్‌కు పంపేశారు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకిరావడంలో ఈజిప్ట్ కీలక మధ్యవర్తిగా ఉన్న నేపథ్యంలో కొందరు ఖైదీలను ఈజిప్ట్‌కు తరలించినట్లు అక్కడి ఖహేరీ టీవీ పేర్కొంది. అంతకుముందు ఈ నలుగురు ఇజ్రాయెలీ మహిళా సైనికులను గాజా సిటీలోని పాలస్తీన్ స్క్వేర్ వద్ద రెడ్‌క్రాస్ బృందానికి హమాస్ సాయుధులు అప్పగించారు. ఈ మహిళలు పూర్తి ఆరోగ్యంతో, నవ్వుతూ అక్కడి వేలాది మంది స్థానికులకు అభివాదం చేస్తూ వెళ్లిపోయారు. వీళ్ల రాకను ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ నగర వీధుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లపై చూసిన వందలాది మంది స్థానికులు సంబరాలు చేసుకున్నారు. "నమ్మలేకపోతున్నా. వాళ్లు అలా విడుదలకావడం చూసి మనసు ఉప్పొంగింది. యుద్ధం శాశ్వతంగా ఆగిపోతే ఎంత బాగుంటుందో"అని సంబరాలు చేసుకున్న అవీవ్ బెర్కోవిచ్ అనే స్థానికుడు ఆనందం వ్యక్తంచేశారు. ఈ మహిళా సైనికులు సురక్షితంగా తమ ఆర్మీ స్థావరానికి చేరుకున్నారని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయం ధ్రువీకరించింది.



గాజాలో హమాస్ చెర వీడిన అనంతరం రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఇజ్రాయెలీ సైనికులు నామా, లిరి, డేనియెలా, కరీనా ఆనందం



అరిజోనాలోని టక్సన్ ఎయిర్‌పోర్టులో వలసదారులను సైనిక విమానంలోకి ఎక్కిస్తున్న అధికారులు

## వెనక్కి పంపేస్తున్నాం..

# మాకు వద్దే వద్దు

- మెక్సికో గుండా వచ్చిన శరణార్థులను పంపేస్తున్న అమెరికా
- వాళ్లను అనుమతించమన్న మెక్సికో
- సందిగ్ధంగా మారిన తరలింపు

మెక్సికో గుండా శరణార్థులుగా చొరబడిన వారందరినీ వెనక్కి పంపేస్తామంటూ అమెరికన్లకు ఇచ్చిన వాగ్దానాన్ని డొనాల్డ్ ట్రంప్ నెరవేర్చాలని చూస్తుంటే అందుకు మెక్సికో ససేమిరా అంటోంది. మా గడ్డ మీదుగా వచ్చినంత మాత్రాన వాళ్లంతా మెక్సికన్లుకాబోరని తెగేసి చెబుతోంది. అయినాసరే విమానాల్లో తరలిస్తామంటే ఆ విమానాలను ల్యాండింగ్ కానివ్వబోమని స్పష్టంచేసింది. దీంతో ఈ శరణార్థులను ఎక్కడి పంపాలో, వీళ్లని ఏం చేయాలా అని అమెరికా తల పట్టుకుంది.

**అసలేం జరిగింది?**

చాన్నాళ్లుగా శరణార్థులుగా అమెరికాలోకి అక్రమంగా వలసవస్తున్న వారిని గత అమెరికా ప్రభుత్వాలు అనుమతించాయి. కానీ ట్రంప్ అధ్యక్షుడయ్యాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డాక్యుమెంట్లు లేకుండా శరణు కోరుతూ అక్రమంగా వస్తే ఎవ్వరినీ అనుమతించబోమని ట్రంప్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇప్పటికే వచ్చిన వారినీ పంపేస్తామని ప్రకటించింది. గ్వాటెమాల నుంచి వచ్చిన వాళ్లను ఇటీవలే వెనక్కి పంపింది. ఒక్కోదాంట్లో 80 మంది శరణార్థులున్న రెండు సైనిక విమానాలు శుక్రవారమే గ్వాటెమాలకు వెళ్లి అక్కడ వదిలేసి వచ్చాయి. ఇదే తరహాలో "మెక్సికో వాళ్లు మెక్సికోలోనే ఉండాలి. అమెరికాలో కాదు"అనే అర్థంలో గతంలో అమలుచేసిన 'రిమేన్ ఇన్ మెక్సికో'విధానాన్ని ట్రంప్ యంత్రాంగం తెరమీదకు తెచ్చింది. మెక్సికో వెళ్లి శరణార్థులను వదిలేసి రావాలని ట్రంప్ ప్రభుత్వం గత వారం నిర్ణయించింది. సీ–17 భారీ సైనిక సంబంధ సరకు రవాణా విమానంలో వారిని మీ దేశానికి తీసుకొస్తున్నట్లు మెక్సికోకు అమెరికా సమాచారమిచ్చింది. ఇది తెల్సిన వెంటనే మెక్సికో ఘాటుగా స్పందించింది. "మా దేశం గుండా మీ దేశంలోకి వచ్చినంత మాత్రాన వాళ్లంతా మెక్సికన్లు అయిపోరు. వాళ్లలో అక్రమంగా మెక్సికోకు వచ్చి చివరకు అమెరికా సరిహద్దుదాకా వచ్చి శరణు కోరిన వారు ఉన్నారు. ఒకవేళ వాళ్లందరినీ విమానంలో మా దేశానికి పంపిస్తే ఆ విమానాన్ని ల్యాండ్ కానివ్వం. అమెరికాతో మాకు సత్సంబంధాలున్నాయి. వలస విషయంలోనూ అంతే. అయినా తప్పదనుకుంటే ఆ శరణార్థుల్లో మెక్సికో జాతీయులను మాత్రం తిరిగి పంపడానికి అనుమతిస్తాం"అని మెక్సికో విదేశాంగ శాఖ స్పష్టంచేసింది.

**క్షీణించిన సత్సంబంధాలు**

మెక్సికో సరిహద్దు వద్ద భద్రతను కట్టుదిట్టంచేస్తానని, ఓ యాప్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకుని ఇంటర్వ్యూ తర్వాత శరణార్థి హోదాలో అమెరికాలోకి వచ్చే విధానానికి చరమగీతం పాడుతున్నట్లు ట్రంప్ అధికారంలోకి రాగానే ప్రకటించారు. అందుకు తగ్గట్లే సరిహద్దు వద్ద వేలాది మందిగా అదనపు బలగాలను మొహరించారు. మెక్సికో గుండా అత్యంత ప్రమాదకర కొత్తరకం మాదకద్రవ్యాలు అమెరికాలోకి స్మగ్లింగ్ చేస్తున్నారంటూ అక్కడి డ్రగ్ ముఠాలను ఉగ్రసంస్థలుగా ప్రకటించారు. మెక్సికో వస్తూత్పత్తులపై ఫిబ్రవరి నుంచి అదనంగా 25 శాతం పన్నులు విధిస్తానని ట్రంప్ ప్రకటించారు. వెనక్కి పంపిస్తామన్న ట్రంప్ ప్రభుత్వ అభ్యర్థనను మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ తిరస్కరించారు. మూకుమ్మడి తిరుగుటపాలు ఒప్పుకోబోమని, అయినా ప్రతిభగల మెక్సికన్ శరణార్థులు అమెరికా ఆర్థికాభివృద్ధికి దోహదపడతారని ఆమె హితవు పలికారు. దీంతో అమెరికా, మెక్సికో సత్సంబంధాలు క్షీణించాయి. 2021లోనూ అఫ్గానిస్తాన్ నుంచి అమెరికా సేనలు నిష్క్రమించినప్పుడు అక్కడి వేర్వేరు దేశస్తులను తమ తమ దేశాలకు అమెరికా తమ సైనిక విమానాల్లో తరలించింది. – సాక్షి, నేషనల్ డెస్క్



### కొత్త రేషన్.. సిటీ పరేషాన్!
రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ఆదివారం లాంఛనంగా ప్రారంభం కానుండగా నగరంలో దాని ఊసే లేదు. పౌర సరఫరాల శాఖ నోరు మెదపడం లేదు. -10లో



### అలనాటి స్మృతుల్లో..
శతాబ్దాల చారిత్రక అస్తిత్వం.. హైదరాబాద్ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతిరూపం. విభిన్న సంస్కృతుల సమాహారం పాతబస్తీ. ఇక్కడ మెట్రో మార్గం సుగమమైంది. - సిటీప్లస్‌లో

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.0/17.0

నగరంలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు అలుముకుంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 17 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



## 300 మీటర్ల మువ్వన్నెల పతాకం
గణతంత్ర దినోత్సవం సందర్భంగా శనివారం మదీనా నుంచి చార్మినార్ వరకు 300 మీటర్ల మువ్వన్నెల జెండాను ప్రదర్శించారు. మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుకారీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ ప్రారంభించారు. - చార్మినార్


కాచిగూడ రైల్వే స్టేషన్

## రిపబ్లిక్ వెలుగులు!
రిపబ్లిక్ డే సందర్భంగా నగరంలోని సచివాలయం, అసెంబ్లీ, చార్మినార్, కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లతో పాటు తదితర ప్రాంతాలు మూడు రంగుల విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. శనివారం రాత్రి తిరంగా కాంతులు ఇలా కనువిందుగా కనిపించాయి. - చార్మినార్


సచివాలయం


చార్మినార్

## అనుదీప్ దురిశెట్టికి 'బెస్ట్ ఎలక్టోరల్ పార్టిసిపేట్' అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: స్వీప్ కార్యక్రమం ద్వారా యువతను చైతన్యవంతం చేయడంతో పాటు ఓటరు శాతాన్ని పెంచినందుకు గాను హైదరాబాద్ ఉప ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి బెస్ట్ ఎలక్టోరల్ పార్టిసిపేట్ అవార్డు- 2024 దక్కింది. శనివారం రవీంద్ర భారతిలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అనుదీప్ ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణీ కుముదిని, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, డిప్యూటీ సీఈఓ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## 2 లక్షల మ్యాన్‌హోళ్లు శుభ్రం
**2561 కి.మీ పైపులైన్ క్లీనింగ్**
**కొనసాగుతున్న డీ-సిల్టింగ్ పనులు**

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి చేపట్టిన 'సీవరేజ్ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ- హైదరాబాద్ స్పెషల్ డ్రైవ్'లో మ్యాన్‌హోళ్లలో తీసినకొద్దీ సిల్ట్ బయటపడుతోంది. శనివారం నాటికి సుమారు 2 లక్షల మ్యాన్ హోళ్లను శుభ్రపరిచినట్లు జలమండలి ప్రకటించింది. ఒక వైపు నిత్యం అందే ఫిర్యాదులను పరిష్కరించుకుంటూనే.. మరోవైపు స్పెషల్ డ్రైవ్ పనులు కొనసాగిస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు 2,561 కిలో మీటర్ల మేర 19,688 ప్రాంతాల్లో సీవరేజ్ పైపులైన్ మ్యాన్‌హోళ్లలో డీ-సిల్టింగ్ పనులు పూర్తి చేశారు. స్పెషల్ డ్రైవ్ పై ఫోకస్ పెట్టి క్రమంగా విధులు నిర్వర్తిస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బంది, అధికారులను ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ అభినందించారు. డాష్ బోర్డులో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఇందులో ఏవైనా సమస్యలుంటే ఐటీ విభాగం అధికారుల సాయం తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల నూతన సీవరేజ్ పైపులైన్ నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

## టమాటా పడిపోయే..




సాక్షి, సిటీబ్యూరో: టమాటా ధరలు దారుణంగా పడిపోయాయి. మునుపెన్నడూలేని రీతిలో ధరలు నేలచూపులు చూస్తున్నాయి. శివార్లలోని రైతులు ధరలు గిట్టుబాటు కాకపోవడంతో తెంపకుండా తోటల్లోనే వదిలేసేందుకు మొగ్గు చూపుతుండగా.. కొందరు మాత్రం మార్కెట్‌కు తెచ్చినా ధరలు రాక పోవడంతో రోడ్లపై పారబోస్తున్నారు. గతేడాది ఇదే సీజన్‌లో నగర మార్కెట్‌లో కిలో రూ. 15 ఉన్న టమాటా ప్రస్తుతం కిలో రూ. రూ.10కి పడిపోయింది. మార్కెట్లకు దిగుబడులు పోటెత్తడంతో సామాన్యులకు మాత్రం టమాటాలు అందుబాటులోకి వచ్చాయి. జంటనగరాల అవసరాలకు సరిపడా టమాటా పెరగడంతో ప్రస్తుతం నగరంలోని గుడిమల్కాపూర్, మోండా, బోయిన్‌పల్లి, మాదన్నపేట, ఎల్బీనగర్ మార్కెట్లలో టమాటా ధరలు తగ్గాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.3-8 ఉండగా రిటైల్ మార్కెట్‌లో ధర కిలో 7-10 పలుకుతోంది.

**డిమాండ్‌కు తగిన సరఫరా**

నగరానికి నిత్యం దాదాపు 100 నుంచి 120 లారీల టమాటా డిమాండ్ ఉంది. ప్రస్తుతం మార్కెట్‌లకు 150 లారీల మేర దిగుమతులు వస్తున్నాయి. దీంతో నగర డిమాండ్ కంటే 30 లారీల టమాటా ఎక్కువగా దిగుమతి అవడంతో ధరలు విపరీతంగా పడిపోయాయి. తెలంగాణ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌ల నుంచి రోజురోజుకూ దిగుమతులు పెరుగుతున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ జిల్లాల నుంచి రోజుకు 30 నుంచి 40 లారీలు వస్తుండగా, పొరుగు రాష్ట్రాల నుంచి మరో 90-120 లారీల మేరకు టమాటా దిగుమతి అవుతోంది. ఈ నెల చివరి వరకు దిగుమతులు ఇలాగే ఉంటాయని, ఫిబ్రవరి రెండో వారం నుంచి దిగుమతులు తగ్గుతాయని హోల్‌సేల్ వ్యాపారులు అంటున్నారు. దిగుమతులు తగ్గితే ధరలు పెరిగే అవకాశముంది.

# న్యూ ఫేస్!
## బల్దియాకు కొత్త రూపు

**శివార్లకు నయా సోకులు**
- నేటితో పురపాలికల గడువు ముగింపు
- వీటిలో ఇక 'ప్రత్యేక' పాలన
- జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి మారనున్న గ్రేటర్ ముఖచిత్రం




సాక్షి, సిటీబ్యూరో:

బహుశా.. వచ్చే ఏడాది గణతంత్ర దినోత్సవం నాటికి జీహెచ్ఎంసీ రెండు లేదా అంతకంటే ఎక్కువ కార్పొరేషన్లుగా ఏర్పాటు కావచ్చు. ప్రస్తుత పాలకమండలి గడువు వచ్చే 2026 ఫిబ్రవరి 10వ తేదీతో పూర్తి కానున్నందున, ఆలోగా జీహెచ్ఎంసీ నైసర్గిక స్వరూపం మారనుంది. ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) పరిధి వరకు ఉన్న ప్రాంతాన్ని మొత్తం గ్రేటర్ హైదరాబాద్‌లో కలపాలని ప్రభుత్వం భావిస్తున్నందున.. ఓఆర్ఆర్ పరిసరాల్లోని స్థానిక సంస్థలన్నీ జీహెచ్ఎంసీలో విలీనం కానున్నాయి. అవి విలీనమయ్యాక ఒకే ఒక మెగా కార్పొరేషన్ కంటే రెండు కానీ, అంతకంటే ఎక్కువ కార్పొరేషన్లుగా కానీ ఏర్పాటు చేయవచ్చని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయానికి అనుగుణంగా కార్పొరేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంతో సఖ్యతగా ఉంటున్న ఎంఐఎం అభిప్రాయాన్ని సైతం పరిగణనలోకి తీసుకొని కార్పొరేషన్ల సంఖ్య నిర్ణయించవచ్చనే వాదన వినిపిస్తోంది.

**పురపాలికల్లో 'స్పెషల్' పాలన**

ఓఆర్ఆర్ పరిసరాల్లోని 51 గ్రామ పంచాయతీలను వాటికి సమీపంలోని 13 మున్సిపాలిటీల్లో విలీనం చేసిన ప్రభుత్వం.. త్వరలోనే 27 పురపాలికలను (20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు) జీహెచ్ఎంసీలో కలపనుంది. వాటి పాలకమండళ్ల గడువు ఆదివారం ముగిసిపోతోంది. సోమవారం నుంచి వీటి పరిధిలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం కానుంది. ప్రత్యేకాధికారుల హయాంలో వాటిని జీహెచ్ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ మొదలు కానుంది. పురపాలికల గడువు ముగిశాక ఆరు నెలల్లోగా కొత్త పాలకమండళ్ల ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ, విలీన ప్రక్రియ ప్రారంభమైతే ఎన్నికల కోసం ఎవరైనా కోర్టులకు వెళ్లినా ఇబ్బందులుండవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**వివాదాలకు తావు లేకుండా..**

ఓఆర్ఆర్ వరకు కొత్తగా ఏర్పాటయ్యే కార్పొరేషన్లు నైసర్గికంగా, వనరులు, ఆదాయ పరంగా ఎలా ఉండాలి? తదితర అంశాలను అధ్యయనం చేయడానికి ప్రభుత్వ శాఖలతో పాటు పట్టణ ప్రణాళిక అంశాల్లో నైపుణ్యం, అనుభవం ఉన్న సంస్థల సహకారం తీసుకోనున్నట్లు సమాచారం. ఈ దిశగా ప్రభుత్వం ఇప్పటికే 'ఆస్కి'కి కొన్ని బాధ్యతలప్పగించినట్లు తెలుస్తోంది. కొత్త కార్పొరేషన్ల ఏర్పాటులో కార్పొరేషన్లు, నియోజకవర్గాలు, వార్డుల సరిహద్దుల్లో వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదిలా ఉండగా.. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా భవిష్యత్‌లో కొత్త నియోజకవర్గాలు కూడా ఏర్పాటు కానున్నందున ఆ అంశాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. లేని పక్షంలో కొత్త సమస్యలకు తావుంటుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

**ఇతర నగరాల్లోని పరిస్థితులు..**

మరోవైపు దేశంలోని ముంబై, ఢిల్లీ తదితర మహా నగరాల పరిస్థితులను, అక్కడి కార్పొరేషన్లు, వాటి పనితీరును కూడా పరిగణనలోకి తీసుకుని, తగిన అధ్యయనం చేసి హైదరాబాద్‌కు అనుగుణంగా ఇక్కడ కార్పొరేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి.

**జీహెచ్ఎంసీ చివరి పాలకమండలి**

మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీహెచ్) నుంచి గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)గా అవతరించాక ప్రస్తుతం 150 వార్డులున్నాయి. ఈ పాలకమండలి గడువు ముగిశాక, తదుపరి ఎన్నికలు కొత్త కార్పొరేషన్లలోనే జరగనున్నాయి. ఏర్పాటయ్యే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి గ్రేటర్ పరిధిలో మేయర్లు ఉంటారు. కొత్తగా ఏర్పాటు చేసే కార్పొరేషన్లలోని జనాభాకు అనుగుణంగా వార్డుల సంఖ్య ఉండనుంది. ప్రస్తుతమున్న వార్డుల్లో మార్పులు చేర్పులకు అవకాశముంది.

# ఆక్రమణలపై హైడ్రా కన్నెర్ర
## పోచారం మున్సిపాలిటీ పరిధిలో కూల్చివేతలు

- సుప్రభాత్ టౌన్‌షిప్, దివ్యానగర్‌లో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

పోచారం: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని దివ్యానగర్, సుప్రభాత్ టౌన్‌షిప్ వెంచర్లలోని అక్రమ నిర్మాణాలపై హైడ్రా కన్నెర్రజేసింది. కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో 300 మంది సిబ్బంది, పోలీసు బలగాలతో శనివారం కూల్చివేతలు చేపట్టింది. కాచవానిసింగారం పరిధిలోని 200 ఎకరాల్లో 2,200 ప్లాట్లతో దివ్యానగర్, మరో అయిదు కాలనీలను వెంచర్ డెవలపర్ నల్ల మల్లారెడ్డి అభివృద్ధి చేశారు. ఇక్కడ వెయ్యి మందికి పైగా సింగరేణి ఉద్యోగులు ప్లాట్లను కొనుగోలు చేశారు. ఒప్పందం ప్రకారం రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయలేదు. భద్రత పేరుతో 200 ఎకరాల విస్తీర్ణం చుట్టూ ప్రహరీ నిర్మించారు. రోడ్లు, డ్రైనేజీ కోసం వసూలు చేసిన డబ్బుతో 15 ఏళ్ల క్రితం రూ.10.50 కోట్లతో 4 కిలో మీటర్ల వరకు ప్రహరీ కట్టారు. ఇప్పటికీ అనేక చోట్ల రోడ్లు, డ్రైనేజీ వసతులు లేవు అని, ప్రజలను నియంత్రిస్తున్నారని స్థానికులు కొందరు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 23న హైడ్రా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీ జాగాలు, పార్కులు ఆక్రమించి వ్యక్తిగత వ్యవసాయానికి వినియోగిస్తున్నారనే అభియోగాలూ ఉన్నాయి. పదుల ఎకరాల్లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి కాంపౌండ్ వాల్ కట్టారని స్థానిక రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ధ్రువీకరించినట్లు సమాచారం. గేటెడ్ కమ్యూనిటీకి మాత్రమే కాంపౌండ్ వాల్ కట్టుకోవచ్చని, మల్లారెడ్డి అభివృద్ధి చేసిన లేఅవుట్ గేటెడ్ కమ్యూనిటీ కానందున హైడ్రా కూల్చివేతలు చేపట్టింది.


దివ్యానగర్‌లో కూల్చివేతలు

**హర్షం వ్యక్తం చేసిన స్థానికులు..**

రోడ్లపై నిర్మించిన గేట్లు, గోడలు, వెంచర్ చుట్టూ ఉన్న ప్రహరీని హైడ్రా కూల్చివేయడంతో పొరుగు ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏకశిలానగర్ లేఅవుట్, వెంకటాద్రి టౌన్‌షిప్, సుప్రభాత్ టౌన్‌షిప్, మహేశ్వరి కాలనీ, కాచవానిసింగారం, పీర్జాదిగూడ, బాలాజీనగర్ కాలనీలకు మార్గం సుగమమైందని చెబుతున్నారు.

**కోర్టు ఆదేశాలు పట్టించుకోలేదు**

దివ్యానగర్ కాలనీ వాసుల భద్రత కోసం నిర్మించిన గోడలు, గేట్లను హైడ్రా కూల్చివేయడాన్ని వెంచర్ డెవలపర్ నల్ల మల్లారెడ్డి తీవ్రంగా ఖండించారు. హైకోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు.

# అదుపు తప్పి.. వేగంగా ఢీకొట్టి..
## ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నవారిపై నుంచి దూసుకెళ్లిన కారు

- గుర్తు తెలియని వ్యక్తి మృతి.. మరో ఇద్దరికి గాయాలు
- బంజారాహిల్స్‌లో శనివారం తెల్లవారుజామున ఘటన



బంజారాహిల్స్: ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్నవారి నుంచి కారు దూసుకెళ్లడంతో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బంజారాహిల్స్‌లో చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన ఆభరణాల వ్యాపారి తనయుడు సాధుల హర్షవర్ధన్ మరో ఐదుగురు స్నేహితులతో కలిసి బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-13లోని సాయి మెన్షన్ అపార్ట్‌మెంట్‌లో అద్దెకు ఉంటున్నాడు. ఆయనే నిర్మాతగా, హీరోగా అర్జున్ దేవర అనే సినిమాలో నటిస్తున్నాడు. శుక్రవారం రాత్రి హర్షవర్ధన్ తన స్నేహితులు సాంకేత్ శ్రీనివాస్ అలియాస్ తేజ, మాడే కార్తీక్, వంశీ, రాకేష్, నేతతో కలిసి ఉంటున్నాడు. హర్షవర్ధన్, వంశీలు గదిలో మద్యం తాగుతుండగా.. రాకేష్ అనే మరో స్నేహితుడు జూబ్లీహిల్స్‌లోని ఎయిర్‌లైవ్ పబ్‌లో ఉండగా తనను పికప్ చేసుకోవడానికి రావాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. తాను మద్యం మత్తులో ఉన్నానని, మీరు వెళ్లి తీసుకురావాలంటూ కార్తీక్‌కు చెప్పి కారు తాళం చెవి ఇచ్చాడు. అర్ధరాత్రి 1.04 గంటల ప్రాంతంలో కార్తీక్.. థార్ కారు నడుపుతుండగా తేజ పక్కన కూర్చొని రాకేష్‌ను తీసుకురావడానికి జూబ్లీహిల్స్ పబ్‌కు బయలుదేరారు. బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 నుంచి అగ్రసేన్ చౌరస్తా మీదుగా అతి వేగంగా కేబీఆర్ పార్కు వైపు వెళ్తుండగా బసవతారకం కేన్సర్ హాస్పిటల్ సమీపంలో కారు అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొట్టి అక్కడ నిద్రిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి పైకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన తెల్లవారుజామున 1.15 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఘటన వివరాలను ప్రత్యక్ష సాక్షుల ద్వారా అడిగి తెలుసుకున్నారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

**కారు డోర్ తీసి పరారైన యువకులు..**

కారు బోల్తా పడిన తర్వాత డోర్ నుంచి ఇద్దరు యువకులు బయటకు వచ్చి పరుగులు తీశారని అక్కడ ఉన్నవారు తెలిపారు. రంగంలోకి దిగిన పోలీసులు కారు నెంబర్ ఆధారంగా ఫోన్ నెంబర్ సేకరించి సీసీ ఫుటేజీల ఆధారంగా కారు ఎక్కడి నుంచి వచ్చిందో గుర్తించారు. ప్రమాదం జరిగిన తర్వాత భయంతో కార్తీక్, తేజ పారిపోతూ గదిలో ఉన్న హర్షవర్ధన్, వంశీ, నేతను కూడా పారిపోవాలని చెప్పడంతో అంతా ఉడాయించారు. అయితే తెల్లవారుజామున ఇంటికి వచ్చిన రాకేష్‌కు గదికి తాళం వేసి ఉండడం కనిపించింది. పోలీసులు రాకేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా ఈ మిస్టరీ వీడింది. పరారీలో ఉన్న కార్తీక్, తేజ, హర్షవర్ధన్, వంశీ, నేత తదితరులను అదుపులోకి తీసుకున్నారు. కారు నడిపిన కార్తీక్ పక్కనే కూర్చొన్న తేజలపై బీఎన్ఎస్ సెక్షన్ 105 (2), 337, ఎంవీ యాక్ట్ 184, 187, పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కారు ఇచ్చిన హర్షవర్ధన్‌పై కూడా కేసు నమోదైంది. కారు నడుపుతున్న కార్తీక్‌కు డ్రైవింగ్ లైసెన్స్ లేదని గుర్తించారు. కార్తీక్, తేజకు డ్రంకన్ డ్రైవ్ నిర్వహించగా వారు మద్యం తాగలేదని తేలింది. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీణా రామన్ బుక్‌రీడింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న హెచ్ఎల్ఎఫ్ ఆర్గనైజర్ కిన్నెరా మూర్తి, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తదితరులు



# కమ్మని సాహిత్యం.. కళలతో సాంగత్యం

- రెండో రోజూ సందడిగా లిటరరీ ఫెస్టివల్
- భారీ సంఖ్యలో హాజరైన సందర్శకులు

సాక్షి, సిటీబ్యూరో, చందానగర్: నాలెడ్జి సిటీలోని 'సత్వ'లో నిర్వహిస్తున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ (హెచ్ఎల్ఎఫ్) ఉల్లాసభరితంగా సాగుతోంది. సాహితీవేత్తలు, కళాకారులు, భిన్న రంగాల ప్రముఖుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. వాట్ ఆన్ ఎర్త్ పేరిట పర్యావరణ హిత కార్టూన్స్‌తో క్యూ (సీఈఈడబ్ల్యూ) సంస్థ ఏర్పాటు చేసిన కార్టూన్ల ప్రదర్శన ఆకట్టుకుంది. హెచ్ఎల్ఎఫ్‌లో నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శన అందరినీ అలరిస్తోంది. పురాతన రాతి సంపదను భావి తరాలకు అందించాలనే సంకల్పంతో 'సేవ్ రాక్స్' ప్రాధాన్యాన్ని గుర్తించేలా చిత్రాలు గీసే పోటీలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక కళా ప్రదర్శనల్లో భాగంగా డ్రమ్స్ కళాకారుడు సాయికుమార్ తన సంగీతంతో అలరించారు. నగరం గురించి ఆశ్చర్యపరిచే చారిత్రక విశేషాలతో సాగిన స్టోరీ టెల్లింగ్, నన్హాసుక్కడ్ ఎ చైల్డ్స్ ప్లే తదితర కార్యక్రమాలతో లిటరరీ ఫెస్ట్ సందడిగా మారింది.

**రాజ్యాంగమే రక్షణ కవచం...**

'బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత రాజ్యాంగం ప్రాధాన్యం మరింతగా మనకు అర్థమైంది. రాజ్యాంగాన్ని మనం విస్మరించకూడదు' అంటూ ఉద్బోధించారు సామాజిక వేత్త అరుణారాయ్. . ఉదయం పూట నిర్వహించిన సెషన్స్‌లో ప్రముఖ సామాజిక వేత్త అరుణ్‌రాయ్ ఫెమినిజంపై తాను రాసిన 'ది పర్సనల్ ఈజ్ పొలిటికల్' అనే పుస్తకంలో అంశాల గురించి సి.రామమనోహర్ రెడ్డితో జరిపిన సంభాషణలో అనేక కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఎవరిని.. ఎవరు పెళ్లి చేసుకోవాలో కూడా రాజ్యమే నిర్ణయిస్తోందని.. అలాంటి దేశ పరిస్థితుల మధ్య బ్రతుకుతున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మరో సెషన్‌లో ప్రముఖ వైద్యులు, డబ్ల్యుహెచ్ఓ చీఫ్ సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్ మాట్లాడుతూ ఏఎంఆర్ (యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్) సహా ఆరోగ్య సాధన విషయంలో ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల్ని ప్రస్తావించారు.


చిత్రాలు గీస్తున్న చిన్నారులు


పుస్తక ప్రదర్శన

# కాల్పులు బిహార్ ముఠా పనే..

- హాజీపూర్ జిల్లా వాసులుగా గుర్తింపు
- అక్కడి నుంచే బైక్ తెచ్చినట్లు నిర్ధారణ
- గాలింపు కొనసాగిస్తున్న నగర పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: కర్నాటకలోని బీదర్, నగరంలోని అఫ్జల్‌గంజ్‌లో తుపాకులతో విరుచుకుపడిన ఇద్దరు దుండగులు బిహార్‌కు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. మహాత్మాగాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) పార్కింగ్ నుంచి స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనం ఈ కోణంలో కీలక ఆధారాలను అందించింది. ఆ ఇద్దరి వివరాలు సేకరించిన పోలీసులు ఆచూకీ కనిపెట్టడానికి ముమ్మరంగా గాలిస్తున్నారు. బీహార్‌లోని హాజీపూర్ జిల్లాకు చెందిన దుండగులు దాదాపు నెల రోజుల క్రితమే తెలంగాణ, కర్ణాటకల్లో పంజా విసరాలని భావించింది. దీంతో అక్కడే ఓ తుపాకీ, ఆరు తూటాలు ఖరీదు చేసుకుని బయలుదేరడానికి సిద్ధమైంది. దీనికోసం తమ స్నేహితుడి ద్వారా అతడి పరిచయస్తుడి ద్విచక్ర వాహనం తీసుకుంది. దాని పైనే బయలుదేరిన ద్వయం దాదాపు 1500 కిలోమీటర్లు ప్రయాణించి నగరానికి చేరుకుంది. ఇక్కడే ఓ లాడ్జిలో బస చేసి బీదర్‌లో రెక్కీ నిర్వహించి మరీ పంజా విసిరింది. ఆపై నగదుతో సహా నగరానికి చేరుకున్న ఇరువురూ బైక్‌ను ఎంజీబీఎస్ పార్కింగ్‌లో పెట్టింది. దాని నిర్వాహకులకు తప్పు పేరు, ఫోన్ నెంబర్ చెప్పింది. ఆపై ఆటోలో బయలుదేరి అఫ్జల్‌గంజ్‌లోని రోషన్ ట్రావెల్స్ వద్దకు వచ్చింది. ప్రైవేట్ బస్సులో రాయ్‌పూర్‌కు టిక్కెట్ బుక్ చేసుకున్నా తదనంతర పరిణామాలతో మేనేజర్ జహంగీర్‌ను కాల్చడం, పారిపోవడం జరిగిపోయాయి. ఈ హత్యాయత్నం తర్వాత కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించిన నగర పోలీసులు నిందితుల రాకపోకలు కనిపెట్టడానికి వందల సంఖ్యలో సీసీ కెమెరాలను జల్లెడపట్టారు. దీంతో ఎంజీబీఎస్ పార్కింగ్‌లో ఉన్న దుండగులు వినియోగించిన వాహనం పోలీసులకు లభించింది. దీని రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా ముందుకు వెళ్లిన పోలీసులు హాజీపూర్ జిల్లాకు చెందిన యజమాని, దాన్ని దుండగులకు అప్పగించిన స్నేహితుడిని గుర్తించారు. వీరిద్దరికీ దుండగులు వాహనం ఎందుకు అడుగుతున్నారో తెలియని, కేవలం తమకు ఉన్న పరిచయం నేపథ్యంలో కొన్నాళ్ల వినియోగించుకోవడానికి బైక్ కావాలి అంటే ఇచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇప్పటికీ పరారీలోనే ఉన్న ఇరువురు నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

# పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువతి

- కార్డియాలజిస్ట్‌నని నమ్మించిన కిలేడీ
- రోగికి వైద్యం చేయాలని రూ.4.97 లక్షలు వసూలు
- సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- ఏపీకి చెందిన యువతితో సహా మరొక నిందితుడు అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: మ్యాట్రిమోనీలో పరిచయమైన ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిట్టనిలువునా మోసగించిందో కిలేడీ. ఈ కేసులో తిరుపతికి చెందిన తమ్మ హేమమణి అలియాస్ ప్రీతి రెడ్డి..ఆమెకు సహకరించిన కొండారెడ్డిలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 45 ఏళ్ల బాధితుడికి గతేడాది మేలో విడాకుల మ్యాట్రిమోనీ యాప్ ద్వారా హేమమణితో పరిచయం ఏర్పడింది. తాను ఎంబీబీఎస్, ఎండీ అర్హతలు కలిగిన కార్డియాలజిస్ట్ అని పరిచయం చేసుకుంది. విడాకులు తీసుకొని భర్తతో దూరంగా ఉన్నట్లు పేర్కొంది. దీంతో తక్కువ కాలంలోనే పలు సామాజిక మాధ్యమాలలో ఇరువురూ సన్నిహితులుగా మారిపోయారు. కొంతకాలం తర్వాత నిందితురాలు వివాహ ప్రతిపాదన తీసుకొచ్చింది. దీంతో బాధితుడు అంగీకరించారు. కొన్ని రోజుల తర్వాత ఆమె రోగికి చికిత్స చేయడానికి నిధులు అవసరమని పేర్కొంటూ బాధితుడి నుంచి సొమ్ము వసూలు చేసింది. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు. తర్వాత ఆమె బాధితుడిని మళ్లీ సంప్రదించి తన తల్లి చనిపోయిందని అత్యవసరంగా ఇంకొంత సొమ్ము అవసరముందని చెప్పింది. పలు లావాదేవీల్లో మొత్తం రూ.4.97 లక్షలు వసూలు చేసింది. ఆ తర్వాత ఆమె నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న ఇన్‌స్పెక్టర్ మధులత నేతృత్వంలోని బృందం ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు.

## గాడియం స్కూల్‌లో 'రన్ ఫర్ రోడ్ సేఫ్టీ'



సాక్షి, సిటీబ్యూరో: కొల్లూరులోని గాడియం స్కూల్‌లో శనివారం నిర్వహించిన 'రన్ ఫర్ రోడ్ సేఫ్టీ' కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. పాఠశాల 10వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకల్లో సంగారెడ్డి ఎస్పీ రూపేష్ పాల్గొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది దాదాపు వెయ్యి మంది 2కే, 5కే, 10కే రన్‌లో పాల్గొన్నారు. ఫిట్‌నెస్, సామాజిక బాధ్యతను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్పీ రూపేష్ అన్నారు. స్కూల్ ఫౌండర్, డైరెక్టర్ కీర్తి రెడ్డి మాట్లాడుతూ..రహదారి భద్రత అంటే నియమాలను పాటించడం మాత్రమే కాదని, శ్రద్ధ, బాధ్యతకు ప్రతిరూపమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే రహదారి భద్రతపై అవగాహన పెరగాలన్నారు.

# రూ.21 లక్షల రీఫండ్

- ఐదు సైబర్ కేసుల్లో సొమ్ము రికవరీ
- బాధితులకు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: ఐదు సైబర్ నేరాల కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న రూ.21.91 లక్షల సొమ్మును హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేసి బాధితులకు తిరిగి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆస్ట్రేలియాలో ఉద్యోగం ఇస్తామని నమ్మించి 54 ఏళ్ల బాధితుడి నుంచి రూ.9.96 లక్షల సొమ్ము కాజేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సత్వరమే స్పందించి బ్యాంక్‌లకు నోటీసులు అందజేసి రూ.1.51 లక్షల సొమ్మును ఫ్రీజ్ చేయించారు. రెండో కేసులో..స్టాక్ ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరిట 40 ఏళ్ల డాక్టర్‌ను రూ.44 లక్షలు మోసగించారు. ఈ కేసులో బాధితుడికి రూ.4.50 లక్షలు రీఫండ్ అందింది. మూడో కేసులో..ఫెడెక్స్ కొరియర్ పేరుతో 31 ఏళ్ల బాధితురాలిని భయభ్రాంతులకు గురి చేసి, రూ.19.94 లక్షలు చీట్ చేసిన కేసులో..రూ.10.10 లక్షలు బాధితురాలికి అందజేశారు. నాలుగో కేసులో.. మనీలాండరింగ్ నెపంతో 76 ఏళ్ల గృహిణిని బెదిరించిన కేటుగాళ్లు ఆమె నుంచి రూ.50 లక్షలు కొట్టేశారు. ఈ కేసులో బాధితురాలికి రూ.2.53 లక్షలు తిరిగి అప్పగించారు. ఇక, ఐదో కేసులో..అధిక లాభాలు ఆశ చూపించి 40 ఏళ్ల బాధితుడి నుంచి రూ.48.17 లక్షలు మోసం చేశారు. ఈ కేసులో బాధితుడికి రూ.3.26 లక్షలు రీఫండ్ అందింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఆయా బాధితులకు సైబర్ క్రైమ్ పోలీసులు సొమ్మును రీఫండ్ చేశారు.



ఘటనాస్థలిలో సీసీఎస్ పోలీసులు

# దొరకని ఆనవాళ్లు

**యువతి హత్య కేసు దర్యాప్తు ముమ్మరం**

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధి మునీరాబాద్ సమీపంలో ఓఆర్‌ఆర్ కల్వర్టు కింద యువతిని దారుణంగా హతమార్చిన ఘటన బయటపడి 24 గంటలు దాటినా ఎలాంటి ఆధారాలు, ఆనవాళ్లు పోలీసులకు లభించలేదు. నిందితులు పోలీసులకు క్లూస్ దొరక్కుండా ఉండేందుకు యువతి ఒంటిపై పెట్రోల్ పోసి నిప్పంటించారు. ముందుగానే పథకం రూపొందించుకుని ఓఆర్‌ఆర్ కల్వర్టు కింద..నిర్మానుష్య ప్రదేశం, సీసీ కెమెరాలు లేని ప్రాంతంగా భావించి ఘటనకు పాల్పడినట్లు భావిస్తున్నారు. హత్యకు గురైన యువతి ఒంటిపై ఉన్న నగలు (పూసలదండ, జడ పిన్నీసులు) ఏపీలోని శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మహిళలు ఎక్కువగా ఉపయోగిస్తారని సమాచారం. దీంతో పోలీసులు ఏపీలోని మిస్సింగ్ కేసులను సైతం పరిశీలనలోకి తీసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా హత్య ఘటన పోలీసులకు పెను సవాల్‌గా మారింది. నిందితుడు ఎలాంటి ఆనవాళ్లు దొరకకుండా చాకచక్యంగా వ్యవహరించి హత్యకు పాల్పడి పరారయ్యాడు. దీంతో సీసీఎస్ పోలీసులు, ఎస్‌ఓటీ, స్థానిక పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర పోలీస్‌స్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసులను పరిశీలిస్తూ దర్యాప్తు చేస్తున్నారు. శనివారం ఉదయం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డిలు సంఘటన స్థలిని పరిశీలించారు.

# 6,093 జాబితాలో 2,918 లబ్ధిదారులు

- తిరస్కరణకు గురైన 4,075 మంది
- ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో పూర్తయిన జాబితా
- ఐదురోజులపాటు సర్వే చేసిన బృందాలు
- పెద్ద ఎత్తున దరఖాస్తుల అనర్హత


రేషన్‌కార్డు లబ్ధిదారుల కోసం సర్వే చేస్తున్న అధికార బృందాలు

**బంజారాహిల్స్:** రేషన్‌కార్డు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో అధికార యంత్రాంగం అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించింది. ఈనెల 16 నుంచి 20 వరకు అధికారిక బృందాలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఈ సర్వే నిర్వహించాయి. ఈ సర్వేలో లబ్ధిదారులను గుర్తించిన అధికారులు వారి జాబితాను రూపొందించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి అందజేశారు.

- పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్, సోమాజీగూడ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ప్రభుత్వ అందజేసిన జాబితాలోని 6,093 మంది అర్హులను ఐదురోజులపాటు 39 బృందాలు సర్వే చేశాయి.
- ఈ సర్వేలో 6,093మందిలో కేవలం 2,918 మందిని మాత్రమే అర్హులైన లబ్ధిదారులుగా గుర్తించారు. వీరందరి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి పంపించారు.
- ఒక్కో డివిజన్ నుంచి ఎంత మంది అర్హులు ఉన్నారో ఆ వివరాలను కూడా నమోదు చేసుకున్నారు.
- ఇప్పటికే ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తికాగా జాబితాను కూడా సిద్ధం చేశారు.
- ప్రజాపాలన, సామాజిక, ఆర్థిక సర్వే కార్యక్రమాల ద్వారా దరఖాస్తుదారులకు సంబంధించి 360 డిగ్రీల వడబోత చేపట్టారు.
- సర్వే అధికారులు ఇంటింటికీ తిరిగి సొంత ఇల్లు, భూమి, ఇతర ఆస్తులపై ఆరా తీశారు.
- ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో 6,093 మందితో జాబితా రూపొందించగా వడబోత అనంతరం 2,918 మందిని అర్హులుగా తేల్చి 4,075 మందిని అనర్హులుగా గుర్తించారు.
- త్వరలో నిర్వహించే సభల్లో ప్రజా ప్రతినిధులు కొంత మందికి కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు ఎక్కడెక్కడ సభలు నిర్వహించేది అధికారులు త్వరలో వెల్లడించనున్నారు.
- ఇందు కోసం ఒక్కో నియోజకవర్గం నుంచి 150 మంది చొప్పున సభల్లో కార్డులు ఇచ్చేందుకు జాబితాలు తయారుచేసి అధికారులకు పంపించడం జరిగింది.
- జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి 150 మంది, ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 150 మందిని, సనత్‌నగర్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల నుంచి 60 మంది చొప్పున బస్తీ సభల్లో పంపిణీ చేసే కార్డుదారుల వివరాలను అందజేశారు.

## పీపుల్స్ ప్లాజా వేదికగా భారతమాత మహా హారతి

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారతమాత విగ్రహ ఊరేగింపు


ర్యాలీలో కిషన్‌రెడ్డి తదితరులు

**ఖైరతాబాద్:** పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించే భారత మాత హారతి కార్యక్రమం సందర్భంగా భారతమాత విగ్రహ ఊరేగింపు శనివారం సాయంత్రం అంబేడ్కర్ విగ్రహం నుంచి ప్రారంభమై పీపుల్స్ ప్లాజా వరకు సాగింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తూ వస్తున్న భారత మాత హారతి కార్యక్రమం ఆదివారం సాయంత్రం పీపుల్స్ ప్లాజా వేదికగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భారతమాత విగ్రహ ఊరేగింపు కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భారతమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా హారతి నిర్వాహణ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. భారతమాత అంటే రాజ్యాంగ స్వరూపమేనని భారత రాజ్యాంగం వేర్వేరు కాదన్నారు. ఆదివారం నుంచి ఈ యాత్రను ప్రారంభించి వచ్చే సంవత్సరం 2026, జనవరి 26 వరకు నిర్వహిస్తామని తెలిపారు. 140 కోట్ల ప్రజల్లో దేశ అభివృద్ధి కోసం పాటుపడే ప్రతి ఒక్కరికి మహా హారతి కార్యక్రమం అంకితమన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్‌తో పాటు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

## మంచి పాలనకు ఒకే ఒక్క ఆయుధం ఓటు

**లిబర్టీ:** ఓటును ఆయుధంగా మలుచుకుని మంచి పాలకులను ఎన్నుకోవాలని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు కోరారు. మంచి ప్రభుత్వాలు ఏర్పడితే పాలకులు ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తారని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. సమర్థవంతమైన, నీతివంతమైన నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ సమావేశంలో పి.వి.శ్రీనివాస్‌రావు, దామోదర్, రేవంత్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జవ్వాది అనిల్‌కు వీరతెలంగాణ అవార్డు


అవార్డు అందుకుంటున్న జవ్వాది

**బంజారాహిల్స్:** వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతోపాటు సంస్థ లక్ష్యాలను ఛేదించినందుకు ఎస్‌బీఐ లైఫ్ సీనియర్ అడ్వయిజర్ జవ్వాది అనిల్‌కుమార్‌ను వీర తెలంగాణ అవార్డు వరించింది. బంజారాహిల్స్‌కు చెందిన జవ్వాది అనిల్‌కుమార్‌కు నగరంలో శనివారం జరిగిన ఎస్‌బీఐ లైఫ్ కార్యక్రమంలో సంస్థ జోనల్ డైరెక్టర్ రాజీవ్ శ్రీవాస్తవ, తెలంగాణ రీజినల్ డైరెక్టర్ అభిషేక్ ముజేందర్‌లు ఈ అవార్డును అందజేశారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, అవార్డు రావడం ఆనందంగా ఉందని అన్నారు.

## కష్టపడి పనిచేసే వారికే పదవులు

**లిబర్టీ:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ను టీపీసీసీ కార్యదర్శి ఎలిమినేటి అమరేందర్‌రెడ్డి కలిశారు. పార్టీలోనూ ప్రభుత్వ పదవుల్లోనూ పార్టీ కోసం నిరంతరంగా శ్రమించిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. శనివారం ఆయనను కలిసి పార్టీ పరిస్థితి వివరించడంతోపాటు నామినేటెడ్ పదవుల విషయంలో పార్టీ కోసం పని చేస్తున్న వారికి చోటు కల్పించే విషయంపై వివరించారు. పార్టీ కోసం పని చేస్తున్న వారికి పార్టీ పదవుల్లోనూ ప్రభుత్వ పదవుల్లోనూ తగిన ప్రాధాన్యత ఉంటుందని పార్టీ కోసం పని చేసిన వారిని విస్మరించే ప్రసక్తే లేదని అమరేందర్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్షుడు భరోసా ఇచ్చారు.

## దేశాభివృద్ధికి అంబేడ్కర్ కృషి చిరస్మరణీయం

**శ్రీనగర్‌కాలనీ:** బడుగు బలహీన వర్గాల హక్కులు, దేశాభివృద్ధి కోసం భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం నాగార్జున నగర్‌కాలనీలోని శారదా మహిళా కళాశాలలో శ్రీనగర్‌కాలనీ బీజేపీ అధ్యక్షురాలు గారపాటి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు, రాజ్యాంగం పట్ల బీజేపీ నిబద్ధత అనే అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ ప్రకాష్‌రెడ్డి మా ట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి విద్యార్థి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంబాల గంగరాజు, అట్లూరి రామకృష్ణ, శాంతికుమార్, నరేందర్ యాదవ్, శ్రీనివాస్, ఉమేష్ పాల్గొన్నారు.

## మెట్రోలో బ్యాగ్ చోరీ

**వెంగళరావునగర్:** మెట్రోలో అమీర్‌పేటకు వచ్చిన యువకుడి బ్యాగ్‌ను చోరీ చేసి అందులో నగదును కాజేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం... విజయనగరం ప్రాంతానికి చెందిన జి.సురేందర్ నగరంలోని కూకట్‌పల్లిలో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 24న తన గ్రామం నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. అక్కడ మెట్రో ఎక్కి మైత్రీవనంలో దిగాడు. అనంతరం చూసుకోగా తన బ్యాగ్ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. దుండగులు బ్యాగ్‌లోని ఏటీఎం కార్డులను వినియోగించి రూ.20 వేల వరకు నగదు తీసుకున్నట్టు మెసేజ్‌ల ద్వారా తెలుసుకున్నాడు. దీంతో బాధితుడు పోలీసుకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఎస్సీ వర్గీకరణకు సంపూర్ణ మద్దతు

**పంజగుట్ట:** ఎస్సీ వర్గీకరణకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలంగాణ అడ్వొకేట్స్ జేఏసీ అధ్యక్షుడు కొమ్ము ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కొమ్ము ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి హైకోర్టు సీనియర్ న్యాయవాదులు వి.రఘునాథ్, జి.శారదాగౌడ్, ఎర్ర జగన్, ప్రభుత్వ ప్లీడర్, బార్ కౌన్సిల్ సభ్యులు సునీల్ కుమార్ గౌడ్‌లు మాట్లాడుతూ 30 సంవత్సరాల పోరాటానికి సుప్రీంకోర్టు మంచి తీర్పు ఇచ్చిందన్నారు. తీర్పు రాగానే ముఖ్యమంత్రి స్పందించిన తీరు కూడా ఎంతో బాగుందని కానీ అమలులో ఆలస్యం కారణంగా అన్యాయం జరుగుతుందన్నారు.

## క్లినికల్ కన్సల్టేషన్ స్కిల్స్‌పై వర్క్‌షాపు


వర్క్‌షాప్‌కు హాజరైన ప్రొఫెసర్ రూత్ ఎడ్వర్డ్స్ తదితరులు

**బంజారాహిల్స్:** కామన్వెల్త్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (సీపీఏ), ఇండియన్ ఫార్మా స్యూటికల్స్ అసోసియేషన్ (ఐపీఏ) సంయుక్తంగా శనివారం బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–3లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ ఫార్మసీ కళాశాలలో 'క్లినికల్ కన్సల్టేషన్ స్కిల్స్' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. దీనికి ఔషధ దుకాణాలు నడుపుతున్న ఫార్మసిస్ట్‌తో పాటు ఫార్మసీ విద్యార్థులు, అధ్యాపకులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌ను ఇండియన్ ఫార్మా స్యూటికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ ప్రారంభించగా, యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి నలుగురు రిసోర్స్ పర్సన్లు, కామన్వెల్త్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ నుంచి ప్రొఫెసర్ రూత్ ఎడ్వర్డ్స్, బెత్‌వార్డ్, విక్టోరియా రట్టర్, రేమండ్ అండర్సన్ హాజరయ్యారు. విద్యార్థులు, కమ్యూనిటీ ఫార్మసిస్టులు రోగులతో ఏవిధంగా సంప్రదింపులు జరపాలనే అంశంపై శిక్షణ కొనసాగింది. ఈ కార్యక్రమంలో సుల్తాన్ ఉల్–ఉలూమ్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జాఫర్ జావీద్, ఐపీఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాశంకర్, సీడీఎస్‌సీఓ అదనపు డ్రగ్ కంట్రోలర్ డాక్టర్ వినయ్‌కుమార్ గుప్తా, హాస్పిటల్ ఫార్మసీ డివిజన్–ఐపీఏ చైర్మన్ డాక్టర్ ఆడెపు రమేష్, క్లినికల్ ఫార్మసీ డివిజన్–ఐపీఏ చైర్మన్ రాజ్ వైద్య, డాక్టర్ సుమలత, భరత్ వికాస్, ప్రిన్సిపాల్ అనుపమ కోనేరు తదితరులు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ భారతీయ విద్యా భవన్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ఊర్జా ఫెస్టివ్ ఫీస్టా పేరిట శనివారం నిర్వహించిన నృత్య, నాటక ప్రదర్శనల సమ్మేళనం ఆకట్టుకుంది. కార్యక్రమానికి ప్రముఖ ఆస్ట్రో వాస్తు కన్సల్టెంట్ తమిళనాడు ప్రభుత్వ పేపర్ బోర్డు ఇండస్ట్రీస్ సలహాదారు బందా కనకరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులు ఉత్సవాల చారిత్రక నేపథ్యాన్ని ప్రదర్శించారు. ఈ వేడుకల సారాంశాన్ని సూచించే నృత్యం, శ్రావ్యమైన పాటల ప్రదర్శన అబ్బురపరిచింది.

## జాగ్రత్తలు తీసుకోకుండా బండరాయి పగలకొట్టే యత్నం

### పనులను అడ్డుకున్న అధికారులు


బండరాయిని పగలకొడుతున్న వ్యక్తులు

**ఫిలింనగర్:** జూబ్లీహిల్స్ రోడ్ నెం.46లోని అంబేడ్కర్‌నగర్ బస్తీలో ఓ భారీ బండరాయిని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, అనుమతులు లేకుండా నిబంధనలు ఉల్లంఘించి పగలగొడుతుండగా ఫిర్యాదులు అందుకున్న షేక్‌పేట రెవెన్యూ అధికారులు పనులను నిలిపివేశారు. శనివారం ఉదయం స్థానికంగా కొంత మంది ఈ బండరాయిని ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే పగలగొట్టేందుకు రంగంలోకి దిగారు. రోడ్డు కోసం ఈ బండరాయిని తొలగిస్తున్నట్లుగా బస్తీవాసులను మభ్యపెట్టారు. అయితే ఈ బండరాయి ఉన్న చోట ఎలాంటి రోడ్డు లేదని పగలగొట్టే క్రమంలో పొరపాటున రాళ్లు జారిపడితే సుమారు 20 ఇళ్లు ధ్వంసం అవుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బండను పగలగొట్టి అడ్డదారుల్లో అమ్ముకోవడానికి యత్నిస్తున్నారని వీటిని ఆపాలని షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డికి కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకొని పనులు నిలిపివేశారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కూడా నిర్ణయించారు.

## సీఎం హామీని నిలబెట్టుకోవాలి

**పంజగుట్ట:** సీఎం ఇచ్చినమాట మేరకు వెంటనే వర్గీకరణ చేసి మాట నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ అధ్యక్షతన రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు వెంటనే వర్గీకరణ చేయకపోవడం వల్ల ఇటీవల జరిగిన నియామకాల్లో మాదిగ, ఉపకులాలు ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 7వ తేదీన చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో లక్ష డప్పులు వెయ్యి గొంతులు నిర్వహిద్దామని, ప్రతి మాదిగ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## మహిళా సాధికారతకు తోడ్పాటునందిస్తాం


ఉమెన్ మెగా కాన్‌క్లేవ్‌కు హాజరైన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

**బంజారాహిల్స్:** మహిళా సాధికారతకు మహిళా కమిషన్ ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని తెలంగాణ ప్రభుత్వ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. వైశ్య బిజినెస్ నెట్‌వర్క్ (వీబీఎన్)కు చెందిన వీబీఎన్ జేడ్ చాప్టర్ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం బంజారాహిల్స్‌లోని పార్క్ హయత్ హోటల్‌లో 'ఉమన్ మెగా కాన్‌క్లేవ్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విభిన్న వృత్తి నేపథ్యాల నుంచి 100 మందికి పైగా మహిళలు ఒకచోట చేరి వ్యాపార రంగంలో మహిళల పరస్పర సహకారం, మహిళా సాధికారతను పెంపొందించడానికి కావలసిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమానికి నేరెళ్ల శారద హాజరై మాట్లాడుతూ మహిళలకు మద్దతు ఇవ్వడంలో మహిళా కమిషన్ ఎప్పుడూ వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. వీబీఎస్ వ్యవస్థాపకుడు ఎమ్మడి శివకుమార్ మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన వీబీఎస్ నగరంలో ఐదు చాప్టర్‌లు కలిగి ఉందన్నారు. వీబీఎన్ జేడ్ చాప్టర్ అధ్యక్షుడు శంకర్ మొగుడంపల్లి మాట్లాడుతూ మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి తాము మహిళా మెగా కాన్‌క్లేవ్‌ను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి, సురానా గోల్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినీతా సురానా, అపెక్స్ చైర్మన్ అరుణ్ బిజ్జల, వీబీఎన్ జేడ్ కార్యదర్శి శ్రీనివాస్ కొత్తపల్లి, కోశాధికారి అమృత కొణిజేటి తదితరులు పాల్గొన్నారు.

## నేడు సీడీఎస్‌లో జాతీయ సదస్సు

**రహమత్‌నగర్:** రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లోని సెంటర్‌ఫర్ దళిత్ స్టడీస్ (సీడీఎస్)లో భారత రాజ్యాంగ సామాజిక, ఆర్థిక న్యాయం సాధనలను సమీక్షించడం అనే అంశంపై ఆదివారం జాతీయ సదస్సు ఏర్పాటు చేయడం జరిగిందని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లేపల్లి లక్ష్మయ్య తెలిపారు. ఈ సమావేశంలో రాజ్యాంగ ద్వారా సామాజిక, ఆర్థిక న్యాయాన్ని సాధించడంలో సాధించిన పురోగతిని విశ్లేషించడం జరుగుతుందన్నారు. ఇందులో ముఖ్య వక్తలుగా భారత సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, యూజీసీ, ఐసీఎస్ఎస్ఆర్ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ సుఖదేవ్ థోరట్, ప్రొఫెసర్ హరగోపాల్, మాజీ ఐఏఎస్ అధికారి డా. రాజు, తెలంగాణ శాసన మండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు పాల్గొంటారని లక్ష్మయ్య తెలిపారు. వక్తలు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. రెండు విడతలుగా ఈ సమావేశం కొనసాగుతుందని చెప్పారు.

## ఘనంగా విష్ణుసహస్రనామ పారాయణం

**వెంగళరావునగర్:** వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ కాలనీలోని శ్రీవీరాంజనేయస్వామి అయ్యప్ప భవానీశంకర సాయిబాబా దేవస్థానం (జీటీఎస్ టెంపుల్)లో శనివారం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శార్దూల ఏకాదశిని పురస్కరించుకుని ఈ పూజలు జరిపించినట్టు దేవాదాయ ధర్మాదాయశాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కాగా శ్రీనృసింహ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో భాగంగా సహస్ర నామ పారాయణం చేయించారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ఈ.ఓ. సుధాకర్ పర్యవేక్షించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## చెస్ క్రీడ ఎంతో గొప్పది


సూపర్ ట్విన్స్‌ని అభినందిస్తున్న ప్రముఖ చెస్ ట్రైనర్ శరవణన్

**శ్రీనగర్‌కాలనీ:** భారతదేశంలో కనుగొన్న చెస్ క్రీడ చాలా గొప్పదని, నేడు చెస్‌లో భారత దేశం ప్రపంచ చాంపియన్‌గా నిలవడం సంతోషకరమని మాజీ వరల్డ్ చెస్ చాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌కు చెస్ ట్రైనర్‌గా వ్యవహరించిన ప్రముఖ చెస్‌ట్రైనీ వెంకటాచలం శరవణన్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని ఏకాగ్ర చెస్ అకాడమీలో గత 10 రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా శిబిరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శరవణన్ మాట్లాడుతూ ఏకాగ్ర చెస్ అకాడమీ చిన్నారులైన సూపర్ ట్విన్స్ అమయ అగర్వాల్, అనయ్ అగర్వాల్‌లు యూరప్‌లో జరిగిన చెస్ టోర్నమెంట్ చాంపియన్స్‌గా నిలవడం గొప్పవిషయమన్నారు. ప్రస్తుతం చెస్‌కు ఆదరణ పెరిగిందని, అవకాశాలు, పరిస్థితులు, టెక్నాలజీ ఉందని, కానీ ఏమీలేని రోజుల్లో చెస్‌లో చాంపియన్‌గా నిలిచిన విశ్వనాథన్ ఆనందర్ అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సీఈఓ సందీప్ నాయుడు, చీఫ్ కోచ్ చైతన్య, కోచ్‌లు శీతల్, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

**బంజారాహిల్స్:** హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో షేక్‌పేట, ఖైరతాబాద్ మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. రన్నింగ్, లాంగ్‌జంప్, టగ్గాఫ్ వార్, వాలీబాల్, హ్యాండ్ బాల్, ఖోఖో తదితర క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. ఇందులో ఎస్‌బీటీనగర్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, షేక్‌పేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఎంజీఎన్ ప్రైమరీ స్కూల్, ఎంఆర్‌సీ ప్రైమరీ స్కూల్, నాట్కో బోరబండ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఆయా క్రీడాంశాల్లో తమ సత్తా చాటారు.

## ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన


చీరలను తిలకిస్తున్న మహిళలు

**శ్రీనగర్‌కాలనీ:** రంగురంగుల సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలతో సోమాజీగూడ డివిజన్ వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన శనివారం ప్రారంభమైంది. ఈ చేనేత ప్రదర్శనలోని సిల్క్, కాటన్ వస్త్రాలు మగువల మనసు దోచుకుంటున్నాయి. ప్రదర్శనలో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని పలు రాష్ట్రాల చేనేతకారుల ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 40 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకులు వికాస్ జైన్ తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 10 వరకూ కొనసాగుతుంది.

## గంజాయి విక్రేతల అరెస్ట్

**వెంగళరావునగర్:** గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను మధురానగర్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఈనెల 22వ తేదీ రాత్రి మధురానగర్ పోలీసులు కృష్ణకాంత్‌పార్క్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్నారు. ఈ సమయంలో నలుగురు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారి వద్దకు పోలీసులు వెళ్లగానే పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో వారిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం ఆ యువకులను విచారించగా బి.సతీష్, రవి, మహేష్, రంజిత్‌లుగా తెలియజేశారు. వారి వద్ద 20 గ్రాముల గంజాయి, ల్యాప్‌టాప్, వెయింగ్ మిషన్, ప్రింటర్‌లు ఉన్నాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా ధూల్‌పేట నుంచి గంజాయి తీసుకువచ్చి చిన్న పాకెట్లలో కావాల్సిన వారికి విక్రయిస్తామని యువకులు పోలీసులకు తెలిపారు. దీంతో వాటిని స్వాధీనం చేసుకుని, యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నగరంలో నేడు

- గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత్ మాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్‌లో సాయంత్రం 6 గంటలకు భారత్‌మాత మహాహారతి కార్యక్రమం జరుగుతుంది.
- నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఇన్నోవేటివ్ హ్యాండ్స్ పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో కులాంతర మతాంతర వివాహితుల మేళా రామకృష్ణ మఠం ఎదురుగా ఉన్న ఇందిరాపార్క్ గేటు వద్ద మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

## 30న రాష్ట్రవ్యాప్తంగా 'బంజారా' వేడుకలు

**మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్**

**కుషాయిగూడ:** ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం 72 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ సభావత్ రాములు నాయక్ తెలిపారు. ప్రతి తండాలో ఉదయం 8–10 గంటల మధ్య సేవాలాల్ జెండా ఎగురవేయనున్నట్లు, హైదరాబాద్‌లోని ఐమాక్స్ వద్ద రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. శనివారం చర్లపల్లి సిరి గార్డెన్స్‌లో జరిగిన మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అన్ని జిల్లాల్లో ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే 20 జిల్లాల్లో పూర్తి చేశామని తెలిపారు. బంజారాలు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, నాయకులు భీమానాయక్, కిషన్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, శంకర్ నాయక్, ఇస్లావత్ హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రగతిపథంలో రాష్ట్రం పరుగులు'

**రాయదుర్గం:** తెలంగాణ అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ అన్నారు. నానక్ రాంగూడలోని వంశీరామ్ సువర్ణ దుర్గా టెక్ పార్క్(వీఎస్‌డీ)లో నూతనంగా ఏర్పాటు చేసిన జాగల్ అనే సంస్థ కార్యాలయాన్ని శనివారం ఆయన టీజీఎస్ ఆర్టీసీ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, విధానాల పట్ల పలు సంస్థలు ఆసక్తి కనబర్చి, పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని అన్నారు.

## రేపు 'వారధి' ఆవిర్భావం

**లక్డీకాపూల్:** ఫెడరేషన్ ఆఫ్ తెలుగు అసోసియేషన్స్ ఆఫ్ మహారాష్ట్ర, ఎఫ్–టీఏఎం ఆధ్వర్యంలో 'సమాజం–సంస్కృతి–వాణిజ్యం'నేపథ్యంగా ఈ నెల 27 'వారధి'సంస్థ ఆవిర్భావ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు గంజి జగన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ, తెలంగాణ, మహారాష్ట్రలోని చిరు వ్యాపారులను ప్రోత్సహించే దిశగా 'వారధి'పని చేస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 27న రవీంద్రభారతిలో జరిగే 'వారధి'ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారని, అతిథులుగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

## ఓయూలో ప్రతి ఏటా పీహెచ్‌డీ ప్రవేశాలు

**ఉస్మానియా యూనివర్సిటీ:** ఓయూలో ఇక నుంచి ప్రతి ఏటా పీహెచ్‌డీ ప్రవేశాలు ఉంటాయని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కుమార్ తెలిపారు. యూజీసీ నిబంధనల ప్రకారం అధ్యాపకుల 57 వయసుకే పీహెచ్‌డీ గైడెషిప్‌ను కుదించడంతో ఓయూలో సుమారు 400 సీట్లు తగ్గాయి. శనివారం జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పీహెచ్‌డీ సీట్లు పెంపు విషయం ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అయితే సీట్ల సంఖ్యను పెంచలేమని ఈ సందర్భంగా వీసీ తేల్చి చెప్పారు. మూడేళ్ల తర్వాత వెలువడిన పీహెచ్‌డీ ప్రవేశాల్లో 45 సబ్జెక్టులకు కేవలం 446 సీట్లు ఉన్నందున విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు.

# కొత్త 'రేషన్'.. సిటీ పరేషాన్!

- హైదరాబాద్‌లో మాత్రం ఊసేలేని వైనం
- ప్రజాపాలన, సమగ్ర సర్వేలో పొంతన లేని దరఖాస్తుల సంఖ్య
- అయోమయంలో ఆయా కుటుంబాలు

## నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా కార్డుల జారీ

**సాక్షి, సిటీబ్యూరో:** 'ఊరంతా ఒక దారి, ఉలిపికట్టెదొక దారి'అన్నట్టుగా హైదరాబాద్ పరిస్థితి ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ఆదివారం లాంఛనంగా ప్రారంభం కానుండగా సాక్షాత్తు రాష్ట్ర రాజధానిలో దాని ఊసే లేదు. పౌర సరఫరాల శాఖ హైదరాబాద్ విషయంలో నోరు మెదపడం లేదు. ఇటీవల సమగ్ర కుటుంబ సర్వేలో గుర్తించిన రేషన్ కార్డులు లేని కుటుంబాలపై జీహెచ్‌ఎంసీ క్షేత్రస్థాయి విచారణ పూర్తి చేసింది. ఇంత చేసి వార్డు సభలు నిర్వహించకుండానే మిన్నుకుండి పోయింది. ఈ విషయమై అధికారికంగా ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. దీంతో ఆయా కుటుంబాలు అయోమయంలో పడ్డాయి. కొత్త రేషన్ కార్డులు ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నాయి.

### క్షేత్రస్థాయి విచారణ జరిగేనా...

ప్రజాపాలన, ప్రజాభవన్, కలెక్టరేట్ ప్రజావాణిల్లో అందిన కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులపై సైతం క్షేత్రస్థాయి విచారణ నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. కేవలం



సమగ్ర కుటుంబ సర్వేలో గుర్తించిన కుటుంబాలపైనే క్షేత్ర స్థాయి విచారణ జరగడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలో వార్డుసభలు నిర్వహిస్తే జాబితాలో పేర్లు లేని కుటుంబాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యే ప్రమాదం ఉండటంతో వాటిని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. దీంతో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కూడా ఆలస్యమయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

### 5.73 లక్షల దరఖాస్తులు...

గతేడాది హైదరాబాద్ పరిధిలో జరిగిన ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం సుమారు 5.73 లక్షల కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ప్రభుత్వం కేవలం గ్యారంటీ పథకాల దరఖాస్తులను మాత్రమే పరిగణనలోకి తీసుకొని, రేషన్ దరఖాస్తులను పక్కకు పెట్టింది. అయితే ఇటీవలి సమగ్ర కుటుంబ సర్వేలో కేవలం 83 వేల కుటుంబాలను మాత్రమే గుర్తించి విచారణ జరిపింది. దీంతో మిగతా కుటుంబాల పరిస్థితి అయోమయంగా తయారైంది. మరికొన్ని కుటుంబాలు అసలు దరఖాస్తే చేసుకోలేదు. ప్రజాపాలనలో పాత బస్తీ నుంచే అత్యధిక రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు దాఖలయ్యాయి. చార్మినార్ జోన్ పరిధిలో 1,40,807, ఖైరతాబాద్ 98,267, సికింద్రాబాద్ 93,004, కూకట్‌పల్లి 87,147, శేరిలింగంపల్లి 64,829, కంటోన్మెంట్‌లో 7,374 దరఖాస్తులు వచ్చినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### వచ్చే నెల ఒకటి తర్వాతనే..?

నగరంలో ఫిబ్రవరి ఒకటి తర్వాతనే వార్డుసభలు నిర్వహించి తుది అర్హుల జాబితా ప్రకటించి రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించే అవకాశాలున్నాయి. అయితే తుదిజాబితాలో పేర్లు లేని కుటుంబాల నుంచి సైతం దరఖాస్తులు స్వీకరించవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

## భావాలకు రూపాలు.. అవి అపురూపాలు

**'రివైవింగ్ ది రూట్స్'చిత్ర ప్రదర్శన ప్రారంభం**





చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**మాదాపూర్:** మనస్సులోని భావాలను అందమైన రూపాలుగా సృష్టించేశక్తి చిత్రకారులకే సొంతమని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు 'రివైవింగ్ ది రూట్స్'పేరిట ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ శేషగిరిరావు దేశం గర్వించదగ్గ గొప్ప చిత్రకారుడని కొనియాడారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా నేటి తరానికి చిత్రకళా నైపుణ్యాలు, కళల గొప్పతనం గురించి తెలుస్తాయన్నారు. ఇతిహాసాలు, చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాలను తెలియజేసేలా చిత్రాలు ఉన్నాయని అన్నారు. అనంతరం ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, జేఎన్ఏఎఫ్‌యూ పెయింటింగ్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ ప్రీతి సంయుక్తతో కలసి చిత్రాలను తిలకించారు. శేషగిరిరావు కుమారుడు వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ నేటి యువకళాకారులకు చిత్రకళపై మక్కువను పెంపొందించేందుకు ఈ ప్రదర్శన తోడ్పడుతుందన్నారు. 1940 నుంచి 2012 వరకు శేషగిరిరావు గీసిన 250 చిత్రాలను ప్రదర్శనలో ఉంచినట్టు తెలిపారు. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 5వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు చిత్రకళాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధునిక సాంకేతికతకే ప్రాధాన్యం



సదస్సులో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

**కాచిగూడ:** సమాచార మార్పిడిసహా అన్ని రంగాల్లోనూ ఆధునిక సాంకేతికతకే అత్యంత ప్రాధాన్యం లభిస్తోందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలాదేవి మహిళా డిగ్రీ కళాశాలలో 'డేటాబేస్‌లను అనుబంధించడంలో ఇన్నోవేటివ్ టెక్నిక్స్–అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్‌లు'అనే అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ దేశ జనాభాలో 65 శాతం మంది 30 ఏళ్ల లోపు ఉన్నారని, ఇలాంటి యువతతో కూడిన దేశానికి గుణాత్మక విద్యను అందించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలు చేస్తేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని సూచించారు. ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎంతో ప్రాముఖ్యం సంతరించుకుందన్నారు. మనిషి ఆలోచించే ప్రతి అంశాన్ని టెక్నాలజీగా మార్చవచ్చన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా సాంకేతిక విద్యాబోధన ఉండాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యువతి మండలి అధ్యక్షురాలు ఆర్.పద్మజ మల్లికార్జున్, కార్యదర్శి నివేదిత కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ డి.వసుంధర, ప్రిన్సిపాల్ బి.లావణ్య కుమారి, డాక్టర్ ఎన్.సిహెచ్.భట్టాచార్యులు, డాక్టర్ అమర్‌నాథ్ దేశిక్, డాక్టర్ జె.అచ్యుతదేవి పాల్గొన్నారు.

## నేడు 'పెను మార్పు సమయం - ఆదిలాబాద్ ఆదివాసీలు' ప్రదర్శన

**లక్డీకాపూల్:** మాదాపూర్‌లోని సత్వ నాలెడ్జ్ సిటీలో కొనసాగుతున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో భాగంగా ఆదివారం 'పెను మార్పు సమయం – ఆదిలాబాద్ ఆదివాసీలు'అనే అంశంపై సుమనస్పతి రెడ్డి ఫొటో ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రేడియో ప్రయోక్త, రచయిత, ఫొటోగ్రాఫర్ సుమనస్పతి రెడ్డి ఆదివాసీ, గిరిజన, గ్రామీణ సంస్కృతుల విశేషాలకు అద్దంపట్టేలా ఛాయచిత్ర ప్రదర్శన కొనసాగనున్నదని పేర్కొన్నారు. కొంతకాలంగా జరుగుతున్న అభివృద్ధి ప్రక్రియ, కొత్త, కొత్త వినియోగ వస్తువులు, సాంకేతిక ప్రక్రియలు, అన్ని వైపుల నుంచి కమ్ముకొస్తున్న డిజిటల్ యుగంతో తక్కువ కాలవ్యవధిలో ఆదివాసుల జీవితాలు, త్వరితగతిన వచ్చిన మార్పులకు నిలువెత్తు నిదర్శనంగా ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

## గూగుల్‌కు కూడా గురువు ఉంటాడు

- యువత మేధస్సుకు పదును పెట్టాలి
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**మాదాపూర్:** 'తల్లిదండ్రుల కంటే తాతయ్య, అమ్మమ్మ, నానమ్మల వద్దే పిల్లలు ఎక్కువ సమయం గడపాలి. పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకోవాలి' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం 'ఇనిజ్‌మెటిక్ బ్లూ హ్యూస్' పేరిట ఏర్పాటు చేసిన చిత్రప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'గురువు లేని విద్య గుడ్డి విద్య. గూగుల్‌కి కూడా గురువు ఉంటాడు. గూగుల్ ద్వారా కొంత సమాచారాన్ని మాత్రమే సేకరించాలి. అంతే కాని దానిపై ఆధారపడవద్దు' అని సూచించారు. పురాతన పుస్తకాలను కాపాడుకుని భావితరాలకు అందించాలన్నారు. 'భారత దేశంలో ఎంతోమంది గొప్పకవులు, కళాకారులు ఉన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు తెలిపే విధంగా ఎన్నో గ్రంథాలు ఉన్నాయి. అయితే ఇప్పుడు చిన్న, చిన్న వాటికి కూడా కాపీరైట్లు తీసుకుంటున్నారు. గతంలో ఇలాంటివి ఏమి లేవు' అని పేర్కొన్నారు. యువత మేధస్సుకు పదును పెడితే గొప్పగొప్ప ఆలోచనలు వస్తాయని, అలాంటి వాటిని ప్రోత్సహించాలని సూచించారు. నీలిరంగుకు ప్రాధాన్యత ఉంటుందని, శ్రీకృష్ణుడు, రాముడు, సముద్రం, ఆకాశం నీలి రంగులో ఉంటాయని, అలాంటి థీమ్‌తో చిత్రాలను వేసిన కళాకారిణి పి.వర్షిణిని ఆయన అభినందించారు. ఈ ప్రదర్శన రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు చిత్ర కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వల్లే విద్యుదాఘాతాలు




**సాక్షి, సిటీబ్యూరో:** విద్యుత్ ప్రమాదాలకు మానవ తప్పిదాలే ప్రధాన కారణమని తెలంగాణ విద్యుత్ తనిఖీ అధికారి సీహెచ్ రామాంజనేయులు అన్నారు. ఈ మేరకు శనివారం రెడ్‌హిల్స్‌లోని ఫ్యాప్సీ భవనంలో తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ 11వ వార్షికోత్సవం, 2025 సంవత్సర డైరీ, కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడం, భవిష్యత్తు అవసరాలు గుర్తించకుండా నాసిరకం విద్యుత్ కేబుళ్లు వాడటం వల్ల షార్ట్‌సర్క్యూట్‌లు సంభవిస్తున్నాయని చెప్పారు. త ద్వారా విలువైన ఆస్తులు కాలిబూడిద కావడంతోపాటు ఒక్కోసారి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. అనుభవం ఉన్న కాంట్రాక్టర్లతో విద్యుత్ పనులు చేయించుకోవడం ద్వారా ప్రమాదాలను కొంతవరకు నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్స్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ గౌడ్, లైసెన్సింగ్ బోర్డు మెంబర్ నేమాల బెనర్జీ నేత, మేడ్చల్ విభాగం అధ్యక్షుడు ఎ.మహేందర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేష్ నేత, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద పుల్లారావు, పి.వేణు బాబు, వి సత్యానారాయణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ అవసరం



**పంజగుట్ట:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం దారుణమని, వెంటనే దానిని ఏర్పాటు చేయాని రాష్ట్ర బీసీ కమీషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేంద్రంపై బీసీల ధర్మ పోరాటం పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ జస్టిస్ రోహిణి కమీషన్ నివేదిక ప్రకారం కేంద్ర ఓబీసీ కులాల జాబితాను వర్గీకరించి అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. కులాలను వర్గీకరించకపోవడంతో బీసీల్లో 3,500 కులాలు ఉన్నప్పటికీ, వెయ్యి కులాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఇప్పటివరకు కనీసం ప్రాతినిధ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ బీసీలపై కేంద్ర వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉంద న్నారు. కార్యక్రమంలో ప్రొ.మురళీమనోహర్, దేవళ్ల సమ్మయ్య, నరహరి, భాస్కర్, వెంకటరమణ పాల్గొన్నారు.

## రైల్వే ఇన్‌స్పెక్టర్‌కు ఇండియన్ పోలీస్ మెడల్



శ్రీనివాసరావు

**లాలాపేట:** సికింద్రాబాద్ డివిజన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇంటలిజెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాసరావు దేశంలోనే అత్యుత్తమ ఇండయన్ పోలీస్ మెడల్‌కు ఎంపికయ్యారు. సికింద్రాబాద్ డివిజన్‌లో ఇంటలిజెన్స్ సేకరణలో ఆయన అత్యుత్తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. గుంటూరు, విజయవాడలో డిటెక్టివ్ వింగ్ హెడ్‌గా దాదాపు కోటి రూపాయల విలువైన రైల్వే ఆస్తులను పరిరక్షించే కేసును ఛేదించారు. గోదావరి, కృష్ణా పుష్కరాల సమయంలో క్రౌడ్ మెనేజిమెంట్ కోసం వ్యూహాత్మక భద్రతా ప్రణాళికలు రూపొందించారు. దాదాపు 1000 మంది పారిపోయిన పిల్లలను రక్షించారు. ఈ విధంగా సేవలందించి రైల్వే ఉన్నతాధికారుల నుంచి ప్రసంశలు అందుకున్నారు.

**రవిచంద్రన్‌కు రాష్ట్రపతి పతకం...**

ప్రస్తుతం మౌలాలి శిక్షణ కేంద్రంలో అసిస్టెంట్ సబ్–ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న పి.రవిచంద్రన్‌కు ప్రతిష్టాత్మక రాష్ట్రపతి పతకం లభించింది. ఈయన 2000 సంవత్సరంలో ఆర్‌పీఎఫ్‌లో కానిస్టేబుల్‌గా, తదుపరి గ్రేడ్–3 డ్రైవర్ గాపనిచేశారు. 24 సంవత్సరాల సర్వీసులో యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా గుర్తింపు పొందారు.

## నూతన విద్యా విధానం అమలు చేయాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సూచన**



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు

**సనత్‌నగర్:** రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు చేయాలని, దీని ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు హైస్కూల్ వరకు మాతృభాషలో చదువుకునేందుకు అవకాశం ఉంటుందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపర్చాలని, కొన్నింటిలో సరిపడా సిబ్బందిలేరని, టాయిలెట్ సౌకర్యం కూడా లేదని పేర్కొన్నారు. బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో ఫర్నిచర్‌తోపాటు టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌ను శనివారం ఆయన అందజేశారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో టాయిలెట్ క్లీనింగ్ మిషన్లు ఇస్తున్నామని చెప్పారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్ పెంచే విషయంపై కూడా స్థానిక ఎంపీగా తన సహాయ సహకారాలు ఉంటాయని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మెడిసిన్, ఇంజనీరింగ్, ఇతర వృత్తివిద్యా కోర్సులను కూడా మాతృభాషలో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. న్యాయస్థానాల్లో వాదనలు, న్యాయమూర్తి తీర్పులు కూడా తెలుగులో ఉండాలని అభిప్రాయపడ్డారు. నూతన విద్యా విధానంలో మాతృభాషకు ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు డిగ్రీ పట్టాలు తీసుకున్న తర్వాత తమ కాళ్లపై తాము నిలబడటంతోపాటు మరో పది మందికి ఉపాధి కల్పించేలా నూతన విద్యావిధానం ద్వారా హైస్కూల్ స్థాయిలోనే శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యా వ్యవస్థలో ఇంకా అనేక రకాల మార్పులు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్యాసుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళ, నాయకులు నెమలి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## నిలోఫర్‌లో అత్యాధునిక ఎక్స్‌రే మిషన్ ప్రారంభం

**నాంపల్లి:** చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో రోగులకు 500 ఎంఏ ఎక్స్‌రే మిషన్ అందుబాటులోకి వచ్చింది. ఆ మిషన్‌ను శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.రవికుమార్ ప్రారంభించారు. ఈ మిషన్ అందుబాటులోకి రావడంతో సిబ్బందిపై పని ఒత్తిడి, రోగుల రద్దీ తగ్గుతుందని, సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. 'మన ప్రభుత్వం–మన శాఖ'లో భాగంగా ఈ మిషన్‌ను సమకూర్చినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వినోద్‌కుమార్‌తోపాటు పలువురు డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్స్‌రే మిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ రవికుమార్, చిత్రంలో ప్రొ.వినోద్‌కుమార్

## జాతీయ క్రీడా పోటీల్లో సత్తా చాటాలి

**తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి**



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న జితేందర్‌రెడ్డి, శివసేనారెడ్డి తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** ఉత్తరాఖండ్‌లో ఈ నెల 28వ తేదీ నుంచి జరగనున్న జాతీయ క్రీడా పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. శనివారం ఎల్బీ స్టేడియంలో జాతీయ క్రీడా పోటీలకు వెళ్తున్న క్రీడాకారులకు ఆయన స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన జాతీయ క్రీడల్లో రాష్ట్ర క్రీడాకారులు ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయారని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి ఇస్తున్న ప్రోత్సాహంతో క్రీడాకారుల్లో నూతనోత్తేజం నెలకొందని తెలిపారు. రాబోయే జాతీయ క్రీడలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు ప్రయత్నిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి నగదు ప్రోత్సాహకాలను పెంచేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోని బాలాదేవి, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్విగ్గీ డెలివరీ బాయ్స్ సమ్మె

**సాక్షి, సిటీబ్యూరో:** సర్వీస్‌లకు తగ్గ వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం నగరంలో స్విగ్గీ డెలివరీ బాయ్స్ సమ్మెకు దిగారు. సమ్మెకు తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్ పూర్తి మద్దతు ప్రకటించింది. పాత ఎంజీ (మినిమం గ్యారంటీ) చెల్లింపుల పునరుద్ధరణ, న్యాయమైన బేస్ పే వ్యవస్థ అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా గిగ్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ కార్మికులకు చట్టాలు, సంక్షేమ బోర్డు, సామాజిక భద్రత అందించడం అత్యవసరమన్నారు.

## లిటరరీ ఫెస్ట్‌లో సంగీతం

**చందానగర్:** హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్–2025లో సంగీత కార్యక్రమం అందరినీ అలరించింది. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్, సత్వా నాలెడ్జి సిటీ భవనంలో ఈ ఫెస్టివల్‌లో భాగంగా డాక్టర్ వై.సాయికుమార్ ఈ జెంబే సర్కిల్ సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. భారతదేశంలోని లిథువేనియా రాయబారి హెచ్‌ఈ దయానా మికెవిసియెన్, గోతెజెంత్రమ్ డైరెక్టర్ అమితాదేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



## 'లవ్ మై ఇండీ డాగ్ షో'

**కవాడిగూడ:** బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్, మార్స్ పెట్‌కేర్ సంయుక్తంగా నిర్వహించిన 'లవ్ మై ఇండీ డాగ్ షో'మూడవ ఎడిషన్ వైభవంగా జరిగింది. దోమల్‌గూడలోని చైతన్య విద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నగరంలోని వీధికుక్కల ప్రేమికులు తమ ఇంటి కుక్కలతో వచ్చారు. బ్లూక్రాస్ వ్యవస్థాపకురాలు అమల అక్కినేని మాట్లాడుతూ వీధికుక్కలపట్ల ప్రేమ, వాటి సంరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. పెంపుడు జంతువుల సంక్షేమానికి వినూత్న కార్యక్రమాలు చేపట్టామని మార్స్ పెట్‌కేర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి తెలిపారు.



సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, ఆదివారం, 26, జనవరి, 2025



శతాబ్దాల చారిత్రక అస్తిత్వం.. హైదరాబాద్ సాంస్కృతిక వైవిధ్యానికి ప్రతిరూపం. విభిన్న జీవన సంస్కృతుల సమాహారం పాతబస్తీ.. కుతుబ్‌షాహీల నుంచి ఆసఫ్‌జాహీల వరకు 400 ఏళ్ల నాటి చార్మినార్ మొదలుకొని ఎన్నెన్నో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, మరెన్నో అందమైన ప్యాలెస్‌లు, మహళ్లు, దర్వాజాలు, దేవిడీలు, బౌలీలు, నవాబుల సమాధులు, పార్కులు ప్రపంచ చిత్రపటంలో పాతబస్తీ ఉనికిని సమున్నతంగా ఆవిష్కరిస్తాయి. హైదరాబాద్‌కు వచ్చే దేశవిదేశాలకు చెందిన పర్యాటకులు పాతబస్తీని సందర్శిస్తేనే ఆ పర్యటన పరిపూర్ణం అవుతుంది. అలాంటి పాతబస్తీలో ఇప్పుడు మెట్రో నిర్మాణానికి మార్గం సుగమమైంది.

- సాక్షి, సిటీబ్యూరో/యాకుత్‌పురా

# అలనాటి స్మృతుల్లో.. అలా సాగిపోతూ..

## చారిత్రక కట్టడాల చుట్టూ మెట్రో పరుగులు

- నివాసభవనాలు, స్కూళ్లు, చారిత్రక సమాధులకు ముప్పు
- ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్లు
- సుమారు 1100 నిర్మాణాల కూల్చివేతకు చర్యలు



### పాతకాలం నాటి ఇల్లు పోతోంది

ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా మెట్రోరైల్ ఎంతో అవసరం, పాతబస్తీ ప్రజలకు మెట్రో సదుపాయం రావడం ఆహ్వానించదగ్గదే.. కానీ పూర్వీకుల నాటి ఇంటిని కోల్పోవాల్సి రావడం కష్టంగానే ఉంది. మా కళ్ల ముందే మా ఇంటిని కూల్చివేస్తుంటే చూడలేకపోతున్నాం. ఎంతో బాధగా ఉంది.

- మహ్మద్ బీన్ అహ్మద్, ఇంటి యజమాని

### పాతబస్తీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని..

నిజాం కాలం నాటి భవనాలు కోల్పోవడం బాధగా ఉంది. మా పూర్వీకులు ఎంతో ఇష్టంతో కట్టుకున్న ఇంట్లో మా తాత, మా నాన్న, ఇప్పుడు మేము కిరాణ జనరల్ స్టోర్ నడుపుతున్నాం. 280 చదరపు గజాలు ఉన్న మా ఇంటి నుంచి మెట్రో కోసం 65 చదరపు గజాల స్థలాన్ని కోల్పోతున్నాం. పాతబస్తీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఇష్టం లేకపోయినా ఒప్పుకోవాల్సి వచ్చింది. - సయీద్ బీన్ అహ్మద్ మహఫూజ్, వ్యాపారి












### పరిహారం అవసరం లేదు

హెరిటేజ్ రోడ్లపై నుంచి మెట్రో నిర్మించడం సరైంది కాదు.. దీనివల్ల మా ఇల్లు 700 గజాలు కోల్పోవాల్సి వస్తుంది. పరిహారం కోరుకోవడం లేదు. త్వరలో న్యాయం కోసం కోర్టుకు వెళ్తాను. ఎట్టిపరిస్థితుల్లోనూ మెట్రోకు స్థలం ఇవ్వను. - ఆబిద్‌హుస్సేన్, దారుల్‌షిఫా



### జిగ్‌జాగ్ మెట్రో ఉంటుందా

ప్రపంచంలో ఎక్కడైనా మెట్రో ప్రధానమైన మార్గాల్లో కట్టారు. కానీ పాతబస్తీ అందుకు విరుద్ధం. ఇలాంటి జిగ్‌జాగ్ మెట్రో ఎక్కడా చూడలేదు.



చాలావరకు చారిత్రక భవనాలను కాపాడుతున్నామంటున్నారు. కానీ స్పష్టత లేదు.

- అనురాధారెడ్డి, ఇంటాక్

ఏ ఒక్క చారిత్రక కట్టడానికి విఘాతం కలిగించకుండా, వాటి ఔన్నత్యాన్ని చాటే విధంగా మెట్రో మెలికలు తిరగనుంది. చారిత్రక కట్టడాలను చుట్టేస్తూ మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల మెట్రో కారిడార్ నిర్మాణానికి కార్యాచరణ మొదలైంది. ఈ మార్గంలో రోడ్డు విస్తరణ వల్ల చారిత్రక భవనాలకు ఎలాంటి ముప్పు లేకపోయినప్పటికీ కొన్ని చోట్ల వందేళ్లకు పైబడిన ఇళ్లు, హోటళ్లు, దుకాణాలు, స్కూళ్లు తదితర భవనాలు పాక్షికంగానో, పూర్తిగానో నేలమట్టం కానున్నాయి. సుమారు 1100 నిర్మాణాలను తొలగించాల్సి ఉంటుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ లిమిటెడ్ గుర్తించింది. ఇప్పటి వరకు 270 మంది తమ ఆస్తులు అప్పగించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు హెచ్ఏఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

- చదరపు గజానికి రూ.81 వేల చొప్పున ఆస్తులు కోల్పోనున్న వారిలో 170 మందికి సుమారు రూ.80 కోట్లు ఇప్పటి వరకు చెక్కులు పంపిణీ చేశారు. కానీ మెట్రో నిర్మాణంలో భాగంగా ఆస్తులను కోల్పోతున్న ఎంతోమంది పాతబస్తీవాసులు పూర్వీకుల నాటి భవనాలను కోల్పోవడంపై ఆందోళనకు గురవుతున్నారు. మెట్రో వల్ల తరతరాలుగా వారసత్వంగా వచ్చే భవనాలను కోల్పోవడం బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్రో నిర్మాణం నేపథ్యంలో పాతబస్తీలో 'సాక్షి' క్షేత్రస్థాయిలో పర్యటించింది. ఆ వివరాలతో ప్రత్యేక కథనం..

### ఆ ఘుమఘుమలు మాయమేనా..?

పాతబస్తీ పేరు వింటేనే కమ్మటి ఇరానీచాయ్, ఉస్మానియా బిస్కెట్లు, సమోసా, బన్‌మస్కా, పసందైన బిర్యానీ రుచులు ఘుమఘుమలాడుతాయి. ప్రతిరోజూ తెల్లవారు జాము నుంచే జనజీవనంతో బీబీబజార్, మొగల్‌పురా, షాలిబండ తదితర ప్రాంతాలు సందడిగా కనిపిస్తాయి. మెట్రో రాక వల్ల అనేక మార్పులు రానున్నాయి. బీబీబజార్‌లోని విక్టోరియా హోటల్ కనుమరుగవుతోంది. అలాగే ఎతేబార్‌చౌక్‌లోని ఏళ్ల నాటి ముఫీద్-ఉల్-ఆనమ్ స్కూల్, పురానీహవేలీలోని ప్రిన్సెస్ ఎస్సెన్ గర్ల్స్ హైస్కూల్ తదితర విద్యాసంస్థలు ప్రభావితం కానున్నాయి. కొన్ని స్కూళ్లు పాక్షికంగా దెబ్బతింటాయి. పాతబస్తీ మెట్రోపైన మొదట్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ తర్వాత గత ప్రభుత్వ హయాంలోనే మార్గం సుగమమైంది. 'అభివృద్ధిని అడ్డుకోవడం లేదు. కానీ పాతబస్తీ రూపురేఖలు, చిహ్నాలు మారిపోతాయనే బాధ మాత్రం తీవ్రంగా ఉంది.' అని మీర్ యూసుఫ్ అలీ అభిప్రాయపడ్డారు.



### చారిత్రక రహదారులపై మెట్రో కారిడార్..

ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మీరాలంమండి రోడ్డు మీదుగా దారుల్‌షిఫా, పురానీహవేలి, ఎతెబార్‌చౌక్, అలీజాకోట్ల, బీబీబజార్, సుల్తాన్‌షాహీ, హరిబౌలి, శాలిబండ, అలియాబాద్, శంషీర్‌గంజ్, ఫలక్‌నుమా వంటి చారిత్రక రహదారిపైన మెట్రో కారిడార్ నిర్మించనున్నారు.

- ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా మెట్రోనూ మళ్లించారు. చార్మినార్‌కు 500 మీటర్ల దూరంలో మెట్రో రానుంది. ఇలా చారిత్రకకట్టడాలు ఉన్న చోట ఇంజినీరింగ్ పరిష్కారాలు, మెట్రో పిల్లర్ స్థానాల సర్దుబాటు వంటి చర్యలు చేపట్టారు. కానీ ఇదే రూట్‌లో ఎంతోమంది పాలు, పండ్లు, కూరగాయలు, నిత్యావసర వస్తువులను విక్రయించే కిరాణా దుకాణాలు, హోటళ్లు, పలు చోట్ల స్కూల్ భవనాలు ప్రభావితం కానున్నాయి. ప్రతి సంవత్సరం మొహర్రం సందర్భంగా బీబీకా ఆలం ఊరేగింపుతో ఎంతో సందడిగా ఉండే దారుల్‌షిఫా స్వరూపం మారనుంది.

- 'ఒకప్పుడు మా ఇల్లు 1200 గజాల్లో ఉండేది. 2002లో రోడ్డు విస్తరణ కోసం 131 గజాలు తీసుకున్నారు. ఇప్పుడు మెట్రో కోసం 700 గజాలు ప్రభావితమవుతోంది. పూర్వీకుల నుంచి ఉన్న మా ఇంటి ఉనికిని కోల్పోతున్నాం.' అని దారుల్‌షిఫాకు చెందిన ఆబిద్ హుస్సేన్ తెలిపారు. మొహర్రం బీబీకాలం ఆలం సందర్భంగా ఏనుగు మా ఇంటికి వస్తుంది. రేపు మెట్రో వచ్చిన తర్వాత అది సాధ్యం కాదు కదా' అని ఆవేదన వ్యక్తం చేశారు. హెరిటేజ్ రోడ్లపై నుంచి కాకుండా ఇతర మార్గాల్లో మెట్రో నిర్మించాలన్నారు.

# ఐ లవ్.. జ్యువెలరీ..

బంగారు ఆభరణాలంటే ఎంతో ఇష్టం.. సంప్రదాయ ఆభరణాలు ధరించేందుకు ఆసక్తి చూపిస్తా.. మన దేశంలో తయారు చేసే ఆభరణాలకు ప్రపంచవ్యాప్తంగా ఎంతో గుర్తింపు ఉంది అంటూ చెప్పుకొచ్చారు అందాల నటి అనుపమ పరమేశ్వరన్. జూబ్లీహిల్స్‌లో వియారా పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లాగ్‌షిప్ జ్యువెలరీ స్టోర్‌ను ముఖ్య అతిథిగా హాజరై శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం స్టోర్‌లో వినియోగదారులతో సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే సాగర్, జనగాం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, నిర్వాహకులు వి.లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

- బంజారాహిల్స్






# నడక లెక్క.. ఇక పక్కా..

**ఎంత దూరం నడిచారు.. ఎన్ని అడుగులేశారు..**
**ఎన్ని కేలరీలు బర్న్ అవుతున్నాయి..**
**కేబీఆర్ పార్కు వినూత్నంగా బోర్డులు**

బంజారాహిల్స్: నడక ఆరోగ్యానికి మంచిదని అందరికీ తెలిసిందే.. అయితే ఎంత దూరం నడిచాం.. ఎన్ని అడుగులు వేశాం.. ఎన్ని కేలరీలు కరిగించాం అనే విషయాలను కొంతమంది డిజిటల్ వాచీలు పెట్టుకొని తెలుసుకుంటారు. చాలామంది వాకర్స్ కేవలం నడకకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తూ ఎంత దూరం నడిచాం.. ఎన్ని అడుగులు వేశాం అనే విషయాలు అంతగా పట్టించుకోరు. అలాంటి వారి కోసం జీహెచ్ఎంసీ వినూత్నంగా ఆలోచించింది. వాకర్స్ అలా నడుచుకుంటూ వెళ్తుంటే చాలు.. ఎంత దూరం నడిచారు.. ఎన్ని అడుగులు వేశారు.. ఎంత కొవ్వు కరిగించారు.. తదితర విషయాలను బోర్డుల ద్వారా కేబీఆర్ పార్కు వాకర్లకు తెలియజేస్తోంది.

- బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు, జీహెచ్ఎంసీ వాక్‌వేలో ప్రతి పావు కిలో మీటరుకు ఒకటి చొప్పున బోర్డులు ఏర్పాటు చేసి వాకర్లు ఎంత దూరం నడిచారు.. ఎన్ని అడుగులు వేశారు.. ఎంత కొవ్వు కరిగింది అనే విషయాలను బోర్డు మీద పొందుపరిచారు. జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఆలోచనతో ఈ బోర్డులను ఏర్పాటు చేయగా.. ఇవి వాకర్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.
- కేబీఆర్ పార్కు మెయిన్ ఎంట్రన్స్ గేటు నుంచి బసవతారకం ఆస్పత్రి, తెలంగాణ భవన్, తాజ్‌మహల్ హోటల్, సీవీఆర్ న్యూస్, బాలకృష్ణ ఇల్లు, క్రీమ్‌స్టోన్ బిల్డింగ్ మీదుగా ఎన్టీఆర్ భవన్ నుంచి మళ్లీ మెయిన్ ఎంట్రన్స్ రావడానికి సుమారు ఐదు కిలోమీటర్లు వాక్‌వే ఉందని గుర్తించారు. వాకింగ్‌కు వచ్చే వారి ఎత్తు, బరువును సగటున అంచనా వేసి ప్రతి పావు కిలోమీటర్‌కు ఒక బోర్డు ఏర్పాటు చేశారు.

# భాషలో రైమ్, రిథమ్

**సాహిత్యాన్ని చదవడం ద్వారానే సాధించగలం**
**హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో ఉన్నతి వేద్**



సాక్షి, హైదరాబాద్: జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అసలైన దారి చదవడమే.. అందుకే పుస్తకాల ద్వారా మంచి భాష, ఉచ్చారణలను అలవరచవచ్చు.. కథలు భాషను పరిపూర్ణం చేస్తాయి.. కథలు చెప్పడంతో పాటు పిల్లలను మేధోవికాసానికి తోడ్పడే వ్యాపకాల్లో వారిని నిమగ్నం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.. అన్నారు ఉన్నతి వేద్. పిల్లలకు వయసు వారీగా వారి మేధో సంపత్తికి తగినట్లు రూపొందించిన 'గుడ్ నైట్ మూన్, చికచిక బూమ్ బూమ్, ద క్యాట్ ఇన్ ద హ్యాట్' పుస్తకాలను పరిచయం చేశారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో నిర్వహించిన 'స్టోరీస్ మేక్ ద బెస్ట్ లాంగ్వేజ్ టీచర్స్' వర్క్‌షాప్‌లో చిన్నపిల్లలు, వారి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు.

- 2-5 ఏళ్ల మధ్య పిల్లల కోసం రూపొందించిన గుడ్ నైట్ మూన్ పుస్తకంలో అన్నీ బొమ్మలే ఉంటాయి. పిల్లలు చదవడానికి అందులో ఒక్క అక్షరమూ ఉండదు. ఇంటి థీమ్‌తో ఉన్న బొమ్మలో ఉన్న వస్తువులను ఒక్కొక్క దాన్నీ గుర్తించాలి. పిల్లలను మేధోపరమైన వ్యాపకంలో నిమగ్నం చేయడమే ఇందులో కాన్సెప్ట్. టంగ్ ట్విస్టర్స్ ఉచ్చారణను, గేయాలాపన ద్వారా కాగ్నిటివ్ స్కిల్స్ పెరుగుతాయని చెప్పారు.
- ఒకే ఉచ్చారణతో రెండు వేర్వేరు అర్థాలున్న పదాలతో 5-7 ఏళ్ల పిల్లల కోసం రూపకల్పన చేశా. సాహిత్యాభిలాషను పెంపొందించడం కోసం 'ఈగర్ రీడర్స్'ను స్థాపించిన పెద్దవాళ్ల కోసం 'ద లిట్ పీపుల్' పేరుతో ఒక బుక్ క్లబ్‌ను నిర్వహిస్తున్నాం. మంచి భవిష్యత్తును నిర్మించుకోవడానికి, జీవితాన్ని లయబద్ధంగా మలుచుకోవాలంటే మనం మాట్లాడే భాషలో రైమ్, రిథమ్ ఉండాలి. అది సాహిత్యాన్ని చదవడం ద్వారానే సాధించగలం' అన్నారు ఉన్నతి వేద్.



# బూమ్ బాక్స్.. మెమరబుల్ నైట్

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ బౌండరీ హిల్స్‌లో 'సీగ్రామ్ రాయల్ స్టాగ్ బూమ్‌బాక్స్' పేరిట శనివారం నిర్వహించిన ప్రదర్శన ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించింది. వైవిధ్యభరిత మ్యూజిక్‌తో పాటు గేమింగ్ వినోదాన్ని కూడా ఒకే చోటకు తీసుకురావడం ఆకట్టుకుంది. సంగీత కళాకారుల పెర్ఫార్మెన్స్ మెమరబుల్ నైట్ అందించింది. ఈ సందర్భంగా సంగీత కారులు ట్రిడెంట్ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లోని మ్యూజిక్ ప్రియత్వం తమకు స్ఫూర్తిని అందించిందని బూమ్‌బాక్స్ ఆర్టిస్ట్స్ చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ సింగర్ అమిత్ త్రివేది మాట్లాడుతూ సిటీలో పెర్ఫార్మ్ చేయడం గొప్ప అనుభూతిగా పేర్కొన్నారు. గాయని నిఖిత గాంధీ, ప్రముఖ హిప్-హాప్ కళాకారుడు రఫ్తార్, డీజె యోగి, గేమింగ్ ఇన్‌ఫ్లుయెన్సర్ మున్నాభాయ్ పాల్గొన్నారు.



# జాతీయ చిహ్నం.. భళారే చిత్రం..

సాక్షి, సిటీ బ్యూరో: ఒకే చిత్రంలో అన్ని జాతీయ చిహ్నాలను గుదిగుచ్చి రూపొందించిన వైవిధ్యభరిత కళారూపాన్ని నగరానికి చెందిన చిత్రకారుడు వెంకటేష్ కందునూరి తీర్చిదిద్దారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ చిత్రాన్ని గీసినట్టు ఆయన తెలిపారు. ఈ చిత్రంలో 11 రకాల జాతీయ చిహ్నాలతో పాటు 8 కేంద్ర పాలిత ప్రాంతాలు, 28 రాష్ట్రాలు.. ఇలా పలు ముఖ్యమైన అంశాలకు స్థానం కల్పించానని ఈ సందర్భంగా ఆయన వివరించారు. దేశభక్తి భావాన్ని ప్రేరేపించే విధంగా గీసిన ఈ చిత్రం కోసం 15 రోజులు పూర్తిస్థాయిలో పనిచేశానన్నారు.

## పురస్కారాలకు ఎంపికైన వారందరికీ శుభాకాంక్షలు: వైఎస్ జగన్



సాక్షి, అమరావతి: తమ తమ రంగాలలో విశేష ప్రతిభా పాటవాలతో సమాజంపై చెరగని ముద్ర వేసిన అవార్డు గ్రహీతలందరికీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. వారి నిరుపమాన సేవలు ప్రజలందరికీ స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు.

## ఎంపీ పదవికి విజయసాయిరెడ్డి రాజీనామా

- ఎవరి ఒత్తిడీ లేదని, వ్యక్తిగత కారణాలతోనేనని స్పష్టీకరణ
- రాజ్యసభ చైర్మన్ ధన్‌ఖడ్‌కు లేఖ అందజేత.. వెంటనే ఆమోదం
- నాలాంటి వాళ్లు వెయ్యి మంది పార్టీ వీడినా జగన్‌కు, పార్టీకి నష్టం లేదు



సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యత్వానికి వి.విజయసాయిరెడ్డి రాజీనామా చేశారు. శనివారం ఉదయం రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను ఆయన అధికారిక నివాసంలో కలిసి రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఇష్టపూర్వకంగానే ఎంపీ పదవికి రాజీనామా చేస్తున్నానని, దీనిని ఆమోదించాలని లేఖలో కోరారు. రాజీనామా లేఖ సమర్పించిన కొద్ది గంటల్లోనే ధన్‌ఖడ్ దానిని ఆమోదించారు. ఈ మేరకు రాజ్యసభ సెక్రటేరియట్ ప్రకటన విడుదల చేసింది. రాజీనామా అనంతరం విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడారు. తాను తీసుకున్న నిర్ణయం వెనుక ఎవరి ఒత్తిడీ లేదన్నారు. లండన్ పర్యటనలో ఉన్న జగన్‌కు తన రాజీనామా గురించి ఫోన్లో వివరించానని చెప్పారు. అయితే.. తాము, పార్టీ అండగా ఉంటుందని, రాజీనామా చేయొద్దని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని తెలిపారు. అయినా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి తాను రాజీనామా చేశానని తెలిపారు.

**నాలుగు దశాబ్దాల అనుబంధం**

వైఎస్ రాజారెడ్డి, రాజశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి వరకు మూడు తరాలుగా నాలుగు దశాబ్దాలుగా వారి కుటుంబంతో తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. జీవిత కాలంలో ఏ రోజు కూడా ఆ కుటుంబంతో ఎప్పుడూ విభేదాలు లేవని, భవిష్యత్తులో కూడా వచ్చే అవకాశం లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ 2019లో 151 స్థానాలు సాధించుకుందని, 2024 ఎన్నికల్లో 40 శాతం ఓటింగ్ సాధించుకుందని, వైఎస్ జగన్ అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడని తెలిపారు. తన లాంటి వెయ్యి మంది పార్టీ వీడినా జగన్‌కు ప్రజాదరణ తగ్గదన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో తాను పార్టీకి న్యాయం చేయలేనన్నారు.

**అప్రూవర్‌గా మారాలని ఒత్తిడి చేశారు**

జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో 2011లో ఎన్నో ఆశలు చూపించి అప్రూవర్‌గా మారాలని ఎంత బలవంత పెట్టినా అంగీకరించలేదని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆ రోజు పరిస్థితే ఈరోజూ ఉందన్నారు. కాకినాడ సీపోర్టు వ్యవహారంతో తన రాజీనామాకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తన రాజీనామా వల్ల కూటమి లబ్ధి పొందుతుందే తప్ప 11 మంది ఎమ్మెల్యేలున్న వైఎస్సార్‌సీపీకి మేలు జరగదని.. అయితే రాజకీయాల నుంచి తప్పుకోవాలని వ్యక్తిగతంగా నిర్ణయించుకున్నానని వివరించారు. తనది ఎవ్వరికీ భయపడే తత్వం కాదన్నారు. ఇక రాజకీయాల గురించి మాట్లాడటం సమంజసం కాదన్నారు. తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని పునరుద్ఘాటించారు.

## మీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాం

### విజయసాయిరెడ్డి రాజీనామాపై స్పందించిన వైఎస్సార్‌సీపీ

సాక్షి, అమరావతి: రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి రాజీనామాపై వైఎస్సార్‌సీపీ స్పందించింది. 'మేము మీ నిర్ణయాన్ని ఆమోదించనప్పటికీ, మీ ఎంపికను గౌరవిస్తాము. మా పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి బలమైన మూలస్తంభాలలో ఒకరిగా ఉన్నారు. కష్టాలు, విజయాలు రెండింటిలోనూ మాతో నిలబడే ఉన్నారు. హార్టికల్చర్‌లో మీ అభిరుచిని కొనసాగించడానికి రాజకీయాల నుంచి దూరంగా ఉండాలనే మీ నిర్ణయాన్ని మేం గౌరవిస్తున్నాం. పార్టీకి మీరు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. భవిష్యత్తులో మీకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నాం. అంటూ వైఎస్సార్‌సీపీ శనివారం 'ఎక్స్'లో పేర్కొంది.

## 'బండి'వి అర్థం లేని వ్యాఖ్యలు

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల గురించి కేంద్ర మంత్రి బండి సంజయ్ అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్నారని పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఆయనకు అసలు మతిస్థిమితం ఉందో, లేదో అర్థం కావడం లేదని శనివారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. అపర కాళిగా, ఉక్కు మనిషిగా గుర్తింపు పొందిన ఇందిర దేశం కోసం ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. పేదలకు అండగా నిలబడిన ఆమె పేరును సంక్షేమ పథకాలకు పెడితే.. సంకుచిత భావజాలంతో బండి సంజయ్ మాట్లాడుతున్నారని విమర్శించారు.

# రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వర్తిస్తాం

- హైకోర్టు కొత్త జడ్జీలుగా రేణుక, నర్సింగ్‌రావు, తిరుమలాదేవి, మధుసూదన్ రావు ప్రమాణస్వీకారం
- ప్రమాణం చేయించిన ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్

సాక్షి, హైదరాబాద్: రాజ్యాంగబద్ధంగా విధులు నిర్వహిస్తామని హైకోర్టు కొత్త జడ్జీలు రేణుక యార, నర్సింగ్‌రావు నందికొండ, తిరుమలాదేవి ఈద, మధుసూదన్‌రావు బొబ్బిలి రామయ్య ప్రమాణం చేశారు. హైకోర్టు ఆవరణలోని ఫస్ట్ కోర్టు హాల్‌లో శనివారం ఉదయం 10.45 గంటలకు నలుగురితో న్యాయమూర్తులుగా తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సుజోయ్ పాల్ ప్రమాణస్వీకారం చేయించారు. తొలుత వీరిని న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఉత్తర్వులను రిజిస్ట్రార్ జనరల్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అదనపు సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ, అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, పీపీ పల్లె నాగేశ్వర్‌రావు, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు ఎ.రవీందర్‌రెడ్డి, రిజిస్ట్రార్లు, ఏఏజీలు, కోర్టు సిబ్బందితోపాటు కొత్త న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరి నియామకంతో హైకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. ఇంకా 12 ఖాళీలున్నాయి. తెలంగాణ హైకోర్టుకు న్యాయమూర్తులుగా ఈ నలుగురి పేర్లను సుప్రీం కోర్టు కొలీజియం ఈనెల 11న సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. వీరంతా 2012లో జిల్లా జడ్జిగా ఎంపికై న వారే కావడం గమనార్హం. న్యాయాధికారుల కోటాలో వీరిని ఎంపిక చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులకు ఈ నెల 22న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. కాగా, జస్టిస్ తిరుమలాదేవి 2026, జూన్ 1 వరకు అదనపు న్యాయమూర్తిగా కొనసాగనుండగా, మిగతా ముగ్గురు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లు అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వహించనున్నారు.



న్యాయమూర్తులుగా జస్టిస్ రేణుక యార, జస్టిస్ నర్సింగరావు, జస్టిస్ తిరుమలాదేవి, జస్టిస్ మధుసూదన్ రావులతో ప్రమాణం చేయిస్తున్న ఏసీజే జస్టిస్ సుజయ్‌పాల్

# డా. నాగేశ్వర్‌రెడ్డికి పద్మ విభూషణ్..

### వైద్య రంగానికి ఆయన అందిస్తున్న సేవలకు గుర్తింపు

- నటుడు నందమూరి బాలకృష్ణకు పద్మ భూషణ్
- మందకృష్ణ మాదిగ, మాడుగుల నాగఫణి శర్మకు పద్మశ్రీ



సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచ ప్రఖ్యాత గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ దువ్వూరు నాగేశ్వరరెడ్డిని దేశ రెండో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మవిభూషణ్ వరించింది. దేశ వైద్య రంగానికి అందిస్తున్న సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయన్ను తెలంగాణ నుంచి ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. ప్రముఖ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఏపీ నుంచి కళల విభాగంలో పద్మ భూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది. అలాగే ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగతోపాటు కవి, పండితుడు, ద్విసహస్రావధాని మాడుగుల నాగఫణి శర్మ, కె.ఎల్. కృష్ణ, మిరియాల అప్పారావు (మరణానంతరం), వాదిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖిలను పద్మశ్రీ పురస్కారాలకు ఎంపిక చేసింది. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం 2025 ఏడాదికిగాను శనివారం పద్మ పురస్కారాలను ప్రకటించింది. మొత్తం 139 పద్మ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం అందులో ఏడుగురికి పద్మవిభూషణ్, 19 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. పురస్కారాల్లో 23 మంది గ్రహీతలు మహిళలు, 10 మంది విదేశీయులు/ఎన్ఆర్ఐలు ఉండగా 13 మందికి మరణానంతరం అవార్డులను ప్రకటించారు. పద్మ అవార్డుల్లో తెలంగాణకు రెండు, ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు లభించాయి.

**జాబితాలో మట్టిలో మాణిక్యాలు**

దేశ సామాజిక, సాంస్కృతిక పురోగతికి తమ సేవల ద్వారా తోడ్పడుతున్నప్పటికీ పెద్దగా గుర్తింపునకు నోచుకోకుండా మట్టిలో మాణిక్యాలుగా మిగిలిపోయిన 30 మందిని కేంద్ర ప్రభుత్వం పద్మ పురస్కారాలతో గౌరవించింది. వారిలో గోవా స్వాతంత్ర్య పోరాట యోధుడైన వందేళ్ల లిబియో లోబో సర్దేశాయ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన మహిళా డోలు కళాకారిణి గోకుల్ చంద్ర దే (57) తదితరులు ఉన్నారు.

**దేశం గర్విస్తోంది: మోదీ**

పద్మ పురస్కారాలకు ఎంపికై న వారికి ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. వివిధ రంగాల్లో అసమాన విజయాలు సాధించిన వ్యక్తులను గౌరవించేందుకు దేశం గర్విస్తోందన్నారు. ఆయా రంగాలకు వారు అందిస్తున్న సేవలు, పనిపట్ల చూపుతున్న నిబద్ధత స్ఫూర్తిదాయకమన్నారు.

**తెలంగాణకు అవమానం: సీఎం**

సాక్షి, హైదరాబాద్: పద్మ పురస్కారాల్లో తెలంగాణకు అవమానం జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గద్దర్ (పద్మవిభూషణ్), చుక్కా రామయ్య (పద్మ భూషణ్), అందెశ్రీ (పద్మభూషణ్), గోరటి వెంకన్న (పద్మశ్రీ), జయధీర్ తిరుమలరావు (పద్మశ్రీ) వంటి ప్రముఖులను కేంద్రం పరిగణనలోకి తీసుకోకవడం 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. మంత్రులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ముఖ్యమంత్రి చర్చించారు. అదే సమయంలో తెలంగాణ, ఏపీ నుంచి ఎంపికై న ప్రముఖులకు సీఎం రేవంత్ అభినందనలు తెలిపారు. పద్మ పురస్కారాల్లో అన్యాయంపై ప్రధాని మోదీకి లేఖ రాయాలని సీఎం యోచిస్తున్నట్లు సమాచారం.

### పద్మ విభూషణ్

1) దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి (వైద్యం) – తెలంగాణ
2) జస్టిస్ జగదీశ్ ఖేహర్ (రిటైర్డ్) (ప్రజా వ్యవహారాలు) చండీగఢ్
3) కుముదిని రజనీకాంత్ లాఖియా (కళలు) గుజరాత్
4) లక్ష్మీనారాయణ సుబ్రమణియం (కళలు) కర్ణాటక
5) ఎం.టి.వి.వాసుదేవన్ నాయర్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) – కేరళ
6) ఓసాము సుజుకీ (మరణానంతరం) (వాణిజ్యం, పరిశ్రమలు)– జపాన్
7) శారదా సిన్హా (కళలు) – బిహార్

### పద్మభూషణ్

1) నందమూరి బాలకృష్ణ (కళలు) – ఆంధ్రప్రదేశ్
2) శోభన చంద్రకుమార్ (కళలు) – తమిళనాడు
3) సుశీల్ కుమార్ మోదీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) – బీహార్
4) బిబేక్ దెబ్రాయ్ (మరణానంతరం) (సాహిత్యం, విద్య) – ఎన్సీటీ ఢిల్లీ
5) జతిన్ గోస్వామి (కళలు) – అస్సాం
6) జోస్ చాకో పెరియప్పురం (వైద్యం) – కేరళ
7) కైలాశ్ నాథ్ దీక్షిత్ (ఇతర– ఆర్కియాలజీ)– ఎన్సీటీ ఢిల్లీ
8) మనోహర్ జోషీ (మరణానంతరం) (ప్రజావ్యవహారాలు) – మహారాష్ట్ర
9) నల్లి కుప్పుస్వామి చెట్టి (వాణిజ్యం, పరిశ్రమలు) – తమిళనాడు
10) పీఆర్ శ్రీజేశ్ (క్రీడలు) – కేరళ
11) పంకజ్ పటేల్ (వాణిజ్యం)–గుజరాత్
12) పంకజ్ ఉదాస్ (మరణానంతరం) (కళలు) – మహారాష్ట్ర
13) రాంబహదూర్ రాయ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) – ఉత్తరప్రదేశ్
14) సాధ్వీ రీతంభర (సామాజిక సేవ) – యూపీ
15) ఎస్.అజిత్ కుమార్ (కళలు) – తమిళనాడు
16) శేఖర్ కపూర్ (కళలు)– మహారాష్ట్ర
17) ఎ.సూర్యప్రకాశ్ (సాహిత్యం, విద్య, జర్నలిజం) – కర్ణాటక
18) అనంత్ నాగ్ (కళలు) – కర్ణాటక
19) వినోద్ ధామ్ (సైన్స్ అండ్ ఇంజినీరింగ్) – అమెరికా

### పద్మశ్రీలు పొందిన ప్రముఖులు

1) మందకృష్ణ మాదిగ (ప్రజావ్యవహారాలు) – తెలంగాణ
2) మాడుగుల నాగఫణి శర్మ (కళలు)– ఆంధ్రప్రదేశ్
3) కేఎల్ కృష్ణ (విద్య, సాహిత్యం) – ఆంధ్రప్రదేశ్
4) మిరియాల అప్పారావు (మరణానంతరం) (కళలు)– ఆంధ్రప్రదేశ్
5) వాదిరాజు రాఘవేంద్రాచార్య పంచముఖి (విద్య, సాహిత్యం) – ఆంధ్రప్రదేశ్
6) రవిచంద్రన్ అశ్విన్ (క్రీడలు)– తమిళనాడు
7. మారుతి భుజంగరావు చితంపల్లి (విద్య, సాహిత్యం) – మహారాష్ట్ర
8. సయ్యద్ ఐనుల్ హసన్ (విద్య, సాహిత్యం) – ఉత్తరప్రదేశ్

## అత్యుత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచంలోని అత్యుత్తమ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌ల్లో డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డి (68) ఒకరు. కర్నూల్ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ చదివిన ఆయన 18 మార్చి 1956న విశాఖపట్నంలో జన్మించారు. ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ పేరిట ఆయన నెలకొల్పిన వైద్య సంస్థ దేశవ్యాప్తంగా అత్యుత్తమ వైద్య సంస్థగా పేరు గడించింది. గ్యాస్ట్రో ఎంటరాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ప్రఖ్యాత వైద్య సంస్థ నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో, ప్రొఫెసర్‌గా గుంటూరు మెడికల్ కాలేజీలో విద్యార్థులకు వైద్యవిజ్ఞానాన్ని బోధించారు. తన కెరీర్‌లో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందారు. 2002లో పద్మశ్రీ, 2016లో పద్మభూషణ్ పురస్కారాలు వరించాయి.

**వినమ్రంగా స్వీకరిస్తున్నా: నాగేశ్వరరెడ్డి**

'పద్మవిభూషణ్ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నాను. ఇది నాకొక్కడికే దక్కినది కాదు... ప్రతిరోజూ నాలో నూతన స్ఫూర్తిని నింపే మా పేషెంట్స్, ఏఐజీ టీమ్, మా వైద్య సిబ్బందికి దక్కిన గౌరవం. తమ వ్యథాభరితమైన, అత్యంత క్లిష్టమైన క్షణాల్లో సైతం మమ్మల్ని పూర్తిగా విశ్వసించి, మాలో పట్టుదలను, సేవానిరతిని రగిలించే మా పేషెంట్స్‌కు అత్యుత్తమ వైద్యసేవలందించడంలో మేమెప్పుడూ ముందుంటాం. భారతీయుడిగా, ఈ తెలుగుగడ్డ మీద పుట్టిన వాడిగా ప్రజలందరికీ ఆరోగ్య సేవలందించడానికి పునరంకితమవుతున్నాను. నా దేశాన్ని ఆరోగ్యకరంగా, మరింతగా బలోపేతం చేయడానికి అనునిత్యం శ్రమిస్తాను' అని నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## సహస్రావధానానికి సిసలైన బిరుదు

మాడుగుల నాగఫణి శర్మ.. ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, కవి, ద్వి సహస్రావధాని. 1959, జూన్ 8న అనంతపురం జిల్లా, తాడిపత్రి తాలూకా, పుట్లూరు మండలంలోని కడవకొల్లు గ్రామంలో జన్మించారు. మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఎంఏ, ఢిల్లీ రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ నుంచి 'శిక్షాశాస్త్రి' పట్టా పొందారు. తిరుపతి రాష్ట్రీయ విద్యా పీఠం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన మాడుగుల.. 1985–90 మధ్య కాలంలో కడప రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృతోపన్యాసకుడిగా, 1990–92 మధ్య తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మ ప్రచార పరిషత్తు అదనపు కార్యదర్శిగా పనిచేశారు. హైదరాబాద్ బర్కత్‌పురలో చాలాకాలంగా సరస్వతీ పీఠాన్ని నిర్వహిస్తున్నారు. అవధాన విద్యలో ఆరితేరిన నాగఫణి శర్మ మాజీ ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయి, పీవీ నరసింహారావు, మాజీ రాష్ట్రపతి శంకర్‌దయాళ్ శర్మ వంటి వారి సమక్షంలో ఆశువుగా... అలవోకగా అవధానాలు నిర్వహించి వారి ప్రశంసలు సైతం పొందారు. తన విద్యతో నాగఫణిశర్మ అవధాన సహస్రఫణి, బృహత్ ద్వి సహస్రావధాని, శతావధాని సమ్రాట్, శతావధాన చూడామణి, కళాసాహిత్య కల్పద్రుమ వంటి అనేక బిరుదులు పొందారు. ఇటీవలే ఆయన విశ్వభారతం అనే సంస్కృత మహాకావ్యాన్ని రచించారు.

## ప్రొఫెసర్.. రచయిత

### సయ్యద్ ఐనుల్ హసన్



రాయదుర్గం: ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్.. విద్యాపరంగా ప్రొఫెసర్, సాహిత్యపరంగా రచయిత. ఆయన ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో 15 ఫిబ్రవరి 1957లో జన్మించారు. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోని పర్షియన్ అండ్ సెంట్రల్ ఏషియన్ స్టడీస్ స్కూల్ ఆఫ్ లాంగ్వేజ్, లిటరేచర్ అండ్ కల్చర్ స్టడీస్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. కాటన్ కాలేజ్ స్టేట్ యూనివర్సిటీలోనూ విధులను నిర్వహించారు. ఆయన 23 జూలై 2021లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (మను) వైస్‌చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఇండో–ఇరాన్ రిలేషన్స్, లిటరేటర్, కల్చర్ స్టడీస్, ఇండోలోజీ గ్లోబలైజేషన్, ఎడ్యుకేషన్ అంశాలపై ఆయన ఎక్కువ మక్కువ చూపిస్తారు. ఆయనకు సతీమణి అర్షియాహసన్, పిల్లలు కమ్రాన్‌బద్ర్, అర్మాన్ హసన్ ఉన్నారు.

## ఉద్యమ ప్రస్థానం నుంచి...

సాక్షి, హైదరాబాద్: మందకృష్ణ హన్మకొండ జిల్లా కాజీపేట మండలం న్యూశాయంపేట గ్రామంలో 1965, జులై 7న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మంద చిన్న కొమురయ్య, కొమురమ్మ. మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్)ని స్థాపించారు. ఎస్సీ వర్గీకరణ, ఎస్సీలోని కులాలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలనే డిమాండ్‌తో 1994 జులై 7న ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఈదుమూడి గ్రామం నుంచి ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా పలురాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటించారు. మాదిగలకు రిజర్వేషన్లు అమలు చేయాలనే అంశాన్ని ప్రచారం చేసి మాదిగలు, ఉపకులాల ప్రజలను చైతన్యపర్చారు. ఎస్సీ, ఎస్టీల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు చేయొచ్చని, ఈమేరకు వర్గీకరణ చేపట్టాలని, ఈ బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగిస్తూ సుప్రీంకోర్టు గత ఆగస్టులో ఇచ్చిన తీర్పు ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి భారీ ఊరట అందించినట్లైంది.

## ఆర్థికవేత్తల రూపశిల్పి

సాక్షి, అమరావతి: ప్రొఫెసర్ కొనసరాజు లీలా కృష్ణ.. కేఎల్‌గా, కేఎల్‌కేగా సుప్రసిద్ధులు. ఆర్థిక శాస్త్రం ఆచార్యులైన ఆయన అనేకమంది విద్యార్థులను ఆర్థికవేత్తలుగా తీర్చిదిద్ది దేశానికి అందించారు. షికాగో యూనివర్సిటీలో చదివిన ఆయన.. ప్రస్తుతం మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ సంస్థకు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఇండియా కేఎల్ఈఎంఎస్ ప్రొడక్టివిటీ ప్రాజెక్టుకు నేతృత్వం వహిస్తున్నారు. ఆరు దశాబ్దాలుగా అప్లైడ్ ఎకనామిక్స్, ఇండస్ట్రియల్ ఎకనామిక్స్, ప్రాంతీయ అసమానతలు, ఆర్థిక ఉత్పాదకత, సైద్ధాంతిక వాణిజ్యం తదితర సబ్జెక్టులు విద్యార్థులకు బోధించడమే కాకుండా, ఆ విభాగాల్లో విస్తృత పరిశోధనలూ చేశారు. ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో సుదీర్ఘకాలం ఆర్థిక శాస్త్రాన్ని బోధించారు. ఇండియన్ ఎకనామిక్ సొసైటీకి 1996–97లో అధ్యక్షుడిగా వ్యవహరించారు. 1997లో ఆయన రచించిన ఎకనోమెట్రిక్ అప్లికేషన్స్ ఇన్ ఇండియా గ్రంథాన్ని ఆర్థిక శాస్త్రంలో ప్రధాన విభాగాల్లో అధ్యయనానికి దిక్సూచిలా ఆర్థికవేత్తలు భావిస్తారు.

## బుర్రకథ టైగర్ మిరియాల

తాడేపల్లిగూడెం: పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన మిరియాల అప్పారావు బుర్రకథలో ప్రఖ్యాతి చెందారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన ఆయన 1949 సెప్టెంబరు 9న మిరియాల వెంకట్రామయ్య, తిరుపతమ్మల రెండో సంతానంగా జన్మించారు. చక్కని రాగాలాపనతో పద్యాలు, పాటలు పాడటంతో రాగాల అప్పారావుగా పేరుగాంచారు. 1969లో బుర్రకథ రంగంలో అడుగుపెట్టారు. తొలి ఏడాదిలోనే తన చాతుర్యంతో అందరినీ అబ్బురపరిచి నడకుదురులో సువర్ణ ఘంటా కంకణం పొందారు. 1974లో రేడియోలో పలు కార్యక్రమాలు చేశారు. 1993లో దూరదర్శన్‌లో బుర్రకథలు చెప్పారు. బుర్రకథ చెప్పడంలో నాజర్‌ను స్ఫురణకు తెచ్చే అప్పారావు గాన కోకిల, బుర్రకథ టైగర్ వంటి బిరుదులు సాధించారు. చింతామణి నాటకంలో బిల్వమంగళుడు, శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడు వంటి పాత్రలను పోషించారు. ఈ ఏడాది జనవరి 15న ఆయన తుదిశ్వాస విడిచారు.

## సంస్కృత పండితుడు

సాక్షి, అమరావతి : కేంద్ర ప్రభుత్వ పద్మశ్రీ పురస్కారానికి ఎంపికై న వాదిరాజ్ పంచముఖి ప్రఖ్యాత సంస్కృత పండితుడు, ఆర్థికవేత్త. 1936 సెప్టెంబర్ 17న కర్ణాటకలోని భాగల్కోట్‌లో జన్మించారు. కర్ణాటక, బాంబే విశ్వవిద్యాలయాలతో పాటు, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో విద్యనభ్యసించారు. ఆర్థిక రంగంలో విశేష కృషి చేసి అనేక పరిశోధన వ్యాసాలు రాశారు. అవి అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. సంస్కృతంలో అనేక పుస్తకాలు, కవితలు రచించారు. తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యా పీఠ్ చాన్స్‌లర్‌గా రెండు పర్యాయాలు సేవలందించారు. టీటీడీ బోర్డ్ మెంబర్‌గా పనిచేశారు. సంస్కృతంలో రాష్ట్రపతి ప్రసంశ పత్రంలో పాటు అనేక అవార్డులను అందుకున్నారు.

# ఇక పురపాలికల్లో 'ప్రత్యేక' పాలన

- నేటితో ముగియనున్న పురపాలక మండళ్ల పదవీ కాలం
- ప్రత్యేక అధికారులుగా కార్పొరేషన్లకు జిల్లా కలెక్టర్లు, మునిసిపాలిటీలకు ఆర్డీఓ స్థాయి అధికారులు
- 120 మున్సిపాలిటీలు, 9 కార్పొరేషన్లలో ముగుస్తున్న ప్రజా ప్రతినిధుల పదవీ కాలం




సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 120 మునిసిపాలిటీలు, 9 కార్పొరేషన్లలో పాలకమండళ్ల పదవీ కాలం ఆదివారంతో ముగుస్తోంది. ఇప్పటికే గ్రామ పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీ కాలం పూర్తయి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండగా, సోమవారం నుంచి పట్టణాలు, నగరాల్లోనూ అధికారుల పాలనే సాగనుంది. రెండు రోజులు ఆలస్యంగా ఎన్నిక జరిగిన కరీంనగర్ నగరపాలక సంస్థ పాలక మండలి పదవీ కాలం మాత్రం ఈనెల 28తో ముగియనుంది. కాగా, పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో అనేక మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో శనివారమే పాలక మండళ్ల సభ్యులు సంబరాలు జరుపుకొన్నారు. కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారులుగా జిల్లా కలెక్టర్లు, మునిసిపాలిటీలకు ఆర్డీఓ స్థాయి అధికారులు ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు.

**అవినీతి ఆరోపణలు**

2020 జనవరి 22న రాష్ట్రంలోని 120 మునిసిపాలిటీలు, 9 కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. 24న కరీంనగర్ ఎన్నిక జరిగింది. అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ (టీఆర్ఎస్) మెజారిటీ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను దక్కించుకుంది. ఏకంగా 77 మునిసిపాలిటీలను ఏకగ్రీవంగా కైవసం చేసుకొని తన ఆధిపత్యాన్ని చాటింది. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోవడంతో చాలా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లు 'అవిశ్వాస' తీర్మానాల ద్వారా అధికార కాంగ్రెస్ పార్టీ పరమయ్యాయి. జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి సహా పలువురు మేయర్లు, మునిసిపల్ చైర్మన్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరో నాలుగురోజుల్లో పదవీ కాలం ముగుస్తుండగా కరీంనగర్ మేయర్ సునీల్‌రావు శనివారం బీజేపీలో చేరారు. కాగా, చాలాచోట్ల పాలక మండళ్లు డబ్బుల సంపాదనే ధ్యేయంగా ఐదేళ్ల పాలన సాగిందన్న ఆరోపణలు వచ్చాయి.

**అక్కడ ఇంకా ఏడాదిన్నర..**


రాష్ట్రంలోని హైదరాబాద్ (జీహెచ్ఎంసీ) కార్పొరేషన్ పదవీ కాలం మరో ఏడాది మిగిలి ఉండగా, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్లతోపాటు కొత్తగా ఏర్పాటైన మరో ఐదు మునిసిపాలిటీల పాలకవర్గాల పదవీ కాలం మరో ఏడాదిన్నర ఉంది. జీహెచ్ఎంసీ ఎన్నికలు 2020 డిసెంబర్ 1న జరగగా, వరంగల్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్లతోపాటు జడ్చర్ల, అచ్చంపేట, నకిరేకల్, కొత్తూరు, సిద్దిపేట మునిసిపాలిటీల ఎన్నికలు 2021 ఏప్రిల్ 30న జరిగాయి. ఈ 8 పురపాలికల పాలక మండళ్ల పదవీ కాలం ఇంకా ఏడాదిన్నర వరకు మిగిలి ఉంది.

### ఎన్నికల నాటికి ఇంకా మార్పులు

కొత్త మునిసిపల్ చట్టం ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని భావిస్తే, పదవీ కాలం మిగిలి ఉన్న పాలక మండళ్లను కూడా రద్దు చేసి ఎన్నికలు జరిపించే అవకాశం ఉంది. రాష్ట్రంలో కొత్తగా మహబూబ్‌నగర్, మంచిర్యాల మునిసిపాలిటీలను కార్పొరేషన్‌లుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు కొత్తగా 12 మునిసిపాలిటీలను ఏర్పాటు చేస్తూ ఇటీవలే ప్రభుత్వం చట్టం చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి వైపు ఉన్న 50కి పైగా గ్రామాలను పక్కనున్న మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కలిపింది. కాగా మునిసిపల్ ఎన్నికల నాటికి ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న అన్ని మునిసిపాలిటీలు, కార్పొరేషన్లను విలీనం చేసి, మూడు లేదా నాలుగు కార్పొరేషన్లుగా మార్చే యోచనతో ఉంది.

# ప్రధాని ఫొటో పెడితేనే నిధులు..

- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై ప్రధాని ఫొటో ఉండాల్సిందే
- లేకపోతే కేంద్రం నిధులు నిలిపివేసి, లబ్ధిదారులకు నేరుగా అందిస్తాం
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన కరీంనగర్ మేయర్ సునీల్‌రావు



కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన సునీల్‌రావు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: 'కేంద్రం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాలకు మళ్లిస్తున్నాయి. గతంలో నేను నిలదీయడం వల్ల వరంగల్, కరీంనగర్ స్మార్ట్‌సిటీ నిధులను గత ప్రభుత్వం విడుదల చేసింది. ఇకపై కేంద్ర నిధులతో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు, అలాగే రేషన్‌కార్డులపై సీఎంతోపాటు ప్రధాని ఫొటో తప్పకుండా ఉండాల్సిందే. లేకపోతే ఆయా పథకాలకు నిధులు నిలిపివేస్తాం' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో నగర మేయర్ సునీల్‌రావు, పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, కేంద్రం ఇచ్చే నిధులతో అమలయ్యే పథకాలకు ప్రధాని ఫొటోను వాడకుంటే తామే లబ్ధిదారులకు నేరుగా నిధులు ఇచ్చేలా ఆలోచన చేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్‌పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డికి గురువు కేసీఆరేనని, అందుకే.. ఆయన బాటలోనే రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. 'సీఎం రేవంత్ బీఆర్ఎస్ నేతలను తొలుత కేసులతో భయపెట్టి, ఆపై కాంగ్రెస్ అధిష్టానానికి డబ్బులు ఇవ్వగానే.. వాటిని పక్కనబెడుతున్నారు. గతంలో పెట్టిన కేసులన్నీ ఇలాగే నీరుగార్చారు' అని ధ్వజమెత్తారు.

**కంపెనీలు, నిధులపై శ్వేతపత్రం ప్రకటించాలి**

'పార్టీలకు చందాలిచ్చిన గ్రీన్‌కో లాంటి సంస్థపై ఏసీబీ దాడులు చేయడం రాష్ట్రానికి నష్టం. ఫలితంగా పలు కంపెనీలు రాష్ట్రం నుంచి తరలివెళ్తున్నాయి. అసలు 2014 నుంచి రాష్ట్రానికి వచ్చిన కంపెనీలు, నిధులు, కల్పించిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. రాష్ట్రానికి కేంద్రం ఎన్ని నిధులిచ్చినా.. కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు ఇచ్చినా, ఏ కార్యక్రమానికీ నన్ను పిలవలేదు. బీఆర్ఎస్ పాలన మొత్తం అవినీతిమయం. సునీల్‌రావు చేరికతో రాబోయే బల్దియా ఎన్నికల్లో కరీంనగర్‌లో బీజేపీ విజయబావుటా ఎగరేస్తుంది' అని సంజయ్ అన్నారు. అనంతరం సునీల్‌రావు మాట్లాడుతూ.. మాజీ మంత్రి గంగుల కమలాకర్‌పై పలు ఆరోపణలు చేశారు.

## క్లుప్తంగా...

### తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరికి జీవన్ రక్షా పదక్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే జీవన్ రక్షా పతకాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. 2024 సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా 17 మందికి సర్వోత్తమ్ జీవన్ రక్షా పదక్, 9 మందికి ఉత్తమ్ జీవన్ రక్షా పదక్, 23 మందికి జీవన్ రక్షా పదక్‌తో సహా మొత్తం 49 మంది వ్యక్తులకు జీవన్ రక్షా పదక్ సిరీస్ అవార్డ్స్‌ను ప్రదానం చేయడానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. ఇందులో ఆరుగురు అవార్డు గ్రహీతలకు వారి మరణానంతరం అందిస్తున్నారు. కాగా, జీవన్ రక్షా పదక్‌లో అవార్డులకు ఎంపికైన వారిలో ఏపీకి చెందిన నెల్లి శ్రీనివాసరావు, తెలంగాణకు చెందిన బండకింది శ్రవణ్ కుమార్ ఉన్నారు. ఈ మేరకు శనివారం కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది.

### మంత్రి దామోదరను కలిసిన డీఎంఈ నరేంద్ర

సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య సంచాలకుడిగా నియమితులైన నరేంద్రకుమార్ శనివారం ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను డీఎంఈగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన.. రాష్ట్రంలోని వైద్య, నర్సింగ్ కళాశాలల పరిస్థితిపై మంత్రితో చర్చించారు. ఈ సందర్భంగా వైద్య కళాశాలలు, టీచింగ్ ఆస్పత్రుల అభివృద్ధికి మరింత కృషి చేయాలని రాజనర్సింహ సూచించారు. వైద్య విద్య ప్రమాణాలు మెరుగుపడేలా, టీచింగ్ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

### యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా చింతల రవీంద్రనాథ్



సాక్షి, హైదరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ అధ్యక్షుడిగా చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఎంపికయ్యారు. ఇటీవల జైపూర్‌లో జరిగిన అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, కోకాపేట్ శ్రీకృష్ణను.. యాదవ్ భవన్ ట్రస్ట్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉండటంతో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో చింతల మీడియాతో మాట్లాడారు. సదర్ పండుగను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

### ఉమ్మడి జిల్లాల్లో గిరిజనులకు శిక్షణ శిబిరాలు

ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లయ్య నాయక్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి పది జిల్లాల్లో గిరిజనులకు శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్టు ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు తేజావత్ బెల్లయ్యనాయక్ చెప్పారు. అందులో భాగంగా ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా శిక్షణ శిబిరాన్ని కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల గ్రామంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పది జిల్లాల్లో శిక్షణ శిబిరాలు పూర్తయిన తర్వాత.. శిక్షణ పొందిన కార్యకర్తలతో రాష్ట్ర స్థాయిలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను ఆహ్వానించి.. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి వివరిస్తామని చెప్పారు.

### మావోయిస్టు దామోదర్ క్షేమంగానే ఉన్నారు

లేఖ విడుదల చేసిన సౌత్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి సమత

సాక్షి, హైదరాబాద్: మావోయిస్టు పార్టీ నేత, తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, పార్టీ సహచరులు క్షేమంగా ఉన్నారని మావోయిస్టు పార్టీ స్పష్టం చేసింది. ఈ మేరకు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్టు) సౌత్ సబ్ జోనల్ బ్యూరో ప్రతినిధి సమత పేరిట హిందీలో ప్రకటన విడుదలైంది. ప్రజల్లో అయోమయం సృష్టించేందుకు మావోయిస్టుల పేరిట పోలీసులే నకిలీ లేఖలు విడుదల చేశారని లేఖలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 16, 17 తేదీల్లో 8 వేల మంది పోలీసు బలగాలు బీజాపూర్ జిల్లాలోని సింగవరం, తుండెపల్లి, మల్లంపెంట, పూజారి కంకేర్, తేమల్బట్టి గ్రామాల్లో ప్రజలపై దాడులకు దిగారని పేర్కొన్నారు. డీఆర్‌జీ, బస్తర్ ఫైటర్స్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా కమాండో బలగాలు, భారత సైన్యానికి చెందిన కొన్ని బలగాలతో ప్రజలపై దాడి చేశారని చెప్పారు. ఇందులో నలుగురు గ్రామస్తులు హత్యకు గురయ్యారు. ప్రజలకు వైద్యం అందించేందుకు వెళ్లిన పార్టీ సహచరులను నిరాయుధులుగా పట్టుకుని, ప్రజల ముందు చిత్రహింసలకు గురిచేసి, దారుణంగా హత్య చేశారని లేఖలో వెల్లడించారు. భద్రతా బలగాలతో పీఎల్‌జీఏ ఆరుసార్లు ఘర్షణ పడిందని, ఈ ఘటనలో 6 మంది పోలీసులు మరణించగా, 8 మంది పోలీసులు గాయపడ్డారని మావోయిస్టు పార్టీ ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ ఎన్‌కౌంటర్‌లో అమరులైన తమ సహచరులందరికీ నివాళులర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. బీజేపీ మావోయిస్టులకే కాకుండా దేశ ప్రజలందరికీ పెద్దముప్పుగా మారిందని లేఖలో పేర్కొన్నారు.

# బలపాలు.. తెగ తినేస్తున్నారు..!

## కళాశాల అమ్మాయిల్లో పాకిన జాడ్యం • బ్రాండ్లు అడిగి మరీ కొనుగోలు

### తెల్లగా మారుతామనే ఆశతో అలవాటు • నాలుగింతలు పెరిగిన అమ్మకాలు • ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



కోదాడ: చిన్నప్పుడు బడిలో టీచర్‌కు కనిపించకుండా బలపాలు తినటం చాలామందికి అనుభవమే. నేడు నర్సరీ నుంచే పెన్సిల్, నోట్‌బుక్ వాడుతుండటంతో స్కూళ్లలో బలపం, పలకతో పనే లేకుండా పోయింది. కానీ, ఈ బలపాలు తినే అలవాటు ఇప్పుడు డిగ్రీ, ఇంజనీరింగ్ చదువుతున్న అమ్మాయిల్లో పెరిగిపోతోంది. ఒకరిని చూసి మరొకరు ఈ జాడ్యానికి బానిసలుగా మారుతున్నారు. బ్రాండ్ల (కంపెనీలు)ను ఎంపిక చేసుకొని మరీ కొనుగోలు చేస్తున్నారు. గతంలో వారానికి ఒక కాటన్ బలపాలు విక్రయించే దుకాణదారులు, ఇప్పుడు రోజూ రెండుమూడు కాటన్ల బలపాలు అమ్ముతున్నామని చెబుతున్నారు. దీన్నిబట్టే ఈ జాడ్యం ఎంతగా విస్తరిస్తుందో అర్థం చేసుకోవచ్చు.

**రంగుమారుతామన్న భ్రమలో..**

సుద్దతో (క్యాల్షియం కార్బొనేట్)తో తయారు చేసే బలపాలు తినడం వల్ల చర్మం రంగు మారి తెల్లగా అవుతారనే తప్పుడు ప్రచారంతో పలువురు బాలికలు వీటిని తింటున్నట్లు తెలుస్తోంది. సుద్దలో క్యాల్షియం కార్బొనేట్‌తో పాటు స్వల్ప మోతాదులో కాడ్మియం, లెడ్ వంటి రసాయనాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల బాలికల్లో రక్త హీనత ఏర్పడి ముఖం పాలిపోయినట్లుగా తయారవుతుందని, దీన్ని రంగుమారడం అనుకుంటున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇలా రంగులో తేడా వచ్చినట్లు కనిపిస్తే వారి ఆరోగ్యం ప్రమాదకరస్థాయికి చేరినట్లుగా భావించాలని సూచిస్తున్నారు.

**ముఖం చూసి చెప్పొచ్చు..**

బలపాలు తింటున్నవారి ముఖం చూసిన వెంటనే గుర్తించవచ్చని వైద్యులు అంటున్నారు. ముఖం పాలిపోయినట్లుగా మారడంతో పాటు పెదాలు నలుపురంగులోకి మారుతాయని, ఆకలి మందగించడంతో ఆహారం తీసుకోరని, రక్తహీనత ఎక్కువ కావడంతో బలహీనంగా తయారవుతారని చెబుతున్నారు. భవిష్యత్తులో సంతానలేమి వంటి సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. బలపాలు తినేవారిలో కొంత ఆత్మన్యూనతాభావం కూడా కనిపిస్తుందని అంటున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించిన తగిన కౌన్సెలింగ్ ఇస్తే.. బలపాలు తినే అలవాటు నుంచి బయటకు తీసుకురావచ్చని సూచిస్తున్నారు. ఆలస్యం చేయడం వల్ల బాలికల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడి.. తిరిగి కోలుకోవడం కష్టంగా మారుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**ఎంతరేటైనా పర్వాలేదు..**

గత నాలుగైదు సంవత్సరాలుగా బలపాల అమ్మకాలు పుంజుకున్నాయని కోదాడలోని దుకాణదారులు అంటున్నారు. ముఖ్యంగా ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివే పిల్లలు రోజూ వీటిని కొనుగోలు చేస్తున్నారు. రూ.5 విలువైన చిన్న డబ్బాలను రూ.10 ధర చెప్పినా కొంటున్నారు. కొందరు టైగర్ బ్రాండ్ కావాలని, మరికొందరు క్యామిల్ బ్రాండ్ కావాలని.. ధర ఎంతైనా పర్వాలేదని చెప్పి కొంటున్నారు. గతంలో నెలకు ఒక కాటన్ (25 డబ్బాలు) అమ్మే తాము.. ఇప్పుడు వారానికి రెండు కాటన్స్ అమ్ముతున్నామని దుకాణదారులు చెబుతున్నారు.

**మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం**

క్యాల్షియం కార్బొనేట్‌తో తయారు చేసే బలపాలు తింటే మూత్ర పిండాలపై అధిక ప్రభావం పడుతుంది. మూత్ర పిండాలలో రాళ్లు ఏర్పడి తీవ్ర నొప్పి వస్తుంది. కడుపులో అల్సర్స్ ఏర్పడి జీర్ణ సమస్యలు, రక్తహీనత వస్తుంది. డయేరియా, రుతుస్రావం ఆలస్యం కావడం, దంతాలు దెబ్బతినడం, దవడలు పాడవడం వంటి సమస్యలు వస్తాయి. గర్భిణిలు బలపాలు తింటే ఆ ప్రభావం పుట్టబోయే బిడ్డలపై కూడా పడుతుంది. పాఠశాలలు, కళాశాలల్లో బాలికలకు దీనిపై అవగాహన కల్పించాలి.

– డాక్టర్ పోలూరు నందకిశోర్, కోదాడ, సూర్యాపేట జిల్లా

# 'సర్వే'లు మీ బాధ్యత కాదా?

- టెండర్లకు ముందే సర్వేలు, డిజైన్లపై అధ్యయనం ఎందుకు చేయలేదు?
- 45 ఏళ్లు ఉండాల్సిన బరాజ్ అప్పుడే ఎలా దెబ్బతింది?
- 'అన్నారం' నిర్మాణ సంస్థ అఫ్కాన్స్‌ను ప్రశ్నించిన పీసీ ఘోష్ కమిషన్
- ఈపీసీలోనే సర్వేలు, డిజైన్లు చేస్తామన్న సంస్థ ప్రతినిధి నాగ మల్లికార్జున రావు



విచారణకు వస్తున్న నాగ మల్లికార్జునరావు

సాక్షి, హైదరాబాద్: బరాజ్ నిర్మాణానికి ముందు సర్వేలు, డిజైన్లపై సమగ్ర అధ్యయనం చేయడం మీ బాధ్యత కాదా? అని అన్నారం బరాజ్ నిర్మాణ సంస్థ అఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ హైడ్రో బిజినెస్ విభాగాధిపతి కె.నాగమల్లికార్జున రావును జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రశ్నించింది. ఈపీసీ పద్ధతిలో పనులకు ముందు సర్వేలు, డిజైన్లను తయారు చేస్తామని, పీస్ రేటు విధానంలో బరాజ్ నిర్మించడంతో ఈ విషయంలో తమ బాధ్యత ఉండదని నాగమల్లికార్జున రావు బదులివ్వగా, కమిషన్ తప్పుబట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణలో భాగంగా కమిషన్ శనివారం నాగ మల్లికార్జునరావుకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించింది. బరాజ్ అంచనా వ్యయం రూ.1,450 కోట్ల నుంచి రూ.1,890 కోట్లకు ఎందుకు పెరిగింది? అని కమిషన్‌ప్రశ్నించగా, ఒప్పందం తర్వాత బరాజ్ లొకేషన్ అనువుగా లేదని గుర్తించి మార్చాలని నీటిపారుదల శాఖను కోరామన్నారు. బరాజ్ నిల్వ సామర్థ్యం పెంచడంతోపాటు భూసేకరణ, అటవీ భూముల సేకరణతోపాటు మేడిగడ్డ పంప్‌హౌజ్ నుంచి అన్నారం బరాజ్ మధ్య కాల్వ పొడవును తగ్గించడం కోసం సైట్‌ను మార్చాలని కోరామన్నారు. మళ్లీ కొత్త ప్రదేశంలో భూసేకరణ జరిపి తమకు అప్పగించేందుకు సమయం పట్టిందని బదులిచ్చారు. టెండర్లలో పాల్గొనడానికి ముందు సైట్‌ను పరీక్షించి నిర్మాణ యోగ్యతను నిర్ధారించుకోరా? అని కమిషన్ నిలదీసింది.

**అధిక షూటింగ్ వెలాసిటీతోనే నష్టం**

అన్నారం బరాజ్ దిగువన సీసీ బ్లాకులు కొట్టుకుపోయి బరాజ్‌లో సీపేజీలు ఎందుకు ఏర్పడ్డాయని కమిషన్ ప్రశ్నించగా, నాగమల్లికార్జున రావు సుదీర్ఘ వివరణ ఇచ్చారు. 2018 అక్టోబర్‌లో 5 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సీసీ బ్లాకులకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. 2019 జనవరిలో గేట్ల నిర్మాణం పూర్తి కాగా, ఆ తర్వాత జూలైలో గేట్లను మూసివేశారన్నారు. బరాజ్ పూర్తిగా నిండినా ఏమీ కాలేదన్నారు. అక్టోబర్, నవంబర్‌లో వరదలొచ్చినప్పుడు బరాజ్ గేట్లను 300–500 మి.మీ. మేర స్వల్పంగా పైకి లేపగా, సెకనుకు 20 మీటర్ల అపరిమిత వేగంతో నీళ్లు బయటకి దూకడంతో దిగువన బరాజ్‌కి రక్షణగా నిర్మించిన సీసీ బ్లాకులు కొట్టుకుపోగా, నీటిపారుదల శాఖ సూచనలతో పునరుద్ధరించామన్నారు. గేట్లను తక్కువ ఎత్తులో లేపినట్టు.. వేగంగా చొచ్చుకు (షూటింగ్ వెలాసిటీ) వచ్చే ప్రవాహం పడే చోట తగిన నీటి నిల్వ ఏర్పాట్లు (స్టిల్లింగ్ బేసిన్) లేకే ఇలా జరిగిందని నిపుణులు గుర్తించారన్నారు. తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ లేబొరేటరీ వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మోడల్ స్టడీస్ నిర్వహించి స్టిల్లింగ్ బేసిన్‌ను మరో 3 మీటర్లు పొడిగించాలని సిఫారసు చేసిందన్నారు. నీటిపారుదల శాఖ ఆ మేరకు చర్యలు తీసుకుందా? అని కమిషన్ ప్రశ్నించగా, లేదని బదులిచ్చారు.

**అప్పుడే దెబ్బతింటే ఎలా..?**

బరాజ్ నిర్మాణానికి మూడేళ్లు అవసరమని ఓ ప్రశ్నకు నాగమల్లికార్జున రావు బదులిచ్చారు. కేవలం మూడేళ్లనా? అని కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. బరాజ్ జీవిత కాలం ఎంత? అని మళ్లీ ప్రశ్నించగా, 100 ఏళ్లు అయి ఉండొచ్చని రావు చెప్పారు. బరాజ్ కనీసం 45 ఏళ్లు చెక్కుచెదరకుండా ఉండాలని, అప్పుడే దెబ్బతింటే ఎలా? అని కమిషన్ తప్పుబట్టింది.

## పొంతనలేని జవాబులిచ్చిన వారికి మళ్లీ కబురు

- రెండోసారి ప్రశ్నించనున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
- బరాజ్‌ల టెండర్ల ప్రక్రియపై లోతుగా అధ్యయనం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణం విషయంలో పొంతన లేని సమాధానాలిచ్చిన వారికి జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. నీటిపారుదల శాఖ ఇంజనీర్లు, ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇప్పటివరకు కమిషన్ క్రాస్‌ఎగ్జామినేషన్ జరిపింది. వీరిలో కొందరు పరస్పర విరుద్ధమైన సమాచారం ఇచ్చినట్టు కమిషన్ గుర్తించింది. ఇక కొందరైతే గతంలో తామిచ్చిన అఫిడవిట్లలోని సమాచారంతో పోల్చితే క్రాస్‌ఎగ్జామినేషన్‌లో పూర్తి విరుద్ధంగా వాంగ్మూలం ఇచ్చారు. త్వరలో వారికి కమిషన్ మళ్లీ సమన్లు జారీ చేసి మళ్లీ క్రాస్ ఎగ్జామినేషన్‌కు రావాలని ఆదేశించనుంది. శనివారంతో నిర్మాణ సంస్థల ప్రతినిధుల క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ ముగిసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో ఇంజనీరింగ్ లోపాలను ఎత్తిచూపుతూ అఫిడవిట్లు దాఖలు చేసిన ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘుతో పాటు నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజనీర్ దొంతు లక్ష్మీనారాయణను సోమవారం రావాలని కమిషన్ కబురు పంపింది. వీరితోపాటు మొత్తం ఐదుగురికి కమిషన్ సోమవారం క్రాస్ ఎగ్జామినేషన్ జరపనుంది.

**బరాజ్‌ల టెండర్లపై విచారణ**

బరాజ్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో అవకతవకలను కమిషన్ తవ్వితీస్తోంది. మేడిగడ్డ బరాజ్‌కి నిర్వహించిన టెండర్లలో ఎల్ అండ్ టీతోపాటు మరో రెండు కంపెనీలు మాత్రమే పాల్గొన్నట్టు గుర్తించింది. రెండు డమ్మీ కంపెనీలతో టెండర్లు వేయించి ఎల్ అండ్ టీకి టెండర్లు దక్కేలా చేశారా? అనే అంశంపై కమిషన్ ఆరా తీస్తున్నట్లు తెలిసింది. కాగా, ఫిబ్రవరిలో మరో ఐదారు మంది సాక్ష్యులను, మార్చిలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, ఈటలను ప్రశ్నించే అవకాశముంది.

## 31న కొత్త ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన

- భవన నిర్మాణ నిబంధనలు పక్కాగా పాటించాలి... సకల సౌకర్యాలతో ఆహ్లాదకర వాతావరణం ఉండాలి
- సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- అంబేడ్కర్ వర్సిటీలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న సీఎం



సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి దామోదర తదితరులు

సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 31న శంకుస్థాపన చేయనున్నారు. ఇందు కోసం ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. భవన నిర్మాణ నిబంధనలు పాటిస్తూ వందేళ్ల అవసరాలకు తగినట్లుగా పూర్తి ఆధునిక వసతులతో ఆసుపత్రిని నిర్మించాలని సీఎం తెలిపారు. నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం ముఖ్యమంత్రి తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణంతోపాటు బోధన సిబ్బంది, విద్యార్థులకు వేర్వేరుగా నిర్మించే హాస్టల్ భవనాల విషయంలోనూ పూర్తి నిబంధనలు పాటించాలని సూచించారు. ఆసుపత్రికి నలువైపులా రాకపోకలు సాగించేలా రహదారులు ఉండాలని సూచించారు. రోగులు, సహాయకులు, పరామర్శకు వచ్చే వారి వాహనాలు నిలిపేందుకు అండర్‌గ్రౌండ్‌లో రెండు ఫ్లోర్లలో పార్కింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. డార్మిటరీ, ఫైర్ స్టేషన్, క్యాంటీన్, మూత్రశాలలు, ఎస్టీపీలు ఆసుపత్రికి అనుబంధంగా నిర్మించాలని ఆదేశించారు. ఆధునిక సౌకర్యాలతో మార్చురీ, బాడీ ఫ్రీజింగ్ కోసం నిర్మాణాలు ఉండాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో రోగుల తరలింపునకు వీలుగా హెలిప్యాడ్ కూడా నిర్మించాలని సూచించారు. ఆసుపత్రిలో అడుగుపెట్టగానే ఆహ్లాదకర వాతావరణం ఉండాలని సీఎం స్పష్టంచేశారు. సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (మౌలిక వసతులు) శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్స్ కమిషనర్ శశాంక, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

**నేడు అంబేడ్కర్ వర్సిటీకి సీఎం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని సందర్శించనున్నారు. వర్సిటీలో ఏర్పాటుచేసిన 15 అడుగుల అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి విశ్వవిద్యాలయంలో నిర్మించనున్న నాలుగు నూతన భవనాలకు, ఆధునిక బస్ షెల్టర్‌కు శంకుస్థాపన చేయనున్నారు.

## తెలంగాణకు రెండు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు



విక్రమ్‌సింగ్ మన్

- సీపీ విక్రమ్‌సింగ్ మన్, ఎస్పీ మెట్టు మాణిక్‌రాజ్‌లకు పురస్కారం
- 19 మంది అధికారులకు ప్రతిభా సేవా పతకాలు
- దేశవ్యాప్తంగా 942 మందికి పోలీసు పతకాలు ప్రకటించిన కేంద్ర హోంశాఖ

సాక్షి, న్యూఢిల్లీ: 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా తెలంగాణకు చెందిన ఇద్దరు పోలీసు అధికారులకు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు లభించాయి. రాష్ట్రం నుంచి పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మన్, ఎస్పీ మెట్టు మాణిక్‌రాజ్‌లు ఈ పురస్కారాలకు (పోలీస్ సర్వీస్) ఎంపికయ్యారు. కాగా దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ సేవల్లోని మొత్తం 942 మంది అధికారులకు కేంద్ర ప్రభుత్వం పోలీసు పతకాలను ప్రకటించింది. ఈ మేరకు శనివారం కేంద్ర హోంశాఖ పతకాల జాబితాను విడుదల చేసింది. శౌర్య (గ్యాలంట్రీ) పతకాలు దక్కించుకున్న 95 మందిలో అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్ నుంచి 17 మంది, జమ్మూకశ్మీర్ నుంచి 15 మంది, ఛత్తీస్‌గఢ్ నుంచి 11 మంది, సీఆర్పీఎఫ్ నుంచి 19 మంది, బీఎస్ఎఫ్ నుంచి ఐదుగురు, సశస్త్ర సీమాబల్ నుంచి నలుగురు పోలీసు అధికారులు ఉన్నారు. కేంద్రం ప్రకటించిన మొత్తం 942 పతకాలలో 95 మంది పోలీసు అధికారులకు శౌర్యపతకాలు (గ్యాలెంట్రీ మెడల్స్), 101 మందికి రాష్ట్రపతి పోలీసు విశిష్ట సేవా పతకాలు దక్కాయి. వీరితోపాటు 746 మంది పోలీసు, ఫైర్, హోంగార్డు, కరెక్షనల్ సర్వీసులకు ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. ఇందులో తెలంగాణ రాష్ట్రానికి చెందిన 12 మంది పోలీసులతో పాటు ముగ్గురు అగ్ని మాపక సిబ్బంది, నలుగురు హోంగార్డు సర్వీస్ అధికారులకు పోలీసు ప్రతిభా సేవా పతకాలు లభించాయి. ఐజీ కార్తికేయ, ఎస్పీ అన్నల ముత్యంరెడ్డి, డీసీపీ కమల్ల రామ్‌కుమార్, డీసీపీ మహ్మద్ ఫజ్లూర్ రహమాన్, డీఎస్పీ కోటపాటి వెంకటరమణ, డీఎస్పీ అన్ను వేణుగోపాల్, ఏఎస్ఐలు రణ్‌వీర్ సింగ్ ఠాకూర్, పీటర్ జోసెఫ్ బహదూర్, మహ్మద్ మొయినుల్లా ఖాన్, ఇన్‌స్పెక్టర్ అనుమల నిరంజన్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్స్ వద్యపత్య నాయక్, మహ్మద్ అయాబ్ ఖాన్‌లు పోలీసు ప్రతిభా సేవా పతకాలకు ఎంపికయ్యారు. అంతేగాక తెలంగాణకు చెందిన లీడింగ్ ఫైర్‌మెన్‌లు వేంకటేశ్వరరావు మోరుబోయిన, సుబ్బయ్య చావల, జనార్దన్ కారుకూరిలతో పాటు నలుగురు హోంగార్డ్‌లు ఈశ్వరయ్య మంత్రి, యాదగిరి మేడిపల్లి, అయిలయ్య కల్లెంల, లక్ష్మణ్ కోమటిలు ప్రతిభా సేవా పతకాలను అందుకోనున్నారు.

# బీజేపీ పాలనకు.. బ్రిటిష్ పాలనకు తేడా లేదు

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ • సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా ర్యాలీ



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న బృందా కారత్, బీవీ రాఘవులు, జూలకంటి తదితరులు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయడం లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా శనివారం సంగారెడ్డిలో నిర్వహించిన బహిరంగసభలో ఆమె మాట్లాడారు. బ్రిటిష్ పాలకులలాగే దేశంలో కులాలు, మతాల పేరుతో ప్రజలను విభజించి పాలించి లబ్ధిపొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలకులు పైకి రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని, వారి హృదయాల్లో మాత్రం మనువాదమే ఉందన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి: రాఘవులు**

మోదీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నారని, అలా జరిగితే మన ప్రాథమిక హక్కులను కూడా కోల్పోవాల్సి వస్తుందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు పేర్కొన్నారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక విధానం వస్తే అన్ని రాజకీయ పార్టీల పని అయిపోతుందని ఆయన జోస్యం చెప్పారు. బహిరంగసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పట్టణంలో ర్యాలీ నిర్వహించాయి.

# త్రిపుర గవర్నర్ ఫోన్‌నూ ట్యాప్ చేశారు

- ఇంద్రసేనారెడ్డినీ వదిలిపెట్టని ప్రభాకర్‌రావు బృందం
- బీఆర్ఎస్ కీలక నేతల ఆదేశాల మేరకు ప్రతిపక్ష నేతలపై నిఘా
- దర్యాప్తులో ఈ విషయం గుర్తించిన పోలీసు అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) కేంద్రంగా చోటుచేసుకున్న అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో కీలకాంశం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో త్రిపుర గవర్నర్‌గా ఉన్న నల్లు ఇంద్రసేనారెడ్డి ఫోన్ పైనా నిఘా ఉంచినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి దర్యాప్తు అధికారులు ఇటీవల ఆయన వ్యక్తిగత సహాయకుడి నుంచి వాంగ్మూలం నమోదు చేశారు. బీఆర్ఎస్ కీలక నేతల ఆదేశాల మేరకు పనిచేసిన నాటి ఎస్ఐబీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నేతృత్వంలోని బృందం ప్రధానంగా ప్రతిపక్ష నేతల్ని టార్గెట్‌గా చేసుకుంది. వారి కదలికలు, ఎత్తులు పైఎత్తుల్ని ఎప్పటికప్పుడు గుర్తించడానికి నాటి డీఎస్పీ ప్రణీత్‌రావు అధీనంలోని స్పెషల్ ఆపరేషన్ టీమ్‌లో (ఎస్ఓటీ) ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలకు చెందిన కీలక నేతల ఫోన్లు ట్యాప్‌చేయడం ద్వారా ఆయా పార్టీల వ్యూహాలను కనిపెట్టారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కొందరి ఫోన్లు ట్యాప్ అయినట్లు గతంలోనే వెలుగులోకి వచ్చింది. గతంలో ఆయా పార్టీల్లో పనిచేసి, ఎన్నికల సమయంలో రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారినీ ప్రభాకర్‌రావు టీమ్ వదిలిపెట్టలేదు.

**బీఆర్ఎస్‌ను దెబ్బతీసే అవకాశం ఉందని...**

గత ఏడాది అక్టోబర్ 26న ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. దానికి ముందు నగరం కేంద్రంగా బీజేపీ క్రియాశీల రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలోనే గవర్నర్‌గా వెళ్లినప్పటికీ ఆయన నగర, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారని, తమ పార్టీని దెబ్బతీసే వ్యూహాలు పన్నుతున్నారని బీఆర్ఎస్ నాయకులు భావించారు. ఈ కారణంగానే ప్రభాకర్‌రావు బృందంకు ఆయన ఫోన్ ట్యాప్ చేసే బాధ్యతలు అప్పగించారు. దీంతో గత ఏడాది నవంబర్ 15 నుంచి 30వ తేదీ వరకు ఎస్ఐబీ అధికారులు ఆయన ఫోన్‌ను అక్రమంగా ట్యాప్ చేశారు. ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న నగర పోలీసులు సాంకేతిక ఆధారాలను బట్టి ఈ విషయం గుర్తించారు. ఆయన నగర, రాష్ట్ర రాజకీయాల్లో జోక్యం చేసుకుంటున్నట్లు ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో ఎన్నికల క్రతువు పూర్తయ్యే వరకు ట్యాప్ చేయకుండా వదిలేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఇంద్రసేనారెడ్డి గవర్నర్‌గా ఉన్నారు. అప్పట్లో ఆయన ఫోన్ వ్యక్తిగత సహాయకుడి వద్దే ఉండేది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఇటీవల ఇంద్రసేనారెడ్డి వ్యక్తిగత సహాయకుడి నుంచి వాంగ్మూలం నమోదు చేసింది. ట్యాపింగ్ వ్యవహారంలో మరికొందరు ప్రముఖులు కూడా బాధితులుగా మారినట్లు పోలీసులు అనుమానిస్తూ ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు.

# వారంలోగా విచారణకు రండి

- ఎఫ్ఈఓ కంపెనీ సీఈఓకు నోటీసు ఇచ్చిన ఏసీబీ
- ఫార్ములా–ఈ కారు రేసులో కీలక మలుపు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ కారు రేసు కేసు విచారణ మరో కీలక మలుపు తిరిగింది. ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణ సంస్థ ఫార్ములా ఈ–ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సీఈఓకు ఏసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు ఈ–మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. ఇప్పటివరకు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్‌తోపాటు నిందితులు ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డిలను విచారించారు. వీరితోపాటు గ్రీన్‌కో, ఏస్ నెక్స్ట్‌జెన్ కంపెనీల ప్రతినిధులనూ విచారించారు. దర్యాప్తునకు హాజరైన తర్వాత, అంతకుముందు పలు సందర్భాల్లో కేటీఆర్ ఈ కేసు గురించి పలు వ్యాఖ్యలు చేశారు. ఎఫ్ఈఓకు నిధులు చెల్లించాలని తానే ఆదేశించానని, ఆ నిధులు సైతం ఎఫ్ఈఓ ఖాతాలో ఉన్నాయని.. ఇందులో అవినీతికి తావేలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు ఎఫ్ఈఓ సీఈఓకు నోటీసులు జారీ చేయడం ఆసక్తికరంగా మారింది. అయితే, విచారణకు హాజరయ్యేందుకు నాలుగు వారాల సమయం కావాలని ఏసీబీ అధికారులను ఎఫ్ఈఓ సీఈఓ కోరినట్టు తెలిసింది.

**నిధుల మళ్లింపుపై దృష్టి**

ఎఫ్ఈఓ ప్రతినిధులు ఏసీబీ విచారణకు హాజరవుతారా? హాజరైతే వారిచ్చే సమాచారంతో విచారణ ఎలాంటి మలుపు తీసుకుంటుంది అన్న చర్చ జరుగుతోంది. కారు రేసు నిర్వహణకు ఒప్పందాలు కుదుర్చుకోవడం మొదలు..నిధుల మళ్లింపు వరకు అనేక అంశాలపై ఏసీబీ పలు కీలక ఆధారాలు సేకరించింది. వీటి ఆధారంగానే కంపెనీ సీఈఓకు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. కారు రేసు నిర్వహణ కోసం హెచ్ఎండీఏ సాధారణ నిధుల నుంచి లండన్‌లోని ఫార్ములా–ఈ ఆపరేషన్స్ కంపెనీకి రూ.46 కోట్ల మేర నిధులు మళ్లించారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా చేశారన్నది ఏసీబీ కేసులోని ప్రధానాంశం. తాజాగా ఏసీబీ ఇప్పుడు నిధుల మళ్లింపు వ్యవహారంపై దృష్టి పెట్టింది. ఎఫ్ఈఓ సీఈఓ నుంచి హెచ్ఎండీఏ నుంచి నగదు మళ్లింపు ఏ బ్యాంకు ఖాతా ద్వారా వచ్చాయి? అందుకు సంబంధించిన పత్రాలు, ఫార్ములా–ఈ కారు రేసు నిర్వహణకు సంబంధించి చేసుకున్న ఒప్పంద పత్రాలు ఏసీబీ అధికారులు కోరినట్టు తెలిసింది.



## నితీశ్‌కు గాయం... ఎన్‌సీఏకు పయనం!

ముంబై: కొన్నాళ్లుగా టి20లతో పాటు ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలోనూ ఆకట్టుకున్న ఆంధ్ర ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి గాయంతో ఇంగ్లండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న ద్వైపాక్షిక టి20 సిరీస్‌కు దూరమయ్యాడు. పవర్ హిట్టర్-పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ రెడ్డి శుక్రవారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తుండగా పక్కటెముకల గాయానికి గురయ్యాడు. అతడు తిరిగి పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కనీసం నాలుగు వారాలు పట్టనుంది. దాంతో నితీశ్‌ను బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)కు పంపుతున్నట్లు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఒక ప్రకటనలో తెలిపింది. కాగా ప్రస్తుత సిరీస్ కోసం అతని స్థానంలో ఆల్‌రౌండర్ శివమ్ దూబేను ఎంపిక చేసినట్లు బోర్డు తెలిపింది. లోయర్ ఆర్డర్ బ్యాటర్ రింకూ సింగ్ కూడా తదుపరి టి20లకు దూరమయ్యాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో అతని వెన్నెముకకు గాయమైంది. దీంతో అతని స్థానాన్ని రమణ్‌దీప్ సింగ్‌తో భర్తీ చేసినట్లు బోర్డు తెలిపింది. 28న రాజ్‌కోట్‌లో, 31న పుణేలో, ఫిబ్రవరి 2న ముంబైలో వరుసగా మూడు, నాలుగు, ఐదో టి20లు జరుగుతాయి.

**మిగతా టి20లకు భారత జట్టు:** సూర్యకుమార్ (కెప్టెన్), సామ్సన్, అభిషేక్, తిలక్ వర్మ, పాండ్యా, దూబే, రమణ్‌దీప్, జురెల్, అక్షర్, హర్షిత్ రాణా, షమీ, అర్ష్‌దీప్, వరుణ్, బిష్ణోయ్, సుందర్.

# తిలక్ తడాఖా

భారత్ ముందున్న లక్ష్యం 166. స్కోరేమో 15 ఓవర్లలో 126/7. అంటే ఈ పాటికే అర్థమై ఉంటుంది. మిగిలిందల్లా టెయిలెండర్లే అని! గెలుపు కష్టమని!! కానీ వారితో పాటు ఒకడు మిగిలాడు. అతడే తెలుగు తేజం నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ. 30 బంతుల్లో 40 పరుగులు... ఇది గెలుపు సమీకరణం. సరిజోడు లేకపోయినా, బ్యాటింగ్ చేయగలిగే ఆటగాడు కరువైనా... వెన్నుచూపలేదు. ఇంగ్లండ్ బౌలింగ్‌కు తమ సహచరుల్లా తలొంచలేదు. ఆర్చర్ 16వ ఓవర్లో 0, 6, 6, 1, 4, 2లతో 19 పరుగులొచ్చాయి. ఇందులో 2 సిక్స్‌లు, 1 పరుగు తిలకే చేశాడు. ఇక 24 బంతుల్లో 21 పరుగులు కావాలి. ఇది భారత్‌ను ఊరించింది. కానీ ఆదిల్ రషీద్ 17వ ఓవర్లో 1 పరుగిచ్చి అర్ష్‌దీప్‌ను అవుట్ చేయడంతో మళ్లీ టెన్షన్... టెన్షన్... అప్పుడు రవి బిష్ణోయ్ (5 బంతుల్లో 9 నాటౌట్; 2 ఫోర్లు) ఆపద్బాంధవుడిలా వచ్చాడు. అతనిది సింగిల్ డిజిట్ స్కోరే కావొచ్చు. కానీ తిలక్‌తో అమూల్యమైన, అబేధ్యమైన విజయానికి ఆ పరుగులు, ఆ భాగస్వామ్యమే (తొమ్మిదో వికెట్‌కు 20 పరుగులు) టీమిండియాను గెలిపించింది. సిరీస్‌లో 2-0తో పైచేయి సాధించేలా చేసింది.

**భారత్‌ను ఒంటిచేత్తో గెలిపించిన హైదరాబాద్ బ్యాటర్**

- రెండో టి20లో ఇంగ్లండ్‌పై 2 వికెట్ల తేడాతో టీమిండియా గెలుపు
- 28న రాజ్‌కోట్‌లో మూడో టి20

చెన్నై: ఓపెనర్ల దూకుడు లేదు. సూర్యకుమార్ యాదవ్ జోరు కనిపించలేదు. హార్దిక్ పాండ్యా అనుభవం కలిసిరాలేదు. కానీ... ఇన్ని ప్రతికూలతల మధ్య భారత్ రెండో టి20లో గెలిచి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది. కారణం ఒకేఒక్కడు తిలక్ వర్మ. అసలు ఆశలే లేని చోట... స్పెషలిస్టు బ్యాటర్లే కరువైన వేళ... పరుగుల వేటలో గెలుపుబాట పరిచాడు. 20వ ఓవర్ రెండో బంతికి బౌండరీతో విన్నింగ్‌షాట్ కొట్టేదాకా క్రీజులో కడదాకా నిలిచి భారత్‌ను గట్టెక్కించాడు. ఆఖరిదాకా విజయం కోసం పట్టుబిగించిన ఇంగ్లండ్ చివరకు 2 వికెట్ల తేడాతో భారత్ చేతిలో పరాజయం పాలైంది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 165 పరుగులు చేసింది. కెప్టెన్ జోస్ బట్లర్ (30 బంతుల్లో 45; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), బ్రైడన్ కార్స్ (17 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) రాణించారు. అక్షర్, వరుణ్ చక్రవర్తి చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన భారత్ 19.2 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తిలక్ వర్మ (55 బంతుల్లో 72 నాటౌట్; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) చిరస్మరణీయ ఇన్నింగ్స్ ఆడాడు. వాషింగ్టన్ సుందర్ (19 బంతుల్లో 26; 3 ఫోర్లు, 1 సిక్స్) మెరుగ్గా ఆడాడు.

**మెరిపించిన బట్లర్, కార్స్**

ఆరంభంలోనే ఓపెనింగ్ జోడీ సాల్ట్ (4)ను అర్ష్‌దీప్, డకెట్ (3)ను సుందర్ పెవిలియన్ చేర్చారు. సొంత ప్రేక్షకుల మధ్య తొలి ఓవర్ (ఇన్నింగ్స్ 4వ) వేసేందుకు దిగిన సుందర్ తొలి బంతికే డకెట్‌ను బోల్తాకొట్టించాడు. హ్యారీ బ్రూక్ (13), లివింగ్‌స్టోన్ (13)లను వరుణ్, అక్షర్ కుదురుకోనివ్వలేదు. చెప్పుకోదగిన భాగస్వామ్యం లేకపోయినా... ధాటైన ఇన్నింగ్స్ ఏ ఒక్కరు ఆడలేకపోయినా... ఇంగ్లండ్ ఆఖరుకొచ్చే సరికి పుంజుకుంది. కెప్టెన్ బట్లర్ మెరుపులతో స్కోరు మోస్తరుగా సాగిపోగా... అరంగేట్రం హీరో జేమీ స్మిత్ (12 బంతుల్లో 22; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కార్స్‌ల వేగంతో స్కోరు వేగం పెరిగింది. అర్ష్‌దీప్, పాండ్యా, సుందర్, అభిషేక్‌లకు తలా ఒక వికెట్ దక్కింది.

**తిలక్... అంతా తానై...**

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లాగే మనకూ మంచి ఆరంభం దక్కలేదు. ఓపెనర్లు అభిషేక్ (12)కు మార్క్ వుడ్, సామ్సన్ (5)కు ఆర్చర్ చెక్ పెట్టారు. తిలక్ వర్మ అడపాదడపా మెరుపులతో భారత్ స్కోరు 50 దాటింది. కానీ ఈ దశలో కెప్టెన్ సూర్యకుమార్ (12), ధ్రువ్ జురేల్ (4), హార్దిక్ పాండ్యా (7)లు స్వల్పవ్యవధిలో అదికూడా 10 ఓవర్లలోపే అవుటవడం భారత్ ఇన్నింగ్స్‌కు పెద్దకుదుపు... 9.1 ఓవర్లు 78/5 స్కోరు! గెలుపు చాలా దూరంలో ఉంటే మిగిలిన స్పెషలిస్టు బ్యాటర్ తిలక్ వర్మ ఒక్కడే! సుందర్, అక్షర్ పటేల్ (2) బ్యాటింగ్ చేయగలరు కానీ గెలిపించేదాకా నిలుస్తారా అన్న సందేహాలు భారత శిబిరాన్ని, స్టేడియంలోని ప్రేక్షకుల్ని కలవరపెట్టాయి. ఊహించినట్లే వారిద్దరు కలవరపెట్టే నిష్క్రమించారు. ఈ దశలో తిలక్‌వర్మ గెలిచేదాకా బాధ్యతను భుజానవేసుకొని విజయమాల భారత జట్టు మెడలో వేశాడు.



తిలక్ వర్మ
పరుగులు 72
బంతులు 55
ఫోర్లు 4
సిక్సర్లు 5

**స్కోరు వివరాలు**

**ఇంగ్లండ్ ఇన్నింగ్స్:** సాల్ట్ (సి) సుందర్ (బి) అర్ష్‌దీప్ 4; డకెట్ (సి) జురేల్ (బి) సుందర్ 3; బట్లర్ (సి) తిలక్ వర్మ (బి) అక్షర్ 45; బ్రూక్ (బి) వరుణ్ 13; లివింగ్‌స్టోన్ (సి) సబ్-హర్షిత్ (బి) అక్షర్ 13; స్మిత్ (సి) తిలక్ వర్మ (బి) అభిషేక్ 22; ఓవర్టన్ (బి) వరుణ్ 5; కార్స్ (రనౌట్) 31; ఆర్చర్ (నాటౌట్) 12; రషీద్ (సి) సామ్సన్ (బి) పాండ్యా 10; మార్క్ వుడ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 165. వికెట్ల పతనం:** 1-6, 2-26, 3-59, 4-77, 5-90, 6-104, 7-136, 8-137, 9-157. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-40-1, హార్దిక్ పాండ్యా 2-0-6-1, వాషింగ్టన్ సుందర్ 1-0-9-1, అక్షర్ 4-0-32-2, రవి బిష్ణోయ్ 4-0-27-0, వరుణ్ 4-0-38-2, అభిషేక్ 1-0-12-1.

**భారత్ ఇన్నింగ్స్:** సామ్సన్ (సి) కార్స్ (బి) ఆర్చర్ 5; అభిషేక్ (ఎల్బీ) (బి) వుడ్ 12; తిలక్ వర్మ (నాటౌట్) 72; సూర్యకుమార్ (బి) కార్స్ 12; జురేల్ (సి) సబ్-రేహన్ (బి) కార్స్ 4; పాండ్యా (సి) సాల్ట్ (బి) ఓవర్టన్ 7; సుందర్ (బి) కార్స్ 26; అక్షర్ (సి) డకెట్ (బి) లివింగ్‌స్టోన్ 2; అర్ష్‌దీప్ (సి) ఆర్చర్ (బి) రషీద్ 6; బిష్ణోయ్ (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 166. వికెట్ల పతనం:** 1-15, 2-19, 3-58, 4-66, 5-78, 6-116, 7-126, 8-146. **బౌలింగ్:** జోఫ్రా ఆర్చర్ 4-0-60-1, మార్క్ వుడ్ 3-0-28-1, కార్స్ 4-0-29-3, ఆదిల్ రషీద్ 4-0-14-1, ఓవర్టన్ 2.2-0-20-1, లివింగ్‌స్టోన్ 2-0-14-1.

# క్వీన్ కీస్...

**ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ హస్తగతం**

- కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన అమెరికా ప్లేయర్
- హోరాహోరీ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ సబలెంకాపై విజయం
- రూ. 19 కోట్ల ప్రైజ్‌మనీ సొంతం



విన్నర్స్ ట్రోఫీతో మాడిసన్ కీస్



సబలెంకా

మెల్‌బోర్న్: పదేళ్ల క్రితం 19 ఏళ్ల ప్రాయంలో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లోనే మాడిసన్ కీస్ తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకొని వెలుగులోకి వచ్చింది. సీన్ కట్ చేస్తే... పదేళ్ల తర్వాత అదే ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆమె తన గ్రాండ్‌స్లామ్ టైటిల్ కలను నెరవేర్చుకుంది. 19వ సీడ్‌గా ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో బరిలోకి దిగిన ప్రపంచ 14వ ర్యాంకర్ మాడిసన్ కీస్... అందరి అంచనాలను తారుమారు చేసి చివరకు చాంపియన్‌గా అవతరించింది. గత రెండేళ్ల ఈ టోర్నీలో విజేతగా నిలిచి... ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు సన్నాహకంగా జరిగిన బ్రిస్బేన్ ఓపెన్ టోర్నీలో టైటిల్ నెగ్గి జోరు మీదున్న బెలారస్ స్టార్, ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ సబలెంకాను ఓడించిన కీస్ కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను దక్కించుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో కీస్ 6-3, 2-6, 7-5తో సబలెంకాపై గెలిచింది. విజేతగా నిలిచిన మాడిసన్ కీస్‌కు 35 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 19 కోట్ల 3 లక్షలు)... రన్నరప్ సబలెంకాకు 19 లక్షల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 10 కోట్ల 33 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. టైటిల్ గెలిచే క్రమంలో కీస్ ముగ్గురు గ్రాండ్‌స్లామ్ చాంపియన్స్‌ను (రిబాకినా, స్వియాటెక్, సబలెంకా) ఓడించడం విశేషం. 2 గంటల 2 నిమిషాల పాటు జరిగిన మ్యాచ్‌లో కీస్ ఆరు ఏస్‌లు సంధించింది. 29 విన్నర్స్ కొట్టింది. 31 అనవసర తప్పిదాలు చేసింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. మరోవైపు సబలెంకా ఐదు డబుల్ ఫాల్ట్‌లు, 33 అనవసర తప్పిదాలు చేసింది. **నేడు యానిక్ సినెర్ (ఇటలీ), అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) మధ్య పురుషుల సింగిల్స్ ఫైనల్ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు ఫైనల్ మొదలవుతుంది.**

# 'పద్మభూషణ్' శ్రీజేశ్

- భారత హాకీ జట్టు మాజీ గోల్‌కీపర్‌కు దేశ మూడో అత్యున్నత పౌర పురస్కారం
- క్రికెటర్ అశ్విన్‌కు 'పద్మశ్రీ'



న్యూఢిల్లీ: భారత పురుషుల హాకీ జట్టు మాజీ కెప్టెన్, మేటి గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేశ్‌కు దేశ అత్యున్నత మూడో పౌర పురస్కారం 'పద్మభూషణ్' లభించింది. 1956లో ధ్యాన్‌చంద్ తర్వాత 'పద్మభూషణ్' అవార్డు గెల్చుకున్న రెండో హాకీ ప్లేయర్ శ్రీజేశే కావడం విశేషం. శనివారం కేంద్ర ప్రభుత్వం 'పద్మ' పౌర పురస్కారాలు ప్రకటించింది. ఈ జాబితాలో క్రీడా రంగం నుంచి ఐదుగురు ఉన్నారు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకున్న భారత మేటి స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ (తమిళనాడు)... భారత ఫుట్‌బాల్ జట్టు మాజీ కెప్టెన్ ఐఎం విజయన్ (కేరళ)... 2024 పారిస్ పారాలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచిన దివ్యాంగ ఆర్చర్ హర్విందర్ సింగ్ (హరియాణా)... పారాథ్లెటిక్స్ కోచ్ సత్య పాల్ సింగ్ (ఉత్తరప్రదేశ్)లకు నాలుగో అత్యున్నత పౌర పురస్కారం 'పద్మశ్రీ' వరించింది. కేరళకు చెందిన 36 ఏళ్ల శ్రీజేశ్ గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకం గెలిచిన తర్వాత ఆట నుంచి వీడ్కోలు తీసుకున్నాడు. ఆ తర్వాత కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించాడు. ప్రస్తుతం భారత జూనియర్ జట్టుకు శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. శ్రీజేశ్ భారత జట్టు తరఫున 336 మ్యాచ్‌లు ఆడాడు. 2014, 2022 ఆసియా క్రీడల్లో స్వర్ణాలు గెలిచిన భారత జట్టుకు శ్రీజేశ్ గోల్‌కీపర్‌గా ఉన్నాడు.

కేరళకే చెందిన 55 ఏళ్ల విజయన్ భారత ఫుట్‌బాల్ జట్టు తరఫున 72 మ్యాచ్‌లు ఆడి 40 గోల్స్ చేశారు. తమిళనాడుకు చెందిన 38 ఏళ్ల అశ్విన్ భారత్ తరఫున 106 టెస్టులు ఆడి 537 వికెట్లు... 116 వన్డేలు ఆడి 156 వికెట్లు ... 65 టి20 మ్యాచ్‌లు ఆడి 72 వికెట్లు పడగొట్టాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



# ప్రతిభా భూషణాలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రతిష్ఠాత్మక పద్మ అవార్డులు ప్రకటించింది. కళల విభాగంలో నటులు నందమూరి బాలకృష్ణ, అజిత్, అనంత్ నాగ్, నటి శోభన, దర్శకుడు శేఖర్ కపూర్‌లకు పద్మభూషణ్ పురస్కారాన్ని ప్రకటించింది కేంద్ర ప్రభుత్వం.



అజిత్

## పట్టుదలే పద్మభూషణ్ వరకూ...


అజిత్ తండ్రి సుబ్రమణి తమిళనాడులో పుట్టారు. అయితే కేరళ మూలాలు ఉన్న కుటుంబం. తల్లి మోహినిది పాకిస్తాన్‌లోని కరాచీ. కోల్‌కతాలో స్థిరపడ్డ సింధీ కుటుంబం. కాగా కోల్‌కతాలో ఉద్యోగం చేస్తున్న సమయంలో మోహినితో ప్రేమలో పడ్డారు సుబ్రమణి. ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత సికింద్రాబాద్‌లోని ఫార్మా కంపెనీలో ఉద్యోగం రావడంతో ఇక్కడ ఐదేళ్లు ఉంది ఆ కుటుంబం. వీరికి ముగ్గురు కుమారులు. అజిత్ రెండో కొడుకు. అజిత్‌కి ఏడాదిన్నర వచ్చాక చెన్నైలో స్థిరపడ్డారు.

**చదువులో లాస్ట్...** అజిత్‌కి పెద్దగా చదువు అబ్బలేదు. అయితే క్రికెట్‌లో బెస్ట్. ఎన్‌సీసీలోనూ మంచి ర్యాంకు సంపాదించాడు. కానీ సరిగ్గా చదవకపోవడంతో స్కూలు యాజమాన్యం అజిత్‌ని పదో తరగతి పరీక్షలు రాయడానికి అనుమతించకపోవడంతో పాటు స్కూలు నుంచి పంపించేసింది. ఆ తర్వాత రాయల్ ఎన్‌ఫీల్డ్ బైకు షోరూమ్‌లో మెకానిక్ అప్రెంటిస్‌గా చేరడం, తల్లిదండ్రుల ప్రోద్బలంతో గార్మెంట్ ఎక్స్‌పోర్ట్ బిజినెస్‌లో చేరడం, అవి చేస్తూనే రేసుల్లో పాల్గొనడం, ఇలా సాగింది. ఇక ఎవరో ఇచ్చిన సలహాతో సినిమాల్లో ప్రయత్నించాలనుకున్నారు అజిత్. ప్రముఖ నటుడు-రచయిత-దర్శకుడు గొల్లపూడి మారుతీరావు తనయుడు శ్రీనివాస్ దర్శకత్వంలో అజిత్ హీరోగా 'ప్రేమ పుస్తకం' సినిమా ఆరంభమైంది. ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చెప్పడంతో నిర్మాత పూర్ణచంద్రరావు అజిత్‌ని హీరోగా తీసుకున్నారు. అయితే శ్రీనివాస్ మృతి చెందడంతో షూటింగ్ ఆగింది. ఆ తర్వాత ఆ చిత్రాన్ని మారుతీరావు పూర్తి చేశారు. అయితే ఆ సినిమా ఆశించిన ఫలితం సాధించలేదు.

**'ఆశై'తో హిట్ ట్రాక్:** ఎస్పీబీయే తమిళ దర్శకుడు సెల్వకి చెప్పి, అజిత్‌కి 'అమరావతి'లో హీరోగా నటించే చాన్స్ ఇప్పించారు. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు లుక్స్, నటన పరంగా అజిత్‌కి మంచి గుర్తింపు వచ్చింది. అయితే ఓ రేసుకి సంబంధించిన ట్రయల్‌కి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో వెన్నెముకకి సర్జరీ జరిగింది. ఆ తర్వాత 'ఆశై' (1995)తో అజిత్ కెరీర్ హిట్ ట్రాక్ ఎక్కింది. ఆ తర్వాత చేసిన 'కాదల్ కోట్టై' (ప్రేమ లేఖ), 'వాలి' వంటివి సూపర్ హిట్. సినిమాలు చేస్తూనే బైక్, కారు రేస్‌లకూ వెళుతుంటారు. ఇటీవల కారు రేసులో అజిత్ టీమ్ విజయం సాధించింది. ప్రస్తుతం అజిత్ నటిస్తున్న చిత్రాల్లో 'విడాముయర్చి' తెలుగులో 'పట్టుదల'గా విడుదల కానుంది. జీవితంలోనూ అజిత్‌కి పట్టుదల ఎక్కువ. ఆ పట్టుదలే నేడు 'పద్మభూషణ్' వరకూ తీసుకొచ్చింది. ఇక 'అమర్కలమ్' (1999) సినిమాలో నటించినప్పుడు అజిత్, హీరోయిన్ షాలిని ప్రేమలో పడ్డారు. 2000లో పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## యాక్టివ్‌గా యాక్టింగ్

ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్ (76) గురించి నేటి తరానికి చెప్పాలంటే 'కేజీఎఫ్' సినిమా చాలు. 'ప్రేమ లేఖలు' (1977), ఆ తర్వాత 'శాంతి క్రాంతి', 'శంఖారావం' వంటి చిత్రాలతో నాటి తరం తెలుగు ప్రేక్షకుల్లో ఆయనకు బాగా గుర్తింపు ఉంది. ఇక నేటి తరం తెలుగు ప్రేక్షకులకు 'కేజీఎఫ్' (2018) ద్వారా దగ్గరయ్యారు అనంత్ నాగ్. ఈ సినిమాలో ఆయన రచయిత పాత్ర చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. 'సంకల్ప' (1973) చిత్రంతో కన్నడంలో నటుడిగా పరిచయం అయ్యారు అనంత్ నాగ్. ఆ చిత్రం పలు అవార్డులు సాధించడంతో పాటు నటుడిగానూ గుర్తింపు తెచ్చిపెట్టింది. 50 ఏళ్ల నట జీవితంలో దాదాపు రెండు వందల కన్నడ చిత్రాల్లోనూ, హిందీ, మరాఠీ, తెలుగు, మలయాళం, ఆంగ్లంలో దాదాపు వంద చిత్రాలు... మొత్తంగా మూడ వందల చిత్రాల్లో నటించారు అనంత్ నాగ్. కొన్ని సినిమాలు నిర్మించారు కూడా. పలు టీవీ షోల్లోనూ నటించారు. 76 ఏళ్ల వయసులోనూ యాక్టివ్‌గా ఉంటూ... సినిమాలు చేస్తున్నారు.



అనంత్ నాగ్



శేఖర్ కపూర్

## కొత్త పంథాకి భూషణం

శేఖర్ కపూర్ భారతీయ సినిమా రంగానికి, ముఖ్యంగా బాలీవుడ్‌కి మ్యాజికల్ టచ్ ఇచ్చిన నిన్నటి తరం దర్శక-నిర్మాత. చేసినవి కొన్ని సినిమాలే అయినా, సంపాదించిన కీర్తి, భారతీయ సినిమాకి తెచ్చిపెట్టిన గౌరవం గొప్పవి. ఇప్పటి పాకిస్తాన్‌లోని లాహోర్‌లో జన్మించారు. సినిమాల మీద మక్కువతో ముంబయి చేరుకున్నారు. మొదట నటుడుగా ప్రయత్నాలు చేశారు. దేవానంద్ 'ఇష్క్ ఇష్క్ ఇష్క్'లో నటించారు. దూరదర్శన్ తొలిదశలో వచ్చిన 'ఖాన్‌దాన్' మొదలైన టీవీ సీరియల్స్‌లో ప్రేక్షకులకి గుర్తుండిపోయే కొన్ని పాత్రలు చేశారు.

**'మాసూమ్'తో డైరెక్టర్‌గా...**

'మాసూమ్' సినిమాతో డైరెక్టర్‌గా తన కెరీర్‌ని కొత్త దారి పట్టించారు. 'ది మేన్, విమెన్ అండ్ చైల్డ్' అనే ఇంగ్లిష్ నవల ఆధారంగా శేఖర్ కపూర్ తీసిన సినిమా అది. భారతీయ సినిమాకి తెలియని కొత్త కథేమీ కాదు. కానీ సెన్సిబుల్‌గా కథని చెప్పారు. దాంతో శేఖర్ కపూర్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.

**స్టయిల్ మార్చేశారు**

ఇండియాలో అన్ని వర్గాల ఆడియన్స్‌కి శేఖర్ కపూర్‌ని ఓ బ్రాండ్‌గా మార్చిన సినిమా 'మిస్టర్ ఇండియా'. 'ది ఇన్విజిబుల్ మేన్' అనే కామిక్స్ స్ఫూర్తితో 'మిస్టర్ ఇండియా' కథ రూపొందింది. హిందీలో అదృశ్య వ్యక్తి హీరోగా అంతకు మునుపు కొన్ని సినిమాలు వచ్చాయి. అయితే ఈ ఐడియాని పాపులర్ పల్ప్ ఫిక్షన్ చేసిన ఘనత శేఖర్ కపూర్‌దే. కమర్షియల్ కథలను కొత్తగా చెప్పే డైరెక్టర్ వచ్చాడని బాలీవుడ్ మురిసిపోయినంత సేపు పట్టలేదు – శేఖర్ కపూర్ తన స్టయిల్ మార్చేశారు.

**బాండిట్ క్వీన్‌కి అడ్డంకులు... అవార్డులు**

చంబల్ లోయకి చెందిన బందిపోటు పూలన్ దేవి జీవిత గాథ ఆధారంగా 'బాండిట్ క్వీన్' సినిమా తీశారు శేఖర్. సెన్సేషనల్ హిట్ అయిన ఆ సినిమా పలు సెన్సార్ సమస్యలు ఎదుర్కొంది. రిలీజ్ అయ్యాక చాలా అవార్డులు గెలుచుకుంది. శేఖర్ కపూర్ దృక్పథాన్ని మార్చింది. బ్రిటన్ మహారాణి జీవితం ఆధారంగా 'ఎలిజిబెత్' సినిమా తీశారు. అంతర్జాతీయంగా శేఖర్ కపూర్ పేరు మారుమోగిపోయింది. ఆ చిత్రం ఆస్కార్ అవార్డ్స్‌లో ఏడు నామినేషన్లు దక్కించుకుంది. ఆ తర్వాత ఆయన 'ది ఫోర్ ఫెదర్స్' (2002), 'ఎలిజెబెత్'కి సీక్వెల్‌గా 'ఎలిజెబెత్: ది గోల్డెన్ ఏజ్' (2007)ని తెరకెక్కించారు. ఎన్నో ఏళ్ళ క్రితమే భారతీయ సినిమాని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళిన శేఖర్ కపూర్ పద్మ భూషణుడు కావడం చిత్రసీమకు లభించిన గిఫ్ట్.


**– తోట ప్రసాద్, ప్రముఖ సినీ రచయిత**

## ఆమె కెరీర్ శోభాయమానం

కేరళలోని త్రివేంద్రంలో (ప్రస్తుతం తిరువనంతపురం) 1970 మార్చి 21న జన్మించారు శోభన. ఆమె పూర్తి పేరు శోభనా చంద్రకుమార్ పిళ్లై. నాట్యంలోనూ, నటనలోనూ ప్రసిద్ధి చెందిన లలిత, పద్మిని, రాగిణిల మేనకోడలైన శోభనకు చిన్నప్పటి నుంచి భరతనాట్యం అంటే చాలా ఇష్టం. అక్కినేని నాగేశ్వరరావు నట వారసుడిగా అక్కినేని నాగార్జున హీరోగా పరిచయమైన 'విక్రమ్' (1986) సినిమాతో తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమయ్యారు శోభన. ఆ తర్వాత కృష్ణ, చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, మోహన్‌బాబు, రజనీకాంత్, మోహన్‌లాల్, రాజేంద్ర ప్రసాద్, శరత్ బాబు, కార్తీక్ వంటి హీరోల సరసన నటించారు. మాతృభాష మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో సినిమాలు చేసిన శోభన అందం, అభినయంతో ప్రేక్షకుల్లో తనకంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకున్నారు. 'రుద్రవీణ, అభినందన, అల్లుడుగారు, అప్పుల అప్పారావ్, రౌడీగారి పెళ్లాం, రౌడీ అల్లుడు' వంటి పలు తెలుగు హిట్ సినిమాలు ఆమె ఖాతాలో ఉన్నాయి. నటనలోనే కాకుండా నాట్యంలో కూడా అద్భుతంగా రాణించారు. చెన్నైలోని చిదంబరం నాట్య అకాడమీలో శిక్షణ పొందిన ఆమె క్లాసికల్ డ్యాన్సర్‌గానూ దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకున్నారు. నేటి తరానికి చెందిన ఎందరో కళాకారిణులు ఆమె దగ్గర నటనలోనూ, నాట్యంలోను శిక్షణ తీసుకుంటుండటం విశేషం. 1994లో 'కళార్పణ' అనే సంస్థను నెలకొల్పారు శోభన. ప్రస్తుతం ఆమె పెద్దగా సినిమాలు చేయడం లేదు. వివాహం కూడా చేసుకోకుండా తన జీవితాన్ని కళకు అంకితం చేశారు. ఓ వైపు దేశ విదేశాల్లో క్లాసికల్ డ్యాన్స్ షోలు చేస్తూ.. మరోవైపు డ్యాన్స్ స్కూల్ నడిపిస్తున్నారామె.



శోభన



బాలకృష్ణ

## నటసింహ కీర్తి కిరీటంలో...

నందమూరి తారక రామారావు, బసవతారకం దంపతులకు 1960 జూన్ 10న చెన్నైలో జన్మించారు బాలకృష్ణ. ఎన్టీఆర్ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'తాతమ్మ కల' చిత్రంతో నటుడిగా రంగప్రవేశం చేశారు బాలకృష్ణ. 1974 ఆగస్టు 30న ఆ సినిమా విడుదలైంది. ఆ సినిమాలో నటించే నాటికి బాలకృష్ణ వయస్సు 14 ఏళ్లు. ఆ తర్వాత 'రామ్ రహీమ్, అన్నదమ్ముల అనుబంధం, దాన వీర శూర కర్ణ' వంటి పలు చిత్రాల్లో నటించారు.

**'సాహసమే జీవితం'తో హీరోగా**

1984 జూన్ 1న రిలీజైన 'సాహసమే జీవితం' సినిమా ద్వారా హీరోగా పరిచయమయ్యారు బాలకృష్ణ. ఆ తర్వాత 'డిస్కో రాజా, జననీ జన్మభూమి' వంటి చిత్రాల్లో నటించారు. అయితే కోడి రామకృష్ణ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటించిన 'మంగమ్మగారి మనవడు' చిత్రం 1984 సెప్టెంబరు 7న విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. దీంతో సోలో హీరోగా స్థిరపడ్డారాయన. ఆ తర్వాత 'కథానాయకుడు, ముద్దుల మామయ్య, లారీ డ్రైవర్, ఆదిత్య 369, రౌడీ ఇన్‌స్పెక్టర్, బంగారు బుల్లోడు, భైరవద్వీపం, బొబ్బిలి సింహం, ముద్దుల మొగుడు, సమర సింహారెడ్డి, నరసింహ నాయుడు, చెన్నకేశవ రెడ్డి, లక్ష్మీ నరసింహా, సింహా, లెజెండ్, లయన్, పైసా వసూల్, అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి' వంటి పలు విజయవంతమైన సినిమాల్లో నటించి, ప్రేక్షకులను అలరించారాయన.

**50 ఏళ్ల నట ప్రస్థానంలో...**

'భైరవ ద్వీపం, శ్రీకృష్ణార్జున విజయం, పాండురంగడు, శ్రీరామరాజ్యం' వంటి చిత్రాలతో పౌరాణిక, జానపద చిత్రాల్లో తండ్రికి తగ్గ తనయుడిగానూ నిరూపించుకున్నారు బాలకృష్ణ. నటుడిగా పవర్‌ఫుల్ డైలాగులు చెప్పడంలోనూ, పౌరుషాన్ని గాంభీర్యంగా ప్రదర్శించడంలోనూ తనకు తానే సాటి అని నిరూపించుకున్నారాయన. ఇప్పటివరకు 110 సినిమాల్లో నటించారు. వాటిలో చారిత్రక, జానపద, పౌరాణిక, సాంఘిక చిత్రాలు ఉన్నాయి. నటుడిగా 50 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్నారు బాలకృష్ణ. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని హిందూపురం నియోజకవర్గం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు బాలకృష్ణ. అలాగే బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ చైర్మన్‌గానూ సేవలందిస్తున్నారు. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో 'అఖండ 2: తాండవం' సినిమాలో నటిస్తున్నారు బాలకృష్ణ.

బాలకృష్ణకి భార్య వసుంధరా దేవి, కుమార్తెలు బ్రాహ్మణి, తేజస్విని, కుమారుడు మోక్షజ్ఞ ఉన్నారు. బాలకృష్ణ నట వారసుడిగా మోక్షజ్ఞ త్వరలో హీరోగా పరిచయం కానున్నారు.

సాక్షి
# పెళ్ళిచూపులు
15
ఆదివారం 26-1-2025

## గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

## వధువు కావలెను



SC మాల/ కట్నం ప్రసక్తి లేదు/M.Tech/ Govt.AEE / ట్రాన్స్‌కో / 18 Lakhs PA/5'8"ఎత్తు / 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-15397]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు /B.Tech/MBA/C.Govt.Sr.ఇంజనీర్/ 80,000/-PM/5'9"ఎత్తు / 28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 9676995093, 9515755529 [HA-15397]

క్రిస్టియన్ మాల/ B.Tech / C.Govt. మేనేజర్/ రైల్వే/1 Lakh. PM/ 5'8"ఎత్తు /30 సం॥ల వెల్ సెటిల్డ్ వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-15397]

విశ్వబ్రాహ్మణ/MBA /SWE / 90,000/-PM / 6'ఎత్తు /30 సం॥ల మంచి ఆస్తి గల వరుడికి వధువు కావలెను. Ph: 8790016395 [HA-15397]

SC హిందూ మాల/28/ 5'8"/ M.Tech (IIT)/Sr.SWE/1,00,000/-PM వెల్ సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. (కట్నం ముఖ్యం కాదు) Ph: 8919289481 [HA-15397]

మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech (IIT)/ C.Govt. Asst. మేనేజర్/IOCL/1 Lakh. PM/5'10" ఎత్తు/28 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 7780299703 [HA-15397]

మాల/ B.Tech / C.Govt. AE / రైల్వే / 98,000/-PM / 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 7416584304 [HA-15397]

కాపు, డైవర్స్, కెనడా సిటిజన్, USA గ్రీన్‌కార్డ్ గల వరుడుకి 1 & 2 మ్యారేజి (కిడ్స్ లేని) వధువు కావలెను. కుల/ ఆస్తి పట్టింపు లేదు. 98481 88297. [B-782091]

రజక/31y/5'10"/15L PA/ తెలుగు, బిలాస్‌పూర్ కోల్ ఇండియాలో Asst. Managerగా వర్క్ చేస్తున్న వరునికి PSU లో వర్క్ చేస్తున్న వధువు కావలెను. Spouse ఆప్షన్ ఉంది. 94406 68540 (B) [B-755651]

క్రైస్తవ మాల 34 సం॥ 5'10" MD, GM Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు MBBS or PG Unmarried / డైవర్స్ డాక్టర్ వధువు కావలెను. No డౌరీ. డైరెక్ట్ సంప్రదించండి. సెల్ : 9441981671 [SCA25001031]

★

నో బ్రోకర్స్: డైవర్స్, 43, BC-D, M.A, B.Ed, ప్రైII టీచర్, 30K, పిల్లలు లేరు. ఒక షటర్ ఉన్న వరునికి పిల్లలు లేని 2వ వధువు కావలెను. సెల్: 9392850846. [SCA25001379]

రెడ్డిలేట్ మ్యారేజ్ /34y/1L P.M./Hydలో సొంత ఇల్లు, ఏపీజే లో 5 ఎకరాల వ్యవసాయ భూమి గల హైదరాబాద్ వరుడికి ట్వీ తెలంగాణ వధువు కావలెను. పిల్లలు లేకుంటే డైవర్స్ /విడో ఓకె కుల, కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-782730]

SC-Mala-Hindu/2nd marriage / CNB/ PG /5'10"/40y/SWE/1.6 Lac PM Wants Good Hindu Bride only. Ph: 8187861989. Direct Contact (No Brokers) [H-782795]

★★

కమ్మ, 1st Match, 38 Yrs, 5'8", Fair, Property 10CR, 22.20 Lakhs PA Job in CA Firm గల వరుడికి అందమైన చదువుకున్న తగిన వధువు కావలెను. ✆ 9440 606 532 [B-782099]


క్రిస్టియన్, 32, 5.8, M.Pharmacy, Phamacist in OMAN, 30 Laks Anual అందమైన వరుడికి వధువు కావలెను. 9490553353. (No Mediator) [B-782100]

రెడ్డి / 35Y / కాలేజీ Lecturer గా గల అబ్బాయికి వధువు కావలెను. No బ్రోకర్స్. సంప్రదించండి: 9010426952. [N-1263888]

క్రైస్తవ మాల Legally Divorced 34 సం॥ 5'10" MD, Govt డాక్టర్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడుకు వధువు కావలెను. డైరెక్ట్ సం॥ 89853 15880 [O-787332]

A.P. SMP Settled in Hyd. invite alliance for their son 2nd marriage 32y, 5'9" B.Tech, MBA, working in MNC as Manager req. fair, well educated below 30y can ✆ Shariff 9869223554 [B-7846]

## వరుడు కావలెను



కుల, ఆస్తి పట్టింపు లేదు/జాబ్/వ్యాపారు/ ఫ్లాట్స్/4 కోట్ల ప్రాపర్టీ అందమైన వధువుకి 1వ, 2వ వరుడు కావలెను. ఇల్లరికం OK. అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. ముఖాముఖి కల్పించబడును. Ph : 9676096314 [H-783659]

రెడ్డి/2ndవిడో/కుల, ఆస్తి ప్రసక్తి లేదు/డిగ్రీ, Age: 32/ సొంత బిజినెస్‌లు, అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK). 1st/2nd అన్ని వయస్సుల వారికి సంబంధాలు కలవు. Ph: 9032596676 [HA-15400]

కమ్మ (చౌదరి). 10 to డిగ్రీ. వయస్సు 25 to 32. సొంత ఇల్లు, ఫాదర్ బిజినెస్ ఉన్న అమ్మాయిలకి ఏదయినా జాబ్ లేదా బిజినెస్ వరులు కావలెను. సంప్ర: 9100579008. [A-1496]

రెడ్డి/2nd మ్యారేజ్ (కుల/ఆస్తి) పట్టింపు లేదు/33Y/Q: డిగ్రీ/సొంత ఇల్లు, షాప్స్, బిజినెస్ ల్యాండ్ గల వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) అన్ని వయస్సుల వారికి 1st, 2వ సంబంధాలు కలవు. Ph: 9059607176 [HA-15400]

SC మాల/25/5'5"/B.Tech (Biotechnology), MBA, Sr.SWE TCS Company/ 80,000/-PM వెల్ సెటిల్డ్ గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9346675639 [HA-15400]

యాదవ్, ఎర్రగొల్ల, పూలెగొల్ల, అక్షగొల్ల, Age 26 సం॥లు. సొంత ఇల్లు, వ్యవసాయం ఉన్న అమ్మాయిలకి ఏదయినా జాబ్ లేదా వ్యవసాయం ఉన్న వరులు కావలెను. 9100579008. [A-1496]

రెడ్డి/విడో/కుల, ఆస్తి, ప్రసక్తి లేదు/Age: 35/ B.com/ Pvt/Job కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం అయినా OK) All Cast marriages Available. Ph: 7207510801 [HA-15400]

రెడ్డి, గౌడ్స్, బలిజ, 25 to 35 సం॥రాలు. 10 to డిగ్రీ. సొంత ఇల్లు, బిజినెస్, వ్యవసాయం ఉన్న అమ్మాయిలకి ఆంధ్ర, తెలంగాణలో తగిన వరులు కావలెను. 9100579008. [A-1496]

కుల పట్టింపు లేదు/44y/5'3"/Govt. టీచర్/ 80K/ సొంత ఇల్లు/వెల్ సెటిల్డ్ Hydలో/ 1 బాబు ఉన్న వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం & 1వ, 2వ మ్యారేజ్ OK) ఫీజు 1000/- సంప్ర : 7286031653 [H-783659]

## అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

### వధువు కావలెను

రెడ్డి Business, BE, 27, 6' 1", Very Rich Family, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 28, 6' 2", Engineer, 120 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS (USA), MBA (ISB), 30, 5' 11", Manager, 36 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", Bank Of America, SWE, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

### వరుడు కావలెను

రెడ్డి BE, 27, 5' 6", Tech Evangelist, 64 L P/A, Hyderabad, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, MS, 27, 5' 2", 100 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE (NIT), MS, 26, 5' 6", SWE, 100 K, H1, Rich Family, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE, MS, 28, 5' 7", Data Engineer, 3 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
D.V. Koti Reddy
98480 11818, 93933 11818

రెడ్డి Australia, BE, MS, 30, 5' 8", Business Analyst, 90 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BS (USA), 34, 5' 10", Manager, 50 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Canada, BE (BITS), MSc, MS, 32, 6', Risk Analytics, 140 K, 7 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి PG, 30, 5' 9", 25 L P/A, Hyderabad, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BDS, MDS, 29, 5' 6", Dental Doctor, 2 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Europe, BE (NIT), MS, 28, 5' 2", SWE, Rich Family, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 27, 5' 8", PG Doctor, Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MBA, 31, 5' 6", 16 L P/A, Hyd, Rich Family, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెండవ పెళ్ళి/37yrs / డైవర్స్ / Govt. ఎంప్లాయ్/ 2,50,000/-/ వెల్ సెటిల్/కుల ప్రసక్తి లేని అందమైన వధువుకి వరుడు కావలెను. సంప్రదించండి : 9032445378 [H-783659]

రెడ్డి/కుల పట్టింపు లేదు/రెండవ పెళ్ళి/ 50Y/విడో/సొంత ఇల్లులు/రెంట్స్/పిల్లలు లేరు/సొంత ప్రాపర్టీ/ఎలాంటి బాదరబందీలేని వధువుకు వరుడు కావలెను. (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-783659]

కమ్మ/50yr / విడో /Govt.Job / సొంత Hotel /Restaurant/ 62 ఏకర్స్ Land/10 Lac Income/FC/BC వరుడు కావలెను. సంప్ర : 9515324063 [H-783659]

విశ్వబ్రాహ్మణ / B.Tech / SWE / 5'4" ఎత్తు /25 సం॥లు/60,000/-PM/ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph : 8790016395 [HA-15397]

రెడ్డి/49y/Govt.జాబ్/ VRS/ పెన్షన్ ఫ్యామిలీ/90K. PMసొంత పెట్రోల్ పంపు & హోటల్స్/20 ఎ॥ ల్యాండ్ /4 Laksh Income. 30Cr ప్రాపర్టీ గల ఒంటరి వధువుకు FC/BC ఇల్లరికం వరుడు కావలెను. పిల్లలున్నా OK. Ph 9642589295 [HA-15397]

రెడ్డి/కుల పట్టింపు లేదు/26/5'3"/B.Tech/ పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చెయ్యండి. Ph: 9885492498 [HA-15397]

కుల ఆస్తి పట్టింపు లేదు/44y/డివోర్స్/ Finance & Auditing Officer/1L PM/సొంత ఇల్లు/ 18ఎ॥ Lands /కోట్ల ఆస్తులు గల ఆర్థికంగా ఉన్న అందమైన ఏకైక వధువుకు వరుడు కావలెను. 9701174357 [H-783519]

ఆచారులు(విశ్వబ్రాహ్మణ్స్), నాయిబ్రాహ్మణ్స్. మొదటి సంబంధం, 25 సం॥రాలు. సొంత ఇల్లు, ఫాదర్ కుల వృత్తి ఉన్న వారికి వరులు కావలెను. 9100579008. [A-1496]

రెడ్డి/విడో/Rtd Govt. పెన్షనర్/HM/సొంత ఇల్లు/ రెంట్స్/ 28 ఎకరాల పొలం రైస్ బిజినెస్/4L PM/ వెల్ సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 7732054195 [H-783519]

కుల ప్రసక్తి లేదు/విడో/50y/విజయవాడ/ Hydలో Own House(రెంట్స్) ల్యాండ్స్ వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాదరబందీలేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. 8519803423 [H-783519]

FC/ విడో/ 50y / 5'2"/స్టాఫ్ నర్స్/ సొంత ఇల్లు మృదు స్వభావం గల వధువుకి వరుడు కావలెను. 9985020249 [H-783519]

దేవాంగ, పద్మశాలి, 26 సం॥రాలు, డిగ్రీ. 5.4, సొంత ఇల్లు టీచర్‌గా చేస్తున్న అమ్మాయిలకి సాంప్రదాయ కుటుంబ వరులు కావలెను. సంప్ర: 9100579008. [A-1496]

మాల : MBBS., MS (Gynic) / 5'7 / 29Y / V.Fair/10 Cr. / సొంత హాస్పిటల్ కలిగి ప్రాక్టీస్ చేస్తున్న వధువు కొరకు (అర్జెంట్‌గా) సంప్ర॥ 81065 01199, 92484 94810. [M-295]

మాల: B.Tech. (IIT), MBA (IIM) Ahmadabad / 5'4 / 28Y / V.Fair, 10 Cr. / నెలకు 3 లక్షల జీతంతో జాబ్ చేస్తున్న వధువు కొరకు సంప్ర॥ 9014269518, 8106501199 [M-295]

★★

మాల క్రిస్టియన్ బి.టెక్/SBI డిప్యూటీ మేనేజర్ / 5'4"/31 సం॥ ఫెయిర్ 1.40 జీతం అమ్మాయికి గవర్నమెంట్ ఎంప్లాయి/బ్యాంక్ ఆఫీసర్ కావలెను. నో బ్రోకర్స్. డైరెక్ట్ ✆ : 91609 18899, 89199 37990 [R-1206914]

## వేదికలు



శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM Est : 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st/ 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790890909 [H-783516]

శక్తి గణేష్ మ్యారేజ్ బ్యూరో. అన్ని కులాల పెళ్లి సంబంధాలు చూడబడును. దేశ విదేశ, 1వ, 2వ, లేటు వధూవరుల తక్షణ సంబంధాలకై సంప్ర : 7095422426 [HA-15400]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712(A) [HA-15399]

మాదిగ వివాహ పరిచయ వేదిక. ఆదివారం తేది : 9/2/2025 హైదరాబాద్‌లో నిర్వహణ : స్వప్న వివాహ వేదిక. 9347046175 [H-783519]

ఫ్రీ రిజిస్ట్రేషన్: 16రో॥ అన్ని కులాల వారికి తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి మ్యారేజి లైన్స్. ✆ 94418 29644, 98490 58673, 9493 661 288. వాట్సప్ [B-621]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC, Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Whatsapp) [HA-1260]

★★


ఐశ్వర్య హిందూ మాట్రిమోనీ: కాపు వివాహ సంబంధం కొరకు సంప్ర॥ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్స్, డాక్టర్స్ ఎన్ఆర్ఐ ఎంప్లాయిస్, ఇండియా, అబ్రాడ్ మ్యాచెస్ కొరకు. ✆ 98665 21319 విజయవాడ [B-1266819]

మాల (క్రైస్తవ, హిందూ) B.Tech, M.Tech, MS, MBA, MBBS చదువులతో డాక్టర్స్, సాఫ్ట్‌వేర్, బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 9440545049 [B-1268407]



# ప్రైవేటు రంగంలోనూ ఓబీసీ రిజర్వేషన్లు

కేంద్ర మంత్రి కుమార స్వామికి.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ వినతి



సాక్షి, హైదరాబాద్: దేశంలో ప్రైవేట్ రంగంలోనూ ఓబీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రం తరహాలో కర్ణాటకలోనూ అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించాలని సౌత్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు, మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు బెంగళూరులో శనివారం కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి జేడీ కుమారస్వామి గౌడను.. శ్రీనివాస్‌గౌడ్ కలిసి వివిధ అంశాలపై చర్చించారు. దేశానికి ప్రధాన ఆదాయవనరుగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర లకు పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలని, ఎక్కువ సంఖ్యలో పరిశ్రమలు నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో దక్షిణాది రాష్ట్రాల ఓబీసీ సంఘాల నేతలు బాలరాజు గుత్తేదార్, శివకుమార్, ఓంకార్, గోపి గౌడ్ తదితరులు ఉన్నారు.

# రాజ్యాంగ హక్కుల్ని ప్రతీ పౌరుడు తెలుసుకోవాలి

న్యాయ అవగాహన సదస్సులో ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ సుజోయ్‌పాల్

కుషాయిగూడ (హైదరాబాద్): రాజ్యాంగ హక్కులను ప్రతీ పౌరుడు తెలుసుకోవాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. శనివారం జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్వహించిన ఖైదీల న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ.. ఖైదీల హక్కులు, వారికి అందజేసే న్యాయ సహాయం వంటి అంశాలపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జైళ్ల శాఖ డీజీపీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ రాష్ట్ర జైళ్ల శాఖ ఖైదీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంస్కరణలు చరిత్రాత్మకమని అన్నారు. జైళ్ల శాఖ సంస్కరణలు ఖైదీల జీవితాల్లో మార్పు తెస్తాయన్నారు. ఖైదీల ఆరోగ్యం, వసతులు, ములాఖత్ వంటి అంశాలతోపాటు జైళ్లశాఖ అధికారుల బాధ్యతలను కూడా వివరించారు. హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ శావిలి, మేడ్చల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్ న్యాయసాయం, సమానత్వంపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పంచాక్షరి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి డి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# కాలయాపన లేని తీర్పులు కావాలి

నూతన కోర్టుల ప్రారంభోత్సవంలో హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీసుధ



కోర్టును ప్రారంభిస్తున్న జస్టిస్ శ్రీసుధ, పక్కన జస్టిస్ శరత్, జస్టిస్ నగేశ్

ఖమ్మం లీగల్: కాలయాపన లేని తీర్పులు అవసరమని, ఇందుకోసం మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారం మంచి విధానమని హైకోర్టు జడ్జి, ఖమ్మం పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ స్పష్టం చేశారు. ఖమ్మం న్యాయస్థానాల సముదాయంలో ఏర్పాటు చేసిన రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ సెషన్స్ జడ్జి కోర్టులను.. శనివారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భీమపాక నగేశ్, జస్టిస్ కాజా శరత్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రీసుధ మాట్లాడుతూ పేదలు, కక్షిదారులకు న్యాయసాయం అందించేందుకు న్యాయవ్యవస్థలో ప్రతీ ఒక్కరు పనిచేయాలని సూచించారు. జస్టిస్ కాజా శరత్ మాట్లాడుతూ అదనపు కోర్టులతోపాటు న్యాయమూర్తులను సైతం ఎంపిక చేసి తగిన సిబ్బందిని కేటాయించడం ద్వారా ఎక్కువ కేసుల పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు. జస్టిస్ భీమపాక నగేశ్ మాట్లాడుతూ మాతృభాష తెలుగులో వాదనలు వినిపిస్తూ భాషా ప్రాధాన్యాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# అలంపూర్ క్షేత్రంలో హైకోర్టు జడ్జి పూజలు



అమ్మవారి దర్శనానికి వస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ అనిల్‌కుమార్

అలంపూర్/వనపర్తి టౌన్: దక్షిణకాశీ, అలంపూర్ క్షేత్ర ఆలయాలను హైకోర్టు జడ్జి జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి కుటుంబ సమేతంగా శనివారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జోగుళాంబదేవి, బాలబ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి మిథున్ తేజ, సీఐ రవిబాబు పాల్గొన్నారు. అంతకుముందు సాయంత్రం వనపర్తి జిల్లా కేంద్రంలో జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి.. పెండింగ్, డిస్పోజబుల్ కేసులపై స్థానిక న్యాయమూర్తులతో సమీక్షించారు.

# కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

## ముఠాగా హైదరాబాద్ ఆసుపత్రులు, వైజాగ్ దళారులు

- తమిళనాడు, కశ్మీర్ నుంచి సర్జన్లను రప్పించి కిడ్నీ మార్పిడులు
- గ్రహీత నుంచి ఒక్కో కిడ్నీకి రూ.60 లక్షల చొప్పున వసూలు
- జనని, అరుణ, అలకానంద ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు
- రాచకొండ కమిషనర్ జీ సుధీర్ బాబు వెల్లడి



కేసు వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ మూలాలను రాచకొండ పోలీసులు ఛేదించారు. సరూర్‌నగర్‌లోని అలకనంద, మాదన్నపేటలోని జనని, అరుణ ఆసుపత్రులలో అక్రమంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయిస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. ఒక్కో కిడ్నీ మార్పిడికి రూ.60 లక్షల చొప్పున గ్రహీత నుంచి వసూలు చేస్తున్న ఈ గ్యాంగ్.. గత రెండేళ్లలో నగరంలో 50కి పైగా కిడ్నీ మార్పిడులు చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠాలోని 9 మందిని అరెస్టు చేయగా.. మరో ఆరుగురు పరారీలో ఉన్నారు. కేసు వివరాలను రాచకొండ పోలీస్ కమిషనర్ జీ సుధీర్ బాబు శనివారం మీడియాకు వెల్లడించారు.

### ఆర్థిక కష్టాలతో పక్కదారి

హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సిద్ధంశెట్టి అవినాశ్ 2022లో సైదాబాద్‌లోని మాదన్నపేట రోడ్‌లో ఉన్న జనని, అరుణ ఆసుపత్రులను కొనుగోలు చేసి కొంతకాలం నడిపించాడు. తర్వాత ఆర్థిక ఇబ్బందుల కారణంగా విక్రయించాలని భావించాడు. ఆ సమయంలో విశాఖపట్నంకు చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి అవినాశ్‌ను సంప్రదించి, ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించాలని సూచించాడు. ఒక్కో కిడ్నీ మార్పిడికి రూ.2.5 లక్షలు చెల్లిస్తానని ఒప్పందం చేసుకున్నాడు. ఆ ప్రతిపాదనకు అంగీకరించిన అవినాశ్ జనని, అరుణ ఆసుపత్రుల్లో ఏప్రిల్ 2023 నుంచి 2024 జూన్ వరకు అక్రమ కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ దందాలో వైజాగ్‌కు చెందిన పవన్ అలియాస్ లియోన్, పూర్ణ అలియాస్ అభిషేక్‌లు కీలక పాత్ర పోషించారు. వీరు తమిళనాడుకు చెందిన డాక్టర్ రాజశేఖర్ పెరుమాల్, జమ్మూకశ్మీర్‌కు చెందిన డాక్టర్ సోహిబ్‌తోపాటు నల్లగొండకు చెందిన మెడికల్ అసిస్టెంట్లు రమావత్ రవి, సపావత్ రవీందర్, సపావత్ హరీశ్, పాదిల సాయి, తమిళనాడుకు చెందిన ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు శంకర్, ప్రదీప్, కర్ణాటకకు చెందిన సూరజ్‌లను కలుపుకొని ముఠాగా ఏర్పడ్డారు.

### ఒక్కో కిడ్నీ రూ.60 లక్షలు..

ఈ ముఠా ఒక్కో కిడ్నీకి రూ.60 లక్షల చొప్పున గ్రహీత నుంచి వసూలు చేసేది. ఇందులో కిడ్నీ దాతకు రూ.5 లక్షలు, అవినాశ్‌కు రూ.2.5 లక్షలు, ప్రధాన సర్జన్‌కు రూ.10 లక్షలు, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లకు రూ.30 వేల చొప్పున ముట్టజెప్పేవారు. మిగిలిన రూ.42 లక్షలను లక్ష్మణ్, పవన్, పూర్ణ, అభిషేక్‌లు పంచుకునేవారు. శస్త్ర చికిత్స చేసే సర్జన్‌ను తమిళనాడు, జమ్మూకశ్మీర్ నుంచి హైదరాబాద్‌కు విమానంలో తీసుకొచ్చి, స్టార్ హోటల్‌లో బస ఏర్పాటు చేసేవారు.

### అలకానందకు ఆపరేషన్ల మార్పు

జనని, అరుణ ఆసుపత్రుల్లో కిడ్నీ మార్పిడి దందాకు బ్రేక్ ఇద్దామని భావించిన డాక్టర్ అవినాశ్.. గతేడాది జూలైలో సరూర్‌నగర్‌లోని అలకానంద ఆసుపత్రి ఎండీ డాక్టర్ గుంటుపల్లి సుమంత్‌ను సంప్రదించి, దందా గురించి తెలిపాడు. అతడు అంగీకరించటంతో అలకానందలో గతేడాది డిసెంబర్ నుంచి దాదాపు 20 అక్రమ కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ప్రతీ సర్జరీకి సుమంత్‌కు రూ.1.5 లక్షలు కమీషన్‌గా అందేవి. విశ్వసనీయ సమాచారం అందడంతో ఈ నెల 21న రంగారెడ్డి జిల్లా వైద్యాధికారులతో కలిసి పోలీసులు అలకానంద ఆసుపత్రిపై దాడిచేసి దందా గుట్టను రట్టు చేశారు. తమిళనాడుకు చెందిన కిడ్నీ దాతలు నస్రీన్ బాను అలియాస్, ఫిర్దోష్, కర్ణాటకకు చెందిన గ్రహీతలు బీఎస్ రాజశేఖర్, భట్ ప్రభలను అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 23న డాక్టర్ సుమంత్, రిసెప్షనిస్ట్ నర్సగాని గోపిలను అరెస్టు చేశారు. తాజాగా డాక్టర్ అవినాశ్, ప్రదీప్, రవి, రవీందర్, హరీశ్, సాయి, సూరజ్ మిశ్రాలను అదుపులోకి తీసుకున్నారు. సర్జన్లు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సోహిబ్, దళారులు పవన్, పూర్ణ, లక్ష్మణ్‌లు పరారీలో ఉన్నారు.

### జీవన్‌దాన్ దాతల జాబితా లీక్

అవయవదానానికి సంబంధించిన సేవలు నిర్వహిస్తున్న జీవన్‌దాన్ సంస్థ డేటా లీక్ కావటమే కిడ్నీ దందాకు కారణమని పోలీసుల విచారణలో తేలింది. పవన్, లక్ష్మణ్‌లు దాతలు, గ్రహీతల వివరాలను అక్రమ మార్గంలో సేకరించి ఈ దందా నిర్వహించినట్లు గుర్తించారు. వారు దొరికితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఈ ముఠా శ్రీలంకలో కూడా కిడ్నీ మార్పిడి దందా చేసిందని అనుమానిస్తున్నారు.

# మాజీ సీఎం కేసీఆర్ సోదరి కన్నుమూత

● అంత్యక్రియల్లో పాల్గొన్న కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు



సోదరి పార్థివ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

మేడ్చల్ రూరల్: మాజీ సీఎం కేసీఆర్ ఐదవ సోదరి చీటి సకలమ్మ అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతిచెందారు. ఆమె పార్థివదేహాన్ని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆమె నివాసానికి తరలించారు. మాజీ సీఎం కేసీఆర్ సోదరి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మల్లారెడ్డి ఆమె అంత్యక్రియల్లో పాల్గొన్నారు. హరీశ్‌రావు పాడె మోశారు. అంత్యక్రియలు ముగిసే వరకు కేటీఆర్ అక్కడే ఉండి కుటుంబసభ్యులతో గడిపారు. ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీ సంతోష్, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్‌రాజు నివాళులర్పించారు.

# సింహాలతో జింకలు కలిసి ఉండలేవు

‘లక్ష డప్పులు...’ సన్నాహక సమావేశంలో మంద కృష్ణమాదిగ



కిరీటం, గదతో కృష్ణమాదిగ

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): మాదిగ డప్పుల తో సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మిస్తున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ‘లక్ష డప్పులు.. వెయ్యి గొంతుకలు’సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం సిద్దిపేట లో భారీ ర్యాలీ, సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ, ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రపంచం వినేలా లక్ష డప్పుల ద్వారా సాంస్కృతిక మహాప్రదర్శన చేస్తున్నామని, ఈ కార్యక్రమానికి మాదిగలు, మాదిగ ఉపకులాల ప్రజలు భారీ సంఖ్యలో హాజరుకావా లని ఆయన పిలుపునిచ్చారు. సింహాల లాంటి మాలలతో జింకల్లాంటి మాదిగ, మాదిగ ఉపకులాలు సహవాసం చేయలేవన్నారు. 1997 నుంచి ఎస్సీ వర్గీకరణను మాలలు అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు.

# రైలు బండి మరింత వేగం..

బడ్జెట్‌పై వివిధ వర్గాల భారీ ఆశలు
సరుకు రవాణాలో రాయితీల పెంపు కోరుతున్న పారిశ్రామిక వర్గాలు
పరిశ్రమలను అనుసంధానిస్తూ రైలు మార్గాలుండాలని డిమాండ్
వేగం పెంపు.. టికెట్ల రేటు తగ్గింపుపై ప్రయాణికుల ఆశలు
మరిన్ని వందేభారత్ రైళ్లు అందుబాటులోకి రావొచ్చని అంచనా
బుల్లెట్ రైళ్లను త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు ప్రణాళికలు

ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్ లలో ఒకటైన భారతీయ రైల్వే కొంతకాలంగా వేగంగా ఆధునికతను సంతరించుకుంటోంది. కుంటుతూ గెంటుతూ నడిచే రైళ్ల స్థానంలో అమితవేగంతో దూసుకుపోయే అత్యాధునిక రైళ్లు అందుబాటులోకి వస్తున్నాయి. బుల్లెట్ రైళ్లను కూడా వీలైనంత త్వరగా దేశంలో పరుగులు పెట్టించాల ని కేంద్రం భావిస్తోంది.ఈ నేపథ్యంలో 2025- 26 బడ్జెట్‌లో రైల్వేలకు కేంద్రం ఏం ఇస్తుంది? ఎలాంటి మార్పులు ప్రతిపాదిస్తుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఫిబ్రవరి 1న కేంద్రప్రభుత్వం 2025-26 వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రైల్వేల నుంచి వివిధ వర్గాల ప్రజలు ఏం ఆశిస్తున్నారనేది చూద్దాం..

### గత ఐదేళ్లలో రైల్వేలో కొత్తగా వచ్చిన మార్పులు



**2019:** సెమీ హైస్పీడ్ వందే భారత్ రైళ్లు ప్రవేశం.

**2020:** రైల్వేల్లో ప్రమాదాలను అరికట్టేందుకు ఆటోమెటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ సిస్టమ్ (ఏటీపీ) 'కవచ్' ప్రారంభం.

**2022:** రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ ఫండ్ (ఆర్ఆర్ఎస్‌కే) ఏర్పాటు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్లకు పెంచాలని లక్ష్యం.

**2023:** ముంబై- అహ్మదాబాద్ మధ్య బుల్లెట్ రైల్ ప్రాజెక్టు వేగవంతానికి చర్యలు. అమృత్ భారత్ స్టేషన్ పథకం ప్రారంభం.
- ఈ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా 1,275 రైల్వే స్టేషన్లను ఆధునీకరించాలని నిర్ణయం.

**2024:** కవచ్ 4.0 ప్రారంభం.
- స్టేషన్ల వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ ఏర్పాటు.
- డెడికేటెడ్ సరుకు రవాణా మార్గాల నిర్మాణం పూర్తి.
- అమృత్ భారత్ 1.0 ప్రారంభం.


**2025:** అమృత్ భారత్ 2.0 రైళ్లు. జమ్మూకశ్మీర్‌లో కీలకమైన రైల్వేలైన్ల నిర్మాణం పూర్తి.

### మరింత వేగంగా ఆధునికత

ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకోవటంలో భారతీయ రైల్వే ఇంకా వెనుకబడే ఉంది. జపాన్, చైనా, యూరప్‌లో బుల్లెట్ ట్రైన్లు ఎప్పటి నుంచో దూసుకుపోతుండగా, మన దేశంలో వాటికి ఇప్పుడిప్పుడే అడుగులు పడుతున్నాయి. అయితే, గత ఐదారేళ్లుగా కేంద్ర ప్రభుత్వం రైల్వేల ఆధునీకరణను వేగవంతం చేసింది. సాధారణ రైళ్ల స్థానంలో వందేభారత్ వంటి అత్యాధునిక సౌకర్యాలున్న రైళ్లను ప్రవేశపెట్టింది. 2024 డిసెంబర్ 2 నాటికి దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్లు పట్టాలెక్కాయి. సాధారణ రైళ్ల కంటే వీటి వేగం భారీగా ఉండటంతో టికెట్ ధరలు కాస్త ఎక్కువైనా వీటిల్లో ప్రయాణించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మరిన్ని వందే భారత్ రైళ్లు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు. ప్రభుత్వం కూడా వచ్చే బడ్జెట్‌లో వందే భారత్ రైళ్లకు ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. ముంబై- అహ్మదాబాద్ మధ్య నిర్మిస్తున్న బుల్లెట్ రైల్ మార్గాన్ని మరింత వేగంగా పూర్తిచేసేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వొచ్చని అంటున్నారు. మరోవైపు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)లో ప్రయాణికుల రైళ్ల నిర్వహణకు వీలు కల్పించాలని పారిశ్రామికవర్గాలు కోరుతున్నాయి.

**రూ.3 లక్షల కోట్లకు రైల్వే బడ్జెట్?**

రైల్వే శాఖకు 2024-25లో కేంద్రత్వం రూ.2,62,200 కోట్లు కేటాయించింది. 2025-26 బడ్జెట్‌లో 15 నుంచి 18 శాతం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అంటే మొత్తం బడ్జెట్ దాదాపు రూ.2.9 లక్షల కోట్ల నుంచి రూ.3 లక్షల కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. వందేభారత్, బుల్లెట్ రైళ్లకు కేంద్రం ఇచ్చే ప్రాధాన్యాన్ని బట్టి రైల్వే బడ్జెట్‌లో పెంపుదల ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2024 ఏడాదిలోనే కేంద్రం ఏకంగా 62 వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీటిని భారీగా పెంచే అవకాశం ఉందని అంటున్నారు. - సాక్షి, సెంట్రల్ డెస్క్




# దేశంలోనే అతిపెద్ద బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్

శంకర్‌పల్లి వద్ద 250 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటుకు టెండర్లు పిలిచిన జెన్‌కో
విద్యుత్ డిమాండ్ తగ్గినప్పుడు సిస్టమ్‌లో నిల్వ
డిమాండ్ పెరగగానే మళ్లీ గ్రిడ్‌కు సరఫరా చేసే వీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 250 మెగావాట్ల భారీ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ఏర్పాటుకు తెలంగాణ విద్యుదుత్పత్తి సంస్థ (టీఎస్ జెన్‌కో) శనివారం గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. బిల్డ్, ఓన్, ఆపరేట్ (బీఓఓ) విధానంలో దీనిని నిర్వహించాలని పేర్కొంది. 250 మెగావాట్ల విద్యుత్‌ను నిల్వ చేసి, అవసరమైనప్పుడు సరఫరా చేయగల సామర్థ్యం ఈ సిస్టమ్‌కు ఉంటుంది. శంకర్‌పల్లిలో ట్రాన్స్‌కోకు చెందిన 400/220 కేవీ సబ్‌స్టేషన్‌కు సమీపంలో దీనిని ఏర్పాటు చేయనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో 100 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ను టాటా కంపెనీ నిర్మించింది. ప్రస్తుతం దేశంలో అదే పెద్ద బ్యాటరీ స్టోరేజీ సిస్టమ్‌కాగా.. తెలంగాణలో అంతకు మించి 250 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించనున్నారు.

**విద్యుత్ నిల్వ, అమ్మకాలు ఇలా..:** రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ తక్కువగా ఉండే సమయాల్లో మిగులు విద్యుత్‌ను బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌లో నిల్వ చేస్తారు. డిమాండ్ పెరిగి, విద్యుత్ కొరత ఏర్పడినప్పుడు అందులోని విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. గంటకు 2.5 లక్షల యూనిట్ల విద్యుత్ సరఫరా సామర్థ్యం దీనికి ఉంటుంది. స్టోరేజీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసే డెవలపర్ సంస్థ... డిమాండ్ లేనప్పుడు జెన్‌కో నుంచి తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేసి నిల్వ చేసుకుని, డిమాండ్ పెరిగినప్పుడు ఎక్కువ ధరకు అమ్ముకోవచ్చు. ఈ మేరకు డెవలపర్‌తో ట్రాన్స్‌కో విద్యుత్ కొనుగోలు ఒప్పందం (పీపీఏ) చేసుకోనుంది.

**రాష్ట్రానికి ఎంతో ప్రయోజనం:** ప్రస్తుతం దేశంలో విద్యుత్ డిమాండ్ గరిష్టంగా ఉన్న సమయాల్లో పవర్ ఎక్స్ఛేంజీల్లో విద్యుత్ ధర యూనిట్‌కు రూ.9 నుంచి రూ.20 వరకు పెరిగిపోతోంది. అదే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ నుంచి గరిష్ట డిమాండ్ సమయాల్లోనూ కాస్త తక్కువ ధరకు విద్యుత్ కొనేందుకు అవకాశం ఉండనుంది. ఇటీవల దేశంలో సెకీ ఆధ్వర్యంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ల ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించగా.. యూని ట్‌కు రూ.3.41 ధరతోనే విక్రయించేందుకు కొందరు డెవలపర్లు ముందుకు వచ్చారని జెన్‌కో వర్గాలు తెలిపాయి. అయితే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్‌ల ఏర్పాటుకు పెద్ద మొత్తంలో వ్యయం అవుతుంది. ఈ క్రమంలోనే పెట్టుబడి వ్యయంలో 40శాతాన్ని వయబిలిటీ గ్యాప్ ఫండ్‌గా ఇచ్చేలా ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఓ పాలసీని ప్రకటించింది. శంకర్‌పల్లిలో ఏర్పాటు చేసే స్టోరేజీ సిస్టమ్‌కు సైతం ఆ రాయితీ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు.

# వికసిస్తా.. విరుచుకుపడతా!

కరీంనగర్ కలెక్టర్ 'ఇన్‌స్టా పోస్ట్'

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ పర్యటన సందర్భంగా శుక్రవారం చేసిన ఏర్పాట్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేసిన నేపథ్యంలో కలెక్టర్ పమేలా సత్పతి శనివారం తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ శుక్రవారం కరీంనగర్‌లో పర్యటించిన సందర్భంగా తోపులాట జరిగి ఒక గన్‌మెన్ పొంగులేటిపై పదేపదే పడటంతో ఆయన ఆగ్రహించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 'నేను మహిళను.. సందర్భానికి తగినట్లుగా ఉంటాను.. మండిపడగలను, వికసించగలను, విరుచుకుపడగలను, గడ్డకట్టిపోగలను, అవసరమైతే కరగిపోగలను' అని ఆంగ్లంలో పోస్ట్ పెట్టారు. అది కొన్ని నిమిషాల్లోనే వైరల్‌గా మారింది. అయితే, కొద్దిసేపటి తర్వాత ఆ పోస్టు ఆమె ఇన్‌స్టాలో కనిపించలేదు. అదే విషయమై ఆమెను సంప్రదించేందుకు ఫోన్ ద్వారా సాక్షి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఈ ఘటనలో మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తీరును తప్పు పడుతూ సామాజిక ఉద్యమకారుడు బక్క జడ్సన్ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

## గవర్నర్ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తైన సందర్భంగా మనకు లభించిన హక్కులు, విధుల పట్ల ఆయన రాజ్యాంగ నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి సిద్ధాంతాల ఆధారంగా రాజ్యాంగాన్ని రచించినందు కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యాంగం వల్లే 4 కోట్ల ప్రజల కల సాకారమై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు.

## ప్రజాస్వామిక, గణతంత్ర రాజ్యంగా దేశం వర్ధిల్లాలి

సీఎం రేవంత్ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా స్వామిక, సార్వభౌమ గణతంత్ర రాజ్యంగా భారతదేశం వర్ధిల్లాలని ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సమరయోధులు, రాజ్యాంగ నిర్మాతలను స్మరిస్తూ సంవిధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టినట్టు వెల్లడించారు. మహిళల సాధికారత కోసం వారికి ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సహాయాన్ని రూ.10 లక్షలకు పెంపు వంటి సంక్షేమ పథకాలు, ఉద్యోగాల భర్తీ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.

## కేసీఆర్ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. భారత దేశాన్ని సార్వభౌమాధికార, సర్వసత్తాక, గణతంత్ర దేశంగా నిలుపుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 76 ఏళ్లు అయిందని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశానికి ఆదర్శ రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాతలకు ఈ సందర్భంగా కేసీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

## యూపీఎస్ వద్దు.. ఓపీఎస్ ముద్దు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) గెజిట్‌ను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఓపీఎస్) సెక్రటరీ జనరల్ గంగాపురం స్థితప్రజ్ఞ చెప్పారు. ఇప్పటికే అమల్లో ఉన్న సీపీఎస్ విధానం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెందిన రూ.10.5 లక్షల కోట్ల నిధులు కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లాయన్నారు.

# హైదరాబాద్‌లో యూబీఎస్ జీసీసీ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయంగా వాణిజ్య సేవల్లో పేరొందిన స్విస్ బ్యాంకర్ హైదరాబాద్‌లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ (జీసీసీ)ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. తద్వారా అంతర్జాతీయంగా వాణిజ్య సేవల్లో హైదరాబాద్ స్థానం మరింత బలోపేతం కానున్నది. జూరిక్ ఇన్నోవేషన్ పార్కులో శుక్రవారం రాత్రి స్విట్జర్లాండ్ ఇన్నోవేషన్ కాన్ఫెడరేషన్ ఏర్పాటు చేసిన సదస్సులో యూబీఎస్ ఇండియా చైర్మన్ హెరాల్డ్ ఎగ్గర్ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబుతో భేటీ అనంతరం ఈ మేరకు ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో యూబీఎస్ సంస్థ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తూ వచ్చే రెండేళ్లలో మరో 1,800 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది. ఐటీ, వాణిజ్య సేవల్లో తెలంగాణను సమీప భవిష్యత్తులో అంతర్జాతీయంగా అగ్రస్థానంలో నిలపడంతో పాటు రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేస్తుందని యూబీఎస్ ప్రకటించింది. 'దేశంలోని జీసీసీల్లో 11 శాతం హైదరాబాద్‌లోనే ఉన్నాయి. పెట్టుబడులకు అనుకూలత, సాంకేతిక వాతావరణం, అత్యాధునిక మౌలిక వసతులు తదితరాల మూలంగా జీసీసీల ఏర్పాటుకు నగరం అత్యంత అనుకూలంగా మారుతోంది' అని మంత్రి శ్రీధర్‌బాబు ఈ సందర్భంగా ప్రకటించారు. గత ఏడాది మార్చిలో భారత్, ఎఫ్టా దేశాలు (స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్, లీషెన్‌స్టీన్) నడుమ కీలకమైన ట్రేడ్ అండ్ ఎకానమీ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్ (టెపా) పేరిట స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎఫ్టా దేశాలు భారత్‌లో వచ్చే 15 ఏళ్లలో పది లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా 100 బిలియన్ యూరోలను పెట్టుబడిగా పెడతాయి. టెపా ఒప్పందంపై అవగాహన కలిగించడంతో పాటు తెలంగాణలో స్విస్ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా తాజాగా స్విట్జర్‌లాండ్ ఇన్నోవేషన్ కార్పొరేషన్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో స్విస్ జాతీయ కౌన్సిల్ సభ్యులు, స్విస్ ఇండియా పార్లమెంటరీ గ్రూప్ ప్రెసిడెంట్ నికోలస్ గగ్గర్, భారత్‌లో స్విట్జర్లాండ్ రాయబారి మాయా టిసాఫీతో పాటు 40కి పైగా స్విస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ తరఫున పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ప్రత్యేక కార్యదర్శి డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఐఐసీ సీఈఓ మధుసూదన్, లైఫ్‌సైన్సెస్ విభాగం డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

**1,800 మందికి ఉద్యోగ అవకాశాలు**




స్విట్జర్లాండ్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

### మరిన్ని పెట్టుబడులు తీసుకొస్తాం: శ్రీధర్ బాబు

యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఈఎఫ్‌టీఏ) దేశాల నుంచి మరిన్ని పెట్టుబడులను తెలంగాణకు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆయా దేశాల పెట్టుబడిదారులకు మద్దతుగా నిలిచేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ'లో భాగంగా శనివారం 'ట్రేడ్ అండ్ ఎకానమిక్ పార్టనర్‌షిప్ అగ్రిమెంట్(టీఈపీఏ)'పేరిట ప్రత్యేక డెస్క్‌ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. 'భారత్, ఈఎఫ్‌టీఏ మధ్య గతేడాది మార్చిలో వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం వల్ల భారత్‌లోకి రాబోయే 15 ఏళ్లలో సుమారు 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశముంది. పది లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ పెట్టుబడుల్లో అధికశాతం తెలంగాణకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించాం. ఇందులో భాగంగానే ఆయా దేశాల పెట్టుబడిదారులకు అన్ని రకాలుగా సహకరించేందుకు సింగిల్ విండో మెకానిజంతో పనిచేసే ఈ ప్రత్యేక డెస్క్‌ను ప్రారంభించాం'అని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా వివరించారు.



బీసీ విస్తృత స్థాయి సమావేశంలో జాజుల, జస్టిస్ ఈశ్వరయ్య తదితర నేతల సంఘీభావం

## ఓటుతో సాధించుకుందాం: జాజుల

సాక్షి, హైదరాబాద్: మనకు దక్కాల్సిన వాటా కోసం యుద్ధం చేయాల్సిన పనిలేదని, ఓటుతో సాధించుకుందామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఒక హోటల్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం 'శాసనమండలి ఎన్నికలు, బీసీల పాత్ర, భవిష్యత్ కార్యాచరణ'పై సమావేశం జరిగింది. మండలి ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా హరికృష్ణకు, నల్లగొండ- ఖమ్మం -వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పూల రవీందర్‌కు మద్దతు ప్రకటించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు జనాభా దామాషా ప్రకారం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేసింది.

# తనను చూసి నవ్వారని..

విద్యార్థినులను చెప్పుతో కొట్టిన టీచర్.. దేహశుద్ధి చేసిన తల్లిదండ్రులు



శ్రీనివాస్‌రెడ్డి (ఫైల్)

బల్మూరు: విద్యార్థినులు తనను చూసి నవ్వారని.. ఓ ఉపాధ్యాయుడు వారిపై చెప్పుతో దాడి చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. శుక్రవారం ఓ బాలిక తోటి విద్యార్థులతో మాట్లాడుతున్న సందర్భంగా నవ్వడంతో తనను చూసే నవ్విందని భావించిన ఇంగ్లిష్ టీచర్ పి. శ్రీనివాస్‌రెడ్డి.. ఆగ్రహంతో తన కాలి చెప్పును ఆమెపైకి విసిరాడు. అయితే ఆ బాలిక తప్పించుకోగా.. అప్పుడే క్లాస్‌రూం నుంచి బయటకు వస్తున్న పదో తరగతి విద్యార్థినికి తగిలింది. ఈ ఘటనలో ఆమె చెవి కమ్మ విరగడంతోపాటు మెడ మీద గాయమైంది. అంతటితో ఆగని ఆ ఉపాధ్యాయుడు మొదటి విద్యార్థిని వద్దకువెళ్లి చేతులతో ఇష్టానుసారంగా చితకబాదాడు. ఈ విషయాన్ని విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో పాఠశాల హెచ్ఎం, ఇన్‌చార్జి ఎంఈఓ విష్ణుమూర్తి తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి దాడి చేసిన ఉపాధ్యాయుడితో క్షమాపణలు చెప్పించారు. అయితే దెబ్బలు తిన్న మొదటి విద్యార్థిని శనివారం ఒళ్లంతా నొప్పులతో లేవలేని స్థితికి చేరడంతో ఆమె తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని నిలదీశారు. దీంతో ఆయన బాలిక తల్లిదండ్రులతో దురుసుగా ప్రవర్తించాడు. ఉపాధ్యాయుడి తీరుతో ఆగ్రహించిన వారు ఆయనకు దేహశుద్ధి చేశారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నరసింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఉపాధ్యాయుడిపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని డీఈఓ రమేశ్‌కుమార్‌ను ఆదేశించారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ శనివారం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు.

# నీట్ యూజీలో కీలక మార్పు

- కరోనా సమయంలో ప్రవేశపెట్టిన ప్రశ్నల ఎంపిక విధానానికి స్వస్తి
- ఇక 180 ప్రశ్నలతోనే నీట్ యూజీ-2025
- నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి

సాక్షి, అమరావతి: ఎంబీబీఎస్, బీడీఎస్, ఇతర వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వ హించే నేషనల్ ఎలిజిబిలిటీ, ఎంట్రెన్స్ టెస్ట్(నీట్)-యూజీ పరీక్ష విధానంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కీలక మార్పులు చేసింది. కరోనా సమయంలో ప్రవేశపెట్టిన.. ప్రశ్నలను ఎంపిక చేసుకునే విధానంతో పాటు అదనపు సమయం కేటాయింపునకు ఎన్టీఏ స్వస్తి పలికింది. నీట్ యూజీ-2025 పరీక్ష 180 ప్రశ్నలతోనే ఉంటుందని శనివారం ఒక ప్రకటనలో ఎన్టీఏ వెల్లడించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీలో 45 చొప్పున, బయాలజీ(బోటనీ, జువాలజీ)లో 90 ప్రశ్నలు ఉంటాయని స్పష్టం చేసింది. ఈ 180 ప్రశ్నలకు విద్యార్థులు 180(మూడు గంటలు) నిమిషాల్లో జవాబులు రాయాల్సి ఉంటుంది. 2021-22 విద్యా సంవత్సరంలో నిర్వహించిన నీట్‌లో ప్రశ్నలను ఎంపిక చేసుకునే విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతి సబ్జెక్ట్‌నూ సెక్షన్-ఏ, బీ అని రెండు భాగాలుగా విభజించారు. సెక్షన్-ఏలోని అన్ని ప్రశ్నలకు.. బీలో 15కు గాను 10 ప్రశ్నలకు జవాబులు ఇచ్చేలా వెసులుబాటు కల్పించారు. దీంతో 200 ప్రశ్నలతో ప్రశ్నాపత్రం ఉండేది. అదనంగా 20 ప్రశ్నలను చేర్చడంతో విద్యార్థులకు 20 నిమిషాల అదనపు సమయం కూడా ఇచ్చారు. ఎన్టీఏ తాజా నిర్ణయంతో ఇకపై సెక్షన్-బీ విధానం ఉండదు. అదనంగా 20 ప్రశ్నలను ప్రవేశపెట్టడంతో విద్యార్థులు 200 ప్రశ్నలు చదివి.. సరైన వాటిని గుర్తించాల్సి వచ్చేది. ఈ విధానం నష్టాన్ని కూడా కలగజేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## అందుబాటులోకి నాలుగు వినూత్న పథకాలు: ఉత్తమ్

సాక్షి, హైదరాబాద్: గణతంత్ర దినోత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దేశంలోనే విప్లవాత్మకమైన నాలుగు పథకాలు అందుబాటులోకి వస్తున్నాయని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్. ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ పథకాల లబ్ధిదారులు, రాష్ట్ర ప్రజలకు ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరాభవన్‌లో శనివారం జరిగిన టీపీసీసీ సీనియర్ నేత ప్రేంలాల్ సంస్మరణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పదేళ్ల పాటు ఒక్క రేషన్‌కార్డు కూడా బీఆర్ఎస్ ఇవ్వలేదని విమర్శించారు. ఇప్పుడు రేషన్‌కార్డులివ్వడంతో పాటు ప్రతి వ్యక్తికి సన్న బియ్యం ఇవ్వబోతున్నామన్నారు.

# పసుపు పంటను తవ్వడానికి కొత్త పరికరం

కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల రూపకల్పన

కమ్మర్‌పల్లి: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు నూతన వ్యవసాయ పరికరాన్ని రూపొందించారు. రైతులకు లాభం కలిగేలా పసుపు పంటను సులభంగా తవ్వే కొంకి (పెడల్ ఆపరేటర్ మాన్యువల్ టర్మరిక్ డిగ్గర్)ని తయారు చేశారు. రాష్ట్రంలో పసుపు పంటను సాధారణంగా కొంకితో తవ్వుతారు. రైతు ఎడమ చేత్తో మొక్క కాండాన్ని పట్టుకొని కుడి చేత్తో కొంకిని భూమిలోకి దిగబెట్టి దుంపను తవ్వుతారు. అయితే ఈ ప్రక్రియ ఒకింత శ్రమతో కూడుకున్న పని. పసుపు పరిశోధన కేంద్రం కొత్తగా తయారు చేసిన కొంకిని నిటారుగా నిలబడి భూమిలోకి తొక్కుతూ పసుపు దుంపను అలసట లేకుండా పెకిలించవచ్చు. ఈ పద్ధతి చాలా సులభమైనది. శనివారం శాస్త్రవేత్తలు కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ప్రాంతంలోని పసుపు చేలల్లో రైతులతో కలసి ఈ పరికరాన్ని పరీక్షించారు. ఈ పరికరం బరువు 2.25 కిలోలు కాగా, మోయడానికి అనువుగా ఉంటుందని పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త బి.మహేందర్ తెలిపారు. అవసరమైతే ఈ పరికరానికి కొన్ని మార్పులు చేపట్టి రైతులకు అందిస్తామని ఆయన వెల్లడించారు.



పెడల్ ఆపరేటర్ మాన్యువల్ టర్మరిక్ డిగ్గర్‌తో చౌట్‌పల్లిలో పసుపు పంటను తవ్వుతున్న రైతులు



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

## ప్రతి సమస్యకు ప్రకృతిలోనే పరిష్కారం

**ఉచితంగా లభిస్తే విలువ తక్కువ.. అందుకే వనరులు వృథా**

- సహజ వనరుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
- ట్రావెల్ జర్నలిస్ట్ అతుషీ దేశ్‌పాండే, సంగీత విద్వాంసుడు రిషిరాజ్ కులకర్ణి



అతుషీ దేశ్‌పాండే



రిషిరాజ్ కులకర్ణి

సాక్షి, హైదరాబాద్: ప్రతి సమస్యలకు పరిష్కారం ప్రకృతిలోనే ఉంటుందని ప్రముఖ ట్రావెల్ జర్నలిస్ట్ అతుషీ దేశ్‌పాండే, సంగీత విద్వాంసుడు రిషిరాజ్ కులకర్ణి అన్నారు. టీహబ్‌లో జరుగుతున్న హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్‌లో భాగంగా శనివారం 'క్లైమెట్ ఎక్స్‌ప్రెషన్స్: ఫోర్జింగ్ యూనిక్ కనెక్షన్స్ విత్ నేచర్' అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో వారు మాట్లాడారు. చర్చాగోష్టికి సమన్వయకర్తగా బిజల్ వచ్చరాజన్ వ్యవహరించారు. మానవుడు సృష్టించిన ప్రతీ వస్తువు ప్రకృతి నుంచి వచ్చిందేనని, అలాంటి సహజసిద్ధమైన ప్రకృతికి దూరంగా కృత్రిమ ప్రపంచం చుట్టూ తిరుగుతున్నామని వ్యాఖ్యానించారు. జీవసంపదకు మూలాధారమైన ప్రకృతిపై ఇప్పుడు రకరకాలుగా దాడులు జరుగుతున్నాయన్నారు. అయినప్పటికీ ప్రకృతి తన సహజత్వాన్ని తిరిగి సంతరించుకునే క్రమంలో ఎన్నో పరిణామాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. మానవ సమాజానికి ఉచితంగా లభించే సహజవనరుల విలువలు ఇప్పటికీ తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉచితంగా వచ్చే ఏ వస్తువుకు విలువ ఉండదని, అలాంటి దృక్పథాన్ని వీడాలని హితవు పలికారు. సహజ వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వాటిని భావితరాలకు జాగ్రత్తగా అందించే బాధ్యత ప్రస్తుత తరంపై ఉందన్నారు. మనిషికి, ప్రకృతికి ఎంతో అన్యోన్యమైన సంబంధం ఉందన్నారు. మనిషికి ఎలాంటి సమస్య వచ్చినా.. వాటి పరిష్కారానికి ఆలోచించే క్రమంలో ప్రకృతితో కలిసిపోవాలని సూచించారు. అలాంటి సమయంలో ఎన్నో అద్భుతమైన ఆలోచనలు మనిషి మెదడులో తిరుగుతాయని పేర్కొన్నారు. మనిషి ఎన్నో రకాలుగా అభివృద్ధి చెందిన అత్యున్నత స్థానాలకు చేరుకుని.. ఇప్పుడు సహజత్వం కోసం పాకులాడే ప్రయత్నం చేస్తున్నాడన్నారు.



2006 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచిన మానుకోట అండర్-19 జట్టు (ఫైల్)



1995లో జోనల్‌స్థాయిలో బాస్కెట్‌బాల్‌లో విజయం సాధించినందుకు బహుమతి అందజేస్తున్న అప్పటి మంత్రి యతిరాజారావు(ఫైల్)

# బంతి తిప్పిన బతుకులు..

## బాస్కెట్‌బాల్ పుట్టినిల్లు మానుకోట ● అంతర్జాతీయస్థాయిలో రాణింపు

### 1967లో మానుకోటలో క్రీడ ప్రారంభం ● వందలాది మందికి ప్రభుత్వ కొలువులు

మహబూబాబాద్ అర్బన్:

మానుకోట.. బాస్కెట్‌బాల్ క్రీడకు ప్రసిద్ధి. ఇక్కడి క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరు, ప్రఖ్యాతులు తీసుకొచ్చారు. వందలాది మంది క్రీడల కోటాలో ఉద్యోగాలు సాధించి ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. అనేక మంది ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో రాణిస్తున్నారు. ప్రస్తుతం యువత క్రీడపై మక్కువతో రాణిస్తున్నారు.



2023లో రాష్ట్రస్థాయి ఆహ్వాన క్రీడా పోటీల్లో విజయం సాధించిన మానుకోట బాస్కెట్‌బాల్ జట్టు

### వెలిశాల కుమారస్వామి తర్ఫీదు..

క్రీడాకారులకు శిక్షకుడు లేని సమయంలో.. వెలిశాల కుమారస్వామిని 1993లో బాస్కెట్‌బాల్ శిక్షకునిగా నియమించారు. అప్పటినుంచి ఇప్పటి వరకు కుమారస్వామి ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దుతున్నారు. తనకు ప్రభుత్వ ఉద్యోగం వచ్చినప్పటికీ దూర ప్రాంతాలకు వెళ్లకుండా.. ఇక్కడే ఒక ప్రైవేట్ స్కూల్‌లో పీడీగా కొన్ని రోజులు పనిచేసి బాస్కెట్‌బాల్ శిక్షకునిగా వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తయారుచేసిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించారు. మానుకోటలో ఇప్పటి వరకు ఆరు రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. రెండు జూనియర్ స్థాయి, మూడు సీనియర్ స్థాయి క్రీడా పోటీలు జరిగాయి.

### 1967లో మట్టికోర్టుతో..

మానుకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో 1967లో కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాల పీడీ బి.రామచందర్ మట్టికోర్టు ఏర్పాటు చేసి బాస్కెట్‌బాల్ క్రీడను ప్రారంభించారు. రెండు టేకు కర్రల సాయంతో బోర్డు ఏర్పాటు చేసి పాయింట్లు వేసేవారు. 1970లో ప్రభుత్వ బాలుర పాఠశాల పీడీ మల్లు అమృత రెడ్డి.. రాంచందర్‌తో మమేకమై బాలుర పాఠశాల విద్యార్థులకు బాస్కెట్‌బాల్ క్రీడలో తర్ఫీదు ఇచ్చారు. 1972లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడా పోటీలను మొట్టమొదటిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల మట్టికోర్టులో నిర్వహించారు. రాంచందర్ బదిలీపై వెళ్లిపోగా.. అమృతరెడ్డి ఇక్కడే ఉండి అనేక మందికి యువతకు క్రీడలో శిక్షణ ఇచ్చారు. 1973లో హైదరాబాద్ జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటి 8మంది క్రీడాకారులు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు.

### 1980లో మహ్మద్ ఇసాక్, డోలి సమ్మయ్య ఆధ్వర్యంలో..

1980 నుంచి సీనియర్ క్రీడాకారులు మహ్మద్ ఇసాక్, డోలి సమ్మయ్య బాధ్యతలు తీసుకున్నారు. చాలామంది క్రీడాకారులకు బాస్కెట్ బాల్ క్రీడలో శిక్షణ ఇవ్వడంతో పాటు వారి అవసరాలను తీర్చేవారు.

ఇసాక్‌కు 1992లో ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీలో ప్రభుత్వ ఉద్యోగం రావడంతో.. హైదరాబాద్‌కు వెళ్లి స్థిరపడ్డారు. ఈ క్రమంలో మానుకోట బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఏర్పడింది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు, మానుకోట ప్రాంతానికి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు.

### మట్టికోర్టు నుంచి సీసీ కోర్టు వరకు..

జెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి మానుకోట ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 1993లో మట్టి కోర్టు మైదానాన్ని రూ.2లక్షల వ్యయంతో సీసీ కోర్టుగా తీర్చిదిద్దారు. రెడ్యానాయక్ మంత్రిగా ఉన్న సమయంలో క్రీడాకారుల కోసం మైదానంలో ఒక గదిని నిర్మించారు. అలాగే 2014లో అప్పటి బీఆర్ఎస్ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ మరో గదిని క్రీడాకారుల కోసం నిర్మించారు. చాలామంది క్రీడాకారులు ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో పీఈటీలుగా, పీడీలుగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. సీనియర్, జూనియర్ క్రీడాకారులందరూ కలిసి నేటివరకు బాస్కెట్‌బాల్ కోర్టు అభివృద్ధిలో సహకారం అందిస్తున్నారు.

### బాస్కెట్‌బాల్ మైదానం నిర్మించాలి



రాంచందర్ సార్ వెళ్లినప్పటి నుంచి 1968 నుంచి ఎంతో మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులను తయారు చేశాను. ప్రభుత్వం బాస్కెట్‌బాల్ మైదానం ఏర్పాటు చేయాలని కోరుతున్నాను. ఎంతో మంది క్రీడాకారులను తీర్చిదిద్దిన సంతృప్తి నాకు ఉంది. ఇప్పటికీ అవసరమైన వారికి ఆర్థిక సాయం అందిస్తున్నాను.

– మల్లు అమృతరెడ్డి, సీనియర్ బాస్కెట్‌బాల్ శిక్షకుడు, పీడీ

### బాస్కెట్‌బాల్‌తో జీవితం మారింది



బాస్కెట్‌బాల్ క్రీడతో గెలుపోటములను సమానంగా స్వీకరించడం నేర్చుకున్నాను. అందరినీ కలుపుకొని పోవడం నేర్చుకున్నాను. 1980లోనే జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించి యూనివర్సిటీలో రాణించాను. 1992 డీఎస్సీలో ఉద్యోగం సాధించాను. ఎడ్యుకేషన్ సైకాలజీలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వేలాదిమంది ఉపాధ్యాయులను తయారు చేశాను. నా పిల్లలు కూడా ఉన్నత విద్య చదివి ఉద్యోగాలు సాధించారు. మొత్తానికి బాస్కెట్‌బాల్ నా జీవితాన్ని మార్చేసింది.

– గుడిబోయిన పూర్ణచందర్, సీనియర్ క్రీడాకారుడు

### క్రీడతోనే పీడీ ఉద్యోగం



నాలుగుసార్లు కాకతీయ యూనివర్సిటీ తరపున జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ క్రీడలో పాల్గొన్నాను. కోచ్ ఇసాక్, డోలి సమ్మయ్య సార్ల సహకారంతో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటాను. 2002 డీఎస్సీలో బాస్కెట్‌బాల్ క్రీడతోనే ప్రభుత్వ పీడీగా ఉద్యోగం సాధించాను. గ్రామీణస్థాయిలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతున్నాను.

– పిల్లి కాశీనాథ్, మానుకోట సీనియర్ క్రీడాకారుడు

### గురువుల స్ఫూర్తితో..



మా గురువు పీడీ రాంచందర్, మల్లు అమృతరెడ్డిలను స్ఫూర్తిగా తీసుకొని అనేక మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులకు సహకారం అందిస్తున్నాను. 1993 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నాను. ఇక్కడి క్రీడాకారులు బాస్కెట్‌బాల్‌లో బంగారు పతకం సాధించారు. వైద్య కళాశాలలో మెడిసిన్, అగ్రికల్చర్, ఐఐటీలో ఉచిత సీట్లు సాధించి ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు.

– ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి, బాస్కెట్‌బాల్ అసోసియేషన్, మానుకోట

### ప్రభుత్వం సహకరిస్తే..



ప్రభుత్వం బాస్కెట్‌బాల్ మైదానాన్ని పూర్తిస్థాయిలో నిర్మించి.. నాకు ఆర్థిక సహకారం అందిస్తే చాలా మంది క్రీడాకారులను తీర్చిదిద్దుతా. నేను తయారు చేసిన క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. క్రీడల్లో బంగారు పతకాలు అందుకున్నారు. సీనియర్ క్రీడాకారులు బాస్కెట్‌బాల్ క్రీడకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు.

– వెలిశాల కుమారస్వామి, బాస్కెట్‌బాల్ శిక్షకుడు, మానుకోట

# వామ్మో.. వానర దండు



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ప్రతి గ్రామంలోనూ వందల సంఖ్యలో వానరాలు హడలెత్తిస్తున్నాయి. ఇళ్లమీద చేరి పెంకులను ధ్వంసం చేస్తున్నాయి. పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. ప్రజలను కూడా గాయపరుస్తున్నాయి.

- ఆత్మకూరు(ఎం)



ఇళ్లపై వానర గుంపు

# నా రచనలతో పాఠకులకు దగ్గరయ్యా..

## విమర్శకురాలు, కవయిత్రి రీఖిలమ్ చట్రాజ్

సాక్షి, హైదరాబాద్: ఇటీవల తాను రాసిన 'సుదీప్ సేన్' పుస్తకం.. ఉత్సాహంగా పాఠకులకు దగ్గరయ్యేందుకు.. తన రచనా సక్తిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు, ఎంతగానో తోడ్పడిందని హైదరాబాద్‌లోని రెడ్డి ఉమెన్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, విమర్శకురాలు, కవయిత్రి రీఖిలమ్ చట్రాజ్ చెప్పారు. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల తాను రాసిన 'సుదీప్ సేన్' రీడింగ్, రైటింగ్, టీచింగ్ పుస్తకం విశేషాలను పంచుకున్నారు. 'మీట్ మై బుక్' లో.. తన పుస్తకం 'సుదీప్ సేన్' గురించి మాట్లాడటం చాలా సంతోషంగా ఉందన్నారు. భారతీయ ఆంగ్ల కవి సుదీప్ సేన్.. 40 ఏళ్లుగా రచనలు చేస్తూనే ఉన్నారని.. అతని రచనలు తననెంతగానో ప్రభావితం చేశాయని వివరించారు. అవి ఎంతో ఆలోచింపజేసే విధంగా, విమర్శనాత్మంగా ఉంటాయని తెలిపారు. సేన్ 60వ పుట్టిన రోజున తానీ పుస్తకం తీసుకొచ్చినట్లు వెల్లడించారు. ఇంగ్లిష్‌లో సమకాలీన భారతీయ కవిత్వంపై విమర్శనాత్మక అధ్యయనం చేయడానికి ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. లిటరరీ ఫెస్టివల్‌లో ఇంతమంది వచ్చి, ఆసక్తిగా పుస్తకం గురించి అడిగి తెలుసుకోవడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.



### అన్ని జీవజాలాలతో కలిసి బతకాలి



**రచయిత్రి, ఉపాధ్యాయిని ప్రియదర్శిని పంచాపకేశన్**

ప్రకృతిలో అన్ని జీవజాలాలతో కలిసి జీవించాలని, వాటిని నాశనం చేసి కాదని.. పిల్లల పుస్తకాల రచయిత్రి, టీచర్ ప్రియదర్శిని పంచాపకేశన్ అభిప్రాయపడ్డారు. తమిళనాడు వాసి అయిన ప్రియదర్శిని కొడైకెనాల్‌లోని కొండప్రాంతాలలో దాగున్న అద్భుతాలను తన రచనల ద్వారా చూపుతారు. వృక్షజాలం, జంతుజాలం, లింగ సమానత్వం, ప్రకృతి కాపాడేందుకు చేసే ఆమె రచనలు ఆలోచింపజేస్తాయి. హైదరాబాద్ లిటరరీ ఫెస్టివల్ సందర్భంగా.. ఆమె మాట్లాడుతూ 'ది గార్డియన్ ఆఫ్ ది ఫారెస్ట్, లింగసమానత్వం సూచించే 'అన్‌సంగ్ షీరోస్ అండ్ హీరోస్', 'ది మిత్ ఆఫ్ ది వైల్డ్ గౌర్' పుస్తకాలు తనను ప్రత్యేకంగా చూపాయని తెలిపారు. కొండ ప్రాంతాలను అకస్మాత్తుగా మేఘాలు కమ్మేస్తుంటాయని.. జల్లులతో ప్రకృతిని పచ్చగా ఉంచుతాయని.. వృక్షజాలం, జంతుజాలం గురించి అపారమైన అవగాహన ఉన్న తేనె సేకరించే తెగకు చెందిన ఓ యువతి చుట్టూ 'ది మిత్ ఆఫ్ ది వైల్డ్ గౌర్' నవల కథాంశం తిరుగుతుందని వివరించారు. మోసపూరిత వ్యాపారవేత్తల నుండి తమ తెగవారిని రక్షించడానికి ఆమె చేసే కృషి, ధైర్యం పాఠకులను బాగా ఆకట్టుకుంటుందని వెల్లడించారు. రచనల ద్వారా సాహసాలు చేయడం ఇష్టమని ఆమె తెలిపారు. ఉపాధ్యాయిని కావడంతో పిల్లలకు కూడా స్టోరీ టెల్లింగ్ సెషన్స్ నిర్వహిస్తుంటానని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా, వారిలో పర్యావరణంపై ఆసక్తి, స్పృహ కలిగించేలా.. బొమ్మల చిత్రీకరణ ద్వారా కథలు చెబుతుంటానని ప్రియదర్శిని పంచాపకేశన్ వివరించారు.



## తాటిచెట్లకు చేటు

తాటికల్లు అంటే పల్లె ప్రజలకు ఎంతో ఇష్టం. పల్లె, పట్టణం.. తేడా లేకుండా కల్లు తాగేందుకు చాలామంది మక్కువ చూపుతారు. ప్రకృతి సిద్ధంగా లభించే కల్లు ఔషధంగా పనిచేస్తుందని కూడా పల్లెవాసులు నమ్ముతారు. ఇలాంటి తాటిచెట్లకు ప్రమాదం ముంచుకొచ్చింది. లద్దెపురుగు సోకి ఇవి మోడువారిపోతున్నాయి. మరికొన్ని చనిపోతున్నాయి. కల్లుగీతపై ఆధారపడిన గీతకార్మికుల బతుకు ప్రయాణం ప్రశ్నార్థకమవుతోంది. పెద్దపల్లి జిల్లా మారేడుగొండ, రాంపల్లి గ్రామ శివార్లలో మోడువారిన తాటిచెట్లు ఇవి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి





# హస్త కళల్లో మేటి కొండపల్లి కొప్పాక

> 'ఏటికొప్పాక ఒకప్పుడు చిన్న పల్లెగ్రామం..ఇప్పుడు హస్తకళల్లో ఖండాంతర ఖ్యాతిని ఆర్జించి..మేటి కొప్పాకగా నిలిచింది. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో లక్కబొమ్మలతో నమ్మశక్యం కాని కళాఖండాలను తయారు చేయగల నైపుణ్యం వారి సొంతం. ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏటికొప్పాక లక్క బొమ్మల శకటం ప్రదర్శనకు ఎంపికైంది. రంగు లీనుతూ కనిపించే ఈ బొమ్మల వెనుక కళాకారుల సృజనాత్మకత మనల్ని కట్టిపడేస్తుంది. ఈ సందర్భంగా ఎన్నో హొయలు పోయే ఏటికొప్పాక లక్కబొమ్మలపై సాక్షి ప్రత్యేక కథనం...'

- గణతంత్ర వేడుకల్లో మన లక్కబొమ్మల ఘనత
- ఢిల్లీ పెరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మల శకటం ప్రదర్శనకు ఎంపిక
- 400 ఏళ్ల హస్త కళకు.. 30 సహజ రంగులతో మెరుగులు
- ఈ బొమ్మలకు రాష్ట్రపతి, పద్మశ్రీ అవార్డులు
- ఇటీవల లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌లో ప్రత్యేకాకర్షణగా ఈ బొమ్మలు



సాక్షి, అనకాపల్లి :

అనకాపల్లి జిల్లా యలమంచిలి మండలం ఏటికొప్పాకలో 7దశాబ్దాల కిందట జీవనోపాధి కోసం, కుటుంబ పోషణ నిమిత్తం లక్కబొమ్మల తయారీని కేవలం 4 విశ్వకర్మ కుటుంబాలు చేపట్టాయి. నేడు అంకుడు కర్రలతో లక్కబొమ్మలు తయారు చేసే హస్త కళాకార కుటుంబాలు ఈ గ్రామంలో దాదాపు 150 వరకూ వున్నాయి. సూదిమొన పరిమాణంలోని కళాఖండాలను సృష్టించే ఏటికొప్పాక హస్త కళాకారుల నైపుణ్యం ఔరా అనిపిస్తుంది.

**తూర్పు కొండల నుంచి సహజ రంగులు**

ఈ కళాకారులు లక్కకి సహజమైన రంగులను కలిపి అనేక ప్రయోగాలు చేస్తుంటారు. ఒక చిన్న పొయ్యి, ఉసిరి, కరక్కాయ, వేపవంటి వాటితోనే పరిశోధనలు చేసి సహజ సిద్ధమైన రంగులను తయారు చేస్తారు. సహజమైన లక్క ఎక్కువగా రాంచీ నుంచి వస్తుంది. అక్కడ ఒక రకమైన సూక్ష్మ క్రిమి విసర్జితాల నుంచి ఇది లభిస్తుంది. దాన్ని స్థానిక గిరిజనులు సేకరించి విక్రయిస్తారు. ఆ లక్కకి తూర్పుకనుమల్లో దొరికే వివిధ మొక్కలు, వాటి విత్తనాలు, ఆకులు, వేళ్లు, కాండం, కలుపు నుంచి వచ్చే సహజ సిద్ధమైన రంగులను కలుపుతారు. 100 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత వద్ద లక్కని వేడిచేసి, రంగుని కలిపి దాన్ని బొమ్మలకు అద్దుతారు. 1990 వరకు ఈ బొమ్మలకు రసాయన రంగులే పూసేవారు. అయితే ఆ గ్రామానికి చెందిన సీవీ రాజు రసాయన రంగుల స్థానంలో సహజ సిద్ధమైన రంగులను వాడడం మొదలుపెట్టారు. సహజ రంగుల తయారీని గ్రామంలోని కళాకారులు నేర్చుకుని బొమ్మలకు వాటిని అద్దడం ప్రారంభించారు. దీంతో ఏటికొప్పాక బొమ్మల అందం ఇనుమడించింది. చాలా మంది తమ ఇళ్ల షో కేసుల్లో ఏటికొప్పాక బొమ్మలను అలంకరించుకోవడానికి ఆసక్తి చూపుతుంటారు.

**ముచ్చటపడిన ప్రధాని**

ఏటికొప్పాకలో లక్క బొమ్మలను వినూత్న రీతిలో తయారు చేసే కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర అవార్డులు కూడా లభించాయి. దేశ ప్రధాని సైతం 'మన్ కీ బాత్' లో లక్క బొమ్మల విశిష్టతను గురించి ప్రస్తావించారు. ఇండియన్ నేవీ ఆధ్వర్యంలో విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ–2016లో ఏర్పాటు చేసిన ఏటికొప్పాక బొమ్మల స్టాల్‌ని నేరుగా ప్రధాని మోదీ సందర్శించారు. అక్కడ తన ఫొటో పెట్టి తయారు చేసిన లక్క డబ్బాని చూసి ముచ్చటపడి దాని మీద సంతకం చేశారు.

**విదేశాలకు ఎగుమతి..**

ఏటికొప్పాక బొమ్మలు అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, పోలెండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, నేపాల్, బ్రిటన్, జర్మనీ వంటి విదేశాలతో పాటు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, బెంగుళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, రాజస్థాన్, పాట్నా తదితర నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థల ఆన్‌లైన్ అమ్మకాలతో లక్కబొమ్మలు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాయి.

## క్లుప్తంగా...

### రాజకీయ దురుద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ నేత అరెస్టు

**అధికారులపై స్థానిక ఎమ్మెల్యే ఒత్తిడి**

వెదురుకుప్పం: రెండు వర్గాలు ఘర్షణ పడుతుండగా సర్దిచెప్పడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకుడిపై అన్యాయంగా కేసులు బనాయించి హింసించడం భావ్యం కాదని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బండి హేమసుందర్‌రెడ్డి ఆరోపించారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామంలో ఈనెల 17న రెండు వర్గాలు ఘర్షణ పడుతుండగా జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి ఇరు వర్గాలను సర్ది చెప్పేందుకు ప్రయత్నించారు. ఈ ఘర్షణపై ఓ వర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురిని అరెస్టు చేశారు. అయితే ఆ గొడవలకు ఎలాంటి సంబంధం లేకున్నా బండి గోవర్ధన్‌రెడ్డిని కూడా ఆ కేసులో ఇరికించినట్లు గ్రామస్తులు చెప్తున్నారు. ఆ కేసులో శనివారం ఆయనను అరెస్టు చేశారు. హేమసుందర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గోవర్ధన్‌రెడ్డిని ఏ4 నిందితుడుగా చేర్చి 307 సెక్షన్ కింద కేసు నమోదు రాజకీయ కక్షతో అక్రమంగా అరెస్టు చేసినట్లు విమర్శించారు.

### 'ప్రకాశం' వాసికి ఇండియన్ పోలీస్ మెడల్



ఒంగోలు: అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, ప్రకాశం జిల్లా పేర్నమిట్ట వాసి అయిన అన్ను వేణుగోపాల్‌కు 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఇండియన్ పోలీస్ మెడల్ ఫర్ మెటీరియల్ సర్వీస్ కోసం ప్రకటించింది. వేణుగోపాల్ 1996లో ఆర్ఎస్సైగా హైదరాబాద్ సిటీ పోలీసు విభాగంలో ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన డీఎస్పీగా తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. 2000 సంవత్సరంలో శ్రీలంక రాజధాని కొలంబోలో జరిగిన 3వ ఆసియా కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించి బంగారు పతకం సాధించారు.

### ఉత్తరాంధ్ర అభివృద్ధికి రూ.50 వేల కోట్లు కేటాయించాలి

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్**

డాబాగార్డెన్స్(విశాఖ): ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి, ఈ ప్రాంత సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం రూ.50 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శనివారం సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం అధ్యక్షతన ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధి, ప్రత్యామ్నాయ విధానాలుపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ వనరులు దోచుకునే అభివృద్ధి వద్దని, మానవాభివృద్ధికి సీపీఎం ప్రత్యామ్నాయ విధానంతో పోరాడుతుందన్నారు. ఫిబ్రవరి 1–3వరకు నెల్లూరులో సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో విజయవాడ, కర్నూలు, విశాఖలో ప్రాంతీయ సదస్సులు నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో అభివృద్ధిపై నడుస్తోన్న చర్చ ప్రజలకు కావాల్సిన ప్రత్యామ్నాయ విధానంపై సీపీఎం కృషి చేస్తుందన్నారు.

### శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 57,665 మంది స్వామివారిని దర్శించుకోగా 20,051 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 10 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# విజ్ఞాన భారతీయం



- సైన్స్‌నే ఎక్కువ నమ్ముతామంటున్న భారతీయులు
- సైన్స్‌పై విశ్వాసం ఉన్న దేశాల్లో రెండో స్థానంలో భారత్
- తొలి స్థానంలో ఈజిప్ట్.. 12వ స్థానంలో అమెరికా
- గ్లోబల్ సర్వే సంస్థ పరిశోధనల్లో వెల్లడి

సాక్షి, విశాఖపట్నం: 'లాజిక్కులు ఎవరూ నమ్మరు.. అందరికీ మ్యాజిక్కులే కావాలి. అందుకే మన దేశంలో సైంటిస్టుల కంటే బాబాలకే ఫేమస్.!' ఇది ఓ పుష్కర కాలం కిందట వచ్చిన ఓ తెలుగు సినిమా డైలాగ్. అయితే ఇది పూర్తిగా తప్పంటున్నారు భారతీయులు. మాకు మ్యాజిక్ కంటే సైన్స్ అంటేనే ఎక్కువ విశ్వాసమని ఢంకాపథంగా చెబుతున్నారు. ప్రపంచంలో సైన్స్‌ని నమ్మే దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉందని గ్లోబల్ సర్వే సంస్థ చేసిన పరిశోధనల్లో స్పష్టమైంది. సైన్స్‌పై విశ్వాసం ఉన్న దేశాల్లో ఈజిప్ట్ తొలి స్థానంలో ఉండగా..అమెరికా 12వ స్థానంలో ఉన్నట్లు సంస్థ వెల్లడించింది. కోవిడ్ మహమ్మారి తర్వాత అన్ని దేశాల ప్రజల్లో సైన్స్‌పై ఎక్కువ నమ్మకం పెరిగిందని స్పష్టమైంది. భారతీయుల సంప్రదాయాలు, ఆచారాలు వాస్తవాలపై ఆధారపడి ఉంటాయి. అనేక భారతీయ సంప్రదాయాలు మూఢనమ్మకాలుగా చెబుతున్నప్పటికీ.. దాని వెనుక సైన్స్ ఉందన్నది వాస్తవం. అందుకే ఇండియన్స్‌కు సైన్స్ అన్నా.. సైంటిస్టులన్నా గౌరవం. ఈ విషయం గ్లోబల్ సర్వే సంస్థ కూడా స్పష్టం చేసింది. హార్వర్డ్ యూనివర్సిటీ, జ్యూరిచ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల బృందం ప్రపంచ వ్యాప్తంగా 68 దేశాల్లో సర్వే నిర్వహించింది. మొత్తం 169 సంస్థల నుంచి 241 మంది పరిశోధకులు ఈ సర్వేలో భాగస్వాములయ్యారు. నేచర్ హ్యూమన్ బిహేవియర్స్ జర్నల్‌లో సర్వే వివరాల్ని ప్రచురించారు. కోవిడ్–19 తర్వాత శాస్త్రవేత్తలపై ప్రజల్లో విశ్వాసం కలిగిందా లేదా అనే అంశంపై సర్వే సాగింది. మెజారిటీ ప్రజలకు శాస్త్రవేత్తలపై నమ్మకం పెరిగినట్లు అధ్యయనంలో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే 78 శాతం మంది శాస్త్రవేత్తలు పరిశోధనలపై విశ్వాసం ఉంచుతున్నట్లు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**ఈజిప్ట్ తర్వాత భారత్..**

శాస్త్రవేత్తలు, సైన్స్‌పై అత్యంత విశ్వసనీయత చూపిస్తున్న ప్రజల జాబితాలో ఈజిప్ట్ అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో భారత్ ఉంది. తర్వాత నైజీరియా, కెన్యా, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ ఉండగా..అమెరికా 12వ స్థానంలో, యూకే 15వ స్థానంలో ఉన్నాయి. కెనడా 17, స్వీడన్ 20లో నిలిచాయి. శాస్త్రవేత్తలు, సైన్స్‌పై నమ్మకంలేని దేశంగా ఆల్బేనియా అట్టడుగున 68వ స్థానంలో నిలిచింది. కజకిస్తాన్ 67, బొలీవియా 66, ఇథియోపియా 64 స్థానంలో ఉన్నాయి. ఇక అతి పెద్ద దేశంగా చెబుతున్న రష్యా మాత్రం 65వ స్థానంలో ఉంది. యూకే ప్రజలకు సాధారణంగా సైన్స్‌పై ఎక్కువ నమ్మకం ఉంటుంది. విద్యావంతులు, వృద్ధులు ఎక్కువగా సైన్స్, శాస్త్రవేత్తలపై విశ్వాసం వ్యక్త పరిచినట్లు అధ్యయనంలో స్పష్టమైంది. ఉత్తర అమెరికా, ఐరోపాలోని కొన్ని ప్రాంతాలలో సైన్స్‌పై నమ్మకం తక్కువగా ఉండటం ఆశ్చర్యకరమైన అంశం.

**సమాజానికి ఉపయోగపడాలనీ..**

అనేక దేశాల ప్రజలు సైన్స్, సైంటిస్టులు సమాజానికి ఉపయోగపడేలా పరిశోధనలు చేసి.. ప్రతి ఒక్క వర్గానికి ఆ ఫలాలు అందించేలా కృషి చెయ్యాలని భావిస్తున్నట్లు జర్నల్‌లో పేర్కొన్నారు. కోవిడ్ కారణంగా ఆరోగ్యంపై భయాందోళనలు మొదలయ్యాయనీ..అయితే..వ్యాక్సిన్ కనుగొన్న తర్వాత.. సాధారణ పరిస్థితులు నెలకొనడంలో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కొంతమంది భారతీయులైతే.. పిట్టల్లా రాలుతున్న జనాల్ని చూసిన తర్వాత.. ప్రపంచం అంతమైపోతుందనే భావనలోకి వెళ్లిపోయినట్లు చెప్పారని పరిశోధకులు వెల్లడించారు. శాస్త్రవేత్తలు వ్యాక్సిన్ కనుక్కోలేకపోతే పరిస్థితులు వేరే విధంగా ఉండేవనీ..అందుకే..సైన్స్, సైంటిస్టులపై విశ్వాసం పెరిగిందని మరికొందరు పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ఇంధన సమస్యలను పరిష్కరించడం,పేదరికాన్ని తగ్గించడం వంటివాటిపై ఎక్కువగా పరిశోధనలు చేయాలని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు సూచించడం కొసమెరుపు.

**సైన్స్‌పై విశ్వాసం ఉన్న టాప్-10 దేశాలు**

| దేశం | పాయింట్స్ | దేశం | పాయింట్స్ |
|---|---|---|---|
| ఈజిప్ట్ | 4.30 | బంగ్లాదేశ్ | 3.91 |
| భారత్ | 4.26 | స్పెయిన్ | 3.90 |
| నైజీరియా | 3.98 | టర్కీ | 3.90 |
| కెన్యా | 3.95 | న్యూజిలాండ్ | 3.88 |
| ఆస్ట్రేలియా | 3.91 | అర్జెంటీనా | 3.87 |

# చిగురించిన ఆశలు


నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

- రోజురోజుకు పెరుగుతున్న నిమ్మ ధరలు
- అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ సాగు
- బెంగళూరులో బస్తా రూ.1000
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

వేంపల్లె: నిమ్మ కాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో అన్నదాతల ఆశలు చిగురిస్తున్నాయి. నిలకడ లేని ధరలతో ఇబ్బందుల్లో ఉండే రైతులు ప్రస్తుతం ఉన్న ధరలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే నెల చివరి వారంలో రూ.300 నుంచి రూ.450 లోపే బస్తా ధర ఉండేది. కానీ ఈ ఏడాది పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. గత వారం రోజులుగా ధరలు పెరుగుతూ గురువారం నిమ్మకాయల బస్తా రూ.800 నుంచి రూ.1000ల ధర పలికింది. గత ఏడాదంతా మార్కెట్ ధరలు పుంజుకోకపోవడంతో నిమ్మ రైతులు నష్టాలను ఎదుర్కొన్నారు. అయితే ఇప్పుడిప్పుడు నిమ్మ ధరలు ఊపందుకోవడంతో అన్నదాతలలో సంతోషం మొదలైంది. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుండి బెంగళూరు మార్కెట్‌లో నిమ్మకాయల బస్తా మొదటి రకం రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. గత పది నెలలుగా బెంగళూరు మార్కెట్‌లో మొదటి రకం నిమ్మకాయల బస్తా రూ.400 నుంచి రూ.500 పలికేది. రెండవ రకం కాయలు రూ.300 మాత్రమే పలికేవి. రైతుకు కూలి పాటు కూడా పడడం లేదు. గత పది రోజులుగా ధరలు రోజు రోజుకు పెరుగుతుండటంతో నిమ్మ సాగు చేసిన రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.


**ఎకరాకు రూ.75 వేల పెట్టుబడి**

రైతులు మొక్క నాటిన నాటి నుంచి ఐదేళ్లపాటు ఎన్నో వ్యయప్రయాసలకు లోనై పెట్టుబడులు పెడతారు. నిమ్మతోట సాగులో ఎకరాకు రూ.75వేలు పెట్టుబడులు అవుతున్నాయి. ఏడాదికి 3 కాపులు వస్తాయి. సాగులో దశలవారీగా తోటలు పూతకు రావడంతో దిగుబడులు కూడా వస్తుంటాయి. ఏడాదిలో ఒక కాపునకు ధరలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఆదాయం ఉంటుందని రైతులు చెబుతుంటారు. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కనిపించడంతో కొంతమేర నిమ్మ ధరలు పెరగవచ్చునని రైతులు అంటున్నారు.

**కూలీల ఖర్చులకు పోను మిగులు**

నిమ్మతోటలో అన్ని ఖర్చులు పోనూ రూ.400 మిగులుతుందని రైతులు చెబుతున్నారు. 10 నెలలుగా ధరలు పతనం కావడంతో రైతులు నిమ్మ సాగు చేయాలంటే నిరాశ వ్యక్తం చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో ధరలు ఆశాజనకంగా ఉండడంతో వారిలో ఉత్సాహం కలుగుతోంది.

**నిమ్మ తోటల సాగు**



ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ తోటలు సాగు చేశారు. అత్యధికంగా రైల్వే కోడూరు, వేంపల్లె, రాజంపేట, పెండ్లిమర్రి, చిట్వేలి, ముద్దనూరు, వీరపునాయునిపల్లె, చక్రాయపేట తదితర మండలాల్లోనూ, అత్యల్పంగా తొండూరు, సింహాద్రిపురం, వేముల, కొండాపురం, చింతకొమ్మదిన్నె, లింగాల మండలాల్లో నిమ్మ తోటలను సాగు చేశారు. ఇక్కడి నుంచి నిమ్మకాయలను బెంగళూరు, నాగపూర్, ఢిల్లీ తదితర మార్కెట్లకు వ్యాపారులు తరలిస్తుంటారు.


నిమ్మకాయలను రవాణా చేసేందుకు సంచులలో నింపుతున్న కూలీలు

# ముగిసిన భాషా సంఘం సదస్సు

తిరుపతి సిటీ : కేంద్ర మానవ వనరులశాఖ, సంస్కృత వర్సిటీ, ఏబీఆర్ఎస్ఎమ్ సంయుక్త ఆధ్వర్యంలో భారతీయ భాషా సంఘం అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. సంస్కృత వర్సిటీ వేదికగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి హాజరై ప్రసంగించారు. అమెరికా, జర్మనీ, ఇంగ్లాండ్ వంటి దేశాల్లో సంస్కృత భాషపై పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. మన వేదాలు, ఉపనిషత్తుల్లోని అంశాలను ఆధునిక సాంకేతిక రంగంలో ఉపయోగించుకుంటూ లబ్ధి పొందుతున్నారని చెప్పారు. అనంతరం ఏబీఆర్ఎస్ఎమ్ జాతీయ సహ సంఘటన కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ.. మాతృభాష విలువైన వారసత్వ సంపద అన్నారు. సమావేశంలో ఏబీఆర్ఎస్ఎమ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ వైవీ రామిరెడ్డి, ప్రొఫెసర్ గణపతి భట్, కన్వీనర్ డాక్టర్ బుల్టిదాస్, కో–కన్వీనర్ డాక్టర్ కనపాల కుమార్, పలు విద్యా సంస్థల నుంచి అధ్యాపకులు పాల్గొన్నారు.


ముగింపు సభకు హాజరైన ముఖ్య అతిథులు

# పుత్తూరులో తుపాకీ కలకలం!

పుత్తూరు: చంపుతానంటూ ఓ ఆర్ఎంపీ డాక్టర్ తనకు తుపాకీ చూపి బెదిరించాడంటూ తిరుపతి జిల్లా పుత్తూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన పి.రాజా అనే వ్యక్తి శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు రాజా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. స్థానిక సెంగుథర్ వీధిలో షణ్ముగ హాస్పిటల్ నడుపుతున్న ఇ.మునిరాజా అలియాస్ చిన్నా అనే ఆర్ఎంపీ డాక్టర్ ఈనెల 23వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో రాజాకు ఫోన్‌చేసి పున్నమి హోటల్ వద్దకు రమ్మని పిలిచాడు. అక్కడకు వెళ్లిన రాజకు డాక్టర్ మునిరాజా భుజానికి తగిలించుకుని ఉన్న బ్యాగులో నుంచి తుపాకీని తీసి ''కాల్చి చంపేస్తాన్‌రా.. ఏమనుకుంటున్నావ్ రా నువ్వు, నీ మామ. ఇదేమైనా డూప్లికేట్ పిస్తోల్ అనుకుటున్నావా? ఎత్తి చూడు దీని వెయిట్ తెలుస్తుంది'' అంటూ బెదిరించాడు. దీంతో అక్కడి నుంచి ఎలాగో రాజా తప్పించుకుని గ్రామానికి చేరి జరిగిన విషయం కుటుంబ సభ్యులకు చెప్పారు. ఈ విషయం గ్రామస్తులందరికీ చెప్పి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మునిరాజ నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన కుటుంబాన్ని రక్షించాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై సీఐ సురేంద్రనాయుడు మాట్లాడుతూ రాజా నుంచి అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

# 'జమిలి'.. కొండను తవ్వి ఎలుకను పట్టడమే..

**లోకసత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ**

విజయనగరం ఫూల్‌బాగ్: భారతదేశంలో ఒకే దేశం ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికల నిర్వహణకు పూనుకోవడం కొండను తవ్వి ఎలుకను పట్టినట్టుగా ఉంటుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ అభిప్రాయపడ్డారు. విజయనగరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో తెలివితేటలు ఉన్న పేదవానికి సరైన విద్య అందడం లేదని, జబ్బు చేస్తే మంచి వైద్యం చేసుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గణతంత్ర దినోత్సవ వేళ సంబరాలతో పాటు దేశంలో అట్టడుగున ఉన్న ప్రజల సమస్యలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు.




### రత్నగిరికి భక్తుల తాకిడి

అన్నవరం: వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కాకినాడ జిల్లా రత్నగిరి కిటకిటలాడింది. పుష్య బహుళ ఏకాదశి, శనివారం కలసి రావడంతో ఉదయం నుంచీ భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం, వ్రత, విశ్రాంతి మండపాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి. భక్తులు తరలి వచ్చిన వందలాది వాహనాలతో పార్కింగ్ స్థలాలన్నీ నిండిపోయాయి. సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సత్యదేవుని వ్రతాలు 1,800 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. స్వామివారి అన్నప్రసాదాన్ని 5 వేల మంది భక్తులు స్వీకరించారు.

### భక్తులతో పోటెత్తిన శ్రీవారి క్షేత్రం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని శ్రీవారి దివ్య క్షేత్రం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తుల రాక ప్రారంభం కావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల, ఇతర విభాగాలు వేలాది మంది భక్తులతో కళకళలాడాయి. అనివేటి మండపంలో పలు భజన మండళ్ల సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను విశేషంగా అలరించాయి.

### తొలి తిరుపతిలో భక్తుల రద్దీ



పెద్దాపురం: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వేంచేసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. క్రమంగా రద్దీ పెరిగి ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సుమారు 20 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆరు వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. స్వామివారిని అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామివారిని సుగంధభరిత పుష్పమాలికలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేశఖండన, వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాల ద్వారా స్వామి వారికి రూ.2,21,512 ఆదాయం సమకూరిందని ఈఓ శ్రీనివాస్ తెలిపారు.




### వేగంగా పాఠశాలల పునర్విభజన

బాపట్ల: ప్రభుత్వ పాఠశాలల పునర్విభజన ప్రక్రియ శరవేగంగా చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పునఃనిర్మాణం, పునర్విభజన ప్రక్రియలో భాగంగా సూర్యలంక వెళ్లే మార్గంలోని సరస్వతి స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 543 మంది నమోదు చేసుకోగా.. విద్యార్థుల హాజరును పరిశీలింకలెక్టర్ పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదైన హాజరు, తరగతుల్లో హాజరును పరిశీలించారు.

### రాష్ట్రస్థాయి ద్వితీయ నాటక, నాటిక రచనల పోటీలు

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో రాష్ట్రస్థాయి ద్వితీయ సాంఘిక నాటక, నాటిక పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్టు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాటకానికి ప్రథమ బహుమతిని ఆరిశెట్టి శివన్నారాయణ స్మారకంగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిని పరాంకుశం వెంకట భవానీప్రసాద్ (బాబ్జీ) స్మారకంగా రూ.15 వేలు, నాటికకు ప్రథమ బహుమతిని భారతుల రామకృష్ణ స్మారకంగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిని గంధం నాగరాజు స్మారకంగా రూ.10 వేలు బహూకరిస్తామని తెలిపారు. పాత్రోచితమైన భాషకు, యాసకు ప్రాధాన్యత, భావంలో విస్తృతి, సంభాషణల్లో క్లుప్తతను పాటించాలని తెలిపారు. రచనలను ఏప్రిల్ 16 లోగా విజయ్, ప్రధాన కార్యదర్శి, 3–96/2, పోలవరపువారి వీధి, తెనాలి మండలం, గుంటూరు జిల్లా –522307 (8309116568)కు పంపాలని కోరారు. వివరాలకు పిన్నమనేని మృత్యుంజయరావు, ముఖ్య సలహాదారును (7794004466) సంప్రదించాలని సూచించారు.




బాలీవుడ్‌లో కొందరు యంగ్ హీరోలు, హీరోయిన్లు ఉల్లాసంగా, ఉత్సాహంగా ప్రేమలో పడుతున్నారు. ప్యార్ మే పడిపోయామే... అంటూ సినిమా సెట్స్‌లో లవ్ సాంగ్స్, డైలాగ్స్ చెబుతున్నారు. సిల్వర్ స్క్రీన్ కోసం ఈ ప్యార్ ప్రపంచంలో మునిగి తేలుతున్న ఆ జంటల గురించి తెలుసుకుందాం...

# ప్యార్ మే పడిపోయామే...

### ముక్కోణపు ప్రేమ

'బ్రహ్మాస్త్ర' సినిమా కోసం తొలిసారి కలిసి పని చేశారు రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్. ఈ సినిమా ప్రయాణంలోనే రణ్‌బీర్ కపూర్, ఆలియా భట్ ప్రేమలో పడ్డారు. ఈ సినిమాలోని తొలి పార్టు 'బ్రహ్మాస్త్ర: పార్టు 1 శివ' 2022 సెప్టెంబరులో విడుదలైంది. కానీ అంతకు ముందే... అంటే 2022 ఏప్రిల్‌లోనే రణ్‌బీర్, ఆలియా పెళ్లి చేసుకున్నారు. 'బ్రహ్మాస్త్ర' తర్వాత వీరి కాంబినేషన్‌లో రూపొందనున్న మూవీ 'లవ్ అండ్ వార్'. ఈ చిత్రంలో విక్కీ కౌశల్ మరో లీడ్ రోల్ చేయనుండగా, సంజయ్ లీలా భాన్సాలీ డైరెక్షన్ చేయనున్నారు. ఇద్దరు అబ్బాయిలు, ఓ అమ్మాయిల మధ్య సాగే ముక్కోణపు లవ్‌స్టోరీగా ఈ మూవీ ఉంటుందని సమాచారం. ఈ ఏడాదిలోనే ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీని ముందుగా ఈ ఏడాది క్రిస్మస్ సందర్భంగా రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ ప్రీ ప్రొడక్షన్‌కు ఎక్కువ సమయం పట్టడం, హిందీ 'రామాయణ' మూవీతో రణ్‌బీర్ కపూర్ బిజీగా ఉండటం వంటి కారణాల వల్ల ఈ చిత్రం వాయిదా పడింది. 'లవ్ అండ్ వార్' మూవీని 2026 మార్చిలో రిలీజ్ చేయనున్నట్లుగా ఇటీవల మేకర్స్ వెల్లడించారు.

### దక్షిణాది అమ్మాయి... ఉత్తరాది అబ్బాయి

దక్షిణాది అమ్మాయి, ఉత్తరాది అబ్బాయి లవ్ చేసుకుంటే ఏలా ఉంటుంది? వారి కుటుంబాలను ఒప్పించడం కోసం ఈ అబ్బాయి, అమ్మాయిలు ఏ విధంగా కష్టపడ్డారు? పెళ్లి తర్వాత వీరికి ఎలాంటి సమస్యలు ఎదురయ్యాయి? అనే అంశాలతో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ మూవీ 'పరమ్ సుందరి'. ఈ చిత్రో సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీ కపూర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ మూవీకి తుషార్ జలోటా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కేరళలో జరుగుతోంది. ప్రముఖ దర్శకుడు మణిరత్నం సినిమాల్లో కనిపించే అథిరపిల్లి వాటర్ ఫాల్స్ లోకేషన్స్‌లోనూ (ఇరువర్, రావణ్, దిల్ సే.. వంటి సినిమాల్లో కనిపిస్తాయి) 'పరమ్ సుందరి' సినిమా సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలిసింది. ఈ చిత్రంలో నార్త్ అబ్బాయి పరమ్‌గా సిద్ధార్థ్ మల్హోత్రా, దక్షిణాది అమ్మాయి సుందరిగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. దినేష్ విజన్ నిర్మిస్తున్న ఈ మూవీ జూలై 25న విడుదల కానుంది.




### రెండు ప్రేమకథలు

తులసీ ప్రేమ కోసం సన్నీ ఎన్నో సాహసాలు చేశాడు. ఈ సాహసాలను ఈ ఏడాది వెండితెరపై చూడొచ్చు. వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ జంటగా శశాంక్ ఖైతాన్ డైరెక్షన్‌లో రూపొందుతున్న రొమాంటిక్ లవ్‌స్టోరీ ఫిల్మ్ 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి'. కరణ్ జోహార్ ఈ సినిమాకు నిర్మాత. ఈ మూవీ చిత్రీకరణ ఆల్రెడీ మొదలైంది. ఈ చిత్రంలో సన్నీగా వరుణ్ ధావన్, కుమారిగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. ఈ మూవీని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. కాగా 'బవాల్ (2023)' అనే ఓ హిందీ చిత్రంలో వరుణ్ ధావన్, జానీ్వ కపూర్ జంటగా నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇక 'సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి'యే కాకుండా తన తండ్రి డేవిడ్ ధావన్ డైరెక్షన్‌లో వరుణ్ ధావన్ ఓ లవ్ స్టోరీ ఫిల్మ్‌లో నటించనున్నారు. ఈ మూవీలోని హీరోయిన్స్‌గా మృణాళ్ ఠాకూర్, పూజా హెగ్డేల పేర్లు తెరపైకి వచ్చాయి. త్వరలోనే ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీ ఫిల్మ్ సెట్స్‌పైకి వెళ్లనుంది. ఇలా రెండు ప్రేమకథలతో వరుణ్ ధావన్ ఫుల్ బిజీ.



### ఏక్ దిన్ లవ్‌స్టోరీ

ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ హిందీలో 'ఏక్ దిన్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే లవ్‌స్టోరీ మూవీ చేస్తున్నారు. సునీల్ పాండే ఈ మూవీని డైరెక్ట్ చేస్తున్నారు. ఈ లవ్‌స్టోరీ ఫిల్మ్‌లో సాయిపల్లవి హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ నిర్మిస్తున్నారు. ఈ ఏడాదే 'ఏక్ దిన్' రిలీజ్ కావొచ్చు. ఈ చిత్రంలో జునైద్ ఖాన్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటిస్తున్నారని బాలీవుడ్ టాక్. ఈ పోలీస్ ఆఫీసర్‌కు ఓ రోజు ఒక అమ్మాయి పరిచయం అవు తుంది. కానీ ఆ అమ్మాయి నెక్ట్స్ డే ఆ అబ్బాయిని గుర్తుపట్టలేకపోతుంది. అసలు వారిద్దరి మధ్య ఒక్క రోజులో ఏం జరిగింది? అన్నదే 'ఏక్ దిన్' కథాంశమని బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. అలాగే జునైద్ ఖాన్ హిందీలో 'లవ్‌యాపా' అనే లవ్‌స్టోరీ ఫిల్మ్ కూడా చేశారు. దివంగత ప్రముఖ నటి శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీ కపూర్ ఈ చిత్రంలో హీరోయిన్‌గా చేశారు. అద్వైత్ చందన్ డైరెక్షన్‌లో రూపొందిన ఈ మూవీ ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్స్, తమిళ దర్శక-నటుడు ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాను నిర్మించారు. ప్రదీప్ రంగనాథన్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన తమిళ హిట్ ఫిల్మ్ 'లవ్ టుడే'కు, హిందీ రీమేక్‌గా 'లవ్‌యాపా' రూపొందినట్లుగా తెలుస్తోంది. ఇంకా ఖుషీ కపూర్ హీరోయిన్‌గా చేసిన మరో లవ్‌స్టోరీ మూవీ 'నాదానియన్'. ఇందులో ఇబ్రహీం అలీ ఖాన్ హీరోగా చేస్తున్నారు.



### ధడక్ సీక్వెల్‌లో...

జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన తొలి చిత్రం 'ధడక్'. ఇందులో ఇషాన్ కట్టర్ హీరోగా నటించారు. ఇప్పుడు 'ధడక్'కు సీక్వెల్‌గా 'ధడక్ 2' రూపొందుతోంది. కానీ సీక్వెల్‌లో ఇషాన్, జాన్వీలు హీరోయిన్లుగా నటించడం లేదు. వీరి ప్లేస్‌లో సిద్ధాంత్ చతుర్వేది, 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ నటిస్తున్నారు. షాజియా డైరెక్షన్‌లో జీ స్టూడియోస్, ధర్మ ప్రొడక్షన్స్, క్లౌడ్ 9 పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ మూవీ ఫిబ్రవరిలో రిలీజ్ కానుంది. అలాగే 'దిల్ కా దర్వాజా ఖోల్నా డార్లింగ్' అనే రొమాంటిక్ మూవీలో కూడా యాక్ట్ చేస్తున్నారు సిద్ధాంత్ చతుర్వేది. వామికా గబ్బి హీరోయిన్‌గా చేస్తున్న ఈ మూవీలో జయా బచ్చన్ ఓ లీడ్ రోల్‌లో చేస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ గోవాలో ప్రారంభమైంది. ఈ సినిమాను కూడా ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

### చాంద్ మేరా దిల్

లక్ష్య, అనన్యా పాండే హీరో హీరోయిన్లుగా నటిస్తున్న బాలీవుడ్ రొమాంటిక్ మూవీ 'చాంద్ మేరా దిల్'. ఆల్రెడీ ఈ మూవీ చిత్రీకరణ గత ఏడాదే మొదలైందని బాలీవుడ్ సమాచారం. వివేక్ సోని దర్శకత్వంలో ఈ మూవీని కరణ్‌జోహార్ నిర్మిస్తున్నారు. ఈ రొమాంటిక్ లవ్‌స్టోరీ మూవీ ఈ ఏడాదే విడుదల కానుంది.

– ముసిమి శివాంజనేయులు

### హీరోయిన్ ఎవరు?

- బాలీవుడ్ లవ్‌స్టోరీ ఫ్రాంచైజీలో 'ఆషికీ'కి మంచి క్రేజ్ ఉంది. దీంతో 'ఆషికీ 3'ని రెండు సంవత్సరాల క్రితం ప్రకటించారు. ఇందులో కార్తీక్ ఆర్యన్ హీరో. అనురాగ్ బసు దర్శకుడు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమా ఇంకా సెట్స్‌పైకి వెళ్ల లేదు. అయితే 'ఆషికీ 3' షూటింగ్ విషయంలో అన్ని సమస్యలు చక్కబడ్డాయని, ఈ మూవీ ఈ ఏడాది సెట్స్‌కు వెళ్లనుందని సమాచారం. అయితే ఇంకా హీరోయిన్ ఖరారు కాలేదు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తీ దిమ్రీ, శర్వారీ వంటి కథనాయికల పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా 'ఆషికీ 3' కోసం కార్తీక్ ప్రేమలో పడే హీరోయిన్ ఎవరో తెలియాలంటే మరికొన్ని రోజులు వెయిట్ చేయ క తప్పదు.

- బాలీవుడ్ దర్శకుడు ఆనంద్ ఎల్. రాయ్‌తో హిందీలో 'రాంఝణా, అత్రంగి రే' వంటి సినిమాలు చేశారు హీరో ధనుష్. వీరి కాంబినేషన్‌లో ముచ్చటగా మూడోసారి 'తేరే ఇష్క్ మే' అనే లవ్‌స్టోరీ మూవీ రానుంది. 2023లో ఈ సినిమాను ప్రకటించారు. కానీ ఇంకా సెట్స్‌ పైకి వెళ్లలేదు. ధనుష్ ఆల్రెడీ కమిటైన ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల ఈ మూవీ చిత్రీకరణ ఆలస్యం అవుతోందట. అయితే ఈ ఏడాది ఈ మూవీని సెట్స్‌పైకి తీసుకుని వెళ్లాలని ఆనంద్ .ఎల్ రాయ్ భావిస్తున్నారని బాలీవుడ్ సమాచారం. ఈ చిత్రంలో హీరోయిన్‌గా కియారా అద్వానీ, త్రిప్తీ దిమ్రీ, కృతీసనన్ వంటి తారల పేర్లు తెరపైకి వచ్చాయి. మరి... ధనుష్ సరసన ఎవరు హీరోయిన్‌గా నటిస్తారో చూడాలి.

- తెలుగు సూపర్‌హిట్ లవ్‌స్టోరీ 'బేబీ'. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో నటించి, సాయిరాజేష్ దర్శకత్వం వహించిన 'బేబీ' మూవీ 2023లో విడుదలై, సూపర్ హిట్ సాధించింది. ఈ సినిమా హిందీలో రీమేక్ కానుందని తెలుస్తోంది. తెలుగు 'బేబీ'కి దర్శకత్వం వహించిన సాయిరాజేష్‌నే హిందీ 'బేబీ'కి రీమేక్ వహించనున్నట్లుగా తెలిసింది. అయితే బేబీ సినిమా నటీనటుల విషయంలో ఇప్పటివరకు క్లారిటీ రాలేదు. ఇషాన్ కట్టర్, అగస్త్య నంద, బాబిల్ ఖాన్ వంటి బాలీవుడ్ కుర్ర హీరోల పేర్లు తెరపైకి వచ్చాయి. అలాగే హీరోయిన్ పాత్ర కోసం ఖుషీ కపూర్, కృతీ శెట్టి వంటి తారల పేర్లు బీటౌన్‌లో వినిపిస్తున్నాయి. మరి..ఫైనల్‌గా హిందీ 'బేబీ'లో ఎవరు యాక్ట్ నటించనున్నారో తెలియా లంటే మాత్రం కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు.


## నన్ను తప్పించారు!

అక్షయ్ కుమార్ హీరోగా నటించిన తాజా చిత్రం 'స్కైఫోర్స్'. దర్శకద్వయం సందీప్ కెవ్లానీ, అభిషేక్ కపూర్ దర్శకత్వం వహించారు. సారా అలీఖాన్, వీర్‌పహాడియా కీలక పాత్రలు పోషించారు. దినేష్ విజన్, జ్యోతి దేశ్ పాండే, అమర్ కౌశిక్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలైంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న అక్షయ్ కుమార్ విలేకరులు అడిగన ప్రశ్నలకు బదులిస్తూ–''నేను నటించిన 'భూల్ భులయ్యా' సినిమా 2007లో విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. అయితే ఆ మూవీకి సీక్వెల్స్‌గా వచ్చిన 'భూల్ భులయ్యా 2'(2022), 'భూల్ భులయ్యా 3'(2024) సినిమాల్లో నేను నటించకపోవడానికి ప్రత్యేక కారణం అంటూ ఏమీ లేదు.. ఆ చిత్రాల నుంచి నేను తప్పుకోనూ లేదు.. వాళ్లే నన్ను తప్పించారు'' అని పేర్కొన్నారు. అక్షయ్ చెప్పిన ఈ మాటలు బాలీవుడ్‌లో వైరల్‌గా మారాయి.


అక్షయ్ కుమార్

## ట్రైలర్‌కి వేళాయె

నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్' ట్రైలర్ విడుదలకు వేళయింది. ఈ నెల 28న ఈ మూవీ ట్రైలర్‌ని రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించి, నాగచైతన్య కొత్త లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. 'లవ్ స్టోరీ' (2021) వంటి హిట్ ఫిల్మ్ తర్వాత నాగచైతన్య, సాయిపల్లవి జోడీగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కానుంది. ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో రూపొందిన చిత్రం 'తండేల్'. లవ్ ఎలిమెంట్స్‌తో పాటు మంచి యాక్షన్ కూడా ఉంటుంది. తండేల్ రాజు పాత్రలో నాగచైతన్య అద్భుతమైన నటన చూస్తారు.దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన 'బుజ్జి తల్లి, శివ శక్తి, హైలెస్సో హైలెస్సా...' పాటలు మ్యూజిక్ చార్టులలో అగ్రస్థానంలో, యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: శ్యామ్‌దత్..


నాగచైతన్య

## గాంధీ తాత చెట్టుకి అభినందనలు

'గాంధీ తాత చెట్టు' సినిమా యూనిట్‌ని హీరో రామ్‌చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రముఖ డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. తబితా సుకుమార్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, గోపీ టాకీస్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శితమై, అవార్డులు కైవసం చేసుకుంది. ఉత్తమ బాల నటిగా సుకృతి వేణి పురస్కారం పొందారు. ఈ నెల 24న విడుదలైన ఈ చిత్రం మంచి ప్రశంసలు దక్కించుకుంటోందని మేకర్స్ తెలిపారు. ఈ నేపథ్యంలో హీరో రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన 'గాంధీ తాత చెట్టు' చిత్ర టీమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. తన నటనకు వస్తున్న స్పందన పట్ల వారిద్దరూ సుకృతిని అభినందించారు. ''మంచి సామాజిక సందేశంతో కూడిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. 13 ఏళ్ల అమ్మాయిగా గాంధీ పాత్రలో సుకృతి వేణి నటనకు అందరూ ఫిదా అవుతున్నారు. అలాగే విమర్శకులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. రామ్‌చరణ్, ఉపాసనలను కలిసిన వారిలో సుకుమార్ భార్య తబితా సుకుమార్, పద్మావతి మల్లాది, శేష సింధూరావు తదితరులు ఉన్నారు.


సుకృతి వేణి, రామ్‌చరణ్, తబితా సుకుమార్, ఉపాసన

## బిజినెస్ రీల్

### క్రోమా రిపబ్లిక్ డే సేల్




ముంబై: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కన్జూమర్ డ్యూరబుల్స్, ఎలక్ట్రానిక్స్ రిటైల్ సంస్థ క్రోమా ప్రత్యేక ఆఫర్లను అందిస్తోంది. క్యాష్ బ్యాక్, ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలతో కలిపి ఇంటెల్ ఐ3 ల్యాప్‌టాప్‌ల ధర రూ. 26,530 నుంచి, శాంసంగ్ గెలాక్సీ ఫోల్డ్ 5 ఫోన్ల రేటు రూ. 98,990 నుంచి, యాపిల్ ఐఫోన్ 16 ధర రూ. 39,490 నుంచి ప్రారంభమవుతుందని సంస్థ తెలిపింది. ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తదితర ఆర్థిక సంస్థలకు చెందిన నిర్దిష్ట కార్డులపై రూ. 26,000 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ పొందవచ్చని పేర్కొంది. దేశవ్యాప్తంగా తమ 550 పైచిలుకు స్టోర్లు, క్రోమాడాట్‌కాంలో ఈ ఆఫర్లు జనవరి 26 వరకు అందుబాటులో ఉంటాయని వివరించింది.

### పబ్లిక్ ఇష్యూకు డార్ఫ్-కీటాల్ కెమికల్స్



న్యూఢిల్లీ: ప్రత్యేక రసాయనాల తయారీలో ఉన్న డార్ఫ్-కీటాల్ కెమికల్స్ ఇండియా లిమిటెడ్ ఐపీవోకు వస్తోంది. రూ.5,000 కోట్లను సమీకరించేందుకు అనుమతి కోరుతూ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక పత్రాలను దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ.1,500 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. ప్రమోటర్ మీనన్ ఫ్యామిలీ హోల్డింగ్స్ ట్రస్ట్ రూ.3,500 కోట్ల విలువైన షేర్లను విక్రయించనుంది. డార్ఫ్-కీటాల్ కెమికల్స్ ఇండియా 1992లో ప్రారంభం అయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, పెట్రోనాస్, ఐవోసీ, పీపీజీ ఇండస్ట్రీస్, వేదాంత వంటి దిగ్గజ సంస్థలు క్లయింట్లుగా ఉన్నాయి. భారత్‌తోపాటు బ్రెజిల్, యూఎస్, కెనడాలో మొత్తం 16 తయారీ కేంద్రాలను కలిగి ఉంది. రసాయనాల తయారీలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అతికొద్ది సంస్థల్లో డార్ఫ్-కీటాల్ కెమికల్స్ ఇండియా ఒకటి. భారత్ వెలుపల సంస్థ ఖాతాలో 542 పేటెంట్స్ ఉన్నాయి. వీటిలో యూఎస్‌లో 99 నమోదయ్యాయి. కంపెనీ 2023-24లో రూ.548 కోట్ల టర్నోవర్‌పై రూ.60 కోట్ల నికరలాభం ఆర్జించింది.

## హైదరాబాద్‌లో ఇళ్ల విక్రయాలు డీలా

- 2024లో 25 శాతం క్షీణత
- ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు 2024లో నెమ్మదించాయి. 2023తో పోలిస్తే 25 శాతం తక్కువగా, 61,722 యూనిట్లు అమ్ముడయ్యాయి. 2023లో విక్రయాలు 82,350 యూనిట్లుగా ఉండడం గమనార్హం. అంతేకాదు, దేశవ్యాప్తంగా తొమ్మిది నగరాల్లోనూ 2024లో ఇళ్ల అమ్మకాలు 9% మేర క్షీణించాయి. 4.71 లక్షల యూనిట్ల ఇళ్ల అమ్మకాలు నమోదయ్యాయి. 2023లో ఈ తొమ్మిది నగరాల్లో అమ్మకాలు 5,14,820 యూనిట్లుగా ఉన్నాయి. ఈ మేరకు ప్రాప్ ఈక్విటీ సంస్థ ఒక నివేదికను విడుదల చేసింది. డిమాండ్‌తో పాటు, తాజా సరఫరా తగ్గడం ఇందుకు కారణాలుగా పేర్కొంది. తొమ్మిది నగరాల్లో కొత్త ఇళ్ల సరఫరా (విక్రయానికి అందుబాటులోకి రావడం) 15 శాతం తగ్గి 4,11,022 యూనిట్లుగా ఉంది.

**పట్టణాల వారీగా విక్రయాలు..**

- బెంగళూరులో ఇళ్ల అమ్మకాలు 2024లో 9 % క్షీణించి 60,506 యూనిట్లుగా నమోదు.
- చెన్నైలో 11% తక్కువగా 19,212 యూనిట్లు అమ్ముడయ్యాయి.
- కోల్‌కతాలో అమ్మకాలు 2023తో పోల్చితే కేవలం 1% తగ్గి 19,212 యూనిట్లకు పరిమితం.
- ముంబైలో అమ్మకాలు 6% క్షీణించాయి. 50,140 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- నవీ ముంబైలో మాత్రం విక్రయాలు 16 శాతం పెరిగి 33,870 యూనిట్లుగా ఉన్నాయి.
- పుణెలో ఇళ్ల విక్రయాలు 13 శాతం తగ్గి 92,643 యూనిట్లుగా ఉన్నాయి. థానేలో 5% తక్కువగా 90,288 యూనిట్ల అమ్మకాలు జరిగాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గతేడాది ఇళ్ల అమ్మకాలు 5% వృద్ధితో 43,923 యూనిట్లుగా నమోదయ్యాయి.

### కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 26-1-2025 | |
|---|---|
| విశాఖ | 485-00 |
| చిత్తూరు | 523-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 485-00 |
| విజయవాడ | 490-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 460-00 |
| వరంగల్ | 462-00 |
| రిటైల్ ధర | 5.20 |

# బీమాకు లభించేనా ధీమా..?



- హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్‌టీ తొలగించాలి
- మరింత మందికి చేరువ చేయాలి
- పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలపై ప్రశ్నార్థకం
- బడ్జెట్ 2025పై పరిశ్రమ వర్గాల అంచనాలు




న్యూఢిల్లీ: పౌరులందరికీ బీమా రక్షణను చేరువ చేసే దిశగా 2025 బడ్జెట్‌లో కీలక చర్యలు ఉంటాయని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. '2047 నాటికి అందరికీ బీమా' లక్ష్యాన్ని చేరుకునేందుకు వీలుగా ఇన్సూరెన్స్‌కు పన్ను ప్రయోజనాలు, ఆరోగ్య సంరక్షణకు ప్రోత్సాహకాలు కల్పించాని పరిశ్రమ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో నవీన్ చంద్ర ఝా మాట్లాడుతూ.. రానున్న బడ్జెట్‌లో హెల్త్ ఇన్సూరెన్స్ విస్తరణ దిశగా మరిన్ని చర్యలు ఉంటాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. 'బీమా సుగమ్'కు నియంత్రణ, నిధుల పరమైన మద్దతు అవసరమన్నారు. ఆర్థిక సేవలు తగినంత అందుబాటులో లేని ప్రాంతాల్లోని వారికి బీమా సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం, సబ్సిడీలపైనా బడ్జెట్‌లో దృష్టి సారించొచ్చని అభిప్రాయపడ్డారు.

- ఎన్‌పీఎస్ మాదిరి పన్ను ప్రయోజనాలను లైఫ్ ఇన్సూరెన్స్ యాన్యుటీ ఉత్పత్తులకు సైతం కల్పించాలని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఎండీ, సీఈవో తరుణ్ ఛుగ్ కోరారు. కొత్త పన్ను విధానంలోనూ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై పన్ను ప్రయోజనాన్ని కల్పించాలని, టర్మ్ ఇన్సూరెన్స్ కోసం ప్రత్యేక పన్ను మినహాయింపు తీసుకురావాలని డిమాండ్ చేశారు.
- ఐఆర్‌డీఏఐ నివేదిక ఆధారంగా జీవిత బీమా విస్తరణ (జీడీపీలో) 2022-23లో ఉన్న 4 శాతం నుంచి 2023-24లో 3.7 శాతానికి తగ్గినట్టు తెలుస్తోంది.
- బడ్జెట్‌లో పెన్షన్, యాన్యుటీ ప్లాన్లకు మద్దతు చర్యలు ఉండొచ్చని పీఎన్‌బీ మెట్‌లైఫ్ ఎండీ, సీఈవో సమీర్ బన్సాల్ పేర్కొన్నారు. పెన్షనర్లకు ప్రోత్సాహకంగా యాన్యుటీ ప్లాన్ల ప్రీమియంపై జీఎస్‌టీని తొలగించాలని బన్సాల్ డిమాండ్ చేశారు. దీంతో యాన్యుటీలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు.
- బీమా పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించేందుకు, బీమా ఉత్పత్తుల స్వీకరణను ప్రోత్సహించే దిశగా సంస్కరణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి బడ్జెట్ అవకాశం కల్పిస్తోందని ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో సుబ్రత మోండల్ పేర్కొన్నారు. మరింత మంది బీమా రక్షణను తీసుకునేందుకు వీలుగా పన్ను రాయితీలు కల్పిస్తారన్న అంచనాను ఆయన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్ భారత్‌కు సైతం బడ్జెట్‌లో కేటాయింపులు పెంచొచ్చని భావిస్తున్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని వారు, ఆర్థికంగా బలహీన వర్గాలకు బీమా అందుబాటులోకి వస్తుందన్నారు.
- హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్‌టీని తొలగించడం ఎంతో అవసరమని యూనివర్సల్ సోంపో జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో శరద్ మాథుర్ అభిప్రాయపడ్డారు. బీమా మరింత మందికి చేరేందుకు వీలుగా ఆవిష్కరణలను ప్రోత్సహించాలని కోరారు.

## సుంకాలు, లైసెన్సు ఫీజులు తగ్గించాలి

- ఓటీటీలు కూడా యూఎస్‌వో ఫండ్‌కి నిధులివ్వాలి
- కేంద్రానికి టెల్కోల బడ్జెట్ వినతులు

న్యూఢిల్లీ: 4జీ, 5జీ నెట్‌వర్క్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాలను, లైసెన్సు ఫీజులను తగ్గించాలని కేంద్రాన్ని టెలికం సంస్థలు కోరాయి. అలాగే భారీగా డేటా వినియోగానికి కారణమయ్యే ఓటీటీ ప్లాట్‌ఫాంలు, స్ట్రీమింగ్ సేవల సంస్థలు (ఎల్‌టీజీ) కూడా యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యూఎస్‌వోఎఫ్)/డిజిటల్ భారత్ నిధి ఫండ్‌కి తప్పనిసరిగా చందా ఇచ్చేలా బడ్జెట్‌లో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. టెలికం సంస్థల సమాఖ్య సీవోఏఐ ఈ మేరకు బడ్జెట్‌పై తమ వినతులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. రిలయన్స్ జియో, భారతి ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా మొదలైనవి ఇందులో సభ్యులుగా ఉన్నాయి. లైసెన్సు ఫీజును 3 శాతం నుంచి 1 శాతానికి తగ్గిస్తే టెలికం సంస్థలపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని సీవోఏఐ తెలిపింది. ఇక తాము బోలెడంత ఖర్చు పెట్టి నెలకొల్పిన నెట్‌వర్క్‌ల ద్వారా కార్యకలాపాలు సాగిస్తూ, లాభాలు గడిస్తున్నా ఎల్‌టీజీలు .. పైసా కూడా కట్టడం లేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో అవి కూడా తమలాగే యూఎస్‌వో ఫండ్‌కి చందా కట్టేలా చూడాలని కోరింది. తమపై విధిస్తున్న యూఎస్‌వో లెవీని పూర్తిగా తొలగించవచ్చని లేదా ప్రస్తుతమున్న రూ. 86,000 కోట్ల కార్పస్ పూర్తిగా ఖర్చు చేసేంతవరకైనా చందాలను నిలిపివేయొచ్చని సీవోఏఐ పేర్కొంది. టెల్కోలపై సుంకాల భారాన్ని తగ్గించడం, పెట్టుబడి అవకాశాలను ప్రోత్సహించడం వల్ల దేశ భవిష్యత్తుపై వ్యూహాత్మకంగా పెట్టుబడులు పెట్టినట్లవుతుందని వివరించింది.

# పద్మవిభూషణ్ ఒసాము సుజుకీ










ముంబై: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం శనివారం పద్మ పురస్కారాలు ప్రకటించింది. వీరిలో వాణిజ్యం, పరిశ్రమల విభాగం నుంచి 10 మంది ఉన్నారు. జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ సుజుకీ మోటార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, దివంగత ఒసాము సుజుకీని (మరణానంతరం) పద్మ విభూషణ్ పురస్కారానికి ఎంపిక చేసింది. తమిళనాడుకు చెందిన టెక్స్‌టైల్ పారిశ్రామికవేత్త నల్లి కుప్పుస్వామి చెట్టి, జైడస్ లైఫ్‌సైన్సెస్ చైర్మన్ పంకజ్ పటేల్ పద్మ భూషణ్ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఇక ఎస్‌బీఐ మాజీ చైర్‌పర్సన్ అరుంధతి భట్టాచార్యతోపాటు ఓంకార్ సింగ్ పాహ్వా (అవాన్ సైకిల్స్), పవన్ గోయెంకా (మహీంద్రా), ప్రశాంత్ ప్రకాశ్ (యాక్సెల్ పార్ట్‌నర్స్), ఆర్జీ చంద్రమోగన్ (హట్సన్ ఆగ్రో ప్రొడెక్ట్స్), సజ్జన్ భజంకా (సెంచురీ ప్లైబోర్డ్స్), సాలీ హోల్కర్‌కు (రేష్వా సొసైటీ) పద్మశ్రీ అవార్డు వరించింది.

**ఒసాము సుజుకీ:** 1930 జనవరి 30న జపాన్‌లోని గేరోలో జన్మించారు. సుజుకీ మోటార్ కార్పొరేషన్ 1981లో భారత ప్రభుత్వ భాగస్వామ్యంతో మారుతీ ఉద్యోగ్ లిమిటెడ్ పేరుతో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయడంలో కీలకంగా వ్యవహరించారు. తర్వాతి కాలంలో మారుతీ సుజుకీ ఇండియాగా కంపెనీ అవతరించింది. దేశంలోకి ఎంట్రీ ఇచ్చిన తొలి విదేశీ కంపెనీ కూడా ఇదే. భారత ప్రభుత్వం ఒసాము సేవలు గుర్తించి 2007లో పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. 2024 డిసెంబర్ 25న మరణించారు.

**నల్లి కుప్పుస్వామి చెట్టి :** తమిళనాడుకు చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త. కాంచీపురంలో 1940 నవంబర్ 9న జన్మించారు. రామకృష్ణ మిషన్ స్కూల్ విద్యాభ్యాసం చేశారు. వాషింగ్టన్ వర్సిటీ నుంచి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పట్టా అందుకున్నారు. వారసత్వ వ్యాపారమైన నల్లీ సిల్క్ పగ్గాలను 1958లో చేపట్టారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి 2000లో కలైమమణి అవార్డు, భారత ప్రభుత్వం నుంచి 2003లో పద్మశ్రీ అవార్డులు అందుకున్నారు.

**పంకజ్ పటేల్:** 1953లో జన్మించారు. తండ్రి స్థాపించిన క్యాడిలా హెల్త్‌కేర్‌లో (ప్రస్తుతం జైడస్ లైఫ్‌సైన్సెస్) 1976లో చేరారు. క్యాడిలా ఫ్యాక్టరీకి ఎనిమిదేళ్ల వయసు నుంచే తండ్రితో కలిసి వెళ్లేవారు. కంపెనీ తయారీ షుగర్‌ఫ్రీ, ఎవర్‌యూత్ బ్రాండ్లు ప్రాచుర్యం పొందాయి. 70కిపైగా దేశాలకు కంపెనీ విస్తరించింది. భారత్‌లో అయిదవ అతిపెద్ద ఫార్మా సంస్థగా ఎదగడంలో కీలకపాత్ర పోషించారు. 2024 అక్టోబర్‌లో ఫోర్బ్స్ 'భారత 100 మంది సంపన్నుల' జాబితాలో 10.2 బిలియన్ డాలర్ల నెట్‌వర్త్‌తో 24 ర్యాంకులో నిలిచారు.

### అరుంధతీ భట్టాచార్య



సేల్స్‌ఫోర్స్ ఇండియా చైర్‌పర్సన్, సీఈవోగా ఉన్నారు. 1977లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో (ఎస్‌బీఐ) ప్రొబేషనరీ ఆఫీసర్‌గా చేరారు. 2013లో ఎస్‌బీఐ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. 200 ఏళ్ల ఎస్‌బీఐ చరిత్రలో ఈ పదవి చేపట్టిన తొలి మహిళగా వినుతికెక్కారు. బ్యాంకు మహిళా ఉద్యోగులకు ప్రసూతి లేదా పెద్దల సంరక్షణ కోసం రెండేళ్ల విశ్రాంతి సెలవు విధానాన్ని ప్రవేశపెట్టారు. భారత ఆర్థిక రంగంలో 40 ఏళ్లకుపైగా అనుభవం ఆమె సొంతం. ఫోర్బ్స్ ప్రకటించిన 'ప్రపంచంలో అత్యంత శక్తివంతమైన 100 మంది మహిళల' జాబితాలో చోటు సంపాదించారు.

## సులభంగా ఈపీఎఫ్‌వో క్లెయిమ్‌ల పరిష్కారం: మాండవీయ



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి క్లెయిమ్‌ల పరిష్కారాన్ని మరింత సులభంగా మార్చాలంటూ అధికారులకు కేంద్ర మంత్రి మనసుఖ్ మాండవీయ ఆదేశించారు. సకాలంలో ఫిర్యాదులకు పరిష్కారం చూపాలని, ప్రజలతో స్నేహపూర్వక విధానాన్ని అనుసరించాలని కోరారు. ఈపీఎఫ్‌వో ప్రాంతీయ అధికారుల పనితీరు సమీక్ష కోసం మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పై ఆదేశాలు జారీ చేశారు. క్లెయిమ్ దరఖాస్తు తిరస్కారాలను తగ్గించడం, పరిష్కార సామర్థ్యాన్ని మెరుగుపరుచుకోవడం, యూనివర్సల్ అకౌంట్ నంబర్ల (యూఏఎన్) యాక్టివేషన్, అధిక వేతనాలపై పెన్షన్ అమలు ఈ సమావేశంలో చర్చకు వచ్చినట్టు కార్మిక శాఖ ప్రకటించింది. సేవల మెరుగునకు తీసుకున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రికి అధికారులు వివరించారు. అధిక వేతనాలపై పింఛను, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి కోరారు. జోనల్, రీజినల్ కార్యాలయాలు సేవల పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆదేశించారు.

## మైండ్‌స్పేస్ రీట్ లాభం అప్


### క్యూ3లో రూ. 522 కోట్లు



న్యూఢిల్లీ: రియల్టీ రంగ సంస్థ మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ ఈ ఆర్థిక సంవత్సరం(2024-25) మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. నికర నిర్వహణ ఆదాయం(ఎన్‌వోఐ) 8 శాతం పుంజుకుని రూ. 522 కోట్లను తాకింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 473 కోట్లు మాత్రమే ఆర్జించింది. యూనిట్ హోల్డర్లకు ఒక్కో యూనిట్‌కు రూ. 5.32 చొప్పున పంపిణీ చేయనున్నట్లు కంపెనీ తెలియజేసింది. తద్వారా రూ. 315.5 కోట్లు వెచ్చించనుంది. దీనిలో ఒక్కో యూనిట్‌కు రూ. 3.2 చొప్పున డివిడెండ్ కలసి ఉంది. ఇందుకు రూ. 190 కోట్లు చెల్లించనుంది. ఈ కాలంలో 1.7 మిలియన్ చదరపు అడుగులను లీజ్ కిచ్చినట్లు కంపెనీ సీఈవో రమేష్ నాయిర్ పేర్కొన్నారు. కాగా.. సస్టెయిన్ ప్రాపర్టీస్‌లో 100 శాతం వాటా కొనుగోలుకి ఆఫర్ ఇచ్చినట్లు మైండ్‌స్పేస్ రీట్ వెల్లడించింది. హైదరాబాద్ రాయ్‌దుర్గ్‌లోని కామర్‌జోన్ ఐటీ పార్క్‌లో 1.8 మిలియన్ చదరపు అడుగులను సస్టెయిన్ కలిగి ఉన్నట్లు తెలియజేసింది.

**బీఎస్ఈలో మైండ్‌స్పేస్ రీట్ షేరు 0.6 శాతం క్షీణించి రూ. 375 వద్ద ముగిసింది.**

## మాక్రోటెక్ డెవలపర్స్ లాభం 88% జంప్




ముంబై: రియల్ ఎస్టేట్ సంస్థ మాక్రోటెక్ డెవలపర్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్‌లో రూ.944 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. ఇళ్లకు డిమాండ్ పెరగడం ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది. గతేడాది ఇదే క్యూ3లో ఆర్జించిన రూ. 503 కోట్లతో పోలిస్తే ఇది 88 శాతం అధికంగా ఉంది. మొత్తం ఆదాయం రూ.2,958 కోట్ల నుంచి రూ.4,146 కోట్లకు చేరింది. ''డిసెంబర్ క్వార్టర్‌లో మొత్తం రూ.4,510 కోట్ల ముందస్తు విక్రయాలు జరిగాయి. ప్రీ-సేల్స్ రూ.4వేల కోట్ల పైగా జరగడం ఇది వరుసగా నాలుగో త్రైమాసికం. ఎన్నడూ లేని విధంగా ఈ క్యూ3లో మొత్తం రూ.4,290 కోట్ల వసూళ్లు జరిగాయి'' అని కంపెనీ ఎండీ-సీఈవో అభిషేక్ లోధా తెలిపారు.

– 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలల్లో నికరలాభం రూ.883 కోట్ల నుంచి రూ.1,842 కోట్లకు చేరింది. మొత్తం ఆదాయం రూ.6,385 కోట్ల నుంచి రూ.9,749 కోట్లకు చేరింది. ఇదే కాలంలో ముందస్తు విక్రయాలు 25% వృద్ధి చెంది రూ.12,820 కోట్లు జరిగాయి.

## గోద్రేజ్ కన్జ్యూమర్ బలహీన పనితీరు

- షేరుకు రూ.5 చొప్పున డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ గోద్రేజ్ కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ (జీసీపీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో పనితీరు పరంగా మెప్పించలేకపోయింది. కన్సాలిడేట్ లాభం క్రితం ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చి చూస్తే 14 శాతానికి పైగా క్షీణించి రూ.498 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లాభం రూ.581 కోట్లుగా ఉండడం గమనించొచ్చు. కన్సాలిడేటెడ్ ఆదాయం ఇదే కాలంలో రూ.3,660 కోట్ల నుంచి రూ.3,768 కోట్లకు పెరిగింది. ముఖ్యంగా పన్ను వ్యయాలు రూ.3,164 కోట్లకు పెరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో పన్ను వ్యయాలు రూ.2,939 కోట్లుగా ఉన్నాయి. ''గడిచిన కొన్ని నెలలుగా డిమాండ్ పరిస్థితులకు సవాళ్లు నెలకొన్నాయి. పట్టణాల్లో వినియోగం తగ్గుముఖం పట్టడం ఇందుకు కారణం''అని జీసీపీఎల్ ఎండీ, సీఈవో సుధీర్ సీతాపతి తెలిపారు. పామాయిల్ ధరలు 40 శాతానికి పైగా పెరగడం, గృహ కీటక నాసిని ఉత్పత్తుల విక్రయాలకు సీజన్ వారి బలహీనత పరిస్థితులను ప్రస్తావించారు. పామాయిల్ ధరల పెరుగుదలతో తమ ఎబిట్డా 21 శాతం తగ్గినట్టు చెప్పారు. ఒక్కో షేరుకు రూ.5 చొప్పున మధ్యంతర డివిడెండ్ పంపిణీకి బోర్డు నిర్ణయించింది.

## క్యూ3 ఫలితాలు

### ఐసీఐసీఐ లాభం రూ.11,791 కోట్లు




ముంబై: ప్రైవేటు రంగ ఐసీఐసీఐ బ్యాంక్ డిసెంబర్ క్వార్టర్‌లో రూ.11,791 కోట్ల నికర లాభం ప్రకటించింది. గతేడాది ఇదే క్యూ3లో ఆర్జించిన రూ.10,272 కోట్లతో పోలిస్తే ఇది 15% అధికంగా ఉంది. మొత్తం ఆదాయం రూ.42,792 కోట్ల నుంచి రూ.48,368 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 12% వృద్ధి చెంది రూ.41,300 కోట్లుగా నమోదైంది. గత డిసెంబర్ క్వార్టర్‌లో ఇది రూ.36,695 కోట్లుగా ఉంది. బ్యాంకు ఆస్తుల నాణ్యతను పరిశీలిస్తే.. స్థూల నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.3% నుంచి 1.96 శాతానికి దిగివచ్చింది. నికర ఎన్‌పీఏలు 0.44% నుంచి 0.42 శాతం నమోదయ్యాయి. రాని బాకీల కోసం చేసిన కేటాయింపులు రూ.1,049 కోట్ల నుంచి రూ.1,227 కోట్లకు పెరిగాయి. నిరర్థక రుణాలపై ప్రొవిజన్ కవరేజ్ రేషియో 78.2 శాతం ఉంది. కనీస మూలధన నిష్పత్తి 14.61% నుంచి 14.71 శాతానికి పెరిగింది.

### లారస్ ల్యాబ్స్ లాభం నాలుగింతలు




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీ సంస్థ లారస్ ల్యాబ్స్ డిసెంబర్ త్రైమాసికంలో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగి రూ.92 కోట్లు సాధించింది. ఎబిటా 57 శాతం దూసుకెళ్లి రూ.285 కోట్లను తాకింది. ఎబిటా మార్జిన్ 15.2 నుంచి 20.2 శాతానికి ఎగసింది. టర్నోవర్ 18 శాతం అధికమై రూ.1,415 కోట్లు నమోదు చేసింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో లారస్ ల్యాబ్స్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే శుక్రవారం 2.79 శాతం పెరిగి రూ.601.25 వద్ద స్థిరపడింది.

### ఎన్‌టీపీసీ నికర లాభం డౌన్

#### మధ్యంతర డివిడెండ్ రూ.2.50



ముంబై: ప్రభుత్వ రంగ విద్యుత్ దిగ్గజం ఎన్‌టీపీసీ డిసెంబరు త్రైమాసిక నికర లాభం స్వల్పంగా తగ్గింది. అధిక పన్ను వ్యయాలు, సర్దుబాట్లు ఇందుకు ప్రధాన కారణం. ఈ క్యూ3లో రూ.5,169.69 కోట్ల నికరలాభం ఆర్జించింది. కాగా క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే క్వార్టర్‌లో రూ.5,208.87 కోట్లుగా నమోదైంది. మొత్తం ఆదాయం రూ.43,575 కోట్ల నుంచి రూ. 45,597 కోట్లకు చేరింది. మొత్తం పన్ను ఖర్చులు రూ.1,361.75 కోట్ల నుంచి రూ. 2,075.12 కోట్లు చేరాయి. 2024 ఏప్రిల్-డిసెంబరు మధ్య కంపెనీ సరాసరి విద్యుత్ టారిఫ్ యూనిట్‌కు రూ.4.57 లభించింది. స్థూల విద్యుత్ ఉత్పత్తి 89.46 బిలియన్ యూనిట్ల (బీయూ) నుంచి 91.25 బి.యూనిట్లకు చేరింది. బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్లాంట్ల ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్ లేదా సామర్థ్య వినియోగం) 75.95 శాతం నుంచి 75.98 శాతానికి చేరింది.

- పది రూపాయల ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు 25 శాతం (రూ.2.50) చొప్పున మధ్యంతర డివిడెండు చెల్లించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

### 165 % పెరిగిన యస్ బ్యాంక్ లాభం




న్యూఢిల్లీ: డిసెంబర్ త్రైమాసికంలో యస్ బ్యాంక్ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 165 శాతం ఎగసి రూ.612 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.8,179 కోట్ల నుంచి రూ.9,341 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం రూ.6,984 కోట్ల నుంచి రూ.7,829 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 10 శాతం అధికమై రూ.2,224 కోట్లు సాధించింది. నికర వడ్డీ మార్జిన్ 2.4 శాతంగా ఉంది. నిర్వహణ లాభం రూ.864 కోట్ల నుంచి రూ.1,079 కోట్లకు చేరింది. స్థూల నిరర్థక ఆస్తులు 2 నుంచి 1.6 శాతానికి తగ్గింది. మొండి బకాయిలు 0.9 నుంచి 0.5 శాతానికి దిగొచ్చాయి. రాని బాకీల కోసం చేసిన కేటాయింపులు రూ.555 కోట్ల నుంచి రూ.259 కోట్లకు వచ్చి చేరాయి. లిక్విడిటీ కవరేజ్ రేషియో 133.2 శాతంగా ఉంది.

### గ్రాన్యూల్స్ ఇండియా లాభం రూ.118 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా రంగ సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా డిసెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 6.4 శాతం తగ్గి రూ.117.6 కోట్లు నమోదు చేసింది. టర్నోవర్ రూ.1,156 కోట్ల నుంచి రూ.1,138 కోట్లకు వచ్చి చేరింది. ఎబిటా 8 శాతం తగ్గి రూ.230 కోట్లుగా ఉంది. యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీల తదనంతరం సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లోని గాగిల్లాపూర్ ప్లాంటులో స్వచ్ఛందంగా ఉత్పత్తి నిలిపివేయడంతో డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయం, లాభాలపై గణనీయంగా ప్రభావం చూపిందని కంపెనీ వెల్లడించింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో గ్రాన్యూల్స్ ఇండియా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే శుక్రవారం 2.83 శాతం క్షీణించి రూ.582.35 వద్ద స్థిరపడింది.

సాక్షి ప్లస్
ఆదివారం । 26-1-2025

# ఐసీసీ టి20 జట్టు కెప్టెన్‌గా రోహిత్

'టీమ్ ఆఫ్ ది ఇయర్'లో బుమ్రా, పాండ్యా, అర్ష్‌దీప్‌కు చోటు
మహిళల టి20 జట్టులో స్మృతి మంధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ




**దుబాయ్:** సుదీర్ఘ నిరీక్షణ అనంతరం దేశానికి టి20 ప్రపంచకప్ అందించిన కెప్టెన్ రోహిత్ శర్మ 2024 సంవత్సరానికిగాను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించిన 'టి20 టీమ్ ఆఫ్ ద ఇయర్' జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు. గతేడాది టీమిండియాకు వరల్డ్ కప్ అందించిన 'హిట్‌మ్యాన్'తో పాటు ఈ జట్టులో భారత్ నుంచి స్టార్ పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా చోటు దక్కించుకున్నారు. ఈ జట్టులో భారత్ నుంచి అత్యధికంగా నలుగురు ప్లేయర్లు ఎంపిక కాగా... ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, పాకిస్తాన్, వెస్టిండీస్, జింబాబ్వే, అఫ్గానిస్తాన్, శ్రీలంక నుంచి ఒక్కొక్కరి చొప్పున చోటు దక్కించుకున్నారు. 2024లో 11 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లాడిన రోహిత్ ప్లేయర్‌గా, సారథిగా సత్తా చాటాడు. 42.00 సగటు, 160కి పైగా స్ట్రయిక్‌రేట్‌తో 378 పరుగులు చేశాడు. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన టి20 ప్రపంచకప్‌లో 37 ఏళ్ల రోహిత్ 3 అర్ధ శతకాలతో రాణించాడు. 'ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో రోహిత్‌కు బాగా తెలుసు. క్లిష్ట పరిస్థితుల్లో యువ ఆటగాళ్లకు అతడు మార్గనిర్దేశం చేసే తీరు రోహిత్ నాయకత్వ పటిమకు నిదర్శనం. భారత గొప్ప టి20 సారథుల్లో రోహిత్ తప్పకుండా ఉంటాడు' అని ఐసీసీ ఒక ప్రకటనలో వెల్లడించింది. గతేడాది 17 మ్యాచ్‌లాడి 352 పరుగులు చేయడంతో పాటు 16 వికెట్లు పడగొట్టిన పాండ్యా... ఐసీసీ టి20 ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. ఇక ఫార్మాట్లకు అతీతంగా... గతేడాది తన బౌలింగ్ ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించిన బుమ్రా... ఈ జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2024లో 8 మ్యాచ్‌లాడిన బుమ్రా... 15 వికెట్లు పడగొట్టాడు. ఐసీసీ టెస్టు టీమ్ ఆఫ్ ద ఇయర్‌లోనూ స్థానం సంపాదించిన బుమ్రా... టీమిండియా టి20 ప్రపంచకప్ నెగ్గడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికాతో టి20 ప్రపంచకప్ ఫైనల్లో అత్యంత ఒత్తిడి సమయంలో చక్కటి బౌలింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ సింగ్... గతేడాది 18 మ్యాచ్‌లాడి 36 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు.

**ఐసీసీ 2024 పురుషుల టి20 జట్టు:** రోహిత్ శర్మ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, బుమ్రా, అర్ష్‌దీప్ (భారత్), ట్రావిస్ హెడ్ (ఆస్ట్రేలియా), ఫిల్ సాల్ట్ (ఇంగ్లండ్), బాబర్ ఆజమ్ (పాకిస్తాన్), నికోలస్ పూరన్ (వెస్టిండీస్), సికందర్ రజా (జింబాబ్వే), రషీద్ ఖాన్ (అఫ్గానిస్తాన్), హసరంగ (శ్రీలంక).

**మహిళల జట్టులో భారత్ నుంచి ముగ్గురికి చోటు**

అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధన, వికెట్ కీపర్ రిచా ఘోష్, స్పిన్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ... ఐసీసీ మహిళల 'టి20 టీమ్ ఆఫ్ ద ఇయర్'లో చోటు దక్కించుకున్నారు. ఈ జట్టులో దక్షిణాఫ్రికా నుంచి ఇద్దరు... శ్రీలంక, ఇంగ్లండ్, వెస్టిండీస్, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, పాకిస్తాన్ నుంచి ఒక్కో ప్లేయర్లు ఎంపికయ్యారు. ఐసీసీ వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్‌లోనూ స్థానం దక్కించుకున్న స్మృతి, దీప్తి టి20 టీమ్‌లోనూ చోటు సాధించారు. 2024లో 23 మ్యాచ్‌లాడిన స్మృతి 42.38 సగటుతో 763 పరుగులు చేసింది. మరోవైపు రిచా ఘోష్ 21 మ్యాచ్‌ల్లో 33.18 సగటుతో 365 పరుగులు చేసింది. మిడిలార్డర్‌లో భారీ షాట్లతో విరుచుకుపడిన ఈ వికెట్‌కీపర్ 156.65 స్ట్రయిక్ రేట్‌తో ఈ పరుగులు సాధించడం విశేషం. ఇక దీప్తి శర్మ గతేడాది 30 వికెట్లు పడగొట్టింది.

**ఐసీసీ మహిళల టి20 జట్టు–2024:** లౌరా వాల్వర్ట్ (కెప్టెన్), మరీనె కాప్ (దక్షిణాఫ్రికా), స్మృతి మంధాన, రిచా ఘోష్, దీప్తి శర్మ (భారత్), చమరి అటపట్టు (శ్రీలంక), హేలీ మాథ్యూస్ (వెస్టిండీస్), స్కీవర్ బ్రంట్ (ఇంగ్లండ్), మెలీ కెర్ (న్యూజిలాండ్), ఒర్లా ప్రెండెర్‌గాస్ట్ (ఐర్లాండ్), సాదియా ఇక్బాల్ (పాకిస్తాన్).



## అర్ష్‌దీప్‌కు అందలం

**2024 ఐసీసీ 'టి20 క్రికెటర్'గా ఎంపిక**

**దుబాయ్:** భారత యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) 'టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యాడు. గతేడాది భారత జట్టు టి20 ప్రపంచకప్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఈ 25 ఏళ్ల లెఫ్టార్మ్ పేసర్... 2024లో ఓవరాల్‌గా 18 మ్యాచ్‌లాడి 15.31 సగటుతో 36 వికెట్లు పడగొట్టాడు. వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన వరల్డ్‌కప్‌లో ఆరంభ ఓవర్లతో పాటు, డెత్ ఓవర్స్‌లో చక్కటి బౌలింగ్‌తో ఆకట్టుకున్న అర్ష్‌దీప్ ఐసీసీ టి20 టీమ్ ఆఫ్ ద ఇయర్ జట్టులోనూ చోటు దక్కించుకున్నాడు. ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా నిలిచిన అర్ష్‌దీప్... భారత టి20 జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగాడు. టి20ల్లో ఇప్పటి వరకు 97 వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్... ఈ ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా రికార్డుల్లోకెక్కాడు. 2021లో ఐసీసీ 'టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు ప్రవేశపెట్టింది. 2021లో మొహమ్మద్ రిజ్వాన్ (పాకిస్తాన్)కు ఈ గౌరవం దక్కగా... 2022, 2023లలో సూర్యకుమార్ యాదవ్ (భారత్) గెల్చుకున్నాడు.

**అమెలియా కెర్‌కు గౌరవం...**



మహిళల విభాగంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమెలియా కెర్ 2024 సంవత్సరానికిగాను 'ఐసీసీ టి20 ప్లేయర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికైంది. గత ఏడాది అమెలియా కెర్ 18 మ్యాచ్‌లు ఆడి 387 పరుగులు చేయడంతో పాటు 29 వికెట్లు పడగొట్టింది. న్యూజిలాండ్ జట్టు 2024 టి20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలవడంలో అమెలియా కీలకపాత్ర పోషించింది. 2016లో సుజీ బేట్స్ తర్వాత ఐసీసీ 'టి20 క్రికెటర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు గెల్చుకున్న రెండో న్యూజిలాండ్ ప్లేయర్‌గా అమెలియా గుర్తింపు పొందింది.

## జ్యోతి యర్రాజీకి స్వర్ణం




**సాక్షి, హైదరాబాద్:** కొత్త ఏడాదిని భారత స్టార్ అథ్లెట్, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకంతో మొదలుపెట్టింది. ఫ్రాన్స్‌లో శనివారం జరిగిన నాంటెస్ మెట్రోపోల్ వరల్డ్ అథ్లెటిక్స్ కేటగిరీ 'సి' మీట్‌లో జ్యోతి యర్రాజీ 60 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచింది. ఫైనల్ రేసును జ్యోతి 8.04 సెకన్లలో ముగించి తన అత్యుత్తమ సమయాన్ని నమోదు చేసింది. హీట్స్‌లో 8.07 సమయం నమోదు చేసిన జ్యోతి ఫైనల్‌కు అర్హత సాధించింది.

## మొత్తం వికెట్లన్నీ మొదటి రోజే!

- విండీస్ 163 ఆలౌట్, పాక్ 154 ఆలౌట్
- టెస్టుల్లో 'హ్యాట్రిక్' తీసిన తొలి పాకిస్తాన్ స్పిన్నర్‌గా నోమన్ అలీ ఘనత




**ముల్తాన్:** ఇరుజట్ల 20 వికెట్లు టెస్టు మొదలైన రోజే మొత్తం కూలాయి. ముల్తాన్ టెస్టులో బౌలర్లే సుల్తాన్లు అయ్యారు. రెండో టెస్టు తొలిరోజును ఆసాంతం శాసించారు. దీంతో శనివారం ముందుగా బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 41.1 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌట్ కాగా... తర్వాత పాక్ తొలి ఇన్నింగ్స్ 47 ఓవర్లలో 154 పరుగులకే ముగిసింది. ఆతిథ్య జట్టు కొన్ని ఓవర్లు ఎక్కువ ఆడగలిగినా... పరుగుల్లో వెనుకబడిపోయింది. దాంతో కరీబియన్ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 9 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. ఫలితంగా ఓ జట్టుది పైచేయి అనేకంటే బౌలర్లదే ఉక్కుపిడికిలి అనడం సబబేమో! తొలుత వెస్టిండీస్ బ్యాటర్లకు పాక్ స్పిన్నర్ నోమన్ అలీ (6/41) నుంచి సవాలు ఎదురైంది. 12వ ఓవర్ వేసిన అతను తొలి మూడు బంతుల్లో వరుసగా గ్రీవ్స్ (1), టెవిన్ (0), కెవిన్ (0)లను అవుట్ చేయడంతో పాక్ టెస్టు క్రికెట్‌లో 'హ్యాట్రిక్' తీసిన తొలి స్పిన్నర్‌గా ఘనతకెక్కాడు. గతంలో వసీమ్ అక్రమ్ (రెండు సార్లు), అబ్దుల్ రజాక్, మొహమ్మద్ సమీ... ఈ ముగ్గురు శ్రీలంకపైనే 'హ్యాట్రిక్' నమోదు చేయగా, చివరిసారిగా 2020లో నసీమ్ షా బంగ్లాదేశ్‌పై ఈ ఫీట్ సాధించాడు. అయితే ఈ నలుగురు కూడా పేస్ బౌలర్లే కావడంతో స్పిన్ ఉచ్చుతో తొలి 'హ్యాట్రిక్' ఇప్పుడు నోమన్ ఖాతాలో పడింది. దీంతో విండీస్ 54 పరుగులకే 8 వికెట్లు కోల్పోగా... టెయిలెండర్లలో గుడకేశ్ మోతీ (55; 4 ఫోర్లు) ఫిఫ్టీ సాధించాడు. కీమర్ రోచ్ (25; 2 ఫోర్లు), వారికన్ (36; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించడంతో కరీబియన్ జట్టు 160 పైచిలుకు స్కోరు చేయగలిగింది. తొలి సెషన్‌లోనే విండీస్ ఆలౌట్ కాగా... బౌలింగ్‌లో మళ్లీ ఈ ముగ్గురే పాక్ పనిపట్టారు. వారికన్ (4/43), గుడకేశ్ మోతీ (3/49), రోచ్ (2/15)ల దెబ్బకు పాక్ కుదేలైంది. రిజ్వాన్ (49; 8 ఫోర్లు), షకీల్ (32; 2 ఫోర్లు) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు.

## జాతీయ బిలియర్డ్స్ విజేత సౌరవ్ కొఠారి



**ఇండోర్:** జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ చాంపియన్‌షిప్ ఫైనల్లో పంకజ్ అద్వానీపై సౌరవ్ కొఠారి విజయం సాధించాడు. శనివారం హోరాహోరీగా సాగిన తుది పోరులో సౌరవ్ కొఠారి 4–2 (15–31, 30–154, 9–151, 150–25, 150–90, 152–147)తో పంకజ్ అద్వానీపై గెలుపొందాడు. పెట్రోలియం స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఇరువురు క్యూయిస్టులు విజయం కోసం తీవ్రంగా శ్రమించారు. ప్రస్తుతం అంతర్జాతీయ బిలియర్డ్స్, స్నూకర్ సమాఖ్య (ఐబీఎస్‌ఎఫ్) ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో ఉన్న సౌరవ్ కొఠారి తొలి మూడు ఫ్రేమ్‌లలో ఒక్క దాంట్లో మాత్రమే గెలిచినా... ఆ తర్వాత చివరి మూడు ఫ్రేమ్‌లలో విజృంభించి విజేతగా నిలిచాడు. 2018లో ప్రపంచ బిలియర్డ్స్ చాంపియన్‌గా నిలిచిన సౌరవ్... ఉత్కంఠ భరితంగా సాగిన పోరులో కీలక సమయాల్లో ఆధిక్యం కనబర్చాడు.

# ముంబైకు జమ్మూ కశ్మీర్ షాక్

- రోహిత్, జైస్వాల్, శ్రేయస్ తదితరులు ఆడినా డిఫెండింగ్ చాంపియన్‌కు తప్పని ఓటమి
- ఐదు వికెట్లతో సంచలన విజయం సాధించిన జమ్మూ కశ్మీర్
- పంజాబ్‌పై ఇన్నింగ్స్ 207 పరుగుల తేడాతో కర్ణాటక ఘనవిజయం



**ముంబై:** స్టార్ ఆటగాళ్లతో నిండి ఉన్న ముంబై జట్టుపై... సమష్టి కృషితో సత్తా చాటిన జమ్మూ కశ్మీర్ జట్టు సంచలన విజయం సాధించింది. దేశవాళీ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'ఎ'లో భాగంగా జరిగిన పోరులో జమ్మూకశ్మీర్ జట్టు 5 వికెట్ల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ముంబైని బోల్తా కొట్టించింది. ముంబైపై జమ్మూ కశ్మీర్ జట్టు విజయం సాధించడం పదేళ్ల తర్వాత ఇదే తొలిసారి కాగా... ఈ ఫలితంతో ఆ జట్టు నాకౌట్ బెర్త్‌ను దాదాపు ఖరారు చేసుకుంది. రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, అజింక్య రహానే, శివమ్ దూబే, శార్దుల్ ఠాకూర్ వంటి అంతర్జాతీయ అనుభవం గల భారత క్రికెటర్లతో కూడిన ముంబై జట్టుపై... జమ్మూ కశ్మీర్ ప్లేయర్లు స్పష్టమైన ఆధిక్యం కనబర్చారు. ఓవర్‌నైట్ స్కోరు 274/7తో శనివారం మూడో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై జట్టు 74 ఓవర్లలో 290 పరుగులకు ఆలౌటైంది. శార్దుల్ ఠాకూర్ (135 బంతుల్లో 119; 18 ఫోర్లు), తనుశ్ కొటియాన్ (136 బంతుల్లో (62) పోరాడారు. జమ్మూ కశ్మీర్ బౌలర్లలో అఖీబ్ నబీ 4, యుధ్వీర్ సింగ్ 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం 205 పరుగుల విజయ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన జమ్మూ కశ్మీర్ జట్టు దూకుడుగా ఆడుతూ 49 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి విజయం సాధించింది. శుభమ్ ఖజూరియా (45), విర్రాంత్ శర్మ (38), అబిద్ ముస్తాక్ (32 నాటౌట్) తలా కొన్ని పరుగులు చేశారు. బ్యాటింగ్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన ముంబై... బౌలింగ్‌లోనూ మ్యాజిక్ చేయలేకపోయింది. షమ్స్ ములానీ 4 వికెట్లు తీశాడు. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి 7 వికెట్లు పడగొట్టిన జమ్మూ కశ్మీర్ పేసర్ యుధ్వీర్ సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ ఫలితంతో 42 సార్లు రంజీ చాంపియన్ ముంబై జట్టుకు తాజా సీజన్‌లో నాకౌట్‌కు చేరే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. గ్రూప్ 'ఎ'లో 6 మ్యాచ్‌లాడిన ముంబై 3 విజయాలు, 2 పరాజయాలు, ఒక 'డ్రా'తో 22 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక మూడో స్థానంలో ఉంది. జమ్ము కశ్మీర్ (29 పాయింట్లు), బరోడా (27 పాయింట్లు) తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి.

**శుబ్‌మన్ గిల్ శతకం వృథా**

భారత యువ ఆటగాడు శుబ్‌మన్ గిల్ (171 బంతుల్లో 102; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీ చేసినా... పంజాబ్ జట్టును ఇన్నింగ్స్ పరాజయం నుంచి తప్పించలేకపోయాడు. ఎలైట్ గ్రూప్ 'సి'లో భాగంగా బెంగళూరు వేదికగా జరిగిన పోరులో కర్ణాటక జట్టు ఇన్నింగ్స్ 207 పరుగుల తేడాతో పంజాబ్‌ను మట్టికరిపించింది. ఓవర్‌నైట్ స్కోరు 24/2తో శనివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పంజాబ్ జట్టు చివరకు 63.4 ఓవర్లలో 213 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ గిల్ ఒంటరి పోరాటం చేయగా... అతడికి మరో ఎండ్ నుంచి సరైన సహకారం లభించలేదు. కర్ణాటక బౌలర్లలో శ్రేయస్ గోపాల్, యశోవర్ధన్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. అంతకుముందు పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకే ఆలౌట్ కాగా... కర్ణాటక జట్టు 475 పరుగులు చేసింది. డబుల్ సెంచరీతో విజృంభించిన కర్ణాటక బ్యాటర్ రవిచంద్రన్ స్మరణ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. గ్రూప్‌లో భాగంగా 6 మ్యాచ్‌లు ఆడిన కర్ణాటక 2 విజయాలు, 4 'డ్రా'లతో 19 పాయింట్లు సాధించి పట్టిక రెండో స్థానంలో కొనసాగుతోంది.


రోహిత్


గిల్

# అనికేత్ అదుర్స్

- ఐదు వికెట్లు పడగొట్టిన హైదరాబాద్ బౌలర్
- హిమాచల్ ప్రదేశ్ 275 ఆలౌట్
- హైదరాబాద్‌కు 290 పరుగుల ఆధిక్యం

**సాక్షి, హైదరాబాద్:** రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్ బౌలర్ అనికేత్ రెడ్డి (5/72) సత్తా చాటాడు. ఫలితంగా ఓవర్‌నైట్ స్కోరు 33/1తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన హిమాచల్ ప్రదేశ్ జట్టు 92 ఓవర్లలో 275 పరుగులకు ఆలౌటైంది. ఇనేశ్ మహాజన్ (79 బంతుల్లో 68 నాటౌట్; 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధశతకం సాధించగా... శుభమ్ అరోరా (53; 7 ఫోర్లు) హాఫ్‌సెంచరీ చేశాడు. అంకిత్ (31), అపూర్వ్ వాలియా (37), ఆకాశ్ వశిష్ట్ (46) తలా కొన్ని పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ రెండు వికెట్లు తీయగా... నిశాంత్, వరుణ్ గౌడ్‌లకు చెరో వికెట్ దక్కింది. దీంతో హైదరాబాద్‌కు 290 పరుగుల భారీ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించడంతో ప్రత్యర్థిని ఫాలోఆన్‌కు ఆహ్వానించింది. శనివారం ఆట ముగిసే సమయానికి హిమాచల్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 పరుగులు చేసింది. శుభమ్ అరోరా (16 బ్యాటింగ్), ప్రశాంత్ చోప్రా (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 10 వికెట్లు ఉన్న హిమాచల్ జట్టు... హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 269 పరుగులు వెనుకబడి ఉంది.


అనికేత్

**స్కోరు వివరాలు**

**హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్:** 565; **హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్:** శుభమ్ అరోరా (ఎల్బీ) (బి) అనికేత్ రెడ్డి 53; ప్రశాంత్ చోప్రా (సి) రాహుల్ రాధేశ్ (బి) నిశాంత్ 1; అంకిత్ (సి) తన్మయ్ అగర్వాల్ (బి) తనయ్ త్యాగరాజన్ 31; అపూర్వ్ వాలియా (స్టంప్డ్) రాహుల్ రాధేశ్ (బి) అనికేత్ రెడ్డి 37; ఆకాశ్ వశిష్ట్ (సి) మిలింద్ (బి) అనికేత్ రెడ్డి 46; రిషి ధవన్ (ఎల్బీ) తనయ్ త్యాగరాజన్ 22; ఇనేశ్ మహాజన్ (నాటౌట్) 68; ముకుల్ నేగీ (సి) హిమతేజ (బి) అనికేత్ రెడ్డి 0; మయాంక్ డాగర్ (సి) రక్షణ్ రెడ్డి (బి) వరుణ్ గౌడ్ 0; వైభవ్ అరోరా (సి) రక్షణ్ రెడ్డి (బి) అనికేత్ రెడ్డి 3; దివేశ్ శర్మ (రనౌట్/హిమతేజ) 1; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం** (92 ఓవర్లలో ఆలౌట్) 275. **వికెట్ల పతనం:** 1–11, 2–78, 3–111, 4–144, 5–188, 6–217, 7–217, 8–218, 9–267, 10–275, **బౌలింగ్:** నిశాంత్ 12–3–52–1; చామా మిలింద్ 13–1–32–0; తనయ్ త్యాగరాజన్ 24–4–62–2; అనికేత్ రెడ్డి 25–5–72–5; రక్షణ్ రెడ్డి 13–1–29–0; వరుణ్ గౌడ్ 5–0–16–1.

**హిమాచల్ ప్రదేశ్ రెండో ఇన్నింగ్స్:** శుభమ్ అరోరా (బ్యాటింగ్) 16; ప్రశాంత్ చోప్రా (బ్యాటింగ్) 1; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (5 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 21. బౌలింగ్:** తనయ్ త్యాగరాజన్ 3–0–13–0; రక్షణ్ రెడ్డి 2–1–4–0.

# మెరిసిన పృథ్వీరాజ్

- ఐదు వికెట్లు తీసిన ఆంధ్ర బౌలర్
- పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్‌లో 260 ఆలౌట్
- ఆంధ్ర రెండో ఇన్నింగ్స్ 248/5
- కరణ్ షిండే అజేయ అర్ధశతకం


పృథ్వీరాజ్

**పుదుచ్చేరి:** రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో భాగంగా పుదుచ్చేరితో జరుగుతున్న పోరులో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 209/5తో శనివారం మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పుదుచ్చేరి జట్టు 79 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. దాంతో ఆంధ్ర జట్టుకు 43 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. పుదుచ్చేరి బ్యాటర్ అమాన్ ఖాన్ (50) అర్ధశతకం సాధించాడు. ఆంధ్ర బౌలర్లలో పృథ్వీరాజ్ 5 వికెట్లు పడగొట్టగా... విజయ్ రెండు వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. మొహమ్మద్ రఫీ, శశికాంత్, లలిత్ మోహన్ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి 69 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. కరణ్ షిండే (136 బంతుల్లో 86 బ్యాటింగ్; 9 ఫోర్లు; 1 సిక్స్) అజేయ అర్ధశతకంతో సత్తా చాటగా... శ్రీకర్ భరత్ (41; 7 ఫోర్లు), షేక్ రషీద్ (26; 3 ఫోర్లు), రికీ భుయ్ (32; 5 ఫోర్లు, 1 సిక్స్), శశికాంత్ (39 బ్యాటింగ్; 4 ఫోర్లు) రాణించారు. పుదుచ్చేరి బౌలర్లలో అంకిత్ శర్మ 2 వికెట్లు తీశాడు. నేడు ఆటకు చివరి రోజు కాగా... చేతిలో 5 వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు ఓవరాల్‌గా 291 పరుగుల ఆధిక్యంలో ఉంది.

**స్కోరు వివరాలు**

**ఆంధ్ర తొలి ఇన్నింగ్స్:** 303; **పుదుచ్చేరి తొలి ఇన్నింగ్స్:** శ్రీధర్ రాజు (సి) శ్రీకర్ భరత్ (బి) పృథ్వీరాజ్ 0; జయ్ పాండే (బి) పృథ్వీరాజ్ 3; పారస్ (సి) శ్రీకర్ భరత్ (బి) పృథ్వీరాజ్ 39; ఆకాశ్ (సి) శ్రీకర్ భరత్ (బి) శశికాంత్ 7; మోహిత్ కాలె (సి) రషీద్ (బి) పృథ్వీరాజ్ 60; అరుణ్ కార్తీక్ (సి) రికీ భుయ్ (బి) పృథ్వీరాజ్ 59; అమాన్ ఖాన్ (సి) రికీ భుయ్ (బి) లలిత్ మోహన్ 50; అంకిత్ శర్మ (సి) శ్రీకర్ భరత్ (బి) విజయ్ 13; సాగర్ (సి) రషీద్ (బి) విజయ్ 0; అబిన్ మాథ్యూ (నాటౌట్) 4; గౌరవ్ యాదవ్ (సి) అభిషేక్ రెడ్డి (బి) రఫీ 16; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (79 ఓవర్లలో ఆలౌట్) 260. **వికెట్ల పతనం:** 1–0, 2–9, 3–20, 4–84, 5–148, 6–225, 7–237, 8–238, 9–241, 10–260, **బౌలింగ్:** పృథ్వీరాజ్ 23–5–64–5; మొహమ్మద్ రఫీ17–1–53–1; శశికాంత్ 15–0–57–1; లలిత్ మోహన్ 16–2–42–1; విజయ్ 8–0–36–2.

**ఆంధ్ర రెండో ఇన్నింగ్స్:** అభిషేక్ రెడ్డి (ఎల్బీ) (బి) గౌరవ్ యాదవ్ 15; శ్రీకర్ భరత్ (ఎల్బీ) (బి) అంకిత్ శర్మ 41; షేక్ రషీద్ (రనౌట్) 26; కరణ్ షిండే (బ్యాటింగ్) 86; రికీ భుయ్ (సి) (సబ్) సీజేడీ శాస్త్రి (బి) అమన్ ఖాన్ 32; హనుమ విహారి (సి) శ్రీధర్ రాజు (బి) అంకిత్ శర్మ 0; శశికాంత్ (బ్యాటింగ్) 39; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (69 ఓవర్లలో 5 వికెట్లకు) 248. **వికెట్ల పతనం:** 1–24, 2–81, 3–82, 4–141, 5–142, **బౌలింగ్:** గౌరవ్ యాదవ్ 10–1–49–1; అబిన్ మాథ్యూ 11–3–34–0; సాగర్ 21–3–72–0; అంకిత్ శర్మ 22–3–56–2; అమాన్ ఖాన్ 3–0–25–1; ఆకాశ్ 2–1–11–0.

సాక్షి ప్లస్
ఆదివారం । 26-1-2025

# కుంభమేళాలో మళ్లీ అగ్ని ప్రమాదం


**మహాకుంభ్ నగర్(యూపీ):** ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళా ప్రాంతంలో మరో అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారం చోటుచేసుకున్న ఘటనలో రెండు కార్లు దగ్ధమయ్యాయి. ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. వారణాసికి చెందిన ఓ కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని ఫైర్ అధికారి వివరించారు. అందులోని వారందరినీ కాపాడి, మంటలను వెంటనే అదుపులోకి తెచ్చామన్నారు. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. ఈ నెల 19న మహాకుంభ్ నగర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 18 క్యాంపులు భస్మీపటలమయ్యాయి. మంటలను సకాలంలో ఆర్పివేయడంతో ప్రాణనష్టం తప్పింది.

### ఒకటిన 73 దేశాల దౌత్యవేత్తల రాక

రష్యా, ఉక్రెయిన్ సహా 73 దేశాలకు చెందిన దౌత్యవేత్తలు మహాకుంభ్ మేళాలో మొదటిసారిగా పుణ్యస్నానాలు చేయనున్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీన వీరంతా రానున్నారని మేళా అధికారి విజయ్ కిరణ్ ఆనంద్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్ల కోసం విదేశాంగ శాఖ యూపీ చీఫ్ సెక్రటరీకి ఒక లేఖ రాసిందన్నారు. జపాన్, అమెరికా, జర్మనీ, నెదర్లాండ్స్, కామెరూన్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, పోలండ్, బొలీవియా తదితర దేశాల దౌత్యాధికారులు పాల్గొంటారని చెప్పారు. బోట్‌లో సంగం వద్దకు చేరుకుని పుణ్యస్నానాలు చేస్తారన్నారు. అనంతరం, అక్షయ్‌వట్, బడే హనుమాన్ ఆలయాలను దర్శించుకోనున్నారు. డిజిటల్ మహాకుంభ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో వీరికి మహాకుంభ్ ప్రాశస్త్యాన్ని వివరించనున్నామన్నారు.

### సొంత అఖాడాకు సీఎం యోగి

ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ శనివారం ప్రయాగ్‌రాజ్‌లోని తన సొంత శ్రీ గురు గోరక్షా నాథ్ అఖాడాను సందర్శించారు. ధర్మ ధ్వజ్‌కు స్వయంగా ఉత్సవ పూజ జరిపారు. ఈ సందర్భంగా సీఎం యోగి దేశం నలుమూలల నుంచి మహాకుంభ్‌కు విచ్చేసిన సిద్ధ యోగులతో చర్చలు జరిపారని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. ఇది గురు గోరక్షా నాథ్ సంప్రదాయాన్ని కొనసాగించే సీఎం యోగి సొంత అఖాడా అని యోగి మహాసభ ప్రత్యేక ఉపాధ్యక్షుడు మహంత్ బాలక్ నాథ్ యోగి చెప్పారు. యోగుల బసకు ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లున్నాయన్నారు.



విను వీధిలో సాధువు శంఖం పూరిస్తున్నట్లుగా కనిపిస్తోంది కదూ..! శుక్రవారం రాత్రి ప్రయాగ్ రాజ్‌లోని మహా కుంభ్‌మేళా ప్రాంతంలో ఏర్పాటైన షోలో డ్రోన్లతో ఢిల్లీ ఐఐటీతో కలిసి యూపీ పర్యాటక శాఖ ఇలా భక్తులను అలరించింది.

## 'సహ జీవన' సంబంధాలకు తగు పరిష్కారం కనుగొనాలి

### అలహాబాద్ హైకోర్టు

**ప్రయాగ్‌రాజ్:** సమాజం ఆమోదించకున్నా నేటి యువత సహ జీవన సంబంధాలకు మొగ్గు చూపుతోందని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఇటువంటి సందర్భాల్లో నైతిక విలువలను కాపాడేందుకు తగు పరిష్కారం లేదా నిబంధనలను రూపొందించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. వివాహం పేరుతో మహిళతో శారీరక సంబంధం కొనసాగించాడనే ఆరోపణలు ఎదుర్కొంటున్న వారణాసి వాసి ఆకాశ్ కేసరి బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ నళిన్ కుమార్ శ్రీవాస్తవ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సహ జీవనం వైపు యువతీయువకులు ఆకర్షితులవుతున్నారు. కొన్నాళ్లు కలిసున్నాక ఇష్టం లేకుంటే అతడు లేక ఆమె చాలా సులువుగా ఈ బంధం నుంచి బయటపడేందుకు అవకాశముంది. అందుకే, ఇలాంటి బంధాలకు యువత తొందరగా లొంగిపోతోంది. అందుకే, సమాజంలో నైతిక విలువలను పరిరక్షించేందుకు సహ జీవన సంబంధాలకు ఒక పరిష్కారం కనుగొనాల్సిన సమయమిదే'అని పేర్కొన్నారు. ఓ మహిళతో ఆకాశ్ కేసరి ఆరేళ్లపాటు సహజీవనం చేశాడు. అనంతరం పెళ్లికి నిరాకరించాడంటూ బాధిత మహిళ సార్‌నాథ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సీ, ఎస్టీ చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు కేసరిని అరెస్ట్ చేశారు. ఆ సమయంలో ఆ మహిళ మేజర్ అనీ, అంగీకారంతోనే ఆమె సహజీవనం చేసిందని కేసరి లాయర్ వాదించారు. ఆమెకు కేసరి అబార్షన్ చేయించలేదని, పెళ్లి చేసుకుంటానని అతడు మాట కూడా ఇవ్వలేదని చెప్పారు. వాదోపవాదాలు విన్న న్యాయమూర్తి కేసరికి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చారు.

## నిజాయతీలేని నాయకుడు రాహుల్ గాంధీ

- కాంగ్రెస్ నేత ఫొటోతో 'ఆప్'పోస్టర్
- ఢిల్లీ ఎన్నికల్లో మొదలైన పోస్టర్ల యుద్ధం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోస్టర్ల యుద్ధానికి తెరలేచింది. అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ప్రచారం ఉధృతం చేసింది. ప్రత్యర్థులపై విమర్శల్లో పదును పెంచింది. కాంగ్రెస్, బీజేపీ నాయకులను టార్గెట్ చేస్తూ శనివారం ఒక పోస్టర్ విడుదల చేసింది. 'నిజాయతీలేని నాయకుల కంటే నిజాయతీపరుడైన అరవింద్ కేజ్రీవాల్ ఎంతో మహోన్నతుడు'అని రాసి ఉన్న ఈ పోస్టర్‌లో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఫొటో ముద్రించడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తోపాటు ఢిల్లీకి చెందిన పలువురు బీజేపీ నాయకుల ఫొటోలు ఉండడం గమనార్హం. కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఇండియా కూటమి ఆమ్ ఆద్మీ పార్టీ భాగస్వామిగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ ఈ రెండు పార్టీలు ఢిల్లీ ఎన్నికల్లో వేర్వేరుగానే పోటీ చేస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇటీవల ఆప్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఫలితంగా రెండు పార్టీల దూరం మరింత పెరుగుతోంది. ఆప్, కాంగ్రెస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. మరోవైపు ఆప్ పోస్టర్‌పై బీజేపీ ఘాటుగా స్పందించింది. దొంగలు, నేరగాళ్ల ముఠా పేరుతో కొత్త పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేసింది. వచ్చే నెల 5న జరిగే ఎన్నికల్లో ఈ గ్యాంగ్‌కు పరాభవం తప్పదని తేల్చిచెప్పింది. ఈ పోస్టర్‌పై ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆ పార్టీ నాయకులు ఫొటోలు ఉన్నాయి.

## ఫిట్‌జీ యజమాని సహా 12 మందిపై కేసులు

**నోయిడా:** దేశ రాజధాని ప్రాంతంతో సహా దేశమంతటా ఫిట్‌జీ (ఎఫ్ఐఐటీజేఈఈ) కోచింగ్ కేంద్రాలను మూసేసిన ఆరోపణలపై ఆ సంస్థ యజమాని డీకే గోయెల్ సహా 12 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేర పూరిత కుట్ర, నమ్మకానికి భంగం కలిగించిన ఆరోపణలపై కేసు నమోదు చేసినట్లు డీసీపీ రాంబదన్ సింగ్ చెప్పారు. నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని సంస్థలో పనిచేసే ఉపాధ్యాయులు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడంతో శుక్రవారం ఢిల్లీవ్యాప్తంగా ఉన్న ఎఫ్ఐఐటీజేఈఈ కోచింగ్ సెంటర్లు ఆకస్మాత్తుగా మూతబడ్డాయి. దేశవ్యాప్తంగా కూడా సంస్థ సెంటర్లు మూతబడ్డట్టు తెలుస్తోంది. దాంతో విద్యార్థుల భవితవ్యంపై తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వారినుంచి భారీగా ఫిర్యాదులు వచ్చినట్టు పోలీసులు తెలిపారు. ఇంజనీరింగ్ అభ్యర్థుల కోసం పోటీ పరీక్షలకు ఎఫ్ఐఐటీజేఈఈ శిక్షణ ఇస్తుంది. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా 73 సెంటర్లున్నాయి. ఒక్క నోయిడా–62 సెక్టార్‌లోని కోచింగ్ సెంటర్‌లోనే రెండు వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని, తల్లిదండ్రులు వీరికి లక్షలాది రూపాయలను ఫీజుగా చెల్లించారని తెలిపారు.

## అమెరికా రక్షణ మంత్రిగా పీట్ హెగ్సెత్

### ఉపాధ్యక్షుడు వాన్స్ టై బ్రేకర్ ఓటుతో సెనేట్ ఆమోదం

**వాషింగ్టన్:** అమెరికా రక్షణ మంత్రిగా పీట్ హెగ్సెత్(44) పేరును ఎట్టకేలకు సెనేట్ ఆమోదించింది. ఆ వెంటనే ఆయన మంత్రిగా ప్రమాణం చేయడం జరిగిపోయాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన పేరును ప్రతిపాదించడం తెలిసిందే. సెనేట్‌లోని 100 మందికి గాను రిపబ్లిక్ పార్టీకి 53 మంది సభ్యుల బలముంది. ఇరాక్, అఫ్గాన్ యుద్ధాల్లో పాల్గొన్న మాజీ సైనికుడు హెగ్సెత్‌పై లైంగిక దాడి, మద్యం అలవాటు, మాజీ సైనికుల చారిటీ నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాత్రి పొద్దుపోయాక జరిగిన ఓటింగ్‌లో ప్రతిపక్ష డెమోక్రాట్ పార్టీకి చెందిన మొత్తం 47 మందితోపాటు అధికార రిపబ్లికన్ పార్టీలోని ముగ్గురు సభ్యులు సైతం హెగ్సెత్‌కు వ్యతిరేకంగా ఓటేశారు. హెగ్సెత్‌కు అనుకూల, వ్యతిరేక ఓట్లు చెరి సమానంగా 50 పడ్డాయి. దీంతో, టై బ్రేకర్‌లో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెగ్సెత్‌కు ఓటేయడంతో కేవలం ఒక్క ఓటు తేడాతో సెనేట్ ఆమోదం పొందినట్లయింది. కేబినెట్ నామినీని ఆమోదింపజేసుకునేందుకు టై బ్రేక్‌లో ఉపాధ్యక్షుడు ఓటేయడం అమెరికా చరిత్రలోనే ఇది రెండోసారని పరిశీలకులు అంటున్నారు. గతంలో, 2017లో ట్రంప్ హయాంలోనే విద్యాశాఖ మంత్రి బెట్సీని సెనేట్ ఆమోదించడం కోసం అప్పటి ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ మొదటిసారిగా ఇలా టై బ్రేక్ ఓటేశారు. కాగా, సెనేట్ ఆమోదం పొందిన కొద్ది గంటల్లోనే హెగ్సెత్‌తో ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ రక్షణ మంత్రిగా ప్రమాణం చేయించారు.

## దేశం కోసం త్యాగం చేసే వారికే ఓటేయండి

### ఢిల్లీ ఓటర్లకు అన్నా హజారే పిలుపు

**ముంబై:** మచ్చ లేని వ్యక్తిత్వం కలిగిన వారు, దేశం కోసం త్యాగం చేయగలిగే వారికే ఓటేయాలని ఢిల్లీ పౌరులకు ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నా హజారే విజ్ఞప్తి చేశారు. అప్రయోజకులకు ఓటేయ వద్దని, అలాచేస్తే దేశం నాశనమవుతుందని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక వీడియో సందేశం విడుదల చేశారు. 'త్వరలో ఢిల్లీలో ఎన్నికలు జరగనున్నాయి. స్వచ్ఛమైన వ్యక్తిత్వం, ఆలోచనలు కలిగిన వారు, సన్మార్గంలో నడిచేవారు, అవమానాలను దిగమింగి అవసరమైతే దేశం కోసం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉండేవారికి ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను'అని పేర్కొన్నారు. 'నేను తాగుతాను కాబట్టి, ఇది ఇతరులు కూడా తాగేందుకు అనుకూలంగా ఉంటుంది'అనే వైఖరి ఎన్నికల ప్రక్రియలో పనికి రాదన్నారు. ఢిల్లీ కేంద్రంగా గతంలో అన్నా హజారే అవినీతి వ్యతిరేక ప్రచారం చేపట్టారు. ఆయనతో పోరాటంలో పాలుపంచుకున్న అరవింద్ కేజ్రీవాల్ అనంతర కాలంలో ఆప్‌ను స్థాపించి, ఢిల్లీ సీఎంగా ఎన్నికయ్యారు. అయితే, కేజ్రీవాల్ రాజకీయాల్లోకి ప్రవేశించడం హజారేకు ఇష్టంలేదు. ఆ తర్వాత పరిణామాల్లో ఇద్దరూ దూరమయ్యారు.

## రామాయణ నృత్య రూపకం

### చైనా కళాకారుల రికార్డు

**బీజింగ్:** భారతీయ ఇతిహాసం రామాయణం ఆధారంగా చేసుకుని చైనా డ్యాన్సర్ల బృందం శనివారం 'ఆది కావ్య–ది ఫస్ట్ పోయెమ్'ను ప్రదర్శించి చరిత్ర సృష్టించింది. చైనా భరతనాట్య వ్యాఖ్యాత జిన్ షన్షాన్ ఈ నృత్య రూపకానికి దర్శకత్వం వహించారు. ప్రాచీన దక్షిణాది కళా రూపాన్ని అధ్యయనం చేసిన 80 మంది ప్రతిభావంతులైన స్థానిక కళాకారులు ఇందులో పాల్గొన్నారు. ప్రొఫెసర్ జి జియాన్‌లిన్ చైనీస్‌లోకి తర్జుమా చేసిన రామాయణం ఆధారంగా ఈ నృత్యరూపకాన్ని రూపొందించారు. రామాయణం ఆధారంగా నృత్య రూపకాన్ని ఇంత భారీ స్థాయిలో చైనాలో ప్రదర్శించడం ఇదే మొదటిసారి. ఇందుకు బీజింగ్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా తన వంతు సహకారం అందించింది. ఈ కార్యక్రమానికి ఉప మంత్రి సున్ హైయాన్, అధికార కమ్యూనిస్ట్ పార్టీ నుంచి లువో, చైనాలో భారత రాయబారి ప్రదీప్ రావత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి హిందూ కుటుంబంలో ముగ్గురు పిల్లలుండాలి

**మహాకుంభ్ నగర్:** దేశంలో హిందువుల జననాల రేటు పడిపోతుండటంపై విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి హిందూ కుటుంబం కనీసం ముగ్గురు పిల్లల్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చింది. మహాకుంభ్ నగర్‌లో శనివారం జరిగిన విరాట్ సంత్ సమ్మేళన్‌లో వీహెచ్‌పీ సెంట్రల్ జనరల్ సెక్రటరీ బజ్‌రంగ్ లాల్ బాంగ్రా మాట్లాడారు. 'హిందువుల జననాల రేటు పడిపోతుండటంతో దేశంలో హిందూ జనాభాలో అసమతూకం ఏర్పడుతోంది. ప్రతి హిందూ కుటుంబంలో కనీసం ముగ్గురు పిల్లలుండాలని హిందూ సమాజంలోని గౌరవనీయులైన సాధువులు కోరుతున్నారు'అని ఆయన అన్నారు. అనంతరం గోరక్షా పీఠాధీశ్వర్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మాట్లాడారు. సనాతన భారత ధర్మం కుంభమేళాలో ప్రత్యక్షంగా కనిపిస్తోందని, యావత్తు ప్రపంచమే దీన్ని చూస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో ప్రణాళిక ప్రకారం హిందువులపై దాడులు సాగడంపై సమావేశంలో చర్చించారని వీహెచ్‌పీ ఒక ప్రకటనలో తెలిపింది. కార్యక్రమానికి జగద్గురు శంకరాచార్య స్వామి వాసుదేవానంద అధ్యక్షత వహించారు.

# జనాభా తగ్గుతోంది... వృద్ధులు పెరుగుతున్నారు

ఇటు జనాభా క్షీణిస్తోంది. అటు వృద్ధుల సంఖ్య భారీగా పెరుగుతోంది. చైనా సహా అనేక దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లివి. పెళ్లికి, పిల్లలను కనేందుకు యువతరం పెద్దగా ఇష్టపడటం లేదు. కాస్త అటూ ఇటుగా ప్రపంచమంతటా ఇదే ధోరణి పెరుగుతోంది. దాంతో ఏ దేశంలో చూసినా జనాభా క్రమంగా తగ్గుతోంది. 2024లో చైనా జనాభా 10.4 లక్షలు తగ్గింది. అక్కడ జనాభా తగ్గడం వరుసగా ఇది మూడో ఏడాది. జపాన్‌లోనైతే 15 ఏళ్లుగా జనాభా వరుసగా తగ్గుముఖం పడుతోంది. దక్షిణ కొరియాలో 2023లో కాస్త పుంజుకున్న జనాభా ఈ ఏడాది మళ్లీ తగ్గింది. ఇటలీలో జననాల సంఖ్య 19వ శతాబ్దం తరవాత తొలిసారి 4 లక్షల కంటే తక్కువకు పడిపోయింది. 63 దేశాలు, భూభాగాల్లో జనాభా ఇప్పటికే గరిష్ట స్థాయికి చేరిందని ఐరాస అంచనా. వచ్చే 30 ఏళ్లలో మరో 48 దేశాలు ఆ స్థాయికి చేరతాయని సంస్థ పేర్కొంది. 60 ఏళ్లలో ప్రపంచ జనాభా వెయ్యి కోట్లకు చేరుతుందని, అక్కడినుంచి క్షీణించడం మొదలవుతుందని అభిప్రాయపడింది.

### చైనాలో రిటైర్మెంట్ వయసు పెంపు

మరోవైపు ఆరోగ్య సంరక్షణ, మెరుగైన జీవన శైలి, ఆయుర్దాయం పెరుగుదల తదితరాలతో చాలా దేశాల్లో వృద్ధుల జనాభా నానాటికీ పెరిగిపోతోంది. చైనాలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. దాంతో ఆర్థిక వృద్ధి దెబ్బ తింటోంది. ఈ సమస్యను అధిగమించేందుకు చైనా నానా ప్రయత్నాలు చేస్తోంది. పురుషుల రిటైర్మెంట్ వయసును 60 నుంచి 63 ఏళ్లకు పెంచింది. ఫ్యాక్టరీ, బ్లూ కాలర్ ఉద్యోగాల్లో మహిళలకు 50 నుంచి 55కు, వైట్–కాలర్ ఉద్యోగాల్లో 55 నుంచి 58కు పెంచింది. 2022 నుంచి చైనాలో జనాభా తగ్గుముఖం పట్టడం మొదలైంది. దాంతో అత్యధిక జనాభా రికార్డును 2023లోనే భారత్‌కు కోల్పోయింది. ఒకే సంతానం నిబంధనను సడలించి ముగ్గురిని కనేందుకు అనుమతించినా లాభం లేకపోయింది. 140 కోట్లున్న చైనా జనాభా 2050 నాటికి 130 కోట్లకు తగ్గుతుందని అంచనా.

### చైనా సహా ఆసియా దేశాలకు సవాలు

### ఇటలీదీ అదే వ్యథ...

ఇటలీలో కూడా జనాభా నానాటికీ తగ్గిపోతోంది. 2023లో 5.94 కోట్లుండగా 2024 చివరికి 5.93 లక్షలకు తగ్గింది. 2008లో 5.77 లక్షలున్న వార్షిక జననాల సంఖ్య 2023 నాటికి ఏకంగా 3.8 లక్షలకు పడిపోయింది! ఇటలీ ఏకీకరణ తరువాత జననాల సంఖ్య క్షీణించడం అదే తొలిసారి! పిల్లల సంరక్షణ ఖరీదైన వ్యవహారంగా మారడం, తక్కువ జీతాలు, వృద్ధ తల్లిదండ్రులను చూసుకునే సంప్రదాయం వంటివి ఇటాలియన్లకు భారంగా మారుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి. ఎక్కువ మంది పిల్లలను కనాల్సిందిగా పోప్ కూడా ఇటీవలే ఇటాలియన్లకు విజ్ఞప్తి చేశారు.

### జపాన్‌లో అలా..

జపాన్ అయితే జనాభా సంక్షోభమే ఎదుర్కొంటోంది! 2008లో 12.8 కోట్లుండగా ప్రస్తుతం 12.5 కోట్లకు పడిపోయింది. జననాల సంఖ్య కూడా బాగా తగ్గుతోంది. యువత పెళ్లి, పిల్లలను కనడంపై తీవ్ర విముఖత చూపుతుండటం ప్రభుత్వాన్ని కలవరపరుస్తోంది. ఉద్యోగావకాశాల లేమి, జీవన వ్యయానికి తగ్గ వేతనాలు లేకపోవడం, కార్పొరేట్ సంస్కృతి పని చేసే మహిళలు పని చేసేందుకు అనుకూలంగా లేకపోవడం వంటివి సమస్యను మరింత పెంచుతున్నాయి. 2070 నాటికి జపాన్ జనాభా 8.7 కోట్లకు పడిపోతుందని అంచనా. జనాభా సమస్యకు తోడు వృద్ధుల సంఖ్య కూడా జపాన్‌ను కలవరపరుస్తోంది. అక్కడ ప్రతి 10 మందిలో నలుగురు వృద్ధులే!

ప్రభుత్వం కూడా 2033 కల్లా ఏటా కనీసం 5 లక్షల జననాలే లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా నిరోధించడానికి జనాభా అవసరమని శాస్త్రవేత్తలు అంటున్నారు. దక్షిణ కొరియాలో విదేశీయుల రాక పుణ్యమా అని 2023లో జనాభా పుంజుకుంది. నిజానికి అధిక పోటీ విద్యా విధానంలో పిల్లలను పెంచడానికి అధిక ఖర్చు, మహిళలే శిశు సంరక్షణ చేపట్టాలనే ధోరణి వల్ల అక్కడ కొన్నేళ్లుగా జనాభా తగ్గుతోంది. వర్కింగ్ వీసా ప్రోగ్రాం పొడిగింపు వల్ల విదేశీ నివాసితుల సంఖ్య 10% పెరిగి 10.9 లక్షలకు చేరింది. ఫలితంగా జనాభాలో కాస్త పెరుగుదల నమోదై 5.18 కోట్లకు చేరింది. కానీ వీరిలో ఏకంగా 90.5 లక్షల మంది 65, అంతకు మించిన వయసువారే! వృద్ధుల జనాభా పెరగడం కార్మికుల కొరతకు దారి తీస్తోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

## ఈసీ స్వతంత్రతకు వారితోనే దెబ్బ

### మోదీ, అమిత్ షాపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ:** జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ఎన్నికల సంఘాన్ని శ్లాఘించిన ప్రధాని మోదీపై విపక్ష కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ''నిత్య చైతన్యవంత భారత ప్రజాస్వామ్యానికి గుర్తుగా జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రతి ఒక్క భారతీయుడు తన ఓటు హక్కును వినియోగించుకోగల్గుతున్నందుకు గుర్తుగా ఈ వేడుక జరుపుకుంటున్నాం. ఇందుకోసం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ)ను మనం ఖచ్చితంగా పొగడాల్సిందే''అని ప్రధాని మోదీ శనివారం తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌చేశారు. ఈ పోస్ట్‌కు గతంలో తన 'మన్ కీ బాత్'రేడియో ప్రసంగంలో ఈసీని పొగిడిన ఆడియోక్లిప్‌ను జతచేశారు. దీనిపై కాంగ్రెస్ ఘాటుగా స్పందించింది. ప్రధాని మోదీతోపాటు ఈసీ, కేంద్ర మంత్రి అమిత్ షా పైనా విమర్శలు గుప్పించింది. ''రాజ్యాంగాన్ని అవహేళన చేస్తున్న, ఓటర్లను అవమానిస్తున్న ఈసీ తనకు తాను సొంత డబ్బా కొట్టుకున్నంత మాత్రాన వాస్తవాలను దాచలేం. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ద్వయం కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం స్వతంత్రత దెబ్బతింది. ఈసీ సమగ్రత గత పదేళ్లుగా దశలవారీగా దెబ్బతింటూ వస్తోంది''అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు.

### తప్పుడు ప్రచారాలొద్దన్న సీఈసీ

విపక్ష కాంగ్రెస్ విమర్శలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందించారు. ఢిల్లీలో జరిగిన జాతీయ ఓటరు దినోత్సవంలో మాట్లాడారు. ''దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య విధానమైన ఎన్నికలపై అబద్ధపు సమాచారం, తప్పుడు ప్రచారాల ప్రమాదకర పోకడ మరీ ఎక్కువైంది. ఇలాంటి మిథ్యాప్రపంచం మాయలో మన భారతీయ యువత పడొద్దని కోరుకుంటున్నా. ఓటర్లు మన ఎన్నికల ప్రక్రియపై సందేహాలతో ఎలాంటి ప్రశ్నలు అడిగినా, ఎలాంటి సలహాలు, సూచనలు ఇచ్చినా స్పందించేందుకు మేం సదా సిద్ధంగా ఉన్నాం. ఎన్నికల ప్రక్రియ మెరుగుకోసం మీ నుంచి వచ్చే సూచనలకు మేం లిఖితపూర్వక స్పందన తెలియజేస్తాం'' అని రాజీవ్‌కుమార్ అన్నారు.

## మూడేళ్లలో యమునను శుద్ధి చేస్తాం

### గిగ్ వర్కర్స్, కార్మికులకు సంక్షేమ పథకాలు

- ఢిల్లీ ఎన్నికలకు బీజేపీ మరో మేనిఫెస్టో
- విడుదల చేసిన హోం మంత్రి అమిత్ షా

**న్యూఢిల్లీ:** ఢిల్లీలో తాము అధికారంలోకి వస్తే యమునా జలాలను మూడేళ్లలో శుద్ధి చేస్తామని, గిగ్ వర్కర్లు, కార్మికులకు సైతం సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అనధికారికంగా ఏర్పాటైన దాదాపు 1,700 కాలనీల్లో వారికి ఆస్తి యాజమాన్య హక్కులను కల్పిస్తామని తెలిపారు. దీని ద్వారా వారు తమ ఆస్తి క్రయవిక్రయాలతోపాటు కొత్తగా నిర్మాణాలు చేపట్టేందుకు సైతం హక్కు ఉంటుందన్నారు. ఢిల్లీ అసెంబ్లీకి మరో 10 రోజుల్లో ఎన్నికలు జరగనుండగా బీజేపీ ఈ హామీలను ప్రకటించడం గమనార్హం. అంతేకాదు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ స్కీం కింద పేద విద్యార్థులు ఢిల్లీ మెట్రోలో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పిస్తామని కూడా ఆయన హామీ ఇచ్చారు. ఈ మేరకు అమిత్ షా శనివారం బీజేపీ తుది మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను విడుదల చేశారు. ఢిల్లీలోని పేదలకు ప్రస్తుతం అమలవుతున్న ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపి వేయబోమని స్పష్టం చేశారు. గిగ్ వర్కర్లు, కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, వీరికి రూ.10 లక్షల బీమాతోపాటు రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేస్తామని అమిత్ షా అన్నారు. ఢిల్లీలో ఖాళీగా ఉన్న 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. గ్రాండ్ మహాభారత్ కారిడార్‌ను అభివృద్ధి చేసి, యువతకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలను సృష్టించనున్నట్లు వెల్లడించారు. ఢిల్లీలో రోడ్ల కోసం రూ.41 వేల కోట్లు, రైల్వే లైన్ల ఏర్పాటుకు రూ.15 వేల కోట్లు, విమానాశ్రయాల నిర్మాణానికి రూ.21 వేల కోట్లు కేంద్ర వెచ్చిందని వివరించారు. కేజ్రీవాల్ సారథ్యంలోని ఆప్ ప్రభుత్వం పలు కుంభకోణాలకు పాల్పడిందని, ఇంతటి అవినీతి మరెప్పుడూ జరగలేదన్నారు. ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ అబద్ధపు హామీలిచ్చి, అమలు మరిచారని విమర్శించారు. ఇటువంటి అబద్ధాల కోరును వదిలించుకునే సమయం ఆసన్నమైందని ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీకి జరిగే ఎన్నికలు బీజేపీ ఇప్పటికే రెండు మేనిఫెస్టోలను విడుదల చేయడం తెలిసిందే.

## బ్యాలెట్ మళ్లీ రావాలి: ఉద్ధవ్ ఠాక్రే

**ముంబై:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల కారణంగా ఓటర్లు తమ ఓటు ఎవరికి పడిందో తెలుసుకునే హక్కును కోల్పోయారని శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ప్రభుత్వం ఆ హక్కును లాగేసుకుందని, ఇది ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. పోలింగ్ బూత్‌ల సీసీటీవీ ఫుటేజీని కూడా ఎన్నికల కమిషన్ ఇకపై ఇవ్వదన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఎన్నికలు మళ్లీ బ్యాలెట్ పేపర్ విధానంలోనే జరగాలని కోరారు. ఈ విధానంలో అయితేనే తాము ఎవరికి వేసిందీ ఓటర్లకు తెలుస్తుందని చెప్పారు. ఈవీఎంల్లో వేసిన ఓటు సంబంధిత అభ్యర్థికి పడిందా లేదా అనేది కచ్చితంగా తెలియదని చెప్పారు. స్వాతంత్య్ర పోరాటంతో సంబంధం లేని వారి చేతుల్లోకి దేశ స్వాతంత్య్రం వెళ్లిపోయిందంటూ ఈ సందర్భంగా ఆయన బీజేపీనుద్దేశించి వ్యాఖ్యానించారు. నేడు ఓటుకు విలువే లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఈవీఎంల ట్యాపరింగ్ అయినా కాకపోయినా అన్ని వ్యవస్థలను చెరబట్టారని అన్నారు.

# సంకుచితభావన, వివక్ష విడనాడండి

### ఆకర్షణీయ పథకాలకు లొంగకండి • ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంచండి

### జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ఉద్బోధ

**న్యూఢిల్లీ:** ఓటింగ్ ప్రక్రియలో అత్యంత నిబద్ధతతో మెలగాలని ఓటర్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉద్బోధించారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆమె దేశవ్యాప్తంగా ఓటర్లనుద్దేశించి ప్రసంగించారు. ''ఎన్నికల ప్రక్రియ మరింత సజావుగా సాగేలా, అత్యంత పారదర్శకంగా పోలింగ్ జరిగేలా కేంద్ర ఎన్నికల సంఘం అధునాతన సాంకేతికతలు, కొత్త సాఫ్ట్‌వేర్‌లను వినియోగించడం హర్షణీయం. ప్రపంచ పౌరులకు భారతీయ ప్రజాస్వామ్యం ఎల్లప్పుడూ ఆదర్శనీయంగా ఉంటుందన్న దృఢ విశ్వాసం నాకు ఉంది. ఓటర్లు ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంచడమేకాదు సంకుచిత భావన, వివక్షలకు తావులేకుండా ఓట్లేయాలి. ఆకర్షణీయ పథకాల వలలో పడకుండా ఓటు ఆయుధాన్ని చక్కగా వినియోగించాలి. అప్పుడే ఓటర్లు ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయగలరు. ఎన్నికల్లోనే భారత సమ్మిళిత ప్రజాస్వామ్య భావన పరిఢవిల్లుతోంది. యావత్ భారతావని, సమాజం మరింతగా పురోగమిస్తోందనడానికి ఎన్నికల క్రతువులో ఏటా పెరుగుతున్న మహిళల భాగస్వామ్యమే ఒక గీటురాయి''అని రాష్ట్రపతి అన్నారు.

### వృద్ధులు సులువుగా ఓటేసే ఏర్పాట్లు

''వయోభారతంలో ఓటు హక్కును వినియోగించుకోవడంలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు ఇబ్బందులు పడొద్దని ఈసీ ప్రత్యేక శ్రద్ధతో వారికి ఇళ్లవద్దే ఓటింగ్ ఏర్పాట్లుచేసింది. దివ్యాంగులు, మారుమూల కొండప్రాంతాల గిరిజనుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తూ ఓటింగ్ శాతం తగ్గకుండా ఈసీ ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటోంది''అని రాష్ట్రపతి అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సైతం మాట్లాడారు. ఈసీలో పక్షపాతానికి తావులేకుండా, పారదర్శకంగా సీఈసీ, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం కేంద్రం కొత్త చట్టం తెచ్చిందని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో భాగంగా ఎన్నికల వేళ విధుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల అధికారులకు రాష్ట్రపతి ''బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్'అవార్డులను ప్రదానంచేశారు. భారత్ గణతంత్ర దేశంగా ఆవిర్భవించడానికి ఒక్కరోజు ముందు అంటే 1950 జనవరి 25వ తేదీన ఎన్నికల కమిషన్ ఏర్పడింది. అందుకు గుర్తుగా గత 15 ఏళ్లుగా నేషనల్ ఓటర్స్ డేను జరుపుకుంటున్న సంగతి తెల్సిందే.

## గణతంత్ర పరేడ్‌లో సైనిక శక్తి

### సాంస్కృతిక వారసత్వాన్ని చాటే ప్రదర్శనలు

**న్యూఢిల్లీ:** భారతదేశ సైనిక పాటవాన్ని, ఘనమైన సాంస్కృతి వారసత్వాన్ని ప్రపంచానికి చాటే తరుణం ఆసన్నమైంది. ఆదివారం జరిగే 76వ గణతంత్ర వేడుకలకు ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. రాజ్యాంగానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ శకటాలు ప్రత్యేక ఆకర్షణ కానున్నాయి. పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలకు సంబంధించి 16 శకటాలకు స్థానం కల్పించారు. తొలిసారిగ 'సశక్త్ ఔర్ సురక్షిత్ భారత్' పేరిట త్రివిధ దళాల ఉమ్మడి శకటం పరేడ్‌లో పాలుపంచుకోనుంది. తొలిసారిగా సైనిక నిఘా వ్యవస్థ 'సంజయ్'తోపాటు ప్రళయ్ క్షిపణి ప్రజలకు దర్శనమివ్వబోతోంది. బ్రహ్మోస్, పినాక, ఆకాశ్ వంటి క్షిపణులతోపాటు అర్జున్ యుద్ధ ట్యాంక్, తేజస్ ఫైటర్ జెట్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ వంటివి సైతం పాల్గొంటాయి. పలు రాష్ట్రాల కళాకారుల ప్రదర్శనలు అలరించనున్నాయి. అంతకుముందు ప్రధాని మోదీ జాతీయ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పిస్తారు.

సాక్షి ప్లస్

ఆదివారం । 26-1-2025

# ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త సుప్రీంకోర్టు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ



## వ్యక్తిగత స్వేచ్ఛలు, హక్కులు

### ప్రకరణ–28

**విద్యాలయాల్లో మత బోధన నిషేధం**

**ప్రకరణ 28(1):** ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడిచే ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక మత బోధన నిషేధం. **ప్రకరణ 28(2):** పై నిబంధనకు కొన్ని మినహాయింపులిచ్చారు. ప్రభుత్వం నిర్వహించే దేవాదాయ, ధర్మాదాయ సంస్థల్లో ప్రత్యేక మత బోధన చేయవచ్చు. **ప్రకరణ 28(3):** ప్రభుత్వ గుర్తింపు ఉన్న, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే విద్యాసంస్థల్లో ఒక వ్యక్తి ఐచ్ఛికంగా మత ప్రార్థనలు /బోధనల్లో పాల్గొనవచ్చు. అయితే పాల్గొనమని ఒత్తిడి చేయరాదు. ఆ వ్యక్తి మైనర్ అయితే తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి అనుమతి తీసుకోవాలి.

### ప్రకరణలు–29, 30

**విద్యా, సాంస్కృతిక పరమైన హక్కులు**

**ప్రకరణ 29(1):** భారతదేశంలో నివసిస్తున్న ప్రజలకు ప్రత్యేక భాష, లిపి, సంస్కృతి ఉంటే.. వాటిని పరిరక్షించుకుని, పెంపొందించుకునే స్వేచ్ఛ వారికి ఉంటుంది.

**ప్రకరణ 29(2):** ప్రభుత్వం నిర్వహిస్తోన్న లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందుతున్న సంస్థల్లో ప్రవేశానికి మతం, జాతి, కులం, భాషా ప్రాతిపదికన వివక్ష చూపరాదు.

**ప్రకరణ 30(1):** మైనారిటీ వర్గాలవారు, ప్రత్యేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకొని, నిర్వహించుకోవచ్చు.

**ప్రకరణ 30(1)(ఎ):** మైనారిటీలు నిర్వహిస్తున్న విద్యాసంస్థలు, వాటి ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే, వారికి ప్రత్యేక నష్టపరిహారం చెల్లించాలి. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ క్లాజును చేర్చారు.

**ప్రకరణ 30(2):** ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించే సమయంలో విద్యాసంస్థల పట్ల వివక్ష చూపరాదు. అల్ప సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలు, అధిక సంఖ్యాక వర్గాల వారు నడిపే సంస్థలను సమ దృష్టితో చూడాలి.

**వివరణ:**

- ఆర్టికల్ 29, 30లలో 'మైనారిటీ' పదాన్ని ప్రస్తావించారు. కానీ ఈ పదాన్ని రాజ్యాంగంలో ఎక్కడా నిర్వచించలేదు.
- మైనారిటీల వర్గీకరణకు రాష్ట్రాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. దేశంలో రెండు రకాల మైనారిటీ వర్గాలున్నాయి. అవి మతపరమైన, భాషాపరమైన మైనారిటీ వర్గాలు.
- హిందువులు మినహా మిగతా వారంతా మతపరమైన మైనారిటీలే. భాషాపరమైన మైనారిటీలు రాష్ట్రాల వారీగా మారుతుంటారు. ఉదాహరణకు.. తెలంగాణలో కన్నడిగులు, గుజరాతీలు, మరాఠీలు భాషాపరంగా మైనారిటీలు.

**సుప్రీంకోర్టు తీర్పులు**

**కేరళ విద్య పాఠ్యాంశాల సవరణ బిల్లు (1958) కేసు:** కేరళ ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవ, కమ్యూనిస్టు భావాలున్న పాఠ్యాంశాలను చేర్చారు. దీంతో ఈ బిల్లును సుప్రీంకోర్టు సలహా పరిధికి నివేదించారు. పాఠ్యాంశాల్లో తీవ్రవాద భావజాలాన్ని చేర్చడం చెల్లదని సుప్రీంకోర్టు తెలిపింది.

**డి.ఎ.వి. కాలేజ్ v/s స్టేట్ ఆఫ్ పంజాబ్ (1971) కేసు:** విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలల్లో పంజాబీ మాత్రమే బోధన భాషగా ఉండాలని నిర్ణయించారు. అయితే ఇది చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు తీర్పుచెప్పింది.

**ఆల్‌సెయింట్స్ v/s గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (1980) కేసు:** మైనారిటీ విద్యాసంస్థల నిర్వహణలో ప్రభుత్వం జోక్యం చేసుకోరాదని ఈ కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**టి.ఎం.ఎ.పాయ్ v/s స్టేట్ ఆఫ్ కర్ణాటక (2003) కేసు:** మైనారిటీ విద్యా సంస్థల విషయంలో ప్రభుత్వం ఏ సందర్భంలో జోక్యం చేసుకోవచ్చో, జోక్యం చేసుకోరాదో వివరణ ఇస్తూ కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. అవి..

- మైనారిటీ స్థాయిని నిర్ణయించడానికి రాష్ట్రాన్ని మాత్రమే యూనిట్‌గా తీసుకోవాలి.
- మైనారిటీ అనే పదంలో భాషాపరమైన, మతపరమైన మైనారిటీలు ఉండవచ్చు.
- బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలు, వారిపై పాలనా నియంత్రణ సంబంధిత హక్కులు మేనేజ్‌మేంట్‌కే ఉంటాయి. ప్రభుత్వ ధనసహాయం పొందని మైనారిటీ విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే అధికారం ప్రభుత్వానికి లేదు. అయితే క్యాపిటేషన్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించవచ్చు.

### ప్రకరణ – 31

**ఆస్తిహక్కు**

పార్లమెంటు ఆస్తి హక్కుకు సంబంధించి అనేక సవరణలు, చట్టాలు చేసింది. 1951లో మొదటి రాజ్యాంగ సవరణ, 1964లో 17వ రాజ్యాంగ సవరణ, 1971లో 24వ రాజ్యాంగ సవరణ చేశారు. 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కును ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగించారు. దాన్ని 12వ భాగంలో ప్రకరణ 300–ఎలో రాజ్యాంగ పరమైన హక్కుగా (Constitutional Rights) చేర్చారు. 1979 జూన్ 20 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అలాగే ఆస్తి హక్కుకు సంబంధించి నూతన నిబంధనలను కూడా చేర్చారు.

**ప్రకరణ 31(ఎ):** ప్రభుత్వం ఆస్తిని స్వాధీనం చేసుకున్నప్పుడు వర్తించే కొన్ని మినహాయింపులను ఈ ప్రకరణలో పేర్కొన్నారు. భూ సంస్కరణల అమలు కోసం చట్టాలు చేసినప్పుడు.. అవి 14, 19 ప్రకరణలకు వ్యతిరేకమనే కారణంతో న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు.

**ప్రకరణ 31(బి):** కొన్ని చట్టాల వర్తింపునకు మినహాయింపులు. వీటిని 9వ షెడ్యూల్డ్‌లో ప్రస్తావించారు. ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయన్న కారణంతో ఇలాంటి చట్టాలను న్యాయస్థానాల్లో ప్రశ్నించరాదు. 9వ షెడ్యూల్డ్‌లో పేర్కొన్న అంశాలు సాధారణంగా న్యాయ సమీక్షకు గురికావు. కానీ 'రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో న్యాయ సమీక్ష అంతర్భాగం. దాన్ని పరిమితం చేసే అధికారం పార్లమెంటుకు లేదు' అని కేశవానంద భారతి కేసు(1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

2007లో ఐ.ఆర్. కొహెల్హో v/s తమిళనాడు కేసులో 'న్యాయ సమీక్ష రాజ్యాంగ మౌలిక నిర్మాణంలోకి వస్తుంది. కాబట్టి 1973 తర్వాత 9వ షెడ్యూల్డ్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్షకు గురవుతాయి' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

**ప్రకరణ 31(సి):** ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రాథమిక హక్కులపై, ముఖ్యంగా ఆస్తి హక్కుపై కొన్ని పరిమితులు విధించవచ్చు. ఈ పరిమితులు రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీల్లేదు.

**మత స్వేచ్ఛ - సుప్రీంకోర్టు తీర్పులు**

**బిజో ఇమాన్యువల్ v/s స్టేట్ ఆఫ్ కేరళ (1986) కేసు:** జాతీయ గీతాన్ని ఆలపించడం తమ మత విశ్వాసాలకు విరుద్ధమని నిరూపించగలిగితే.. జాతీయ గీతం పాడాలని ఏ వ్యక్తిని ఒత్తిడి చేయరాదని సుప్రీంకోర్టు పేర్కొంది. కేరళ పాఠశాలల్లో జాతీయ గీతం ఆలపించడం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీన్ని ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో ఈ కేసు దాఖలైంది.

**సెయింట్ జేవియర్స్ కాలేజీ v/s స్టేట్ ఆఫ్ గుజరాత్ (1974) కేసు:** 'లౌకికతత్వం' పదానికి ఈ కేసులో సుప్రీంకోర్టు వివరణ ఇచ్చింది. మతానికి, దేవుడికి అతీతంగా వ్యవహరించడమే లౌకికతత్వం. దేవుడి పట్ల ప్రత్యేక ద్వేషం, వ్యతిరేకత చూపకూడదు. దేవుణ్ని నమ్మేవారిని, నమ్మని వారిని ప్రభుత్వం ఒకే విధంగా చూడాలి.

ఆదేశిక సూత్రాల్లోని ప్రకరణ 39లో ఉన్న క్లాజు బి, సిలో సామ్యవాద తరహా సమాజ స్థాపన గురించి పేర్కొన్నారు. ఈ విషయమై రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంటు కొన్ని పరిమితులు విధిస్తే, అవి ప్రాథమిక హక్కులకు వ్యతిరేకమని న్యాయస్థానంలో ప్రశ్నించలేం.

**వివరణ:** ప్రకరణ 31(ఎ),31(బి),31(సి)లు ఆస్తిహక్కుపై పరిమితికి సంబంధించినవి. ఇవి ఎలాంటి ప్రాథమిక హక్కులను ప్రసాదించవు. 44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు ప్రకరణ 31ను తొలగించారు. కానీ వీటిని మాత్రం కొనసాగించారు.

### ప్రకరణ – 32

**రాజ్యాంగ పరిహార హక్కు (Right to Constitutional Remedies)**

ప్రాథమిక హక్కుల్లో ఇది అత్యంత ముఖ్యమైంది. మూడో భాగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగినా/ఆ హక్కులను పరిమితం చేసినా/అమలు చేయకపోయినా, బాధితులు నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన రాజ్యాంగ పరిహారాలను పొందవచ్చు. మొదటి ఆరు ప్రాథమిక హక్కుల అమలు ఈ నిబంధన పైనే ఆధారపడి ఉంటుంది. హక్కులను గుర్తించడంతో పాటు, వాటి అమలుకు హామీ ఉన్నప్పుడే వాటికి విలువ ఉంటుంది. అమలు కాని హక్కులు వ్యర్థం.

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు నిబంధన 32 (4) హామీ ఇస్తోంది. అందుకే అంబేద్కర్ రాజ్యాంగ పరిహార హక్కును రాజ్యాంగ ఆత్మగా, హృదయంగా వర్ణించారు.

**ప్రకరణ 32(1):** ఒక వ్యక్తి ప్రాథమిక హక్కులకు భంగం కలిగినప్పుడు లేదా అవి అమలు కానప్పుడు ఆ వ్యక్తి నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించి తగిన పరిహారం పొందవచ్చు.

**ప్రకరణ 32(2):** హక్కులను కాపాడటానికి ప్రత్యేక ఆదేశాలైన హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో–వారెంటో, సెర్షియరీ లాంటి రిట్లను సుప్రీంకోర్టు జారీ చేసేందుకు ఈ భాగం వీలు కల్పిస్తుంది.

**ప్రకరణ 32(3):** సుప్రీంకోర్టు అధికారాలకు విఘాతం కలగకుండా, ఇతర న్యాయస్థానాల(స్థానిక కోర్టులు, జిల్లా కోర్టులు)కు కూడా రిట్లు జారీ చేసే అధికారాన్ని పార్లమెంటు చట్టం ద్వారా కల్పించవచ్చు.

**ప్రకరణ 32(4):** రాజ్యాంగంలో ఇతరత్రా అనుమతించిన విధంగా తప్ప ఈ ప్రకరణ ద్వారా గుర్తించిన హక్కులు రద్దు కావు.

**వివరణ:** రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో రాజ్యాంగ పరిహార హక్కు అంతర్భాగమని 1981లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**రిట్లు-పరిధి-పరిమితులు**

ప్రాథమిక హక్కుల పరిరక్షణకు జారీచేసే ప్రత్యేక ఆదేశాలను న్యాయశాస్త్ర పరిభాషలో రిట్లు (Writs) అంటారు. రిట్లు జారీ చేసే పద్ధతిని బ్రిటన్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. నిబంధన 32 ప్రకారం సుప్రీంకోర్టుకు, నిబంధన 226 ప్రకారం రాష్ట్ర హైకోర్టులకు రిట్లు జారీ చేసే అధికారాన్ని కల్పించారు. పార్లమెంటు ప్రత్యేక చట్టం ద్వారా ఈ అధికారాన్ని జిల్లా న్యాయస్థానాలకు కల్పించవచ్చు. ఇప్పటి దాకా పార్లమెంటు అలాంటి చట్టాలను రూపొందించలేదు. కాబట్టి సుప్రీంకోర్టు, హైకోర్టులకు మాత్రమే రిట్లు జారీ చేసే అధికారం ఉంది. రిట్ల జారీ విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు మధ్య వ్యత్యాసాలు ఉన్నాయి. హైకోర్టులు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దవుతుంది. ప్రకరణ 226 విషయ పరిధి తక్కువ. కానీ సుప్రీంకోర్టు జారీ చేసే రిట్ అత్యవసర పరిస్థితుల్లో రద్దు కాదు. ప్రకరణ 32 విషయ పరిధి విస్తృతమైంది.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీం కోర్టుకు ప్రత్యేకమైన, ప్రాథమిక విచారణ పరిధి ఉంటుంది (Primary and Original). అందుకే సుప్రీం కోర్టును ప్రాథమిక హక్కుల పరిరక్షణ కర్త అంటారు.

ప్రాథమిక హక్కుల పరిరక్షణలో సుప్రీంకోర్టు, హైకోర్టులకు ఉమ్మడి పరిధి ఉంటుంది. అంటే పౌరులు ప్రాథమిక హక్కుల పరిరక్షణకు ప్రకరణ 32 ప్రకారం నేరుగా సుప్రీంకోర్టును లేదా ప్రకరణ 226 ప్రకారం హైకోర్టును ఆశ్రయించవచ్చు.

సాధారణంగా హైకోర్టు ద్వారా తగిన రక్షణ, ఉపశమనం లభిస్తుందని పౌరులు భావిస్తే, మొదట హైకోర్టును ఆశ్రయించాలని కనుభాయ్ బ్రహ్మ భట్ v/s గుజరాత్ (1972) కేసులో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

**వివిధ రిట్లు-అర్థం-పరిధి-ప్రాముఖ్యత**

**హెబియస్ కార్పస్ (Hebeas Corpus)**

ఈ పదం లాటిన్ భాష నుంచి వచ్చింది. హెబియస్ అంటే 'Have', కార్పస్ అంటే 'Body' అని అర్థం. ఒక వ్యక్తిని భౌతికంగా కోర్టు ముందు హాజరుపర్చడమని దీనికి అర్థం. ఇది పురాతన రిట్. నిబంధన 19–22 వరకు పొందుపరచిన వ్యక్తిగత స్వేచ్ఛలకు భంగం కలిగినప్పుడు ఈ రిట్ జారీ చేస్తారు. అరెస్టయిన వ్యక్తిని 24 గంటల్లోగా సమీప న్యాయస్థానంలో హాజరుపరచాలి. లేని పక్షంలో ఈ రిట్ దాఖలు చేస్తే వెంటనే ఆ వ్యక్తిని న్యాయస్థానం ముందు హాజరుపరచాలని కోర్టు ఆదేశిస్తుంది.

వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణతోపాటు చట్టబద్ధత లేకుండా ఏ వ్యక్తిని నిర్బంధించకుండా, శిక్షించకుండా కాపాడటం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ఈ రిట్‌ను ప్రభుత్వ సంస్థలకు, ప్రైవేట్ వ్యక్తులకు కూడా జారీ చేయవచ్చు. మూడో వ్యక్తికి కూడా ఇందులో జోక్యం చేసుకునే హక్కు(లోకస్ స్టాండై)ఉంటుంది.బాధితుల తరఫున సామాజిక స్పృహ ఉన్న సంస్థ/వ్యక్తి ఈ రిట్ దాఖలు చేయవచ్చు. అందుకే దీన్ని ఉదారమైన రిట్ అని,వ్యక్తిగత స్వేచ్ఛల పరిరక్షణ సాధనమని అంటారు.

**మినహాయింపులు:**

పార్లమెంటు స్వాధికారాలకు భంగం కలిగించిన కారణంతో వ్యక్తిని నిర్బంధించినప్పుడు, కోర్టు ద్వారా నేరారోపణ నిరూపితమై జైలు శిక్ష అనుభవిస్తున్నప్పుడు ఇది వర్తించదు.

**మాండమస్ (Mandamus)**

భాషాపరంగా మాండమస్ అంటే ఆదేశం అని అర్థం.సుప్రీం కోర్టు లేదా హైకోర్టు జారీచేసే అత్యున్నత ఆదేశంగా దీన్ని చెప్పవచ్చు. ప్రభుత్వాధికారి/సంస్థ తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని న్యాయస్థానం ఇచ్చే ఆదేశం.

ప్రభుత్వాధికారులు, సంస్థలు తమ విధులను చట్టబద్ధంగా నిర్వర్తించనప్పుడు ప్రజల హక్కులకు భంగం వాటిల్లుతుంది.అలాంటి సందర్భాల్లో వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి ఈ రిట్ జారీ చేస్తారు. పబ్లిక్ సంస్థలు, క్వాజి పబ్లిక్ (Quasi-Public),జ్యుడీషియల్ సంస్థలు,క్వాజి జ్యుడీషియల్ సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీ చేయవచ్చు.

**మినహాయింపులు:**

రాష్ట్రపతి, గవర్నర్లకు ఈ రిట్ వర్తించదు. వీరు తమ అధికారాలు, విధులను నిర్వర్తించనప్పుడు వాటిని నిర్వర్తించమని ఏ కోర్టు ఆదేశించలేదు.

ప్రైవేట్ వ్యక్తులు, ప్రైవేటు సంస్థలకు వ్యతిరేకంగా ఈ రిట్ జారీచేయడానికి వీల్లేదు. మాండమస్ రిట్‌ను అంతిమ ప్రత్యామ్నాయంగా మాత్రమే జారీ చేస్తారు.అంటే పరిపాలనాపరమైన ప్రత్యామ్నాయాల ద్వారా పౌరులు న్యాయాన్ని పొందలేనప్పుడు ఈ రిట్ ద్వారా ఉపశమనం పొందవచ్చు. ఈ రిట్ జారీ అనేది కోర్టు విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అధికారులు తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధులకే ఇది వర్తిస్తుంది. విచక్షణా(Discretion) పూర్వకమైన విధులకు వర్తించదు.

# కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమం?




## వాయు కాలుష్యం

మానవ మనుగడకు గాలి, నీరు, నేల అత్యంత ప్రధానమైనవి. శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో మనకు అనేక సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కానీ మానవ కార్యకలాపాల వల్ల గాలి, నీరు, నేల వాటి సహజత్వాన్ని కోల్పోతున్నాయి. ఈ సహజ వనరులపై మనకెంత అధికారం ఉందో, వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత కూడా అంతే ఉంది.

**గాలి - వాతావరణం**

భూఉపరితలం నుంచి సుమారు 1000 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాయు మండలాన్ని వాతావరణం అంటారు. గాలి వివిధ వాయువుల మిశ్రమం. ఇందులో ప్రధాన అనుఘటకం నైట్రోజన్. తర్వాతి స్థానంలో ఆక్సిజన్, కార్బన్ డై ఆక్సైడ్, నీటిఆవిరి ఉన్నాయి. వీటితోపాటు ఆర్గాన్, హీలియం, నియాన్ అనే జడవాయువులు ఉన్నాయి.

**గాలి సంఘటనం**

| గాలిలోని వాయువు | సంఘటనం |
|---|---|
| నైట్రోజన్ | 78% |
| ఆక్సిజన్ | 21% |
| ఆర్గాన్ | 0.9% |
| నీటిఆవిరి | 0.04% |
| కార్బన్ డై ఆక్సైడ్ | 0.03% |

గాలిలోని ఈ వాయువులు వాటి సహజ ధర్మాన్ని కోల్పోకుండా ఉంటాయి. అయితే ఈ సంఘటనం అన్ని వేళలా, అన్ని ప్రదేశాల్లో స్థిరంగా ఉండకపోవచ్చు. పారిశ్రామిక వాడల్లో శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం తదితర పదార్థాలను ఎక్కువగా మండిస్తారు. అందువల్ల కార్బన్ డై ఆక్సైడ్ పరిమాణం పెరుగుతుంది. శ్వాసక్రియలో భాగంగా మానవులు, ఇతర జంతుజాలం ఆక్సిజన్‌ను గ్రహించి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి. వెంటిలేషన్ సరిగా లేని తరగతి గదిలో శ్వాసించేందుకు సరిపడా ఆక్సిజన్ లభించదు. దీంతో ఆవలింతలు వస్తాయి. మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా పిండి పదార్థాలను తయారు చేసుకుంటాయి. ఈ ప్రక్రియలో భాగంగా వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్‌ను వినియోగించుకుని ఆక్సిజన్‌ను విడుదల చేస్తాయి. అందుకే వృక్ష సంపద అధికంగా ఉన్న ప్రాంతాల్లోని గాలిలో కార్బన్‌డై ఆక్సైడ్ సమతుల్యంగా ఉంటుంది. 'లెగ్యుమినేసి' మొక్కలు ఉన్న ప్రాంతాల్లోని గాలిలో నైట్రోజన్ పరిమాణం సాధారణం కంటే తక్కువగా ఉంటుంది. ఈ మొక్కల వేర్ల బుడిపెల్లో బ్యాక్టీరియా ఉంటుంది. ఇది గాలిలోని నైట్రోజన్‌ను గ్రహించి మొక్కలకు ఉపయోగకరమైన నైట్రేట్ ఎరువుల రూపంలోకి మారుస్తుంది.

జంతు, వృక్ష సంబంధ పదార్థాలు బ్యాక్టీరియా వల్ల కుళ్లిపోయి, వాటి ప్రొటీన్ సంబంధిత సంయోగ పదార్థాలు వియోగం చెంది నైట్రోజన్ విడుదలవుతుంది. ఇలా విడుదలైన నైట్రోజన్ గాలిలోకి చేరుతుంది.

గాలిలోని నీటిఆవిరి కూడా అన్ని ప్రదేశాల్లో ఒకేలా ఉండదు. ఉష్ణోగ్రత పెరిగినప్పుడు, సముద్ర తీర ప్రాంతాల్లో గాలిలో నీటిఆవిరి ఎక్కువగా ఉంటుంది. పీఠభూమి ప్రాంతాల్లో తేమ(నీటిఆవిరి) తక్కువగా ఉంటుంది. శీతాకాలంలో ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిఆవిరి అధికంగా ఉండటం వల్ల నీటిమంచు, పొగమంచు ఏర్పడతాయి.

మనం పీల్చే గాలి సహజ సంఘటనంలో ఉండటం లేదు. వాహనాలు, పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు విష వాయువులను వెలువరిస్తున్నాయి. బొగ్గును మండించటం, వంటచెరకు కాల్చడం తదితర చర్యల వల్ల కూడా అనేక విష వాయువులు గాలిలో చేరుతున్నాయి. ఇలా వాతావరణంలో చేరే వాటిలో కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్ నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్ ఫ్రియాన్, ఓజోన్, మీథేన్ లాంటి వాయువులు; ఫ్లైయాష్, మెర్క్యురీ, జింక్, క్రోమియం, కాడ్మియం తదితర లోహాలు ముఖ్యమైనవి.

**వాతావరణ కాలుష్యం - పదాల వివరణ**

**కాలుష్యం:** మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల వల్ల విడుదలై, పరిసరాల మీద దుష్ప్రభావం చూపే పదార్థాన్ని కాలుష్యం అంటారు.

**ఉదాహరణ:** సల్ఫర్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్ లాంటి వాయువులు. లెడ్, మెర్క్యురీ తదితర లోహాలు. పుప్పొడి రేణువులు, దుమ్ము, ధూళి, రేడియోధార్మిక పదార్థాలు, పురుగు మందులు మొదలైనవి.

**మలినం:** ప్రకృతిలో సహజంగా లభించని, మానవ లేదా ప్రకృతి కార్యకలాపాల ద్వారా పరిసరాల్లోకి విడుదలైన పదార్థాన్నే మలినం అంటారు.

**ఉదాహరణ:** భోపాల్ దుర్ఘటనకు కారణమైన మిథైల్ ఐసోసయనేట్. ఢిల్లీ దుర్ఘటనకు కారణమైన పైరో సల్ఫ్యూరిక్ ఆమ్లం. హరిత గృహ ప్రభావానికి, ఓజోన్ పొర క్షీణతకు కారణమైన క్లోరో ఫ్లోరో కార్బన్లు (ఫ్రియాన్‌లు). ఈ వాయువులు ప్రకృతిలో సహజసిద్ధంగా లభించవు. మానవ కార్యకలాపాల ద్వారా గాలిలో చేరాయి.

**గ్రాహకం:** కాలుష్య ప్రభావానికి గురయ్యే మాధ్యమాన్ని గ్రాహకం అంటారు. **ఉదా:** ఆటో మొబైల్ గ్యారేజీలో, రోడ్లపై వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా మన కళ్లు ఎర్రబారి మండుతాయి. ఈ సందర్భంలో కళ్లను గ్రాహకాలు అనవచ్చు.

**సింక్:** కాలుష్యాలతో చర్య జరిపే మాధ్యమాన్ని సింక్ అంటారు. ఉదాహరణకు అడవులు, సముద్రాలు కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుని సింక్‌లుగా పనిచేస్తాయి.

**వాతావరణ విభాగాలు**

భూమిపై సుమారు 500 కి.మీ. వరకు వ్యాప్తి చెంది ఉన్న వాతావరణాన్ని నాలుగు భాగాలుగా విభజించవచ్చు. భూమి ఉపరితలం నుంచి పైకి పోయే కొద్దీ గాలి సాంద్రత, పీడనం, ఉష్ణోగ్రత తగ్గుతాయి. అందుకే ఎత్తయిన కొండ ప్రాంతాల్లో త్వరగా వంట చేయలేం. పర్వతారోహకులకు ఆక్సిజన్ సరిగా అందదు.

ట్రోపో ఆవరణం (0–11 కి.మీ), స్ట్రాటో ఆవరణం (11–50 కి.మీ.), మీసో ఆవరణం (50–85 కి.మీ.), థర్మో ఆవరణం (85–500 కి.మీ.) అనేవి వాతావరణంలోని పొరలు.

స్ట్రాటోస్ఫియర్‌లో ఓజోన్ పొర ఉంటుంది. ఇది సూర్యరశ్మిలోని చర్మ క్యాన్సర్‌ను కలిగించే అతినీలలోహిత కిరణాలను భూమికి చేరకుండా అడ్డుకుంటుంది. కానీ ఫ్రియాన్లు ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతున్నాయి. స్ట్రాటో స్ఫియర్‌లోనే విమానాలు ప్రయాణిస్తాయి. అంతరిక్షం నుంచి భూమివైపు వేగంగా దూసుకొచ్చే ఉల్కలు మీసో ఆవరణంలో మండిపోతాయి. భూమి నుంచి ఉద్గారమైన రేడియో తరంగాలు థర్మోస్ఫియర్ ద్వారా తిరిగి భూమికి పరావర్తనం చెందుతాయి.

**ప్రధాన వాయు కాలుష్యాలు**

**కార్బన్ మోనాక్సైడ్ (CO):** ఇది విషపూరితమైంది. పెట్రోల్ లాంటి శిలాజ ఇంధనాలు తక్కువ గాలి(ఆక్సిజన్) సమక్షంలో అసంపూర్తిగా మండటం వల్ల ఇది వాతావరణంలోకి విడుదలవుతుంది. వాహనాలు, ఐరన్, స్టీల్ పరిశ్రమలు, ఘన వ్యర్థాల నుంచి కూడా ఇది విడుదలవుతుంది. కార్బన్ మోనాక్సైడ్‌ను పీల్చడం ప్రమాదకరం. ఇది హిమోగ్లోబిన్‌తో కార్బాక్సీ హిమోగ్లోబిన్‌ను ఏర్పర్చి రక్తంలో ఆక్సిజన్ సరఫరా కాకుండా చేస్తుంది. హిమోగ్లోబిన్‌తో ఆక్సిజన్ ఏర్పరిచే బంధం కంటే CO బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. వాతావరణంలో ఆమోదింపదగిన CO స్థాయి 7 పీపీఎం. దీని పరిమాణం ఎక్కువైతే దృష్టి కోల్పోవడం (10 పీపీఎం), తలనొప్పి (100 పీపీఎం), స్పృహ కోల్పోవడం (250 పీపీఎం), కోమాలోకి వెళ్లడం (750 పీపీఎం), తక్షణ మరణం (1000 పీపీఎం) లాంటి దుష్ప్రభావాలు తలెత్తుతాయి. కార్బన్ మోనాక్సైడ్‌కు నేల ప్రధానమైన సింక్. నేలలోని కొన్ని రకాల సూక్ష్మజీవులు వాతావరణంలోని COను తొలగిస్తాయి.

**కార్బన్ డై ఆక్సైడ్ ($CO_2$):** ఇది విషపూరితం కాని కాలుష్యకారకం. శ్వాసక్రియ, శిలాజ ఇంధనాల దహనం, సిమెంట్ పరిశ్రమలు (సున్నపురాయిని కాల్చడం ద్వారా), మొక్కలు కుళ్లిపోవడం, అగ్నిపర్వతాల విస్ఫోటనం తదితర కారణాల వల్ల $CO_2$ వాతావరణంలో కలుస్తుంది. అడవులను ప్రధాన కార్బన్ డై ఆక్సైడ్ సింక్‌లుగా పేర్కొనవచ్చు. సముద్రాలు కూడా కార్బన్ డై ఆక్సైడ్‌ను కరిగించుకొని కార్బొనేట్లు, బైకార్బొనేట్లను ఏర్పరుస్తూ మరో ప్రధాన సింక్‌లుగా పనిచేస్తాయి. సూర్యరశ్మి సమక్షంలో క్లోరోఫిల్ ఉన్న మొక్కలు కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి పిండిపదార్థాలను తయారుచేసుకుంటాయి. ఇవి $CO_2$ స్థాయిని తగ్గిస్తాయి. హరిత గృహ ప్రభావం (భూగోళ తాపం) కలిగించే వాయువుల్లో కార్బన్ డై ఆక్సైడ్ ప్రధానమైంది.

**ఇతరవాయువులు:** నీటి ఆవిరి, ఫ్రియాన్లు, ఓజోన్, మీథేన్, నైట్రస్ ఆక్సైడ్.

**సల్ఫర్ డై ఆక్సైడ్:** ఇది ఘాటైన వాసన ఉన్న, రంగు లేని వాయువు. నేలబొగ్గును మండించటం (ఉదా: థర్మల్ పవర్ ప్లాంట్లు), పెట్రోలియం రిఫైనరీలు, అగ్నిపర్వతాలు, పైరైటిస్ ఖనిజాల (ఐరన్, కాపర్, జింక్ సల్ఫైడ్‌లు) భర్జనం, కుళ్లిన పదార్థాల నుంచి విడుదలైన హైడ్రోజన్ సల్ఫైడ్ ఆక్సీకరణం తదితర కారణాల వల్ల ఇది వాతావరణంలోకి చేరుతుంది. ఇది నైట్రోజన్ ఆక్సైడ్‌తో కలిసి ఆమ్ల వర్షానికి కారణమవుతుంది. ఆమ్ల వర్షాల వల్ల నేల pH తగ్గుతుంది. ఫలితంగా నేల నిస్సారమవుతుంది. పాలరాయి లేదా చలువరాయి/సున్నపురాయితో నిర్మించిన కట్టడాలకు సల్ఫర్ డై ఆక్సైడ్ వల్ల నష్టం వాటిల్లుతుంది.

పాలరాతి కట్టడమైన తాజ్‌మహల్ పసుపు రంగులోకి మారడానికి మధురలోని చమురు శుద్ధి కర్మాగారం విడుదల చేసే సల్ఫర్ డై ఆక్సైడే కారణం. ఈ వాయువు ఊపిరితిత్తుల వ్యాధిని కలిగిస్తుంది. మొక్కల పెరుగుదలను క్షీణింపజేస్తుంది.

**నైట్రోజన్ ఆక్సైడ్‌లు:** నైట్రస్ ఆక్సైడ్, నైట్రిక్ ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్‌లు కాలుష్యాన్ని కలిగించే ప్రధాన నైట్రోజన్ ఆక్సైడ్‌లు. ఇవి గ్రీన్‌హౌస్ వాయువులు. నైట్రోజన్ ఆక్సైడ్ స్ట్రాటోస్ఫియర్‌లో కాంతి రసాయన చర్యల్లో పాల్గొని ఓజోన్ పొర క్షీణతకు కారణమవుతుంది. ఇది నేలలోని సూక్ష్మజీవుల వల్ల కూడా ఉత్పత్తి అవుతుంది. సాధారణంగా గాలిలోని నైట్రోజన్, ఆక్సిజన్ ఒకదానితో మరొకటి చర్య జరపవు. కానీ మెరుపులు ఏర్పడినప్పుడు అధిక ఉష్ణోగ్రతల (1483 K కంటే అధికం) వద్ద ఈ రెండు వాయువులు చర్య జరపుతాయి. ఫలితంగా నైట్రోజన్ ఆక్సైడ్‌లు వాతావరణంలోకి విడుదలవుతాయి. నైట్రోజన్ డై ఆక్సైడ్ సూర్యరశ్మి సమక్షంలో విఘటనం చెంది చర్యాశీలత ఉన్న ఆక్సిజన్ పరమాణువును ఏర్పరుస్తుంది. ఇది బాష్పశీల హైడ్రోకార్బన్లు, పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్ లాంటి సమ్మేళనాలతో కలిసి 'కాంతి రసాయన స్మాగ్'కు కారణమవుతుంది.

**మాదిరి ప్రశ్నలు**

1. వాతావరణంలోకి కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేసే ప్రక్రియలేవి?
   ఎ. అగ్ని పర్వతాల విస్ఫోటనం
   బి. జంతు శ్వాసక్రియ
   సి. కిరణజన్య సంయోగక్రియ
   డి. మొక్కలు కుళ్లిపోవడం
   1) ఎ,బి మాత్రమే
   2) ఎ, సి, డి మాత్రమే
   3) ఎ, బి, డి మాత్రమే 4) పైవన్నీ
2. స్టీల్ పరిశ్రమ వాతావరణంలోకి విడుదల చేసే కాలుష్య కారక వాయువులేవి?
   1) సల్ఫర్ డై ఆక్సైడ్
   2) కార్బన్ డై ఆక్సైడ్
   3) కార్బన్ మోనాక్సైడ్ 4) పైవన్నీ
3. మెరుపులు ఏర్పడినప్పుడు విడుదలయ్యే వాయువు ఏది?
   1) నైట్రస్ ఆక్సైడ్ 2) కార్బన్ డై ఆక్సైడ్
   3) సల్ఫర్ డై ఆక్సైడ్
   4) నైట్రోజన్ డై ఆక్సైడ్
4. కాంతి రసాయన పొగమంచుకు కారణమైన పదార్థాలేవి?
   1) నైట్రస్ ఆక్సైడ్ 2) పొగ
   3) పెరాక్సీ ఎసిటైల్ నైట్రేట్
   4) పైవన్నీ
5. వాతావరణంలో అనుమతించదగ్గ కార్బన్ మోనాక్సైడ్ స్థాయి?
   1) 10 పీపీఎం 2) 7 పీపీఎం
   3) 50 పీపీఎం 4) 100 పీపీఎం
6. కింద ఇచ్చిన వాటిలో గాలిని కలుషితం చేయనిది?
   1) ఫ్లై యాష్ 2) ఫ్రియాన్
   3) హైడ్రోజన్ సల్ఫైడ్ 4) ఫ్లోరైడ్
7. అంటార్కిటికాలో ఓజోన్ క్షీణతకు కారణమైన పదార్థం?
   1) ఎక్రోలిన్ 2) PAN
   3) CO, $CO_2$ 4) క్లోరిన్ నైట్రేట్
8. కార్బన్ మోనాక్సైడ్ (CO) విడుదలకు ప్రధాన కారణం?
   1) పరిశ్రమలు 2) వాహనాలు
   3) అడవులు 4) అగ్నిపర్వతాలు
9. రేడియో తరంగాలను పరావర్తనం చేసే వాతావరణ పొర?
   1) స్ట్రాటో ఆవరణం
   2) మీసో ఆవరణం
   3) ట్రోపో ఆవరణం
   4) థర్మో ఆవరణం
10. వాతావరణం పై పొరల్లో ఓజోన్ పొర క్షీణతకు కారణమైన వాయువులేవి?
    1) ఫుల్లరీన్లు 2) ఫ్రియాన్లు
    3) పాలిహాలోజన్లు
    4) ఫెర్రోసీన్

**సమాధానాలు**

1) 3; 2) 4; 3) 1; 4) 4; 5) 2; 6) 4; 7) 4; 8) 2; 9) 4; 10) 2.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com



# భారత జాతీయాదాయాన్ని గణించే సంస్థ?

**తెలంగాణ 2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించింది. భౌగోళికంగా ఇది పూర్తిగా దక్కన్ పీఠభూమి మధ్యభాగంలో విస్తరించి ఉంది. రాష్ట్ర విస్తీర్ణం 1,14,840 చదరపు కిలోమీటర్లు. విస్తీర్ణ పరంగా, జనాభా పరంగా ఇది దేశంలో 12వ పెద్ద రాష్ట్రం. 2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా 3,51,93,978 మంది. రాష్ట్రం స్థూల ఆర్థికాభివృద్ధిలో గణనీయ ఫలితాలు సాధిస్తూ ముందడుగేస్తోంది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాదులున్నాయి. ఈ ప్రాంత భౌగోళిక, వాతావరణ స్థితిగతులు, సహజ వనరుల లభ్యత, సామాజిక నిర్మితి తదితరాలు ఆర్థికాభివృద్ధికి సోపానాలుగా ఉన్నాయి.**

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఎకానమీ

### తెలంగాణ రాష్ట్ర స్థూల ఉత్పత్తి - మదింపు ప్రక్రియలు

ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా మూడు రంగాలుగా వర్గీకరించారు.

అవి:

1. ప్రాథమిక రంగం (Primary Sector),
2. ద్వితీయ రంగం (Secondary Sector),
3. తృతీయ రంగం (Tertiary Sector).

వీటిని వివిధ ప్రధాన వృత్తుల ఆధారంగా విభజించారు. ఒక దేశంలోని జనాభా వివిధ వృత్తుల్లో పనిచేసే తీరును ఈ వృత్తుల వారీ విభజన తెలుపుతుంది. జాతీయ/ రాష్ట్ర ఆదాయానికి ఏయే రంగాల ద్వారా ఎంత ఆదాయం సమకూరుతుందో తెలుసుకోవడానికి, వాటి అభివృద్ధి, పెరుగుదల శాతాల్లో ఏ విధమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయో అర్థం చేసుకొని తగిన సంస్కరణలు ప్రవేశపెట్టడానికి ఈ విభజన తోడ్పడుతుంది. వివిధ ఆర్థిక రంగ అభివృద్ధి ప్రక్రియలు దేశ పురోభివృద్ధి గమనాన్ని, సామాజిక, ఆర్థిక వ్యవస్థలను అధికంగా ప్రభావితం చేస్తాయి.

**ప్రాథమిక రంగంలోని ఉప రంగాలు:** వ్యవసాయం,పశుసంపద-పాడి పరిశ్రమ,అడవులు-అటవీ ఉత్పత్తులు,మత్స్య పరిశ్రమ,గనులు,తవ్వకాలు.

**ద్వితీయ రంగంలోని ఉప రంగాలు:** వస్తూత్పత్తి తయారీ పరిశ్రమలు, నిర్మాణ రంగం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా.

**తృతీయ రంగంలోని ఉప రంగాలు:** వ్యాపారం, హోటళ్లు, రెస్టారెంట్లు, రవాణా, నిల్వలు, సమాచార వ్యవస్థ, రైల్వేలు, రక్షణ, తపాలా సేవలు, ఫైనాన్సింగ్, బీమా, రియల్ ఎస్టేట్, బ్యాంకింగ్, సామాజిక వ్యక్తిగత సేవలు, ప్రజాపరిపాలన, ఇతర సేవలు.

సాధారణంగా వ్యవసాయ రంగాన్ని ప్రాథమిక రంగంగా, పారిశ్రామిక రంగాన్ని ద్వితీయ రంగంగా, సేవా రంగాన్ని తృతీయ రంగంగా పేర్కొంటారు. అయితే 'గనులు, తవ్వకాలు' అనే ఉప రంగం లేని ప్రాథమిక రంగంలోని అంశాలను వ్యవసాయ రంగంగా భావిస్తారు. 'గనులు, తవ్వకాలు' ఉప రంగంతో కూడిన ద్వితీయ రంగంలోని అంశాలను పారిశ్రామిక రంగంగా గుర్తిస్తారు. తృతీయ రంగంలోని అంశాలన్నీ సేవల రంగం కిందకి వస్తాయి. ఈ ముఖ్య ఆర్థిక రంగాల్లో వివిధ ఉప రంగాల వారీగా ఆదాయం, వృద్ధి, మొత్తం ఆదాయంలో వాటి వాటాను మదింపు చేసి జాతీయాదాయం లేదా రాష్ట్ర ప్రాంతీయాదాయాన్ని తెలుసుకుంటారు. 'కేంద్ర గణాంక సంస్థ' (Central Statistical Organisation - CSO) జాతీయాదాయాన్ని అంచనా వేస్తుంది. రాష్ట్ర ఆర్థిక గణాంక సంచాలకులు రాష్ట్ర ఆదాయాన్ని అంచనా వేస్తారు. ఇందులో భాగంగా వీరు వివిధ లెక్కింపు పద్ధతుల ద్వారా గణాంకాలను రూపొందిస్తారు.

### ఆదాయ మదింపు పద్ధతులు

సాధారణంగా జాతీయ లేదా రాష్ట్ర ఆదాయాన్ని 3 రకాల పద్ధతుల్లో లెక్కిస్తారు. అవి:

1. ఉత్పత్తి లేదా నికర ఉత్పత్తి పద్ధతి
2. ఆదాయ పద్ధతి (నికర ఆదాయ పద్ధతి)
3. వ్యయ పద్ధతి

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో ఈ మూడు పద్ధతులనే అనుసరిస్తున్నారు. మన దేశంలో (అన్ని రాష్ట్రాల్లోనూ) ఉత్పత్తి, ఆదాయ మదింపు పద్ధతుల ఆధారంగా జాతీయదాయాన్ని గణిస్తున్నారు.

### ఉత్పత్తి మదింపు పద్ధతి

దీన్ని విలువ జోడించిన పద్ధతి (Value Added Method), Industrial Origin Method, Inventory Method అని కూడా అంటారు. ప్రముఖ ఆర్థికవేత్త సైమన్ కుజినెట్స్ ఈ పద్ధతిని 'ఉత్పత్తి సేవా పద్ధతి'గా పేర్కొన్నాడు. ఆర్థిక వ్యవస్థలో ఏడాది కాలంలో జరిగే అంతిమ వస్తు సేవల ఉత్పత్తిని కలిపితే 'నికర ఉత్పత్తి' వస్తుంది. ఈ విలువను జాతీయాదాయం లేదా రాష్ట్ర ప్రాంతీయాదాయంగా భావిస్తారు. ఆర్థిక వ్యవస్థలో ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల్లో జరిగిన ఉత్పత్తిని కలిపితే మొత్తం ఉత్పత్తి వస్తుంది. అయితే ఒక రంగంలో జరిగిన ఉత్పత్తిని మరో రంగంలో ఉత్పత్తి కారకాలు (మాధ్యమిక వస్తువులు)గా ఉపయోగించవచ్చు. కాబట్టి వాటి విలువను లెక్కలోకి తీసుకోకూడదు. అంటే ఒకే వస్తువును రెండుసార్లు లెక్కించకూడదు. ఈ పద్ధతిలో.. జాతీయాదాయం = కారకాల దృష్ట్యా నికర దేశీయోత్పత్తి + నికర విదేశీ కారకాల ఆదాయాలు.

### ఆదాయ మదింపు పద్ధతి

దీన్ని కారక చెల్లింపు పద్ధతి (Factor Payment Method), వాటాల పంపిణీ పద్ధతి (Distributed Share Method), ఆదాయ చెల్లింపు పద్ధతి (Income Paid Method), ఆదాయ గ్రాహక పద్ధతి (Income Received Method) అని పిలుస్తారు. ఈ పద్ధతిలో జాతీయ/ రాష్ట్ర ఆదాయాన్ని పంపిణీ కోణం నుంచి లెక్కిస్తారు. వివిధ ఉత్పత్తి కారకాలు.. అంటే శ్రమపై వచ్చే వేతనాలు, భూమిపై వచ్చే అద్దె, మూలధనంపై వచ్చే వడ్డీ, పరిశ్రమ వ్యవస్థాపకుడికి వచ్చే లాభాలు, వీటన్నింటి ప్రతిఫలాల మొత్తం విలువతో పాటు నికర విదేశీ ఆదాయాలను కలిపితే వచ్చేదే జాతీయాదాయం. ఈ పద్ధతిలో వివిధ ఉత్పత్తి కారకాల మధ్య జాతీయాదాయం ఏ విధంగా పంపిణీ అయిందో తెలుసుకోవచ్చు. దీంతో పాటు వివిధ వర్గాల ప్రజలకు ఎంతెంత ఆదాయం వస్తుందో అంచనా వేయవచ్చు. ఆదాయ మదింపు పద్ధతిలో.. జాతీయాదాయం = వేతనం + భాటకం + వడ్డీ + లాభాలు + నికర విదేశీ ఆదాయాలు.

### వ్యయాల మదింపు పద్ధతి

ఇది ఆధునిక పద్ధతి. దీన్ని ఎక్కువగా అభివృద్ధి చెందిన దేశాల్లో అనుసరిస్తున్నారు. భారతదేశంలో ఇది అంతగా వినియోగంలో లేదు. ఈ పద్ధతిలో వ్యక్తులు, సంస్థలు, ప్రభుత్వం ఒక ఏడాది కాలంలో అంతిమ వస్తు సేవలపై చేసే మొత్తం వ్యయాన్ని లెక్కించడం ద్వారా జాతీయాదాయాన్ని గణిస్తారు. జాతీయాదాయ లెక్కింపు పద్ధతులన్నింటిలో ఇది చాలా కచ్చితమైంది. దీన్ని వినియోగ - పెట్టుబడి పద్ధతి అని కూడా అంటారు. ఈ వ్యయ మదింపు పద్ధతిని ప్రఖ్యాత ఆర్థికవేత్త జే.ఎం. కీన్స్ రూపొందించారు. ఈ పద్ధతిలో జాతీయాదాయం = గృహ సంబంధ వ్యయాలు + సంస్థల వ్యయాలు + ప్రభుత్వ వ్యయాలు.

### ఆదాయ లెక్కింపు - ప్రామాణిక ధరలు

జాతీయ, రాష్ట్ర ప్రాంతీయ ఆదాయాన్ని గణించేటప్పుడు సాధారణంగా రెండు రకాల ధరలను ప్రామాణికంగా తీసుకుంటారు.

### ప్రస్తుత ధరల్లో జాతీయాదాయం

ప్రస్తుత సంవత్సరం ఆచరణలో ఉన్న వస్తు సేవల ధరల్లో ఆదాయాన్ని లెక్కిస్తే దాన్ని 'ప్రస్తుత ధరల్లో ఆదాయం' లేదా 'నామమాత్రపు ఆదాయం' అంటారు.




ప్రస్తుత ధరల్లో ఆదాయాన్ని లెక్కించినప్పుడు.. గతేడాది, ప్రస్తుత సంవత్సరం జాతీయాదాయాలను సరిపోలిస్తే ఉత్పత్తి పెరగనప్పటికీ ధరలు అధికమవడం వల్ల జాతీయదాయం పెరిగినట్లు ఫలితాలు రావచ్చు. ఎందుకంటే వస్తు సేవల ధరలు అనేక కారణాల వల్ల రోజురోజుకూ పెరుగుతుంటాయి. ధరలు పెరగడం వల్ల ఆదాయం అధికమైనట్లు గోచరిస్తుంది. ఈ కారణంగా వాస్తవ వస్తు సేవల ఉత్పత్తులను అంచనా వేయలేం. అందువల్ల ఈ పద్ధతిలో వాస్తవ జాతీయాదాయాన్ని లెక్కించడం వీలు కాదు.

### స్థిర (ప్రామాణిక) ధరల్లో జాతీయాదాయం

ఏ విధమైన సామాజిక, రాజకీయ, ఆర్థిక, ప్రకృతి పరమైన ఒడుదొడుకులు లేకుండా ఉత్పత్తి మంచిగా జరిగిన ఒకానొక సంవత్సరాన్ని ఆధార సంవత్సరం (బేస్ ఇయర్)గా తీసుకొని ఆ ధరల ఆధారంగా జాతీయాదాయాన్ని లెక్కిస్తే దాన్ని 'స్థిర ధరల్లో ఆదాయం' లేదా 'వాస్తవ ఆదాయం' అంటారు.

స్థిర ధరల్లో జాతీయాదాయాన్ని లెక్కించడానికి కేంద్ర గణాంక సంస్థ (సీఎస్ఓ) ఎప్పటికప్పుడూ ఆధార సంవత్సరాన్ని నిర్ధారిస్తుంది. మన దేశంలో ఇప్పటివరకూ 1948-49, 1960-61, 1970-71,1980-81,1993-94,1999-2000, 2004-05లను ఆధార సంవత్సరాలుగా తీసుకున్నారు.

- ప్రస్తుత ధరల్లో ఆదాయాన్ని గణించినప్పటికీ దాన్ని 'ధరల సూచీ' (Price Deflator) ఆధారంగా స్థిర ధరల్లోకి మార్చవచ్చు.

స్థిర ధరల్లో ఆదాయం =

$$\frac{\text{ప్రస్తుత ధరల్లో ఆదాయం}}{\text{ధరల సూచీ}} \times 100$$

### స్థూల రాష్ట్రోత్పత్తి (జీఎస్‌డీపీ)

ఒక రాష్ట్ర భౌగోళిక హద్దుల మధ్య, నిర్దీత కాల వ్యవధిలో (సాధారణంగా ఒక సంవత్సరం) ఉత్పత్తి చేసిన వస్తువుల, సేవల మొత్తం విలువను స్థూల రాష్ట్రోత్పత్తి (Gross State Domestic Product - GSDP) అంటారు. జీఎస్‌డీపీ నుంచి 'తరుగుదల'ను తీసేస్తే 'నికర రాష్ట్రోత్పత్తి (Net State Domestic Product - NSDP) వస్తుంది. సాధారణంగా జీఎస్‌డీపీనే రాష్ట్ర ఆదాయంగా పరిగణిస్తారు. కానీ, ఆర్థిక పరిభాషలో రాష్ట్ర ఆదాయం అంటే ఎన్ఎస్‌డీపీ. వీటిని గణించేటప్పుడు ఒక రాష్ట్రంలోని వారు ఇతర రాష్ట్రాల్లో సంపాదించిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోరు.

- రాష్ట్ర తలసరి ఆదాయం = ఎన్ఎస్‌డీపీ రాష్ట్ర జనాభా

### స్థూల జిల్లా ఉత్పత్తి (జీడీడీపీ)

ఒక జిల్లాలో ఏడాది కాలంలో ఉత్పత్తి చేసిన అంతిమ వస్తు సేవల మొత్తం విలువను 'స్థూల జిల్లా ఉత్పత్తి' (Gross District Domestic Product - GDDP) అంటారు.

### రాష్ట్ర స్థూల ఉత్పత్తి - దృగ్విషయాలు

జీఎస్‌డీపీ లెక్కింపునకు అనువుగా ఉండటానికి రాష్ట్రంలో మూడు రంగాలను తొమ్మిది విభాగాలుగా విభజించారు. ఈ పద్దులను కింది విధంగా వర్గీకరించారు.

I. వ్యవసాయ రంగం
  - 1.1 (ఎ) వ్యవసాయం
  - 1.1 (బి) జీవోత్పత్తులు (పశు సంపద - పాడి పరిశ్రమ)
  - 1.2 అటవీ ఉత్పత్తులు, కలప
  - 1.3 మత్స్య సేకరణ

II. పారిశ్రామిక రంగం
  - 2. గనులు, తవ్వకాలు 3. వస్తూత్పత్తి
  - 4. విద్యుచ్ఛక్తి, గ్యాస్, నీటి సరఫరా
  - 5. నిర్మాణాలు

III. సేవల రంగం
  - 6. వాణిజ్యం, హోటళ్లు, రెస్టారెంట్లు
  - 7.1 రైల్వేలు
  - 7.2 రవాణా, నిల్వ చేయడం
  - 7.3 సమాచార సంబంధాలు
  - 8. రుణ సహాయం (ఫైనాన్సింగ్), బీమా, స్థిరాస్తులు, వ్యాపార సేవలు
  - 9. సామూహిక, సామాజిక, వ్యక్తి స్థాయి సేవలు, ఇతర సేవలు

వీటిలో మొదటి మూడు అంశాలను ఉత్పత్తి మదింపు పద్ధతి; 4,6,7,8,9లోని అంశాలను ఆదాయ మదింపు పద్ధతి; 5వ అంశాన్ని (నిర్మాణ రంగం) వ్యయ మదింపు పద్ధతి ద్వారా గణిస్తున్నారు.


### మాదిరి ప్రశ్నలు

1. భారత జాతీయాదాయంపై మొదటిసారిగా విశేషంగా పరిశోధన చేసినవారు?
   ఎ) వి.కె.ఆర్.వి. రావ్ బి) పి.ఎస్. ధర్
   సి) ప్రొఫెసర్ షెనాయ్ డి) జగదీష్ భగవతి
2. కింది వాటిలో జాతీయాదాయన్ని ఏ విధంగా లెక్కించరు?
   ఎ) ఆదాయ పద్ధతి బి) ఖర్చు పద్ధతి
   సి) ఎగుమతులు - దిగుమతుల పద్ధతి
   డి) విలువ ఆధారిత పద్ధతి
3. భారత జాతీయాదాయాన్ని గణించే సంస్థ?
   ఎ) ఎన్ఎస్ఎస్ఓ బి) సీఎస్ఓ
   సి) ఆర్‌బీఐ డి) ఎన్ఈఎస్
4. 'గనులు, తవ్వకాలు' అంశాన్ని ఏ రంగంలో భాగంగా పరిగణిస్తారు?
   ఎ) వ్యవసాయ రంగం
   బి) పారిశ్రామిక రంగం
   సి) సేవల రంగం డి) ఉమ్మడి రంగం
5. రాష్ట్ర స్థూల ఉత్పత్తిని మదింపు చేసేది?
   ఎ) రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి
   బి) కేంద్ర గణాంక సంస్థ సి) ఆర్థిక సంఘం
   డి) రాష్ట్ర ఆర్థిక గణాంక సంచాలకులు
6. తెలంగాణ స్థూల రాష్ట్రోత్పత్తి (జీఎస్‌డీపీ)ని ఏ పద్ధతి ద్వారా లెక్కిస్తారు?
   ఎ) ఉత్పత్తి పద్ధతి బి) ఆదాయ పద్ధతి
   సి) వ్యయ పద్ధతి డి) పైవన్నీ

**సమాధానాలు**

1) ఎ; 2) సి; 3) బి; 4) బి; 5) డి; 6) డి;

# What is core inflation?




## MODEL QUESTIONS

1. Insurance Repository is formed and registered under:
   a) Companies Act 1956
   b) IRDA Act 1999
   c) Partnership Act 1932
   d) Shops and Establishments Act of respective States
   e) None of these
2. Which type of banking that shuns the very idea of interest rates and is founded on the principles of profit sharing:
   a) Islamic Banking
   b) Land Development Banking
   c) Consumer Banking
   d) Exchange Banking
   e) Personal Banking
3. Which of the following banks has issued Multi Currency World Travel Card?
   a) Karur Vysya Bank
   b) Union Bank of India
   c) Kotak Mahindra Bank
   d) Bank of Baroda
   e) State Bank of India
4. The Gold Monetisation Scheme, 2015 will replace the existing ________. However, the deposits outstanding under the Gold Deposit Scheme will be allowed to run till maturity unless the depositors prematurely withdraw them.
   a) Gold Deposit Scheme, 1995
   b) Gold Deposit Scheme, 1999
   c) Sovereign Gold Bond Scheme.
   d) Gold Deposit Scheme, 1991
   e) None of the above
5. Which of the following is not correct regarding the Rajiv Gandhi Equity Savings Scheme.
   a) Those investors whose annual taxable income is below Rs. 10 lacs are eligible under the scheme.
   b) The maximum investment permissible under the scheme is Rs.50,000.
   c) It is a tax savings scheme which gives tax benefit for new investors.
   d) The scheme aims to promote debt culture in India.
   e) None of the above
6. Which of the following banking system is generally referred to involvement of financial intermediaries in aiding credit creation without regulatory oversight.
   a) Tiered Banking
   b) Shadow Banking
   c) Multiple Banking
   d) Universal Banking
   e) Night Banking
7. Which one of the following entity is not authorised to open insurance accounts?
   a) Central Insurance Repository Limited
   b) SHCIL Projects Limited
   c) NSDL Database Management Limited
   d) Kotak Insurance Repository Limited e) None of the above
8. The scheme "Aapka paisa aapke haath", refers to the
   a) Direct Transfer Scheme
   b) Direct Benefit Transfer Scheme
   c) Direct Bank Transfer Scheme
   d) Direct Bank Transfer Mode
   e) Direct handing over of cash benefit by hand through postal services
9. Interest rate payable on saving bank account is:
   a) Regulated by RBI
   b) Regulated by State Govt
   c) Regulated by Finance Ministry
   d) Deregulated e) None
10. Which of the following are eligible to make deposits under Gold Monetisation Scheme?
    a) Resident Indians & HUF
    b) Trusts including Mutual Funds / Exchange Traded Funds
    c) Registered under SEBI (Mutual Fund) Regulations
    d) Companies
    e) All of these
11. The Union Finance Minister has launched the IRDA's Insurance Repository System (IRS). Which of the following is not correct about IRS policies?
    a) Insurance Repository is authorised only to maintain the policies in physical form
    b) Insurance Repository provide a Insurance
    c) The Repository acts as a single stop for several policy service requirements.
    d) The Repository will issue a unique code number to all policy holders
    e) None of the above
12. The drawee of a cheque can be:
    a) One person b) Two person
    c) Any legal or juristic person
    d) A Bank e) None of these
13. Which of the following organization was established as a subsidiary of the Reserve Bank of India with the purpose of providing long term industrial finance and later took over business of Refinance Corporation of India in September, 1964?
    a) ICICI Ltd b) IDBI Ltd
    c) IFCI Ltd
    d) Development Credit Bank of India(DCB)
    e) None of the above
14. Which of the following is/are called Bretton Woods institution?
    a) International Monetary Fund
    b) World Trade Organization
    c) United Nations
    d) Asian Development Bank
    e) Multilateral Development Bank
15. The minimum deposit at any one time shall be raw gold (bars, coins, jewellery excluding stones and other metals) equivalent to ____ grams of gold of 995 fineness.
    a) 10 gm b) 20 gm
    c) 30 gm d) 40 gm e) 50 gm
16. The new RTGS System operationalised is based on which standard messaging formats?
    a) ISO 2002 b) ISO 20022
    c) ISO 2022 d) ISO 22200
    e) ISO 22220
17. The forensic audit of which bank ordered by the Reserve Bank of India is a first in the country's banking history?
    a) United Bank of India
    b) Allahabad Bank
    c) State Bank of India
    d) Union Bank of India
    e) Dena Bank
18. RBI has mandated that the banks intending to enter insurance broking:
    a) NPAs should not exceed 3% of their loans.
    b) Should have a minimum net worth of Rs. 500 crore
    c) Should have capital adequacy ratio of 10%
    d) Only a & b e) All a, b, and c
19. Which State Govt. in India will introduce a cash compensation policy for housewives with less than Rs. 3 laks annual income:
    a) Karnataka b) Goa
    c) Maharashtra d) Delhi
    e) Andhra Pradesh
20. The maximum limit for deposit under the Gold Monetisation Scheme is _______.
    a) Rs. 1 lak b) Rs. 5 lak
    c) Rs. 10 lak d) Rs 20 lak
    e) No limit
21. No margin is required to bought in by the borrower for the education loans to special courses up to _________:
    a) Rs. 2 lak b) Rs. 4 lak
    c) Rs. 3 lak d) Rs. 5 lak
    e) None of the above
22. What is core inflation?
    a) It is the inflation rate of a particular basket of commodities
    b) It is the sudden increase in prices of certain amount of food grains
    c) It is caused by supply shocks in certain essential commodities.
    d) It is the sudden decrease in supply of all goods and services.
    e) Only a & b
23. Which of the following regulatory authority has been introduced by the Central Govt. with wide powers to recommend, enforce and monitor the compliance of accounting and auditing standards?
    a) Financial Reporting Authority of India
    b) National Financial Reporting Authority
    c) National Financial Stabilization Authority
    d) Audit Departments of Respective States
    e) None of the above
24. Japan will promote ________, a theory which asserts that the advancement of women in the society is directly correlated with its growth rate.
    a) womenomics
    b) womenpowerment
    c) women Empowerment
    d) women Employment
    e) None of the above.
25. The Reserve Bank is issuing Banknotes in Mahatma Gandhi Series 2005 with a new numbering pattern and special features for the visually impaired in ____, _____ and _____ denominations.
    a) Rs.10, Rs. 50, Rs.100
    b) Rs.100, Rs.500 and Rs.1000
    c) Rs.50, Rs.100 and Rs.500
    d) Rs.10, Rs.500 and Rs.1000
    e) Rs.5, Rs.10, and Rs.20
26. To provide better security for debit card holders, payment services provider, National Payment Corporation of India has introduced a chip based card that provide protection to banks and their customers against card skimming and counterfeiting frauds. Such cards falls under which brand?
    a) Rupay Brand
    b) Rupaiya Brand
    c) Rupee Brand
    d) Rupiah Brand
    e) Rupai Branch
27. As per Govt. guidelines, banks having total business of Rs. 300000 cr are to have how many EDs?
    a) Minimum 2 b) 2
    c) 3 d) Maximum 3
    e) Only one irrespective of total business
28. According to Pension Fund Regulatory and Development Authority which Bank has been appointed as the new National Pension System Trustee Bank ?
    a) State Bank of India
    b) Axis Bank
    c) ICICI Bank
    d) Punjab National Bank
    e) Bank of India
29. Which of the following banks is the first Indian bank to introduce Display Debit cards?
    a) HDFC Bank b) Axis Bank
    c) ICICI Bank
    d) State Bank of India
    e) HSBC Bank
30. The Reserve Bank has reviewed and enhanced the limit or cash withdrawal at Point of Sale (POS - for debit cards and open system prepaid cards issued by banks in India) from Rs.1000 to ________ per day in Tier III to VI centres.
    a) Rs. 1500 b) Rs. 2000
    c) Rs. 2,500 d) Rs.3000
    e) Rs. 3,500

**KEY**

| | | | | |
|---|---|---|---|---|
| 1) a | 2) a | 3) c | 4) b | 5) d |
| 6) b | 7) d | 8) b | 9) d | 10) e |
| 11) a | 12) d | 13) b | 14) a | 15) c |
| 16) b | 17) a | 18) e | 19) b | 20) e |
| 21) b | 22) a | 23) b | 24) a | 25) b |
| 26) a | 27) c | 28) b | 29) b | 30) b |